

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 11

సంచిక: 281

మంగళవారం 1-1-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



విద్యుత్ రంగంలో తెలంగాణ చారిత్రిక విజయం

కేసీఆర్ మార్గదర్శకత్వంలో విద్యుత్ సంస్థల విజయనాదం



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి రోజుల్లో భయంకరమైన విద్యుత్ సంక్షోభం ఎదుర్కొన్నది. దార్శనిక నాయకుడు, గౌరవ ముఖ్యమంత్రి **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు** గారి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలు అతి తక్కువ సమయంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ఈ సంక్షోభాన్ని పరిష్కరించాయి. నేడు తెలంగాణ రాష్ట్రం వ్యవసాయంతో పాటు అన్ని రంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నది. ఈ విజయపరంపరలో తెలంగాణ రాష్ట్రం విద్యుత్ రంగంలో అనేక కొత్త రికార్డులు సృష్టించింది.

తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సర కానుక
800 మెగావాట్ల కెటిపిఎస్ 7వ దశ ప్లాంటు

అతి తక్కువ సమయంలో నిర్మించిన విద్యుత్తు ప్లాంటుగా కొత్త చరిత్ర
తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రారంభించి, పూర్తి చేసిన మొదటి ప్రాజెక్టు
మిగులు విద్యుత్ రాష్ట్రం దిశగా తెలంగాణ రాష్ట్రం మరో ముందడుగు

తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో చేపట్టిన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నది. రూ.6,405 కోట్ల వ్యయంతో చేపట్టిన కెటిపిఎస్ 7వ దశ నిర్మాణాన్ని కేవలం 42 నెలల్లోనే పూర్తి చేసి, 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని తెలంగాణ జెన్‌కో అందుబాటులోకి తెచ్చింది. ఇంత తక్కువ సమయంలో భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఆధ్వర్యంలో మరే విద్యుత్ ప్లాంటు నిర్మాణం జరగలేదు. 2015 జనవరి 1న ఈ ప్లాంటు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 2018 జూన్ 30 నాటికి ప్లాంటు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మార్గదర్శకాల అనుగుణంగా, 48 నెలల్లోనే ప్లాంటు పూర్తి చేసి, ఉత్పత్తి ప్రారంభించింది. తెలంగాణ రాష్ట్రం విద్యుతు ప్లాంట్ల నిర్మాణంలో దేశానికే ఆదర్శంగా నిలిచింది.



విద్యుత్ రంగంలో తెలంగాణ సృష్టించిన సరికొత్త రికార్డులు

తలసరి విద్యుత్ వినియోగం వృద్ధిరేటులో దేశంలో నెంబర్ వన్

ప్రగతి సూచికల్లో అతి ముఖ్యమైన తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం రికార్డు స్థాయి వృద్ధి సాధించింది. 2014లో 1,084 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగం ఉంటే 2018 నాటికి 1,727 యూనిట్లకు చేరింది. ఏడాదికి వెయ్యి యూనిట్లకు పైగా తలసరి వినియోగం జరిగే రాష్ట్రాల్లో తెలంగాణ అత్యధికంగా 11.34 శాతం వార్షిక వృద్ధిరేటు సాధించి దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

దేశ సగటును మించి గరిష్ట డిమాండ్ వృద్ధి

2016-17లో తెలంగాణలో 9,187 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదు కాగా, 2018-19 సంవత్సరంలో 10,818 మెగావాట్లకు చేరింది. దేశ సగటు వృద్ధి శాతం 2.43 అయితే, తెలంగాణ వృద్ధి రేటు 17.75 శాతంగా నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నేడు 10,818 మెగావాట్ల గరిష్ట డిమాండ్ ఏర్పడినా కోత లేకుండా విద్యుత్ సరఫరా చేయగలిగింది.

సోలార్ పవర్‌లో దేశంలోనే అగ్రగామి

3,416 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తితో దేశంలోనే 2వ స్థానంగా నిలిచింది.

వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం

రాష్ట్రంలోని మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా అవుతున్నది. ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కొత్త చరిత్రను సగర్వంగా లిఖించింది.

లోటు నుంచి మిగులు వరకు

2014లో స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్లు ఉండేది. 2,700 మెగావాట్ల లోటు ఏర్పడేది. ఇప్పుడు 110 శాతం పెరిగి 16,307 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది.

రూ. 21,970 కోట్లతో పంపిణీ, సరఫరా వ్యవస్థలు పటిష్టం

రూ.21,970 కోట్ల వ్యయంతో పంపిణీ, సరఫరా వ్యవస్థలను ప్రభుత్వం పటిష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన ఆరో నెల (2014, నవంబర్ 20) నుంచే కోతల్లేని విద్యుత్ సరఫరా జరుగుతున్నది.

శరవేగంగా విద్యుత్ ప్లాంట్‌ల నిర్మాణం

తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో 5,880 మెగావాట్ల సామర్థ్యంతో జెన్‌కో మూడు కొత్త విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టింది. 4,000 మెగావాట్ల రికార్డు స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ప్లాంటు, 1080 మెగావాట్ల సామర్థ్యంతో భద్రాద్రి పవర్ ప్లాంటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కెటిపిఎస్-7 ప్లాంటు విద్యుత్ సరఫరా ప్రారంభించింది.

తెలంగాణ చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్‌ల అనుసంధానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్‌ల మధ్య వార్ధా నుండి హైదరాబాద్-765 కెవి డిసి లైన్ ప్రారంభం పి.జి.సి.ఐ.ఎల్ ద్వారా నిర్మించబడింది. దేశంలో ఎక్కడి నుంచైనా విద్యుత్‌ను ఇచ్చిపుచ్చుకునే సౌలభ్యం ఈ లైన్ వల్ల కలిగింది.

రికార్డు స్థాయిలో ఉద్యోగాల కల్పన - దళారీ వ్యవస్థ నిర్మూలన

జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్ లలో కొత్తగా 13,357 మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నది. వేల మందికి ఏకకాలంలో పదోన్నతి కల్పించింది. 22,500 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసింది. దళారీ వ్యవస్థను నిర్మూలించింది. ఉద్యోగులకు 35 శాతం ఫిట్‌మెంటు, అదనపు ఇంక్రిమెంట్లతో వేతనాలు భారీగా పెంచింది.

ఎత్తిపోతల పథకాలకు 9 వేల మెగావాట్ల విద్యుత్

కోటి ఎకరాలకు సాగునీరు అందించే సంకల్పంతో ప్రభుత్వం నిర్మిస్తున్న భారీ ఎత్తిపోతల పథకాలకు అవసరమైన 9వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయడానికి పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేసింది.

పవర్ బ్యాంకింగ్ విధానానికి శ్రీకారం

తెలంగాణ రాష్ట్రంలో మొదటిసారిగా పవర్ బ్యాంకింగ్ విధానానికి విద్యుత్ సంస్థలు శ్రీకారం చుట్టాయి. 500 మెగావాట్ల మిగులు విద్యుత్‌ను రాజస్థాన్‌కు అందించి అధిక డిమాండ్ ఉన్న యాసంగి సీజన్‌లో ఆ విద్యుత్‌ను రాజస్థాన్ నుంచి తిరిగి తీసుకుంటుంది.

విద్యుత్తు వెలుగులో బంగారు తెలంగాణ రూపుదిద్దుకుంటున్నది



తెలంగాణ రాష్ట్ర పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్

తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

RO No: 60/18



సిడ్నీ టెస్టుకు రోహిత్ దూరం... జనవరి 8న తిరిగి జట్టుతో చేరిక

భారత క్రికెటర్ రోహిత్ శర్మ ఈనెల 3 నుంచి సిడ్నీలో ఆస్ట్రేలియాతో మొదలయ్యే చివరిదైన నాలుగో టెస్టుకు దూరమయ్యాడు. తన భార్య రితిక సజ్దే బిడ్డకు జన్మనివ్వడంతో... రోహిత్ మెల్‌బోర్న్ నుంచి ముంబైకి ప్రయాణమయ్యాడు. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం ఈ నెల 8న అతడు తిరిగి జట్టుతో చేరతాడు. 'జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభిస్తున్న రోహిత్‌కు శుభాకాంక్షలు' అంటూ బీసీసీఐ ఓ ప్రకటనలో అభినందనలు తెలిపింది. రోహిత్ స్థానంలో సిడ్నీ టెస్టుకు మరెవరినీ ఎంపిక చేయలేదని ప్రకటించింది.



స్మృతి... డబుల్ ధమాకా

- రెండు ఐసీసీ పురస్కారాలు దక్కించుకున్న భారత ఓపెనర్
- మహిళా క్రికెటర్, వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపిక
- ప్రపంచ టి20 జట్టు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్

దుబాయ్: భారత మహిళా క్రికెట్ డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన 2018 సంవత్సరానికి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 'ఉత్తమ మహిళా క్రికెటర్'... 'వన్డే ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డులను గెలుచుకుంది. ఎడంచేతి వాటం విధ్వంసక బ్యాటర్ అయిన 22 ఏళ్ల స్మృతి గతేడాది 12 వన్డేల్లో 669 పరుగులు (సగటు 66.90), 25 టి20ల్లో 622 పరుగులు (స్ట్రయిక్ రేట్ 130.67) చేసింది. ఇటీవల ముగిసిన టి20 ప్రపంచకప్‌లో భారత్ సెమీస్ చేరడంలో స్మృతిది కీలక పాత్ర. ఆ టోర్నీలో ఐదు మ్యాచ్‌ల్లో ఆమె 125.35 స్ట్రయిక్ రేట్‌తో 178 పరుగులు చేసింది. పేసర్ జులన్ గోస్వామి (2007) తర్వాత 'ఐసీసీ మహిళా క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా నిలిచిన భారత క్రికెటర్‌గా స్మృతి రికార్డులకెక్కింది. ఇందులో భాగంగా ఆమె రాచెల్ హెహో య్ ఫ్లింట్ అవార్డును అందుకోనుంది. 'అవార్డులు మన ప్రతిభకు గుర్తింపు. మరింత కష్టపడేందుకు, జట్టుకు ఉపయోగపడేందుకు ఇవి ప్రేరణగా ఉపయోగపడతాయి. కింబర్లీలో దక్షిణాఫ్రికాపై చేసిన శతకం నాకు ఎక్కువ సంతృప్తినిచ్చింది. తర్వాత సొంతగడ్డపై ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లపైనా రాణించా. అయితే, భారీ స్కోర్లు సాధించలేకపోయా. ఈ విషయంలో నన్ను నేను నిరూపించుకుంటా' అని స్మృతి పేర్కొంది. మరోవైపు 'స్మృతి తన అద్వితీయ ఆటతో 2018లో మహిళా క్రికెట్ అభిమానులను అలరించింది. ఈ ఏడాదిని గుర్తుంచుకునేదిగా చేసింది' అని ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ రిచర్డ్‌సన్ కొనియాడారు. ఆస్ట్రేలియా ఓపెనర్, వికెట్ కీపర్ అలీసా హీలీకి 'ఐసీసీ టి20 మహిళా క్రికెటర్' అవార్డు దక్కింది.

ప్రపంచ టి20 జట్టు సారథిగా హర్మన్, వన్డే జట్టుకు బేట్స్

'ఐసీసీ టి20 టీమ్ ఆఫ్ ద ఇయర్ 2018' కెప్టెన్‌గా భారత టి20 జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, ప్రపంచ వన్డే జట్టు కెప్టెన్‌గా న్యూజిలాండ్ క్రికెటర్ సుజీ బేట్స్ ఎంపికయ్యారు. మాజీ క్రికెటర్లు లిసా స్థలేకర్, చార్లెట్ ఎడ్వర్డ్స్, అంజుమ్ చోప్రాలతో కూడిన కమిటీ గతేడాది ప్రదర్శనల ఆధారంగా ఓటింగ్ నిర్వహించగా వీరిద్దరికీ ప్రపంచ జట్ల పగ్గాలు దక్కాయి. అయితే, హర్మన్‌కు వన్డే టీమ్‌లో చోటు దక్కకపోవడం గమనార్హం. భారత ఓపెనర్ స్మృతి మంధాన, లెగ్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ రెండింటిలోనూ సభ్యులుగా ఉన్నారు. 'టి20 ప్రపంచ కప్‌లో హర్మన్ 160.5 స్ట్రయిక్ రేట్‌తో 183 పరుగులు చేసింది. 2018లో ఆమె మొత్తం 25 మ్యాచ్‌ల్లో 126.2 స్ట్రయిక్ రేట్‌తో 663 పరుగులు చేసింది' అని ఐసీసీ పేర్కొంది. 'నిజంగా చెప్పాలంటే ఇది నన్ను ఆశ్చర్యపర్చింది. ఈ ఘనత మా జట్టు సభ్యులదే. గత రెండేళ్లలో మేం ఎక్కువగా టి20లు ఆడలేదు. మనం టి20ల్లో రాణించగలం అని జట్టులో ఆత్మవిశ్వాసం కల్పించేందుకు ప్రయత్నించా. ఈ అవార్డు బాధ్యతను పెంచింది. బీసీసీఐ నాపై ఉంచిన నమ్మకంతో ఈ ఫార్మాట్లో మరింత బాగా రాణించేందుకు కృషి చేస్తా' అని హర్మన్ పేర్కొంది.

ఫైనల్లో ఆంధ్ర ఓటమి

బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే టోర్నీ విజేత బెంగాల్



అనూష

బెంగళూరు: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సీనియర్ మహిళల వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ టోర్నీలో తొలిసారి ఫైనల్‌కు అర్హత సాధించిన ఆంధ్ర జట్టు తుది పోరులో 11 పరుగుల తేడాతో బెంగాల్ చేతిలో ఓటమి చవిచూసింది. ఆంధ్ర జట్టులో నలుగురు రనౌట్ కావడం గమనార్హం. టాస్ నెగ్గిన ఆంధ్ర ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్ చేసిన బెంగాల్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 198 పరుగులు సాధించింది. మందిర మహాపాత్ర (39 నాటౌట్), దీప్తి (34; 3 ఫోర్లు) రాణించారు. ఆంధ్ర బౌలర్లలో సీహెచ్ ఝాన్సీ లక్ష్మి మూడు వికెట్లు తీయగా... పుష్పలత, శరణ్యలకు ఒక్కో వికెట్ లభించింది. 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు 49.1 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అనూష (61; 5 ఫోర్లు), పద్మజ (38; 4 ఫోర్లు) ఆకట్టుకున్నా... కీలకదశలో ఔటవ్వడం ఆంధ్ర విజయావకాశాలపై ప్రభావం చూపింది.

రాణించిన జ్ఞానేశ్వర్: ఆంధ్ర 207/3

సాక్షి, విజయనగరం: హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లకు 207 పరుగులు చేసింది. సీఆర్ జ్ఞానేశ్వర్ (65; 12 ఫోర్లు), సాయికృష్ణ (38; 3 ఫోర్లు) రాణించారు. ప్రస్తుతం రికీ భుయ్ (49 బ్యాటింగ్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), శ్రీకర్ భరత్ (14 బ్యాటింగ్; 2 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. అంతకుముందు హైదరాబాద్ జట్టు 271 పరుగులకు ఆలౌటైంది. శశికాంత్ 64 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు.

మొర్తజా గెలిచాడు

బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీగా ఘన విజయం



ఢాకా: తాజాగా జరిగిన బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో ఆ దేశ వన్డే క్రికెట్ జట్టు కెప్టెన్ మష్రఫె మొర్తజా ఎంపీగా గెలిచాడు. నరైల్–2 నియోజకవర్గం నుంచి అవామీ లీగ్ తరపున పోటీ చేసిన 35 ఏళ్ల మొర్తజా 2,74,418 ఓట్లు సాధించాడు. అతడి ప్రత్యర్థి, జాతీయ ఐక్య కూటమి అభ్యర్థి ఫరీదుజ్మాన్ ఫర్హాద్‌కు కేవలం 8,006 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 3,17,844 కాగా పోలైన వాటిలో 96 శాతం మొర్తజాకే పడటం విశేషం. 'నరైల్ ఎక్స్‌ప్రెస్'గా పేరుగాంచిన అతడు... నయీమూర్ రెహ్మాన్ తర్వాత ఎంపీ అయిన రెండో బంగ్లాదేశీ కెప్టెన్‌గా, క్రికెట్లో ఉంటూనే ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగా రికార్డులకెక్కాడు.

టైటిల్ పోరుకు బెంగళూరు

తొలి క్వాలిఫయర్‌లో గుజరాత్‌పై గెలుపు

కొచ్చి: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేల్)లో బెంగళూరు బుల్స్ ఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం జరిగిన తొలి క్వాలిఫయర్‌లో బెంగళూరు 41–29 స్కోరుతో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్‌పై విజయం సాధించింది. రైడింగ్‌లో బుల్స్ ఆటగాడు పవన్ షెరావత్ చెలరేగాడు. 13 సార్లు రైడింగ్‌కు వెళ్లిన అతను 13 పాయింట్లు తెచ్చి పెట్టాడు. రోహిత్ కుమార్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టాడు. అతను 11 పాయింట్లు సాధించాడు. మిగతా వారిలో మహేందర్ సింగ్ 6 ట్యాకిల్ పాయింట్లు చేశాడు. గుజరాత్ జట్టులో సచిన్ ఆకట్టుకున్నాడు. 12 సార్లు రైడింగ్‌కు వెళ్లిన సచిన్ 10 పాయింట్లు సాధించాడు. ఓడినా... గుజరాత్‌కు ఫైనల్ చేరే అవకాశం ఇంకా మిగిలే వుంది. ఈ నెల 3న యూపీ యోధతో జరిగే రెండో క్వాలిఫయర్‌లో గెలిస్తే ఆ జట్టు టైటిల్ పోరుకు అర్హత సంపాదించవచ్చు. ఎలిమినేటర్–3 మ్యాచ్‌లో యూపీ యోధ 45–33తో దబంగ్ ఢిల్లీపై విజయం సాధించి రెండో క్వాలిఫయర్‌కు అర్హత పొందింది.



గుజరాత్ రైడర్‌ను పట్టేసిన బెంగళూరు బుల్స్ ఆటగాళ్లు

ముంబై రాకెట్స్ దూకుడు

5–2తో అవధ్ వారియర్స్‌పై ఘన విజయం



సమీర్

పుణే: ఉత్కంఠగా సాగిన పురుషుల సింగిల్స్ మ్యాచ్‌ల్లో సత్తా చాటిన ముంబై రాకెట్స్ 5–2తో అవధ్ వారియర్స్‌పై గెలిచింది. ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) నాలుగో సీజన్‌లో తమ ఖాతాలో రెండో విజయం నమోదు చేసుకుంది. ఇరు జట్లు తమ తొలి మ్యాచ్‌లనే 'ట్రంప్'గా ఎంచుకున్నాయి. మహిళల సింగిల్స్‌లో బీవెన్ జాంగ్ (అవధ్) 15–10, 15–10 తేడాతో శ్రేయాన్షి పరదేశి (ముంబై)పై నెగ్గి జట్టును 2–0 ఆధిక్యంలో నిలిపింది. అనంతరం పురుషుల డబుల్స్‌ను ముంబై 'ట్రంప్'గా ఎంచుకుంది. లియాంగ్ డె-కిమ్ జి జంగ్ జోడీ 15–7, 15–9తో లి చాంగ్ వి-ఎంఆర్ అర్జున్ జంటపై గెలుపొందింది. స్కోర్లు 2–2తో సమంగా నిలిచిన ఈ స్థితిలో పురుషుల సింగిల్స్ హోరాహోరీగా సాగాయి. తొలి మ్యాచ్‌లో ఆండర్స్ ఆంటోన్సెన్ (ముంబై) 6–15, 15–11, 15–14తో సన్ వాన్ హోపై, రెండో మ్యాచ్‌లో సమీర్ వర్మ (ముంబై) 15–11, 8–15, 15–11తో లీ డాంగ్ కుయెన్‌పై శ్రమించి నెగ్గారు. దీంతో 4–2తో ఫలితం తేలిపోయింది. నామమాత్రంగా మారిన మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ ముంబై పట్టు విడవలేదు. కిమ్ జి జంగ్–పియా బెర్నాడెత్ జంట 15–10, 7–15, 15–13తో అశ్విని పొన్నప్ప–మథియాస్ క్రిస్టియన్‌సెన్‌లపై జయభేరి మోగించింది. మంగళవారం జరిగే మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్‌తో నార్త్ ఈస్టర్న్ వారియర్స్ తలపడుతుంది.

• స్పోర్ట్స్ క్యాలెండర్ •

2019



గతేడాది భారత క్రీడా రంగం కొత్త శిఖరాలను అధిరోహించింది. క్రికెట్ లోనే కాకుండా ఆర్చరీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, అథ్లెటిక్స్, టెన్నిస్... ఒకటేంటి బరిలోకి దిగిన ప్రతీ అంతర్జాతీయ ఈవెంట్‌లో మనోళ్లు మెరిపించారు. మెగా టోర్నీల పరంగా గత సంవత్సరం ఫుట్‌బాల్ ప్రపంచకప్, కామన్వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడలు, యూత్ ఒలింపిక్స్... ఇతర క్రీడాంశాల్లో ప్రపంచకప్‌లతో ఏడాది పొడవునా సందడి నెలకొంది. ఇదే ఊపును కొనసాగించేందుకు 2019 కూడా సిద్ధమవుతోంది. 2020 టోక్యో ఒలింపిక్స్‌కు ఏడాది మాత్రమే ఉండటంతో భారత్‌కు పతకావకాశాలు ఉన్న ఈవెంట్స్‌లో సన్నాహాలు మొదలు కానున్నాయి. మరోవైపు రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ వన్డే క్రికెట్ ప్రపంచకప్‌నకు ఆతిథ్యమిచ్చేందుకు ఇంగ్లండ్ ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో 2019లో జరిగే ప్రధాన ఈవెంట్స్‌తో కూడిన స్పోర్ట్స్ క్యాలెండర్ మీ కోసం...

క్రికెట్




జనవరి 3-7: భారత్ X ఆస్ట్రేలియా, నాలుగో టెస్టు (సిడ్నీ)
జనవరి 12: భారత్ X ఆస్ట్రేలియా, తొలి వన్డే (సిడ్నీ)
జనవరి 15: భారత్ X ఆస్ట్రేలియా, రెండో వన్డే (అడిలైడ్)
జనవరి 18: భారత్ X ఆస్ట్రేలియా, మూడో వన్డే (మెల్‌బోర్న్)
జనవరి 23: భారత్ X న్యూజిలాండ్, తొలి వన్డే (నేపియర్)
జనవరి 26: భారత్ X న్యూజిలాండ్, రెండో వన్డే (మౌంట్ మాంగనీ)
జనవరి 28: భారత్ X న్యూజిలాండ్, మూడో వన్డే (మౌంట్ మాంగనీ)
జనవరి 31: భారత్ X న్యూజిలాండ్, నాలుగో వన్డే (హామిల్టన్)
ఫిబ్రవరి 3: భారత్ X న్యూజిలాండ్, ఐదో వన్డే (వెల్లింగ్టన్)
ఫిబ్రవరి 6: భారత్ X న్యూజిలాండ్, తొలి టి20 (వెల్లింగ్టన్)
ఫిబ్రవరి 8: భారత్ X న్యూజిలాండ్, రెండో టి20 (ఆక్లాండ్)
ఫిబ్రవరి 10: భారత్ X న్యూజిలాండ్, మూడో టి20 (హామిల్టన్)
ఫిబ్రవరి 24: భారత్ X ఆస్ట్రేలియా, తొలి వన్డే (మొహాలి)
ఫిబ్రవరి 27: భారత్ X ఆస్ట్రేలియా, రెండో వన్డే (హైదరాబాద్)
మార్చి 2: భారత్ X ఆస్ట్రేలియా, మూడో వన్డే (నాగ్‌పూర్)
మార్చి 5: భారత్ X ఆస్ట్రేలియా, నాలుగో వన్డే (ఢిల్లీ)
మార్చి 8: భారత్ X ఆస్ట్రేలియా, ఐదో వన్డే (రాంచీ)
మార్చి 10: భారత్ X ఆస్ట్రేలియా, తొలి టి20 (బెంగళూరు)
మార్చి 13: భారత్ X ఆస్ట్రేలియా, రెండో టి20 (వైజాగ్)
మార్చి-ఏప్రిల్: భారత్‌లో జింబాబ్వే పర్యటన (టెస్టు, మూడు వన్డేలు)
జూలై-ఆగస్టు: వెస్టిండీస్‌లో భారత్ పర్యటన (2 టెస్టులు, 3 వన్డేలు, 3 టి20లు)
అక్టోబర్: భారత్‌లో దక్షిణాఫ్రికా పర్యటన (3 టెస్టులు)
నవంబర్: భారత్‌లో బంగ్లాదేశ్ పర్యటన (2 టెస్టులు, 3 టి20లు)
డిసెంబర్: భారత్‌లో వెస్టిండీస్ పర్యటన (3 వన్డేలు, 3 టి20లు)

బ్యాడ్మింటన్



జనవరి 13: పీబీఎల్ ఫైనల్ (బెంగళూరు)
జనవరి 15-20: మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీ (కౌలాలంపూర్)
జనవరి 22-27: ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీ (జకార్తా)
మార్చి 6-10: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ (బర్మింగ్‌హామ్)
మార్చి 26-31: ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీ (న్యూఢిల్లీ)
ఏప్రిల్ 2-7: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ (కౌలాలంపూర్)
ఏప్రిల్ 9-14: సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీ (సింగపూర్)
మే 19-26: సుదిర్మన్ కప్ (గ్రేడ్-1 టీమ్ టోర్నీ; నానింగ్, చైనా)
జూలై 16-21: ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ (జకార్తా)
జూలై 23-28: జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ (టోక్యో)
జూలై 30-ఆగస్టు 4: థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీ (బ్యాంకాక్)
ఆగస్టు 19-25: ప్రపంచ చాంపియన్‌షిప్ (గ్రేడ్-1 టోర్నీ; బాసెల్, స్విట్జర్లాండ్)
సెప్టెంబర్ 17-22: చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ (చాంగ్‌జౌ)
సెప్టెంబర్ 24-29: కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీ (సియోల్)
అక్టోబర్ 15-20: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ (ఒడెన్స్)
అక్టోబర్ 22-27: ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ (పారిస్)
నవంబర్ 12-17: హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నీ (హాంకాంగ్)
నవంబర్ 5-10: చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ (ఫుజౌ)
డిసెంబర్ 11-15: వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ (గ్వాంగ్‌జౌ)

టెన్నిస్



జనవరి 14-27: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ
ఫిబ్రవరి 1-2: డేవిస్ కప్ క్వాలిఫయర్స్
మార్చి 3-17: ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీ
మార్చి 20-31: మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీ
ఏప్రిల్ 4-5: డేవిస్ కప్ గ్రూప్-2 మ్యాచ్‌లు
ఏప్రిల్ 14-21: మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీ
మే 5-12: మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీ
మే 12-19: రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీ
మే 26-జూన్ 9: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ
జూలై 1-14: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ
ఆగస్టు 5-11: మాంట్రియల్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీ
ఆగస్టు 11-18: సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీ
ఆగస్టు 26-సెప్టెంబర్ 8: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ
సెప్టెంబర్ 13-15: డేవిస్ కప్ గ్రూప్-1, 2 మ్యాచ్‌లు
అక్టోబర్ 6-13: షాంఘై ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీ
అక్టోబర్ 28-నవంబర్ 3: పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీ
నవంబర్ 10-17: ఏటీపీ ఫైనల్స్ (సీజన్ ముగింపు టోర్నీ)
నవంబర్ 18-24: డేవిస్ కప్ ఫైనల్

ఫార్ములావన్



మార్చి 17: ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రి (మెల్‌బోర్న్)
మార్చి 31: బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి (సాఖిర్)
ఏప్రిల్ 14: చైనా గ్రాండ్‌ప్రి (షాంఘై)
ఏప్రిల్ 28: అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి (బాకు)
మే 12: స్పెయిన్ గ్రాండ్‌ప్రి (బార్సిలోనా)
మే 26: మొనాకో గ్రాండ్‌ప్రి (మోంటెకార్లో)
జూన్ 9: కెనడా గ్రాండ్‌ప్రి (మాంట్రియల్)
జూన్ 23: ఫ్రెంచ్ గ్రాండ్‌ప్రి (మార్సెలి)
జూన్ 30: ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి (స్పీల్‌బెర్గ్)
జూలై 14: బ్రిటిష్ గ్రాండ్‌ప్రి (సిల్వర్‌స్టోన్)
జూలై 28: జర్మనీ గ్రాండ్‌ప్రి (హాకెన్‌హీమ్)
ఆగస్టు 4: హంగేరి గ్రాండ్‌ప్రి (బుడాపెస్ట్)
సెప్టెంబర్ 1: బెల్జియం గ్రాండ్‌ప్రి (స్పా ఫ్రాంకోర్‌చాంప్స్)
సెప్టెంబర్ 8: ఇటలీ గ్రాండ్‌ప్రి (మోంజా)
సెప్టెంబర్ 22: సింగపూర్ గ్రాండ్‌ప్రి (సింగపూర్ సిటీ)
సెప్టెంబర్ 29: రష్యా గ్రాండ్‌ప్రి (సోచి)
అక్టోబర్ 13: జపాన్ గ్రాండ్‌ప్రి (సుజుకా)
అక్టోబర్ 27: మెక్సికో గ్రాండ్‌ప్రి (మెక్సికో సిటీ)
నవంబర్ 3: యూఎస్ గ్రాండ్‌ప్రి (టెక్సాస్)
నవంబర్ 17: బ్రెజిల్ గ్రాండ్‌ప్రి (సావోపాలో)
డిసెంబర్ 1: అబుదాబి గ్రాండ్‌ప్రి (అబుదాబి)

చెస్



జనవరి 9-16: ఢిల్లీ ఓపెన్ గ్రాండ్ మాస్టర్స్ టోర్నీ
ఏప్రిల్ 1-10: ఆసియా యూత్ చాంపియన్‌షిప్ (శ్రీలంక)
సెప్టెంబర్ 9-అక్టోబర్ 2: వరల్డ్ కప్
అక్టోబర్ 1-13: ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ (నాగ్‌పూర్)
అక్టోబర్ 14-26: ప్రపంచ జూనియర్ అండర్-20 చాంపియన్‌షిప్ (న్యూఢిల్లీ)

ఆర్చరీ



ఏప్రిల్ 22-28: వరల్డ్ కప్ స్టేజ్-1 (కొలంబియా)
మే 6-12: వరల్డ్ కప్ స్టేజ్-2 (చైనా)
మే 20-26: వరల్డ్ కప్ స్టేజ్-3 (టర్కీ)
జూన్ 10-16: ప్రపంచ చాంపియన్‌షిప్ (నెదర్లాండ్స్)
జూలై 1-7: వరల్డ్ కప్ స్టేజ్-4 (జర్మనీ)

హాకీ



జూన్ 6-16: అంతర్జాతీయ హాకీ సమాఖ్య పురుషుల సిరీస్ ఫైనల్ టోర్నీ (భారత్)
జూన్ 15-23: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) మహిళల సిరీస్ ఫైనల్ టోర్నీ (జపాన్)



తప్పక చూడండి
మే 30 - జూలై 14
ఐసీసీ పురుషుల వన్డే క్రికెట్ ప్రపంచకప్ టోర్నమెంట్
వేదిక: ఇంగ్లండ్

ఫుట్‌బాల్



జనవరి 5-ఫిబ్రవరి 1: ఆసియా కప్ (యూఏఈ)
మే 23-జూన్ 15: వరల్డ్ కప్ అండర్-20 టోర్నీ (పోలాండ్)
జూన్ 7-జూలై 7: మహిళల వరల్డ్ కప్ (ఫ్రాన్స్)
జూన్ 14-జూలై 7: కోపా అమెరికా కప్ (బ్రెజిల్)
జూన్ 15-జూలై 13: ఆఫ్రికా నేషన్స్ కప్ (కామెరూన్)
అక్టోబర్ 5-27: వరల్డ్ కప్ అండర్-17 టోర్నీ (పెరూ)

అథ్లెటిక్స్




జనవరి 20: ముంబై మారథాన్
మార్చి 17: ఆసియా రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్ (జపాన్)
మార్చి 30: వరల్డ్ క్రాస్‌కంట్రీ చాంపియన్‌షిప్ (డెన్మార్క్)
ఏప్రిల్ 15: బోస్టన్ మారథాన్
ఏప్రిల్ 28: లండన్ మారథాన్
మే 3: డైమండ్ లీగ్ మీట్-1 (దోహా)
మే 18: డైమండ్ లీగ్ మీట్-2 (షాంఘై)
మే 30: డైమండ్ లీగ్ మీట్-3 (స్టాక్‌హోమ్)
జూన్ 6: డైమండ్ లీగ్ మీట్-4 (రోమ్)
జూన్ 13: డైమండ్ లీగ్ మీట్-5 (ఓస్లో)
జూన్ 16: డైమండ్ లీగ్ మీట్-6 (మొరాకో)
జూన్ 30: డైమండ్ లీగ్ మీట్-7 (అమెరికా)
జూలై 5: డైమండ్ లీగ్ మీట్-8 (స్విట్జర్లాండ్)
జూలై 12: డైమండ్ లీగ్ మీట్-9 (మొనాకో)
జూలై 20: డైమండ్ లీగ్ మీట్-10 (లండన్)
ఆగస్టు 18: డైమండ్ లీగ్ మీట్-11 (బర్మింగ్‌హామ్)
ఆగస్టు 24: డైమండ్ లీగ్ మీట్-12 (పారిస్)
ఆగస్టు 29: డైమండ్ లీగ్ మీట్-13 (జ్యూరిక్)
సెప్టెంబర్ 6: డైమండ్ లీగ్ మీట్-14 (బెల్జియం)
సెప్టెంబర్ 27-అక్టోబర్ 6: ప్రపంచ చాంపియన్‌షిప్ (దోహా)

టేబుల్ టెన్నిస్




ఏప్రిల్ 5-7: ఆసియా కప్ (జపాన్)
ఏప్రిల్ 21-28: ప్రపంచ సీనియర్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ (హంగేరి)
సెప్టెంబర్ 2-7: ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్ (మంగోలియా)
సెప్టెంబర్ 17-22: ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్ (ఇండోనేసియా)
నవంబర్ 24-డిసెంబర్ 1: ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్ (థాయ్‌లాండ్)

రెజ్లింగ్



జనవరి 23-26: డేవ్ షుల్జ్ స్మారక టోర్నీ (కొలరాడో స్ప్రింగ్స్, అమెరికా)
ఏప్రిల్ 23-28: ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్ (చైనా)
జూలై 9-14: ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్ (లెబనాన్)
ఆగస్టు 12-18: ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్ (ఎస్టోనియా)
సెప్టెంబర్ 14-22: ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్ (కజకిస్తాన్)
అక్టోబర్ 28-నవంబర్ 3: ప్రపంచ అండర్-23 చాంపియన్‌షిప్ (హంగేరి)

వెయిట్‌లిఫ్టింగ్



మార్చి 8-15: ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ (అమెరికా)
ఏప్రిల్ 20-30: ఆసియా చాంపియన్‌షిప్ (చైనా)
జూన్ 1-8: ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్ (ఫిజీ)
జూలై 9-14: కామన్వెల్త్ జూనియర్, యూత్, సీనియర్ చాంపియన్‌షిప్ (సమోవా)
సెప్టెంబర్ 18-27: ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్ (థాయ్‌లాండ్)
అక్టోబర్ 20-27: ఆసియా జూనియర్, యూత్ చాంపియన్‌షిప్ (ఉత్తర కొరియా)

షూటింగ్



ఫిబ్రవరి 20-28: వరల్డ్ కప్ రైఫిల్, పిస్టల్ (న్యూఢిల్లీ)
మార్చి 15-26: వరల్డ్ కప్ షాట్‌గన్ (మెక్సికో)
ఏప్రిల్ 5-16: వరల్డ్ కప్ షాట్‌గన్ (యూఏఈ)
ఏప్రిల్ 21-29: వరల్డ్ కప్ రైఫిల్, పిస్టల్ (చైనా)
మే 7-18: వరల్డ్ కప్ షాట్‌గన్ (కొరియా)
మే 24-31: వరల్డ్ కప్ రైఫిల్, పిస్టల్ (జర్మనీ)
జూన్ 30-జూలై 10: ప్రపంచ షాట్‌గన్ చాంపియన్‌షిప్ (ఇటలీ)
ఆగస్టు 13-23: వరల్డ్ కప్ షాట్‌గన్ (ఫిన్‌లాండ్)
ఆగస్టు 26-సెప్టెంబర్ 3: వరల్డ్ కప్ రైఫిల్, పిస్టల్ (బ్రెజిల్)
అక్టోబర్ 8-15: వరల్డ్ కప్ ఫైనల్స్ షాట్‌గన్ (యూఏఈ)



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 11

సంచిక: 281

మంగళవారం 1-1-2019



2019

యాక్షన్ 2019

ఈ సంవత్సరం తెలుగు సినిమాను కళకళలాడించడానికి ఎవరెవరు ఏయే సినిమాలు చేస్తున్నారు?.

– ఫ్యామిలీలో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కొత్త సంవత్సరానికి
కొత్త ఫోన్ అది అన్‌బ్రేకబుల్
సంగీత లో మాత్రమే
6 నెలల
స్క్రీన్ రీప్లేస్‌మెంట్
ఉచితంగా
పొందండి
ప్రతి స్మార్ట్‌ఫోన్ తో
హాఫ్
ప్రైజ్
సేల్
అన్ని స్మార్ట్‌ఫోన్స్ పై
ఇంకా పొందండి
20%
క్యాష్‌బ్యాక్
Paytm
+
30%
తిరిగి
మీ వాలెట్‌కి
మరియు
ఖచ్చితమైన
బహుమతులు
ప్రతి కొనుగోలుతో
iPhone XS Max
₹4,579 pm
iPhone XR
₹3,204 pm
iPhone X
₹3,666 pm
Samsung Galaxy A9
₹2,466 pm
Vivo V11
₹1,399 pm
Oppo A7
₹1,544 pm
Redmi Note 6 Pro
₹1,208 pm
సంగీత డ్యామేజ్ ప్రొటెక్షన్
మా ఫోన్లన్నీ అన్‌బ్రేకబుల్.
పగిలితే, కొత్త ఫోన్ సగం ధరకే పొందండి.
మీ ఫోన్ దొంగిలించబడినప్పుడు, కొత్త ఫోన్ సగం ధరకే పొందండి.
₹25
CRORE
PAID BACK
TILL NOW
సంగీత ప్రైజ్ ప్రొటెక్షన్
మా ఫోన్లన్నీ ప్రైజ్ డ్రాప్ ప్రొటెక్టెడ్.
మీరు కొన్న ఫోన్ ధర ఒకవేళ తక్కువైతే, తేడా డబ్బుని
మేము మీకు తిరిగి ఇస్తాము.
2 HRS DELIVERY
SHOP ONLINE AT
www.sangeethamobiles.com
Finance option from:
BAJAJ FINSERV
INDIA'S LARGEST MOBILE RETAILER WITH OVER 150 STORES IN ANDHRA PRADESH AND TELANGANA AND 565 STORES IN INDIA
సంగీత
Sangeetha®
PIONEER THEN, LEADER NOW.
44 YEARS | 9 STATES | 565 STORES | 30 MILLION DELIGHTED CUSTOMERS
Feedback/suggestions: support@sangeethamobiles.com | SangeethaMobilesIndia | T&C: www.sangeethamobiles.com | Customer Care No.: 080-49397000

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16+4+16 వెల: ₹ 5.00
సంపుటి: 11
సంచిక: 281
మంగళవారం 1-1-2019
SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | MUMBAI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'

Happy New Year 2019

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటన కర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి నూతన సంవత్సర శుభాకాంక్షలు
వై.ఎస్. భారతి
చైర్‌పర్సన్



ఇండియా టాప్‌టెన్..

1 మోదీ మళ్లీ గెలుస్తారా?
2019 సార్వత్రిక ఎన్నికలు మోదీ అనుకూల, మోదీ వ్యతిరేక కూటముల మధ్య పోరుగానే ఉండబోతోంది. ఈ ఎన్నికల్లో నరేంద్రుడి విజయావకాశాలపై విశ్లేషణలు జోరందుకున్నాయి.

2 ఎజెండాపై అన్నదాత
పార్లమెంటు ఎన్నికల్లో అన్నదాత సమస్యలే అసలైన ఎజెండాగా మారబోతున్నాయి. ఈ నేపథ్యంలో రుణమాఫీ, రైతుబంధు తరహా పథకాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

3 ఆరోగ్యబీమా..
ప్రజలందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించడం ఆవశ్యకం. 50–60 కోట్ల మందికి లబ్ధి చేకూర్చేందుకు ప్రవేశపెట్టిన 'ఆయుష్మాన్ భారత్' ప్రభావం ఏ స్థాయిలో ఉండనుందో ఆసక్తికరంగా మారింది.

4 భారత్ వర్సెస్ పాక్..
పాకిస్తాన్ కవ్వింపు చర్యలు, ఇమ్రాన్‌ఖాన్ వ్యాఖ్యలతో భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరిగే సూచనలు కనబడుతున్నాయి. భారత్ మరో సర్జికల్ స్ట్రైక్ చేపట్టవచ్చనే చర్చ జరుగుతోంది.

5 ఐఓటీ, కృత్రిమ మేధ
కొత్త సంవత్సరంలో భారతీయులకు కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అందుబాటులోకి వచ్చే సూచనలున్నాయి. అక్రమాలకు తావివ్వని బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ కూడా సిద్ధమైపోయింది.

6 5జీ ఈ యేడాదేనా?
సాంకేతిక ప్రపంచం ఎదురుచూస్తున్న 5జీ టెక్నాలజీ ఈ ఏడాది అమల్లోకి వస్తుందనే అంచనాలున్నాయి. అరచేతిలోనే 2 జీబీపీఎస్ వేగాన్నిచ్చే 5జీ సేవలు.. స్పెక్ట్రమ్ వేలం జరగకపోవడంతో కాస్త ఆలస్యం కావొచ్చు.

7 నెట్టింట్లో 'బూతు'
అమేజాన్, నెట్‌ఫ్లిక్స్ తదితర వెబ్‌సిరీస్‌ల్లో విశృంఖల అశ్లీల, అసభ్య, అనైతిక దృశ్యాలు.. కుటుంబ వ్యవస్థకు సవాల్ విసురుతున్నాయి. వీటిపై న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.

8 'మ్యాన్–మెషీన్' విద్య
తయారీ, సేవలు తదితర రంగాల్లో కృత్రిమ మేధ పెరుగుతున్నా మ్యాన్–మెషీన్ అనుసంధానం కీలకం కానుంది. ఏఐసీటీఈ సిలబస్‌ను మార్చడం భవిష్యత్ మార్పులకు సంసిద్ధతను వెల్లడిస్తోంది.

9 చమురు, రూపాయి
ఒపెక్ దేశాల నిర్ణయం నేపథ్యంలో కొత్త ఏడాది చమురు ధరలు మరింత పతనం కాకపోవచ్చనే భావన వ్యక్తమవుతోంది. ద్రవ్యోల్బణం, చమురు ధరల తగ్గుదలతో డాలర్‌తో రూపాయి మారకం పుంజుకోవచ్చు.

10 ప్రపంచకప్ మనదేనా?
కోహ్లీ సారథ్యంలో దూకుడు మీదున్న భారత జట్టు ఈ ఏడాది మే–జూన్‌లో ఇంగ్లండ్‌లో జరగనున్న క్రికెట్ ప్రపంచ కప్‌పై కన్నేసింది. ఈసారి కప్‌పై భారీ అంచనాలున్నాయి.

- 2లో

బ్రాండ్ తెలంగాణ..

ప్రభుత్వపరంగా 'ఫుడ్ ప్రాసెసింగ్' ఉత్పత్తులు: కేసీఆర్



- ఆరేడు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపన.. ఐకేపీ–మహిళా సంఘాల భాగస్వామ్యం
- దేశ, విదేశాల్లోని అత్యుత్తమ పద్ధతులపై అధ్యయనం
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల అభివృద్ధిపై సీఎం సమీక్ష
- నియంత్రిత పంటల సాగును ప్రోత్సహించాలని సూచన

సాక్షి, హైదరాబాద్

"ఏ రకమైన వ్యవసాయ ఉత్పత్తినైనా ప్రాసెస్ చేస్తే ధర పెరుగుతుంది. ఈ రోజుల్లో ప్రతీది కల్తీ అవుతోంది. మార్కెట్లో ఒక బ్రాండ్ పేరుతో మన ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులను విక్రయించాలి. ప్రభుత్వ పరంగా తయారైన వస్తువులని ప్రజల్లో నమ్మకం కలిగించాలి. మన ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను ప్రారంభించాలి. మన ఆలోచనలకు కార్యరూపమిచ్చి అమలు చేయాలి. ఏ ప్రాంతంలో ఎన్ని, ఏ రకమైన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉండాలో నిర్ణయించాలి. మన రాష్ట్ర అవసరాలకు సరిపోగా.. మిగిలిన ఉత్పత్తులను పక్క రాష్ట్రాల్లో, విదేశాలకు ఎగుమతి చేయాలి. ఈ ప్రక్రియలో ఐకేపీ–మహిళా సంఘాలను భాగస్వామ్యం చేసేందుకు అధ్యయనం చేయాలి. 130 కోట్ల జనాభా ఉన్న మన దేశం పెద్ద దేశీయ మార్కెట్. ఏ రాష్ట్రంలో ఏ పంట పండదో విశ్లేషించి మన వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఇక్కడ వాటిని పండించి, వాటితో ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులను తయారు చేయాలి. దేశ, విదేశాల్లో అత్యుత్తమ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఎక్కడుందో గుర్తించి అలాంటిది మన రాష్ట్రంలో ఏర్పాటు చేసుకునే అంశంపై అధ్యయనం చేయాలి"అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశించారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధిపై సోమవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ ఒక సామూహిక ప్రయత్నమని, మహిళా బృందాలతో పాటు పలువురిని భాగస్వాములను చేయాలన్నారు. తొలుత ఆరేడు మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఈ కార్యక్రమం

మిగతా 5వ పేజీలో ▶

న్యూ ఇయర్ జోష్..



2019కి ఆహ్వానం పలుకుతూ బాణాసంచా వెలుగుల్లో కాంతులీనుతున్న సిడ్నీ హార్బర్. ప్రపంచ వ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముందుగా న్యూజిలాండ్ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది.

రైల్వే బోర్డు చైర్మన్‌గా వినోద్‌కుమార్

ప్రస్తుతం దక్షిణమధ్య రైల్వే జీఎంగా బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్‌కు పదోన్నతి లభించింది. భారత రైల్వే బోర్డు చైర్మన్‌గా, భారత ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఉన్నతస్థాయి నియామకాల మంత్రివర్గ కమిటీ సోమవారం ఆయన నియామకాన్ని ఆమోదించింది. ప్రస్తుత చైర్మన్ అశ్వనీ లోహానీ తర్వాత వినోద్‌కుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు. 1982లో రైల్వే ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా వినోద్‌కుమార్ ప్రస్థానం ప్రారంభమైంది. రైల్వేతో పాటు భారత ప్రభుత్వ పరిశ్రమల శాఖ, రైల్ వికాస్ నిగమ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో పనిచేశారు. 2017–18లో దక్షిణమధ్య రైల్వే రూ.13,673 కోట్ల రికార్డు ఆదాయం సాధించడంలో ఆయన కృషి విశేషమైంది. 2018లో ఆరు ఎక్స్‌అఫీషియో అవార్డులు, ప్రతిష్టాత్మక పండిట్ గోవింద్ వల్లభ్ పంత్ పురస్కారం కూడా దక్షిణమధ్య రైల్వే అందుకుంది.



ఇట్లు.. మీ విధేయులు

ఎమ్మెల్సీ స్థానాల కోసం టీఆర్‌ఎస్‌లో పోటాపోటీ..

- ఉమ్మడి జిల్లాకు నలుగురు చొప్పున ఆశావహులు
- శాసనమండలిలో ఖాళీ అవుతున్న 13 స్థానాలు
- రాజీనామాలతో ఇప్పటికే నాలుగు ఖాళీ.. మార్చితో మరో 9 మంది పదవీకాలం పూర్తి
- ఫిబ్రవరి, మార్చిలో ఎన్నికలు
- కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయంతో రెండోసారి అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్.. పార్టీ నేతలకు పదవుల పంపకంపై దృష్టి పెడుతోంది. ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న శాసన మండలి ఎన్నికల నుంచే ఈ ప్రక్రియను ప్రారంభించాలని భావిస్తోంది. టీఆర్‌ఎస్‌లో మొదటి నుంచి పని చేస్తున్న వారికి, పార్టీ విధేయులకు, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పని చేసిన వారికి ఎమ్మెల్సీలుగా అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. రాజీనామాల కారణంగా మండలిలో ఇప్పటికే 4 స్థానాలు ఖాళీ అయ్యాయి. పదవీ కాలం ముగుస్తుండటంతో మార్చిలో మరో తొమ్మిది స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ఈ ఖాళీ స్థానాల్లో అవకాశం కోసం టీఆర్‌ఎస్ నేతలు చాలా మంది పోటీపడుతున్నారు. టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు తమ మనసులోని కోరికను చెప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావును కూడా కలసి పార్టీ కోసం తాము చేసిన పనులను వివరించి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్ర శాసనమండలిలో మొత్తం 40 స్థానాలున్నాయి. ఎమ్మెల్యేల కోటా 14, స్థానిక సంస్థల కోటా 14, గవర్నర్ కోటా 6, ఉపాధ్యాయుల కోటా 3, పట్టభద్రుల కోటా 4 స్థానాలు ఉన్నాయి. ప్రతి రెండేళ్లకు ఒకసారి మూడింట్లో రెండొంతు స్థానాలు ఖాళీ అవుతాయి. కేంద్ర ఎన్నికల సంఘం వీటికి ఎన్నికలు నిర్వహిస్తుంది. మార్చిలో 9 స్థానాలు ఖాళీ అవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేలు అయిన ముగ్గురు ఎమ్మెల్సీలతోపాటు టీఆర్‌ఎస్‌లో నుంచి కాంగ్రెస్‌లో చేరిన మరో ఎమ్మెల్సీ రాజీనామా చేశారు. ఇలా మొత్తం 13 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం...



మిగతా 5వ పేజీలో ▶

హసీనా నాలుగోసారి

- బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో మహాకూటమి అఖండ విజయం
- 300కు గాను 288 స్థానాలు కైవసం
- అవకతవకలు, రిగ్గింగ్ జరిగిందని విపక్షాల ఆరోపణ
- మళ్లీ ఎన్నికల ప్రసక్తే లేదన్న ఈసీ

- వివరాలు 9లో







అర్లి–టీ 2.7 డిగ్రీలు

వణుకుతున్న రాష్ట్రం.. మరో నాలుగు రోజులు ఇంతే.. జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం చలి గుప్పిట్లో గజగజలాడుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న చలిగాలులతో జనం వణికిపోతున్నారు. గత 24 గంటల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలుచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి–టీలో ఏకంగా 2.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఈ సీజన్‌లో ఇదే మొదటిసారి. అలాగే కొమురంభీం జిల్లా తిర్యాని మండలం గిన్నధరి, సిర్పూరు, కామారెడ్డి జిల్లా బిక్నూరులోనూ 3 సెంటీమీటర్ల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ సహా ఆ జిల్లాలోని రాంనగర్, కొమురంభీం జిల్లా లింగాపూర్, సంగారెడ్డి జిల్లా అలగోల్‌లో 4 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఇలా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సాధారణం కంటే ఆరేడు డిగ్రీల వరకు తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే మూడు డిగ్రీల వరకు తగ్గాయి. వచ్చే నాలుగు రోజులూ రాష్ట్రంలో తీవ్రమైన చలి తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం ఆదిలాబాద్, కొమురంభీం, నిర్మల్, మంచిర్యాల, మెదక్, వరంగల్ రూరల్ జిల్లాల్లో తీవ్రమైన చలి గాలుల తీవ్రత ఉంటుందని తెలిపింది. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్ అర్బన్, నిజామాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో చలిగాలులు వీస్తాయని వెల్లడించింది. ఈ నెల 2 నుంచి 5 వరకు వరకు ఆయా జిల్లాల్లో చలిగాలులు వీస్తాయని, చలి తీవ్రత కొనసాగుతుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

పలు చోట్ల ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

ప్రాంతం	కనిష్ట ఉష్ణోగ్రత
భద్రాచలం	13
హకీంపేట	11
హన్మకొండ	9
హైదరాబాద్	9
ఖమ్మం	13
మహబూబ్‌నగర్	14
మెదక్	6
నల్లగొండ	15
నిజామాబాద్	10
రామగుండం	9



ఆకాశహర్మ్యంలో పేలుడు..



- రష్యాలోని మాగ్నిటోగొరస్క్ నగరంలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. పురాతన బహుళ అంతస్తుల భవనంలో సంభవించిన పేలుడుతో నలుగురు చనిపోయారు. దాదాపు 70 మంది వరకు శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని భావిస్తున్నారు.

- 9లో

చర్చకు నోచుకోని 'ట్రిపుల్ తలాక్'



- ఊహించినట్లుగానే విపక్షాలు పట్టు విడవకపోవడంతో ట్రిపుల్ తలాక్ బిల్లుపై రాజ్యసభలో చర్చ ప్రారంభం కాలేదు. బిల్లును జాయింట్ సెలక్ట్ కమిటీకి పంపాలన్న తమ డిమాండ్‌ను ప్రతిపక్షాలు పునరుద్ఘాటించాయి. మంత్రి రవిశంకర్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. అయితే, విపక్షాలు సహకరించకపోవడంతో కార్యకలాపాలు జరగకుండానే సభ వాయిదా పడింది.

- 9లో

2019

బిగ్‌–10

2018 వెళ్లిపోయి కొత్తసంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. 2019 వివిధ రంగాల్లో ఆశావహంగా కనబడుతుంటే.. మరికొన్ని రంగాలు ఆందోళన కలిగిస్తున్నాయి. మరికొన్ని చర్చనీయాంశం అవుతున్నాయి. అన్నింటికీ మించి ఇది ఎన్నికల సంవత్సరం. అందుకే.. రాజకీయ పార్టీలన్ని అజెండాలు, కూటముల రూపకల్పనలో తలమునకలవుతున్నాయి. కేంద్రంలో ఎవరు పాగా వేస్తారనే దానిపై చర్చలు మొదలయ్యాయి. బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న నేపథ్యంలో.. ప్రభుత్వాల ఆర్థిక నిర్ణయాలు జనాల జేబులు నింపుతాయా? లేక చిల్లులు పెడతాయా? అన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. ఆరోగ్య భారత్‌ కల సాకారమవ్వాలన్న ఆకాంక్ష బలంగా ఉంది. సాంకేతిక రంగంలో అనుకున్న మాదిరిగానే దూసుకెళ్తున్నాం. దాయాది దేశంతో సఖ్యత ఎండమావేనని గతేడాది పరిణామాలు హెచ్చరిస్తున్నాయి. క్రీడారంగంలో 2018లో సాధించిన విజయాల పరంపర ఈసారీ కొనసాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

కొంగొత్త ఆశలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న వేళ వివిధ రంగాల భవిష్యత్తుపై ఓ విశ్లేషణ.

1 మోదీ మళ్లీ గెలుస్తారా?



వచ్చే సార్వత్రిక ఎన్నికలు మాత్రం పూర్తిగా మోదీ కేంద్రంగానే జరుగుతున్నాయి. మోదీ అనుకూల, మోదీ వ్యతిరేక కూటముల మధ్యే ప్రధానంగా పోరు ఉండబోతుందనేది సుస్పష్టం.

చాయ్‌వాలా స్థాయి నుంచి దేశ ప్రధానిగా ఎదిగిన నరేంద్ర మోదీ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి జయకేతనం ఎగరేసి రెండోసారి ఢిల్లీ పీఠాన్ని అధిష్టిస్తారా లేక 'పునరుజ్జీవ 'కాంగ్రెస్‌కు దారిస్తారా? అనే అంశంపైనే దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. 2014 తర్వాత మోదీ 'రాజకీయ చాణక్యం'తో దేశంలో ఒక్కో కాంగ్రెస్‌ పాలిత రాష్ట్రాన్ని బీజేపీ తన ఖాతాలో వేసుకుంటూ బలమైన శక్తిగా తయారైంది. దీంతో జాతీయంగా, అంతర్జాతీయంగా మోదీ ప్రతిష్ట అమాంతం పెరిగిపోయింది. అయితే.. దేశంలో వ్యవసాయంతోపాటు పలు రంగాల్లో ఎదురవుతున్న సమస్యలతో.. మోదీ ప్రభుత్వం పట్ల కొంత వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏదేమైనా.. వచ్చే సార్వత్రిక ఎన్నికలు మాత్రం పూర్తిగా మోదీ కేంద్రంగానే జరుగుతున్నాయి. మోదీ అనుకూల, మోదీ వ్యతిరేక కూటముల మధ్యే ప్రధానంగా పోరు ఉండబోతుందనేది సుస్పష్టం. అటు కాంగ్రెస్‌ కూడా ఎలాగైనా మోదీని గద్దెదించాలని అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. ఈ నేపథ్యంలో విపక్షాలకు చెక్‌పెట్టి.. ప్రజామోదాన్ని మోదీ పొందగలరా? లేదా? అనేదే భారత్‌తోపాటు అంతర్జాతీయంగా ఆసక్తి రేపుతోంది.



2 ఎజెండాపై అన్నదాత

అన్ని పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో 'అన్నదాత'పై ప్రత్యేక దృష్టి సారించనున్నాయి. ఇందులో రైతు రుణమాఫీపై ప్రధాన అజెండాగా మారింది. రుణమాఫీ బదులు రైతులకు అవసరానికి ఆర్థిక సాయం అందించే పథకాలు మంచివన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దేశంలో రైతు ఎదుర్కొంటున్న సమస్యలే ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఇటీవల 3 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమికి రైతుల్లో నెలకొన్న ఆగ్రహమే కారణమనే విశ్లేషణల నేపథ్యంలో.. అన్ని పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో 'అన్నదాత'పై దృష్టి సారించనున్నాయి. ఇందులో రైతు రుణమాఫీపై ప్రధాన ఎజెండాగా మారింది. దేశంలో ఏడు రాష్ట్రాలు ఇప్పటికే రుణమాఫీని అమలు చేస్తున్నాయి. అయితే.. రుణమాఫీ ప్రభుత్వాలకు ఆర్థికంగా గుదిబండ అవుతుందని ఆర్బీఐ, ఆర్థిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రైతులకు అవసరానికి ఆర్థిక సాయం అందించే పథకాలు మంచివన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు పేరుతో, ఒడిశా కాలియా పేరుతో, జార్ఖండ్‌ సర్కారు మరో పేరుతో రైతులకు పెట్టుబడి సాయం చేస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో మొన్నటివరకు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతుకు కనీస మద్దతు ధర అందేలా 'భావాంతర్‌ భుగ్తాన్‌' యోజన అమలు చేసింది. కనీస మద్దతు ధరకు, మార్కెట్‌ ధరకు ఉన్న తేడా సొమ్మును రైతు ఖాతాలో జమ చేయడం ఈ పథకం ఉద్దేశం. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ రెండేళ్ల క్రితమే రైతు భరోసా పేరుతో పథకాన్ని ప్రకటించింది. 2017, జూలై 9న జరిగిన పార్టీ ప్లీనరీలో ప్రకటించిన నవరత్నాల్లో ఈ పథకం కూడా ఒకటి. ఈ నేపథ్యంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అన్నదాతే ప్రధాన అజెండాగా మారతారా అనే చర్చ జరుగుతోంది.

ఆరోగ్య బీమా కేంద్రం ✘ రాష్ట్రాలు 3



ఒక్కో కుటుంబానికి ఏటా రూ.5 లక్షల విలువైన వైద్య సాయం అందేలా కేంద్రం 'ఆయుష్మాన్‌ భారత్‌' పథకం ప్రారంభించింది. ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలు చేస్తున్నందున ఆయుష్మాన్‌తో పనేముందని కొన్ని రాష్ట్రాలు వాదిస్తున్నాయి.

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆరోగ్య సంరక్షణ కూడా ప్రధాన అంశంగా మారనుందనేది నిర్వివాదాంశం. దేశ ప్రజలకు అందుబాటు ధరల్లోనే నాణ్యమైన వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్‌ భారత్‌' పథకాన్ని ప్రారంభించింది. ఈ జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకంలో భాగంగా ఒక్కో కుటుంబానికి ఏటా రూ.5 లక్షల విలువైన వైద్య సాయం అందుతుంది. దేశవ్యాప్తంగా 10 కోట్ల కుటుంబాలు (దాదాపుగా 50–60 కోట్ల మంది ప్రజలు) ఈ పథకం పరిధిలోకి వస్తాయి. అయితే ఈ పథకాన్ని అమలు చేసేందుకు తెలంగాణ, ఢిల్లీ, కేరళ, ఒడిశా, పంజాబ్‌ రాష్ట్రాలు విముఖత వ్యక్తం చేస్తున్నాయి. రాజ్యాంగం ప్రకారం ఆరోగ్యం రాష్ట్రాల పరిధి కిందకు వస్తుందని.. ఈ పథకం ద్వారా రాష్ట్రాల హక్కుల్లో జోక్యం చేసుకోవాలని కేంద్రం భావిస్తోందని ఈ రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలుచేస్తున్నందున ఆయుష్మాన్‌తో పనేముందని వాదిస్తున్నాయి. దీనికితోడు ఆయుష్మాన్‌ భారత్‌ కింద ప్రభుత్వ వాటాగా కట్టే బీమా సొమ్మును రాష్ట్రాలే చెల్లించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అయితే.. ఆరోగ్య బీమా పథకం వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు రాలుస్తుందా అన్నది చర్చనీయాంశం కానుంది.

4 సరిహద్దు ఉద్రిక్తతలు పెరుగుతాయా?

నియంత్రణరేఖ వెంబడి భారీ దాడికి పాకిస్తాన్‌ సరిహద్దు రక్షణ బృందం (బీఏటీ) చేసిన ప్రయత్నం రెండు దేశాల మధ్య పెరగనున్న ఉద్రిక్తతలకు అద్దంపడుతోంది.

2018లో నెలకొన్న పరిస్థితులను చూస్తుంటే.. కొత్త సంవత్సరంలోనూ భారత్‌–పాక్‌ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలున్నట్లు అర్థమవుతోంది. ఈసారి కశ్మీర్‌లో మంచు మరింత ఎక్కువగా కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో.. చొరబాట్లు వచ్చే ఏడాది ఎక్కువగా ఉండొచ్చని తెలుస్తోంది. సంవత్సరం చివరి రోజున.. కశ్మీర్‌ సరిహద్దుల్లో పాక్‌ సైనికులు, ఉగ్రవాదులు కలిసి భారత్‌లోకి చొచ్చుకొచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని మన బలగాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయి. ఈ ప్రయత్నంలో ఇద్దరు పాక్‌ జవాన్లు మరణించారు. అటు, నియంత్రణరేఖ వెంబడి భారీ దాడికి పాకిస్తాన్‌ సరిహద్దు రక్షణ బృందం (బీఏటీ) చేసిన ప్రయత్నం రెండు దేశాల మధ్య పెరగనున్న ఉద్రిక్తతలకు అద్దంపడుతోంది. దీనికితోడు పాకిస్తాన్‌లో కొత్త ప్రభుత్వం.. ఆర్మీ చెప్పుచేతుల్లోనే పాలన కొనసాగిస్తుండటం, ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ తరచూ రెచ్చగొట్టేలా ప్రకటను ఇవ్వడం ఇరుదేశాల ఉద్రిక్తతలు మరింత పెరిగేందుకు సంకేతాలిస్తోంది. ఈ పరిస్థితుల్లో భారత్‌ మరోసారి సర్జికల్‌ స్ట్రయిక్స్‌ తరహా లేదా అంతకన్నా ఎక్కువ శక్తిమంతమైన దాడులు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే జరిగితే.. ఈ దాడులు సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి చేకూరుస్తుందనే చర్చ కూడా జరుగుతోంది.



ఈ ఏడాదేనా 5G



అమెరికాతోపాటు యూరప్, ఆస్ట్రేలియా, జపాన్‌లలో 5జీ ఈ ఏడాదే అందుబాటులోకి వస్తోంది. ఈ తాత్కాలిక ఏర్పాటు వల్ల ఈ ఏడాది స్మార్ట్‌ఫోన్ల ఇంటర్నెట్‌ వేగం సెకనుకు రెండు గిగాబైట్ల స్థాయికి చేరుకోవచ్చునని అంచనా.

సాంకేతిక ప్రపంచం ఎదురుచూస్తున్న 5జీ టెక్నాలజీ ఈ ఏడాది అమల్లోకి వస్తుందనే అంచనాలున్నాయి. అయితే ఇది భారత్‌లోనూ అందుబాటులోకి వస్తుందా? లేదా.. ఇంకొంత ఆలస్యమవుతుందా అన్నదానిపై స్పష్టత రాలేదు. స్మార్ట్‌ఫోన్‌ ఇంటర్నెట్‌ వేగాన్ని 4జీ స్థాయికి పదింతలు చేయగల 5జీ టెక్నాలజీకి అవసరమైన స్పెక్ట్రమ్‌ కేటాయింపులు మన దేశంలో ఇంతవరకూ జరగకపోవడమే ఇందుకు కారణం. అన్నీ సవ్యంగా సాగితే ఈ ఏడాది చివరికల్లా స్పెక్ట్రమ్‌ వేలం జరిగే అవకాశాలున్నట్లు చర్చ జరుగుతోంది. జియో, ఎయిర్‌టెల్‌ వంటి కంపెనీలు స్పెక్ట్రమ్‌ వేలంతో సంబంధం లేకుండా 5జీ వేగాలను అందించే అవకాశం ఉంది. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, జపాన్‌లలో 5జీ ఈ ఏడాదే అందుబాటులోకి వస్తోంది. ఈ తాత్కాలిక ఏర్పాటు వల్ల ఈ ఏడాది స్మార్ట్‌ఫోన్ల ఇంటర్నెట్‌ వేగం సెకనుకు రెండు గిగాబైట్ల స్థాయికి చేరుకోవచ్చునని అంచనా.

6 దూసుకొస్తున్న ఐఓటీ, కృత్రిమ మేధ



ఆఫీసులో కూర్చుని ఇంట్లోని ఫ్రిజ్‌లో ఏమున్నాయో తెలుసుకోవడం.. ఏసీ ఎప్పుడు ఆన్‌/ఆఫ్‌ కావాలో ఎక్కడి నుంచైనా నిర్ణయించడం ఐఓటీ టెక్నాలజీ సాకర్యాలు

నిన్న, మొన్నటివరకూ సామాన్యుడికి సంబంధం లేదని అనుకున్న కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌) ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ల రూపంలో అరచేతుల్లోకి చేరిపోయింది. 2019లో దీని పరిధి మరింత విస్తృతం చేసుకుని. దాదాపు అన్ని రంగాల్లోనూ తన ప్రభావం చూపనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదొక్కటే కాదు.. ఇంటర్నెట్‌కు అనుసంధానమైన పరికరాలు (ఇంటర్నెట్‌ ఆఫ్‌ థింగ్స్‌), అక్రమాలకు తావివ్వని బ్లాక్‌చెయిన్‌ టెక్నాలజీలు 2019లో అందరికీ అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. వరద ముప్పుపై ముందస్తు హెచ్చరికలు చేసేందుకు, మధుమేహం కారణంగా కంటికి జరిగే నష్టాలను తెలుసుకునేందుకు గూగుల్‌ కృత్రిమ మేధ సాయంతో ఇప్పటికే ప్రయత్నాలు చేస్తోంది. కొన్ని కంపెనీలు ఉద్యోగార్థుల దరఖాస్తులను వడపోసి సరైన వారిని గుర్తించేందుకూ ఈ అత్యాధునిక టెక్నాలజీ సాయం తీసుకుంటున్నాయి. ఆఫీసులో కూర్చుని ఇంట్లోని ఫ్రిజ్‌లో ఏమున్నాయో తెలుసుకోవడం.. ఏసీ ఎప్పుడు ఆన్‌/ఆఫ్‌ కావాలో ఎక్కడి నుంచైనా నిర్ణయించడం.. రైతన్న ఇంట్లో కూర్చుని పంటకు నీరు, ఎరువులు ఎప్పుడు, ఎంతమేరకు వేయాలో తేల్చేయగలగడం.. ఐఓటీ టెక్నాలజీ ద్వారా వచ్చే సౌకర్యాలకు కొన్ని ఉదాహరణలు.

నట్టింట్లో బూతు పురాణం 7



మన ప్రమేయం ఇసుమంతైనా లేకుండా నేరుగా.. ఇళ్లల్లోకి, మన పిల్లల మస్తిష్కాల్లోకి చొరబడి నవతరాన్ని ప్రభావితం చేస్తోన్న అశ్లీల, అసభ్య, అనైతిక ఇంటర్నెట్‌ దృశ్యాల నుంచే ఈ యేడాది మనకు ప్రమాదం పొంచి ఉంది.

ఒకప్పుడు సినిమా పాటలో అశ్లీలం ఉందంటేనే తీవ్ర విమర్శలు వచ్చేవి. ఆ తర్వాత నిబంధనలు కాస్త సరళీకృతమైనా.. సినిమాల్లో అశ్లీలాన్ని నియంత్రించేందుకు సెన్సార్‌బోర్డు తన వంతు పనిచేస్తోంది. కానీ.. పెరుగుతున్న సాంకేతికత ఎలాంటి పట్టపగ్గాల్లేకుండా బూతును నేరుగా నట్టింట్లోకి తీసుకొచ్చింది. మన ప్రమేయం ఇసుమంతైనా లేకుండా నేరుగా.. మన ఇళ్లల్లోకి, మన పిల్లల మస్తిష్కాల్లోకి చొరబడి నవతరాన్ని ప్రభావితం చేస్తోన్న డిజిటల్‌ వ్యవస్థ నుంచే ఈ యేడాది మనకు ప్రమాదం పొంచి ఉంది. అమెజాన్, నెట్‌ఫ్లిక్స్‌ వెబ్‌ సిరీస్‌ల ద్వారా.. అశ్లీల, అసభ్య, అనైతిక ఇంటర్నెట్‌ దృశ్యాలు.. కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ.. మన సంస్కృతిపై యుద్ధం ప్రకటిస్తున్నాయి. వెబ్‌ సిరీస్‌ల్లో నగ్న, అర్ధనగ్న చిత్రాలతో పాటు బూతుపురాణం కూడా వెగటుగా తయారైంది. దీనికితోడు చిన్నారులను ఆత్మహత్యకు పురిగొల్పే 'బ్లూవేల్‌' వంటి మొబైల్‌ గేమ్స్‌ విచ్చలవిడిగా పెరిగిపోయాయి. ఇలాంటి వెబ్‌సిరీస్‌లు, గేమ్స్‌ను నియంత్రించే అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.

క్రికెట్‌ ప్రపంచకప్‌ మనదేనా 8



మే 30న ప్రారంభమయ్యే క్రికెట్‌ పండగ ఈ ఏటి ఆసక్తికర క్రీడాంశాల్లో మొదటి స్థానంలో నిలువనుంది. భారత్‌తోపాటు ఆతిథ్య ఇంగ్లండ్‌ ఫేవరెట్‌గా కనిపిస్తోంది.

క్రికెట్‌ అభిమానులంతా ఎదురు చూస్తున్న పెద్ద పండగ 2019–వన్డే వరల్డ్‌ కప్‌.. ఈ ఏడాది ఇంగ్లండ్‌లో జరగనుంది. ఇప్పటికే 1983, 2011 ప్రపంచకప్‌లను గెలుచుకున్న భారత్‌ ఈసారి కూడా టైటిల్‌ గెలుచుకునే అవకాశాలున్నాయి. ఇటీవలి కాలంలో జట్టు విదేశాల్లో చూపిస్తున్న ఆటతీరు. కోహ్లి ఆటతీరు, జోష్‌తోపాటు.. జట్టులో ఉత్సాహమైన యువరక్తం అవకాశం వచ్చినపుడు సత్తా చాటుతుండటంతో భారత జట్టు విజయావకాశాలపై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. ఏడాది కాలంగా విదేశాల్లో భారత బౌలర్లు (ముఖ్యంగా పేస్‌ బౌలర్లు) రాణిస్తున్నారు. దీనికితోడు ప్రస్తుత క్రికెట్‌ ప్రపంచంలో స్థిరంగా రాణిస్తున్న బ్యాట్స్‌మెన్‌ (రోహిత్‌ శర్మ, రాయుడు, కోహ్లి, శిఖర్‌ ధావన్, హార్దిక్‌ పాండ్యా తదితరులు)లు భారత జట్టులో ఉండటమే ఈ భారీ అంచనాలకు కారణం. దీనికితోడు భారత క్రికెట్‌ను ఉన్నతశిఖరాలకు చేర్చడంలో తన పాత్రకు న్యాయం చేసిన మహేంద్రసింగ్‌ ధోనీ తన చివరి వరల్డ్‌ కప్‌లో జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్‌ రెండో స్థానంలో ఉంది. మే 30న ప్రారంభమయ్యే క్రికెట్‌ పండగ ఈ ఏటి ఆసక్తికర క్రీడాంశాల్లో మొదటి స్థానంలో నిలువనుంది. భారత్‌తోపాటు ఆతిథ్య ఇంగ్లండ్‌ ఫేవరెట్‌గా కనిపిస్తోంది.

మ్యాన్‌ – మెషీన్‌ అనుసంధాన విద్య 9

ఇంజనీరింగ్, టెక్నాలజీ కోర్సుల్లో ఆటోమేషన్, రొబోటిక్స్, ఏఐ, మెషిన్‌ లెర్నింగ్‌ కోర్సులకు ప్రాధాన్యం పెరగనుంది.

తయారీ, సేవలు తదితర రంగాలతో పాటు ఆటోమొబైల్, హెచ్‌ఆర్, ఫైనాన్స్, ఈ–కామర్స్‌ విభాగాల్లో ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏఐ) పాత్ర పెరుగుతున్న తరుణంలో.. సంబంధిత టెక్నికల్‌ నైపుణ్యాలు లేని లక్షల ఉద్యోగాలు పోతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా తయారీ రంగంలో రొబోటిక్స్, ఆటోమేషన్‌ ఆందోళనకు గురిచేస్తోంది. అయితే.. మారుతున్న వ్యాపారాలు, పనివాతావరణం, ఉత్పత్తి ప్రక్రియల కారణంగా ఎంత రొబోటిక్స్‌ ప్రభావం ఉన్నా.. మ్యాన్‌–మెషీన్‌ సమన్వయం తప్పనిసరంటూ పరిశోధకులంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో.. ఇంజనీరింగ్, టెక్నాలజీ కోర్సుల్లో ఆటోమేషన్, రొబోటిక్స్, ఏఐ, మెషీన్‌ లెర్నింగ్‌ కోర్సులకు ప్రాధాన్యం పెరగనుంది.

చమురు, రూపాయి ఏమంటాయో! 10



చమురు ధరల పతనం, ఆర్‌బీఐ కొత్త గవర్నర్‌ ఉదారవాద విధానాన్ని అవలంభించడంతో రూపాయి పుంజుకోవచ్చు.

ముడిచమురు బ్యారెల్‌ ధర 82 డాలర్లను చూసి.. మళ్లీ ఇపుడు 50 డాలర్ల శ్రేణిలోకి వచ్చింది. అలాగే మన రూపాయి డాలర్‌తో పోలిస్తే ఏకంగా 74 రూపాయలను దాటేసి.. ఇపుడు రూ.70 కిందికు దిగింది. ఇవే 2019లో మన స్టాక్‌ మార్కెట్లను, ఆర్థిక వ్యవస్థనూ శాసించబోతున్నాయి. పతనమైన ముడి చమురు ధరలపై ఒపెక్‌ దేశాల నిర్ణయం నేపథ్యంలో మరింతగా పతనమవుతుందని ఊహించలేం. ద్రవ్యోల్బణం దిగివస్తుండటం, చమురు ధరల పతనంతో డాలర్‌తో రూపాయి మారకం పుంజుకోవచ్చు.

హైదరాబాద్‌కు డ్రగ్స్‌.. వయా గోవా

- న్యూ ఇయర్‌ వేడుకల కోసం సిటీకి మాదకద్రవ్యాలు
- 89 గ్రాముల కొకైన్‌ సరఫరా చేస్తుండగా ఇద్దరి అరెస్టు

సాక్షి, హైదరాబాద్‌: గోవా నుంచి హైదరాబాద్‌కు మాదకద్రవ్యాలను తెచ్చి విక్రయిస్తున్న ఇద్దరు సభ్యుల ముఠాను వెస్ట్‌జోన్‌ టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ. 21 లక్షల విలువ చేసే 89 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను సోమవారం ఇక్కడి నగర పోలీసు కమిషనరేట్‌లో సీపీ అంజనీకుమార్‌ మీడియాకు వివరించారు. గోవాకు చెందిన లివియో జోసెఫ్‌ అల్మీద అలియాస్‌ పియూష్‌ అక్కడే ట్రావెల్స్‌ వ్యాపారం చేస్తున్నాడు. అక్కడకు వచ్చే టూరిస్ట్‌లకు వాహనాలను అద్దెకిస్తుంటాడు. ఈ వ్యాపారంలో వచ్చే ఆదాయం సరిపోక ఇబ్బందులు పడుతున్న సమయంలో పియూష్‌కు డ్రగ్స్‌ క్రయవిక్రయాలు చేస్తున్న నైజీరియన్లతో పరిచయం ఏర్పడింది. వీరు రూ.3 వేలకు గ్రాము చొప్పున కొకైన్‌ కొనుగోలు చేసి అవసరమైనవారికి రూ.6 వేల నుంచి రూ.7 వేలకు విక్రయించడాన్ని గమనించాడు. విలాసవంతమైన జీవితంతోపాటు భారీగా ఆదాయం సంపాదించవచ్చనే ఉద్దేశంతో వారితో చేతులు కలిపి దందా మొదలెట్టాడు.

మధ్యవర్తి ద్వారా పరిచయం

ఎనిమిది నెలల క్రితం గోవాకు వచ్చిన బంజారాహిల్స్‌వాసి, వాల్‌ పెయింటర్‌ యు.శంకర్‌తో ఓ మధ్యవర్తి ద్వారా పియూష్‌కు పరిచయం ఏర్పడింది. శంకర్‌ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా తణుకు. శంకర్‌ ద్వారా గోవా నుంచి మాదకద్రవ్యాలను నగరానికి పంపించి పియూష్‌ డ్రగ్స్‌ వ్యాపారం చేయసాగాడు. ఈ నేపథ్యంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లో కొకైన్‌ విక్రయించాలని పథకం వేశారు. ఇందులో భాగంగా ఒక్కో గ్రాము చొప్పున గోవాలో ప్యాక్‌ చేసిన కొకైన్‌ను హైదరాబాద్‌లో ఉండే శంకర్‌కు ఇచ్చేందుకు పియూష్‌ నగరానికి వచ్చాడు. ఈ సమాచారం వెస్ట్‌జోన్‌ టాస్క్‌ఫోర్స్‌ పోలీసులకు అందడంతో బంజారాహిల్స్‌లో నిఘా పెట్టి శంకర్, పియూష్‌లిద్దరినీ రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి నుంచి 89 గ్రాముల కొకైన్‌ స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌ను ఎవరెవరికి సరఫరా చేస్తున్నాడనే విషయాలు విచారణలో వెలుగులోకి వస్తాయని సీపీ వెల్లడించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్‌ డీసీపీ రాధాకిషన్‌రావు, ఇన్‌స్పెక్టర్‌ గట్టుమల్లు బృందం పాల్గొంది. డ్రగ్స్‌ ముఠా సమాచారం సేకరించిన కానిస్టేబుల్‌ జి.లోకేశ్వర్‌ను సీపీ అభినందించారు.


డ్రగ్‌ ప్యాకెట్‌ని మీడియాకు చూపిస్తున్న సీపీ అంజనీ కుమార్‌

‘జనాభా ప్రాతిపదికనే రిజర్వేషన్లు’

సాక్షి, హైదరాబాద్‌: పంచాయతీ ఎన్నికల్లో జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్‌ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ వికాస్‌రాజ్‌ను ఆర్‌.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ బృందం కలిసి విన్నవించింది. బీసీ రిజర్వేషన్లు తగ్గించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

‘పంచాయతీ’ రిజర్వేషన్లు ఖరారు చేసింది సుప్రీమే

నోముల నర్సింహయ్య

సాక్షి, హైదరాబాద్‌: పంచాయతీ ఎన్నికల్లో సుప్రీంకోర్టు నిర్ణయించిన రిజర్వేషన్లనే ఖరారు చేశామని టీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అన్నారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పుపై స్పెషల్‌ లీవ్‌ పిటిషన్‌ (ఎస్‌ఎల్‌పీ) కూడా దాఖలు చేసినట్లు గుర్తుచేశారు. తమ ఎస్‌ఎల్‌పీని కూడా సుప్రీంకోర్టు కొట్టివేయడంతోనే బాధాకర పరిస్థితుల్లో సీఎం కేసీఆర్‌ తీర్పును అంగీకరించారని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ఉత్తమ్, కోదండరాం మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉండగా బీసీ ఫెడరేషన్లకు ఒక్క పైసా కూడా కాంగ్రెస్‌ కేటాయించలేదని ఆరోపించారు. బీసీలకు 90 శాతం సబ్సిడీతో ఇప్పుడు పెట్టుబడి సమకూరుస్తున్నామని చెప్పారు. బీసీ సంఘాల నేత కృష్ణయ్య వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. తమిళనాడు తరహాలో తెలంగాణలో రిజర్వేషన్లు సాధించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. బీసీలకు ఎవరేం చేశారో తేల్చుకునేందుకు ఉత్తమ్‌ దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్‌ విసిరారు. కాగా, ఏపీ సీఎం చంద్రబాబు కల్లు తాగిన కోతిలా ప్రవర్తిస్తున్నారని నర్సింహయ్య విమర్శించారు. బాబు–మోదీ పంచాయితీలో సీఎం కేసీఆర్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు దక్కుతున్న ప్రజాదరణను చూసి బాబు ఓర్వలేకపోతున్నారన్నారు. ఇప్పటికైనా బాబు పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

ఏడాదిలోపు మీడియా అకాడమీ భవనం

అల్లం నారాయణ వెల్లడి

సాక్షి, హైదరాబాద్‌: ఏడాదిలోపు తెలంగాణ మీడియా అకాడమీ భవనం అందుబాటులోకి వస్తుందని అకాడమీ చైర్మన్‌ అల్లం నారాయణ తెలిపారు. సోమవారం సమాచార భవన్‌లో నిర్వహించిన అకాడమీ పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత భవనాన్ని కూల్చేసి కొత్త భవన నిర్మాణం కోసం ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో టెండర్లు కూడా ఖరారయ్యాయని చెప్పారు. నూతన భవన శంకుస్థాపన కార్యక్రమం త్వరలో సీఎం కేసీఆర్‌ చేతుల మీదుగా జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్‌ ప్రత్యేకశ్రద్ధ తీసుకొని అకాడమీకి రూ.15 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. నూతన భవనం పూర్తయితే రూ.100 కోట్ల జర్నలిస్టుల సంక్షేమనిధి నుంచి శాశ్వత తరగతి గదుల నిర్మాణం ఏర్పాటు చేసి జర్నలిజం కోర్సు కూడా ప్రవేశపెడతామని వెల్లడించారు.

150 కుటుంబాలకు ఆర్థిక చేయూత

గతంలో ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి వంద కోట్లు ప్రకటించి, రూ.34.50 కోట్లను విడుదల చేసిందని అల్లం నారాయణ వివరించారు. మరణించిన 150 మంది జర్నలిస్టుల కుటుంబాలకు వాటి నుంచి రూ.లక్ష చొప్పున రూ.కోటి యాభై లక్షలు, తీవ్ర అనారోగ్యం బారిన పడిన జర్నలిస్టులకు రూ.50 వేల చొప్పున 26 లక్షల సహాయం అందజేశామని తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రతి నెలా రూ.3,000 చొప్పున 5 ఏళ్ల వరకు ఆర్థికసాయం ఇవ్వనున్నట్లు చెప్పారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 104 మంది పిల్లలకు 1 నుంచి 10వ తరగతి వరకు రూ.1,000 చొప్పున ట్యూషన్‌ ఫీజు చెల్లిస్తున్నామన్నారు. తెలంగాణ జర్నలిస్టు సమాజానికి ఎనలేని ఖ్యాతి తీసుకొచ్చిన ప్రముఖ జర్నలిస్టుల మెనును గ్రాఫ్స్‌ రూపంలో భద్రపర్చడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

హైదరాబాద్ పచ్చగా ఉండాలి

పెద్ద ఎత్తున పచ్చదనం పెంపునకు సీఎం ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పచ్చదనాన్ని హైదరాబాద్ మహా నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో కూడా పెంచే కార్యక్రమాన్ని ఉధృతంగా చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. దేశంలోని ఇతర కొన్ని నగరాల తరహాలో హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్‌గా మారడా నికి వీలు లేదని ఆయన స్పష్టంచేశారు. నగర ప్రజల కు ప్రయోజనం కలిగించడంతో పాటు భవిష్యత్తు తరాలకు కూడా సంతోషం కలిగించే రీతిలో ఈ కార్యక్రమం ముందుకు సాగాలన్నారు. నగరంలో పచ్చ దనం అభివృద్ధిపై సోమవారం ఆయన హెచ్‌ఎండీఏ కమిషనర్ బి.జనార్దన్ రెడ్డితో సమీక్ష నిర్వహించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో సరిపడా లంగ్ స్పేస్(వనాలు)ను సాధ్యమైనంత రీతిలో అభివృద్ధిపరచాలన్నారు. వాకర్స్ క్లబ్బులను ఏర్పాటు చేసి పార్కుల నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి కోసం అటవీ శాఖ సహకారంతో ప్రణాళిక తయారు చేయాలన్నారు. పచ్చదన పెంపునకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి అమలు చేయాలని హెచ్‌ఎండీఏను ఆదేశించారు.

బీసీ సంక్షేమంపై బహిరంగ చర్చకు సిద్ధం

కాంగ్రెస్ నేతలకు ఎంపీ లింగయ్య సవాల్




సాక్షి, న్యూఢిల్లీ: బీసీల సంక్షేమం కోసం గత కాంగ్రెస్ హయాంలో, ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో చేసిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు తాము సిద్ధమే అని టీఆర్‌ఎస్ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. సోమవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు టీఆర్‌ఎస్ పక్షాన నిలబడ్డారని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికలను సుప్రీంకోర్టు ఆదేశానుసారమే నిర్వహిస్తున్నామన్నారు. బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మొదట తీర్మానం చేసింది టీఆర్‌ఎస్ పార్టీయే అని ఆయన గుర్తు చేశారు. రాజ్యసభలో టీఆర్‌ఎస్‌కి ఆరుగురు సభ్యులుంటే అందులో నలుగురు బీసీలేనని వివరించారు. బీసీల కోసం రూ.16వేల కోట్లు బడ్జెట్ కేటాయించడమే కాకుండా, ఎంబీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు విడుదల చేసిన ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీయేతర ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటు కోసం కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలపై విమర్శలు చేస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు తీరును తప్పుబట్టారు. ఇతర రాష్ట్రాలకు దిక్సూచిగా నిలుస్తున్న తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలన్నదే కేసీఆర్ లక్ష్యమని, బాబు మాదిరి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కాదని విమర్శించారు.

రిజర్వేషన్లను కాపాడుకుంటాం: జాజుల



సాక్షి, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో గతంలో ఉన్న 34 శాతం బీసీ రిజర్వేన్లను కాపాడుకుంటామని, అరశాతం తగ్గించి నా రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. సోమవారం ఇక్కడ నిర్వహించిన బీసీ విద్యార్థి సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. బీసీ ఉద్యమాలను దెబ్బతీసేందుకు సీఎం కేసీఆర్ రిజర్వేషన్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. 34 శాతం రిజర్వేషన్ల కోసం న్యాయ పోరాటం చేస్తామని, ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, కలెక్టరేట్ల ముట్టడి తదితర ఆందోళనలతో పాటు బీసీ రిజర్వేషన్ల పరిరక్షణ యాత్ర చేపడతామని హెచ్చరించారు. అనంతరం తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం ఓయూ అధ్యక్షుడు స్వామిగౌడ్, విద్యార్థి, నిరుద్యోగ ఫ్రంట్ ఛైర్మన్ చనగాని దయాకర్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగంగౌడ్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో దేశగాని సాంబశివ గౌడ్, నాగరాజు గౌడ్, బొంగు వెంకటేశ్, దళిత జేఏసీ ఛైర్మన్ గుండెల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

334వ రోజు



ఇప్పటివరకు నడిచిన దూరం: 3,574.1 కిలోమీటర్లు

334వ రోజు
నడిచిన దూరం: 11.1 కి.మీ.
31–12–2018, సోమవారం
దెప్పూరు కూడలి, శ్రీకాకుళం జిల్లా

వారు కన్నీరుమున్నీరవుతుంటే.. నా గుండె బరువెక్కింది

ఈ రోజు కిడ్నీ వ్యాధి పీడితులు, తిత్లీ తుపాను బాధితులు గ్రామగ్రామానా కలిశారు. ఈ రోజు పాదయాత్ర సాగిన వజ్రపుకొత్తూరు మండలంలోనే తిత్లీ తుపాను తీరం దాటింది. ఎటు చూసినా నేలవాలిన పెద్ద పెద్ద కొబ్బరి, జీడి మామిడి చెట్లే కనిపించాయి. తుపాను బీభత్సాన్ని కళ్లకు కట్టాయి. మామిడిపల్లికి చెందిన కూలీపని చేసుకునే జోగారావు అనే అన్న కలిశాడు. తిత్లీ తుపానప్పుడు ఆ గాలులకు పక్కింటి పైకప్పు ఎగిరిపడి ఆయన కాలు తెగిపోయిందట. గంటల తరబడి ఎదురుచూసినా సాయమందని పరిస్థితి. విధిలేని పరిస్థితిలో భుజాలమీద ఎత్తుకుని కిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారట. అక్కడ వైద్యం చేయలేమన్నారని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళితే.. ఆరోగ్యశ్రీ వర్తించదన్నారట. లక్షల రూపాయలు అప్పుచేసి వైద్యం చేయించుకోవాల్సి వచ్చిందంటూ ఆ సోదరుడు కంటతడిపెట్టాడు. అధికారుల చుట్టూ, అధికార పార్టీ నేతల చుట్టూ పరిహారం కోసం నేటికీ తిరుగుతూనే ఉన్నాడు.

చినవంక గ్రామస్తులది మరో జాలి కథ.. తిత్లీ తుపాను తర్వాత కొద్ది రోజుల వరకూ ఏ సాయమూ అందని దుస్థితి వారిది. ఆ ఊరికే వచ్చిన ముఖ్యమంత్రిగారికి తమ కష్టాలు చెప్పుకుందామని పోతే 'నోర్లు మూసుకోండి.. అడ్డొస్తే బుల్డోజర్లతో తొక్కించేస్తా'.. అంటూ బెదిరించాడని వాపోయారు.

విప్లవాల పురిటిగడ్డ.. బొడ్డపాడు గ్రామం సమీపంలో పాదయాత్ర సాగింది. భూమి కోసం.. భుక్తి కోసం.. సాయుధ రైతాంగ పోరాటాలు ప్రారంభమైన గ్రామమది. మామిడిపల్లి, బొడ్డపాడు గ్రామాల మహిళలు కలిశారు. వారంతా జీడి కార్మికులే. చాలామంది 60 ఏళ్లు పైబడ్డ అవ్వలే. జీడి పిక్కలు ఒలిచి.. చర్మమంతా పోయి.. చేతులు నల్లగా పొక్కిపోయాయి. రోజంతా కష్టపడ్డా రూ.130 కూడా గిట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేతులకు గ్లౌజులు కూడా కొనుక్కోలేని దుస్థితి వారిది. చేతి వేళ్లు దెబ్బతినడంతో పింఛనూ, రేషన్‌కు సమస్యే అంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

సాయంత్రం గునిపల్లి, మిట్టూరు గ్రామాలకు చెందిన దాదాపు 20 మందికి పైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు కలిశారు. ఈ నియోజకవర్గంలోనే అత్యధిక కిడ్నీ వ్యాధిగ్రస్తులున్నది గునిపల్లిలోనేనట. దాదాపు ప్రతి ఇంట్లో కిడ్నీ బాధితులున్నారని చెప్పారు. ఆ ఊరంతా మత్స్యకారులే. ఉపాధి కోసం వలసలుపోయి తెచ్చిన సంపాదనంతా.. ఇంట్లో కిడ్నీ బాధితుల చికిత్సకే సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ఇంట్లో ఇద్దరు ముగ్గురు కిడ్నీ వ్యాధిగ్రస్తులున్న కుటుంబాలూ ఉన్నాయట. రేషన్‌కార్డును బట్టి ఒక ఇంట్లో ఒకరికే డయాలసిస్ చేస్తున్నారట. మరి మిగతావారి పరిస్థితేం కావాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు మందుల్లేక.. మరోవైపు డయాలసిస్ సేవలు సరిగా అందక.. ఇంకోవైపు పింఛన్లు రాక.. వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఈ బాధలుపడటం కన్నా ఆత్మహత్యే మేలని ఓ అన్న కన్నీరుమున్నీరవుతుంటే.. గుండె బరువెక్కిపోయింది.

ముఖ్యమంత్రిగారికి నాదో ప్రశ్న.. 'ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం ప్రతి పీహెచ్‌సీలో మందులు ఉచితంగా అందిస్తాం.. ప్రతి డయాలసిస్ సెంటర్లో ఒక నెఫ్రాలజిస్ట్‌ను నియమిస్తాం'.. అంటూ పలాస బహిరంగ సభలో ప్రకటించారు. రెండేళ్లు దాటిపోయింది.. మరి ఆ హామీ ఏమైంది?

వైఎస్. జగన్.



సోమవారం హైదరాబాద్‌లోని హైకోర్టు నుంచి విజయవాడకు తరలివెళ్తున్న ఏపీ న్యాయమూర్తులు, న్యాయవాదులు

కొత్త అధ్యాయం

అమరావతి కేంద్రంగా నేడు ఏపీ హైకోర్టు ప్రారంభం

- సీజేగా ప్రమాణం చేయనున్న జస్టిస్ ప్రవీణ్‌కుమార్.. అనంతరం ఇతర న్యాయమూర్తులూ..
- వారితో ప్రమాణ స్వీకారం చేయించనున్న గవర్నర్ నరసింహన్
- విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి
- నగరానికి చేరుకున్న న్యాయమూర్తులు.. నోవాటెల్ హోటల్‌లో వసతి సదుపాయం..
- ప్రత్యేక బస్సుల్లో విజయవాడకు ఏపీ హైకోర్టు ఉద్యోగులు..

విజయవాడ లీగల్/ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)/గరికపాడు(జగ్గయ్యపేట)/సాక్షి, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు అధ్యాయం ముగిసిపోయింది. నేటి నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతి కేంద్రంగా పనిచేయనుంది. ఈ నేపథ్యంలో హైకోర్టు కార్యకలాపాలకు, జడ్జీలు, అధికారుల వసతికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆంధ్రప్రదేశ్ నూతన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా చాగరి ప్రవీణ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు మరో 13 మంది న్యాయమూర్తులతో గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. జనవరి 2వ తేదీ నుంచి హైకోర్టు కార్యకలాపాలు మొదలవుతాయి. ఇందుకోసం విజయవాడలోని సివిల్ కోర్టుల పక్కనున్న సీఎం క్యాంపు కార్యాలయంలో కోర్టులను ఏర్పాటు చేశారు. ఇక హైకోర్టు కార్యాలయం కోసం ఎం.జి.రోడ్డులోని ఏ.పి.ఏ.టి. భవనంలో 10,000 చదరపు అడుగులు కేటాయిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా ఉత్తర్వులు జారీ చేశారు. అందులో ఫర్నిచర్ ఏర్పాటు చేయమని సీఆర్‌డీఏను, హైకోర్టు కార్యకలాపాల అవసరాలకు అవసరమైన కంప్యూటర్లను సమకూర్చాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఇదిలా ఉంటే.. న్యాయమూర్తులు, అధికారుల వసతికోసం ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(విజిలెన్స్) సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్, కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వై.లక్ష్మణరావు, హరిహరనాథ్ శర్మలు దగ్గరుండి చూశారు. హైకోర్టు న్యాయమూర్తులకు, రిజిస్ట్రార్‌లకు నగరంలోని హోటల్ నోవాటెల్‌లో వసతి సదుపాయం ఏర్పాటు చేశారు. ఇతర న్యాయశాఖ అధికారులకు స్టేట్ గెస్ట్‌హౌస్‌లో బస కల్పించారు.

న్యాయమూర్తులకు ఘన స్వాగతం..

రాష్ట్ర హైకోర్టు కార్యకలాపాలు అమరావతిలో ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఏపీ హైకోర్టుకు కేటాయించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తోపాటు ఇతర న్యాయమూర్తులందరూ సోమవారం హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గాన విజయవాడకు చేరుకున్నారు. వీరంతా తమకు బస ఏర్పాటు చేసిన నోవాటెల్ హోటల్‌కు సాయంత్రం ఐదుగంటల సమయానికి చేరుకోగా ఘన స్వాగతం లభించింది. వారికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్‌చంద్ర పునేఠా, ప్రోటోకాల్ సెక్రటరీ ఎన్.శ్రీకాంత్, కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జాయింట్ కలెక్టర్ విజయకృష్ణన్, సబ్ కలెక్టర్ మిషాసింగ్‌లు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ ద్వారకా తిరుమలరావు నుంచి తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా నియమితులైన జస్టిస్ ప్రవీణ్‌కుమార్ గౌరవ వందనం అందుకున్నారు. అంతకుముందు రోడ్డుమార్గాన విజయవాడకు వస్తున్న హైకోర్టు న్యాయమూర్తులకు 65వ నెంబర్ జాతీయ రహదారి గరికపాడు వద్ద కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ విజయ్‌కృష్ణన్, విజయవాడ సబ్‌కలెక్టర్ మిషాసింగ్‌లు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ప్రధాన న్యాయమూర్తులతోపాటు వారి కుటుంబసభ్యులు ప్రత్యేక వాహనాల్లో బందోబస్తు నడుమ వచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ నరసింహారావు, జగ్గయ్యపేట న్యాయమూర్తులు బిందుమాధవి, కళార్చనలు పాల్గొన్నారు.

తెలంగాణ చీఫ్ జస్టిస్‌గా నేడు రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారం

మరోవైపు తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ రాధాకృష్ణన్ మంగళవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రమాణ స్వీకారం చేస్తారు. ఉదయం ఎనిమిదిన్నర గంటలకు ఆయనతో గవర్నర్ నరసింహన్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

ఏపీ హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన బీబీఏ ప్రతినిధులు

ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఎస్.వి.బట్టు, జస్టిస్ ఎ.వి.శేషసాయి, జస్టిస్ టి.సునీల్ చౌదరి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి, జస్టిస్ జి.శ్యామ్‌ప్రసాద్, జస్టిస్ జె.ఉమాదేవి, జస్టిస్ నక్కా బాలయోగి, జస్టిస్ టి.రజనీ, జస్టిస్ డి.వి.వి.ఎస్.సోమయాజులు, జస్టిస్ కె.విజయలక్ష్మి, జస్టిస్ ఎం.గంగారావులను బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) అధ్యక్షుడు కొండపల్లి సత్యనారాయణరావు, ఉపాధ్యక్షుడు కనిసెట్టి వెంకటరంగారావు, ప్రధాన కార్యదర్శి దొడ్ల లక్ష్మణరావు, కార్యవర్గ సభ్యులు మువ్వల జయప్రకాష్, ఎం.హనుమంత్, సి.హెచ్.రాధాకుమారి, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్, బీబీఏ మాజీ అధ్యక్షులు చేకూరి శ్రీపతిరావు, గోగుశెట్టి వెంకటేశ్వరరావు, మట్టా జయకర్, సోము కృష్ణమూర్తి, చోడిశెట్టి మన్మథరావు తదితరులు హోటల్ నోవాటెల్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.



విజయవాడకు బస్సులో బయలుదేరిన న్యాయమూర్తులు, న్యాయవాదులు

హైదరాబాద్ హైకోర్టు ఆవరణలో ఉద్వేగభరిత వాతావరణం

హైకోర్టు విభజన నేపథ్యంలో ఏపీకి చెందిన సిబ్బంది, న్యాయవాదులు సోమవారం విజయవాడకు పయనమైనప్పుడు హైదరాబాద్‌లోని హైకోర్టు ఆవరణలో ఉద్వేగభరిత వాతావరణం నెలకొంది. ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి హైకోర్టులో కలసిమెలసి పనిచేసిన న్యాయవాదులు, సిబ్బంది విడిపోతుండడంతో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. బాధాతప్త హృదయంతోనే పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏపీ ఉద్యోగులకు తెలంగాణ ఉద్యోగులు, న్యాయవాదులు వీడ్కోలు చెప్పారు. అనంతరం హైకోర్టు నుంచి ఐదు ప్రత్యేక బస్సులు బయల్దేరి సోమవారం రాత్రికి విజయవాడకు చేరాయి. కోర్టు రికార్డులను కూడా తీసుకొచ్చారు. ఆ ఫైళ్లను ఆయా కోర్టుల్లో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నేడు విజయవాడకు జస్టిస్ ఎన్.వి.రమణ

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ మంగళవారం విజయవాడకు రానున్నారు. ఉదయం ఏడు గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు ఆయన చేరుకుంటారు. అక్కడినుంచి నోవాటెల్ హోటల్‌కు చేరుకుని హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరవుతారు.

దుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన చీఫ్ జస్టిస్ దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వారికి వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో వి.కోటేశ్వరమ్మ, పాలక మండలి ఛైర్మన్ గౌరంగబాబు, ఆలయ ప్రధాన అర్చకులు ఎల్‌డీ ప్రసాద్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

హైకోర్టు విభజన నోటిఫికేషన్‌పై పిటిషన్

- రేపటి జాబితాలో చేర్చిన రిజిస్ట్రీ
- కోర్టును తప్పుదోవ పట్టించారంటూ వ్యాజ్యంలో ఆరోపణ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు భవన నిర్మాణం ఇంకా పూర్తికానందున రాష్ట్రపతి జారీ చేసిన ఉమ్మడి హైకోర్టు విభజన నోటిఫికేషన్ అమలును వాయిదావేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్ బుధవారం విచారణకు రానుంది. ఏపీ న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కె.సీతారాం, సభ్యుడు కాసా జగన్‌మోహన్‌రెడ్డి ఈ పిటిషన్‌ను దాఖలు చేయగా సుప్రీం కోర్టు రిజిస్ట్రీ జనవరి రెండో తేదీ నాటి విచారణాంశాల జాబితాలో చేర్చింది. జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో కూడిన ధర్మాసనం దీన్ని విచారించనుంది. పిటిషన్‌లోని వివరాలు ఇలా ఉన్నాయి. 'ఏపీలో భవన నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. న్యాయవాదులు, న్యాయస్థాన సిబ్బందికి తగిన వసతులు లేవు. ఈ భవనాల చుట్టూ 20 కిలోమీటర్ల వైశాల్యంలో ఎక్కడా తగిన వసతులు లేవు. ఈ భవనాలకు చేరుకునేందుకు సరైన రహదారులు లేవు. అందువల్ల మౌలిక వసతులు ఏర్పాటయ్యేంతవరకు సిబ్బంది, న్యాయవాదులు అక్కడికి నివాసాన్ని మార్చేందుకు సుముఖంగా లేరు. ఇప్పటికీ సచివాలయ, ఇతర ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు పూర్తిస్థాయిలో హైదరాబాద్ నుంచి అమరావతికి తమ నివాసాలను మార్చలేదు. అందువల్ల హైకోర్టును తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేయడం ద్వారా సిబ్బంది, న్యాయవాదులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటారు. ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం సుప్రీం కోర్టునే తప్పుదోవ పట్టించేలా డిసెంబరు 15 కల్లా తాత్కాలిక భవన నిర్మాణం పూర్తవుతుందని అఫిడవిట్ వేసింది. ఇప్పుడు హైకోర్టు విభజన నోటిఫికేషన్ వెలువడ్డాక ఒక మెమో జారీచేసింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయ భవన సముదాయంలో హైకోర్టు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. ఇక్కడి రాజకీయ వాతావరణం హైకోర్టు నిర్వహణకు ఇబ్బందికరంగా ఉంటుంది. భవన నిర్మాణం పూర్తికావడానికి మరో 10 నెలలు అవసరమని తెలుస్తోంది.. అందువల్ల ఆ నిర్మాణం, వసతుల ఏర్పాటు పూర్తయ్యేంతవరకు నోటిఫికేషన్ అమలును వాయిదావేయాలి..' అని పిటిషనర్లు కోరారు.

కేవియట్ దాఖలు చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైకోర్టు విభజనకు చెందిన గెజిట్ నోటిఫికేషన్ అమలుపై వచ్చిన పిటిషన్లపై ఆదేశాలు జారీ చేసేముందు తమ అభిప్రాయం తెలియపరిచే అవకాశం ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం కేవియట్ దాఖలు చేసినట్టు ప్రభుత్వ న్యాయవాది ఉదయ కుమార్ సాగర్ తెలిపారు.

అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్

దోపిడీదారులకు శిక్ష తప్పదు: లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అంటే కమీషన్–కరప్షన్–కలెక్షన్‌గా పేరుగాంచిందని, సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, రాహుల్‌గాంధీ నేతృత్వం అంతా కుంభకోణాలమయం అయిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌కు దేశ రక్షణ, ప్రజల రక్షణ పట్ల ఏ మాత్రం బాధ్యత లేదని, వారి డీఎన్‌ఏలోనే దోపిడీ ఉందన్నారు. అగస్టా వెస్ట్‌లాండ్ స్కామ్ నిందితుడిని భారత ప్రభుత్వం ఇటీవల పట్టుకొని దేశానికి తీసుకొచ్చిందన్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్, సోనియా, రాహుల్ ఇతర నేతలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. దోపిడీ బయట పడుతుందని దొంగే దొంగ అని అరిచినట్లుగా రాహుల్ ప్రవర్తిస్తున్నారన్నారు. అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్ల కొనుగోలులో అక్రమాలు చోటుచేసుకున్నాయని మొదట ఇటలీ కోర్టు తెలిపిందని, ఇప్పటికే అక్కడి ప్రభుత్వం ఈ కేసుకు సంబంధించి కొందరిని అరెస్ట్ చేసిందన్నారు. ఇటలీ కోర్టులో పలుమార్లు సోనియా పేరు వచ్చిందని, నిందితుడు మిషెల్ కూడా సోనియా పేరు ప్రస్తావించారని ఈడీ డిసెంబరు 29న పాటియాలా కోర్టుకు తెలిపిందన్నారు. ఈ కుంభకోణం నుంచి సోనియా కుటుంబం తప్పించుకోలేదని లక్ష్మణ్ అన్నారు.

మారనున్న పలు సెట్ల కన్వీనర్లు!

- ఐసెట్, లాసెట్, పీజీఈసెట్, ఎడ్‌సెట్ కన్వీనర్ల మార్పు
- ఎంసెట్, ఈసెట్, పీఈసెట్ కన్వీనర్లు పాతవారే?
- రేపు ఉన్నతస్థాయి భేటీ, షెడ్యూల్, కన్వీనర్లు ఖరారు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2019–20 విద్యా సంవత్సరంలో వివిధ వృత్తి విద్యా కోర్సుల ప్రవేశాలకు నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్స్)పై ఉన్నత విద్యామండలి కసరత్తు వేగవంతం చేసింది. ఏప్రిల్ నెలాఖరు నుంచి ప్రవేశ పరీక్షలను ప్రారంభించాలంటే మొదటివారంలోనే సెట్లు నిర్వహించే యూనివర్సిటీలు, కన్వీనర్లు, షెడ్యూలును ఖరారు చేసి ప్రకటించాల్సి ఉంది. అందులో భాగంగా కన్వీనర్లను ఖరారు చేసేందుకు జనవరి 2న ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. అందులో అన్ని యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లు, ఇతర అధికారులు పాల్గొననున్నారు. 2018–19 విద్యాసంవత్సరంలో సెట్లు నిర్వహించిన కన్వీనర్లలో నలుగురు ఈసారి మారనున్నారు. గత ఏడాది ఐసెట్ నిర్వహించిన ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యశర్మ (కాకతీయ వర్సిటీ), పీజీఈసెట్ నిర్వహించిన ప్రొఫెసర్ షమీమ్ ఫాతిమా(ఉస్మానియా వర్సిటీ), పదవీ విరమణ పొందారు. గత ఏడాది లాసెట్ నిర్వహించిన ప్రొఫెసర్ ద్వారకనాథ్, ఎడ్‌సెట్ నిర్వహించిన ప్రొఫెసర్ మధుమతి త్వరలో పదవీవిరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో ఆ 4 సెట్లకు కన్వీనర్లుగా కొత్తవారిని నియమించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది.

పాతవారికే మూడు సెట్ల బాధ్యత

ఎంసెట్, ఈసెట్, పీఈసెట్ నిర్వహణ బాధ్యతలను గతేడాది నిర్వహించిన వర్సిటీలకే అప్పగించి, పాతవారినే కన్వీనర్లుగా కొనసాగించాలని ఉన్నత విద్యామండలి భావిస్తోంది. దీంతో ఎంసెట్‌కు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదయ్య, ఈసెట్‌కు అదే వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ గోవర్ధన్, పీఈసెట్‌కు ప్రొఫెసర్ సత్యనారాయణ కన్వీనర్లుగా కొనసాగే అవకాశముంది. దానిపై జనవరి 2న జరిగే ఉన్నతస్థాయి సమావేశంలో చర్చించి అధికారికంగా నిర్ణయం ప్రకటించనుంది. సమావేశంలో కన్వీనర్ల పేర్లు, సెట్ల నిర్వహణ తేదీలను కూడా ఖరారు చేసే అవకాశం ఉంది. మరోవైపు ఈసారి ఎంసెట్ నిర్వహిస్తామని ఉస్మానియా వర్సిటీ ముందుకు వచ్చినట్లు తమకు ఎలాంటి సమాచారం లేదని, ఎలాంటి లేఖ అందలేదని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి పేర్కొన్నారు. ఈసారి ఐసెట్ నిర్వహణ బాధ్యతలను తమకు అప్పగించాలని తెలంగాణ వర్సిటీ లేఖ రాసిందని, ఆ అంశాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు.

వైద్యం అందక చచ్చిపోతున్నామయ్యా..

వైఎస్ జగన్‌తో గోడు వెళ్లబోసుకున్న ఉద్దానం కిడ్నీ బాధితులు

ప్రజా సంకల్ప యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : 'అయ్యా.. మా ఆశలన్నీ మీపైనే.. మమ్మల్ని మీరే కాపాడాలి.. వైద్యం అందక చచ్చిపోతున్నామయ్యా..'అంటూ ఉద్దానం ప్రాంత కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. రోజంతా కష్టపడి సంపాదించుకున్న కూలీ డబ్బులు డయాలసిస్‌కే సరిపోక ఇబ్బంది పడుతున్నామని, ఇట్టాగైతే ఎలా బతకాలని బావురుమన్నారు. బతుకులు దుర్భరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా 334వ రోజు సోమవారం శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గంలో జగన్ పాదయాత్ర సాగించారు. తిత్లీ తుపానుతో అతలాకుతలమైన గ్రామాల మీదుగా పాదయాత్ర సాగింది. అక్కడి కుటుంబాలు సర్వస్వం కోల్పోయాయి. అసలే కిడ్నీ జబ్బులతో కునారిల్లుతున్న తమ ప్రాంతాన్ని తిత్లీ మరింత కుంగదీసిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దెప్పూరు క్రాస్ వద్ద పలువురు కిడ్నీ వ్యాధిగ్రస్తులు, వారి కుటుంబీకులతో జగన్ ముఖాముఖి మాట్లాడారు. వారి కష్టాలు ఓపిగ్గా విన్నారు. దెప్పూరు, గునుపల్లి, మెట్టూరు, గడూరు, డోకులపాడు, హరిజనపేట, తోటూరు గ్రామాలకు చెందిన బాధితులు తమ కష్టాలు చెప్పుకున్నారు.

బతుకు భారమైందయ్యా..

ప్రభుత్వం ఇస్తున్న రూ.1000 పింఛన్ మందులకు కూడా చాలడం లేదని, బతుకు భారమైందని సంక లోలాక్షి ఆవేదన వ్యక్తం చేసింది. డయాలసిస్ కోసం దాదాపు 100 నుంచి 250 కిలోమీటర్ల మేర ప్రయాణించడం కష్టంగా ఉందని గేదెల పున్నాలమ్మ అనే మహిళ వాపోయింది. 'దూరంగా ఉన్న డయాలసిస్ కేంద్రానికి వెళ్లి రావడానికి ఆరోగ్యం సహకరించడం లేదయ్యా.. ఎన్నాళ్లు బతుకుతానో'అంటూ పుక్కళ్ల ఎల్లమ్మ కన్నీటిపర్యంతమైంది. గునపల్లి, మెట్టూరు గ్రామాల్లో ఇంటికి ఒకరిద్దరు చొప్పున కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉండగా, ఈ ప్రభుత్వం ఇంటికొకరికే డయాలసిస్ చేస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక రేషన్ కార్డుపై ఒక కిడ్నీ రోగికే డయాలసిస్ చేస్తున్నారని, కొన్ని కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు చొప్పున బాధితులున్నారని, వారిలో ఒకరు మరణిస్తే తప్ప మరొకరికి డయాలసిస్ సౌకర్యం కలగడం లేదని కన్నీటి పర్యంతమయ్యారు. డయాలసిస్ కోసం శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాలకు వెళ్లి రావడానికి అవస్థలు పడుతున్నామన్నారు. ఈ ప్రాంతంలో కిడ్నీ బాధితుల మరణాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో కిడ్నీ వ్యాధి వల్ల వేటకు వెళ్లలేని పరిస్థితి ఉందని, ఒకవేళ సముద్రంలోకి వెళ్లినా వ్యాధి కారణంగా మళ్లీ తిరిగొస్తారన్న నమ్మకం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

మరిన్ని ఫొటోలు టాబ్లాయిడ్‌లో



సోమవారం శ్రీకాకుళం జిల్లా చీపురుపల్లి వద్ద కిడ్నీ బాధితులతో మాట్లాడుతున్న జగన్

అన్ని విధాలా ఆదుకుంటాం

ఉద్దానం కిడ్నీ బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని వైఎస్ జగన్ వారికి భరోసా ఇచ్చారు. ప్రతి కిడ్నీ బాధితుడికి రూ.10 వేల పింఛన్ మంజూరు చేస్తామన్నారు. రోగులకు అందుబాటులో 200 పడకలతో కూడిన కిడ్నీ డయాలసిస్, రీసెర్చి సెంటర్‌ను ఏర్పాటు చేసి మెరుగైన సేవలందిస్తామని హామీ ఇచ్చారు. వ్యాధిని ప్రాథమిక దశలోనే నిర్ధారించి.. చికిత్స చేయడానికి ఈ పరిశోధనా కేంద్రంలో వసతులుంటాయని చెప్పారు.

ఉద్దానంలో వైఎస్ జగన్‌కు బ్రహ్మరథం

ఉద్దానం పల్లెల్లో ప్రజలు వైఎస్ జగన్‌కు బ్రహ్మరథం పట్టారు. వజ్రపుకొత్తూరు మండలం రాజాం కాలనీ, ధర్మపురం, గరుడభద్ర, తర్లగడూరు క్రాస్, అక్కుపల్లి, గడూరు, చీపురుపల్లి జంక్షన్ మీదుగా దెప్పూరు జంక్షన్ వరకు పెద్ద సంఖ్యలో మహిళలు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. ఊళ్లకు ఊళ్లు తరలి వచ్చి జగన్‌కు సంఘీభావం ప్రకటించాయి. ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఇటీవల తిత్లీ తుపాను బీభత్సానికి ఈ ప్రాంతమంతా ధ్వంసమైంది. స్థానికులు ఒకవైపు జగన్‌కు ఘన స్వాగతం పలుకుతూనే.. మరోవైపు తమ కష్టాలూ చెప్పుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం.. పడిపోయిన చెట్లను తొలగించడానికి అయ్యే ఖర్చుకు కూడా సరిపోలేదన్నారు. అలాగే పింఛన్‌లు, రేషన్ అందడం లేదని, వైఎస్సార్‌సీపీ సాను భూతిపరులమని టీడీపీ నేతలు అక్రమ కేసులు పెడుతున్నారని, ఏళ్ల తరబడి పనిచేస్తున్నా తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయడం లేద ని.. ఇలా పలువర్గాల ప్రజలు తమ కష్టాలు చెప్పుకుని వినతిపత్రాలిచ్చారు. అందరి సమస్యలను ఓపిగ్గా విన్న జగన్.. మనందరి ప్రభుత్వం రాగానే అందరికీ మంచి జరుగుతుందని భరోసా ఇచ్చారు.

గవర్నర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ ప్రజలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇరు రాష్ట్రాల ప్రజల జీవితాల్లో కొత్త సంవత్సరం సుఖసంతోషాలు, ఐశ్వర్యాన్ని తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రజల జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలి



కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు పోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరిసేలా దీవించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

హోంమంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు హోంమంత్రి హోంమంత్రి మహమూద్ అలీ సోమవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరమంతా అందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు అలీ పేర్కొన్నారు.

సుఖసంతోషాలు వెల్లివిరియాలి

తెలుగు ప్రజలకు వైఎస్ జగన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2019.. తెలుగు ప్రజలకు ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, సంపద సమృద్ధిగా కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవితాల్లో మంచి మార్పులకు దారితీయాలని జగన్ తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో సుపరిపాలన అందుతుందని, విలువలు లేని అవకాశవాదుల నుంచి రాష్ట్రానికి విముక్తి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. రాజకీయాల్లో, పరిపాలనలో కొత్త ధోరణికి నూతన సంవత్సరం శ్రీకారం చుడుతుందన్న ధీమాను వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరి మనసును స్పృశించేలా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

నూతన సంవత్సరంలో సుఖసంతోషాలతో గడపాలి: ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలని ఆయన భగవంతుడిని ప్రార్థించారు. పాత సంవత్సరంలో మంచిని కొనసాగిస్తూ నూతన సంవత్సరంలో కూడా అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు.

మూసీపై సుందర వంతెన

రూ.231 కోట్లతో ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: సాలార్‌జంగ్ మ్యూజియం ఎదుట మూసీ నదిపై రూ.231.5 కోట్ల అంచనా వ్యయంతో పాదచారుల వంతెన నిర్మించనున్నారు. ఈ మేరకు సోమవారం సీఎస్ ఎస్కే జోషి నేతృత్వంలో సమావేశమైన హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బోర్డు 'ఐకానిక్ బ్రిడ్జి'పేరుతో నిర్మించనున్న ప్రాజెక్టు డిజైన్లకు ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా కులీకుతుబ్‌షా కాంప్లెక్స్ వద్ద మల్టీలెవల్ కార్ పార్కింగ్, పండ్ల విక్రయదారులకు స్థలం కల్పించేందుకు ఐకానిక్ బ్రిడ్జికి సమాంతరంగా మరో బ్రిడ్జిని నిర్మించనున్నారు. త్వరలో ఈపీసీ విధానంలో టెండర్లను ఆహ్వానించనున్నారు.

కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శం

బెంగాల్‌లోనూ రైతుబంధు, రైతుబీమా: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఒడిశా, జార్ఖండ్ తర్వాత తాజాగా పశ్చిమ బెంగాల్‌లోనూ రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా పథకాలను ప్రవేశపెట్టనున్నట్లు ఆ రాష్ట్ర సీఎం ప్రకటించారని తెలిపారు. ఈ మేరకు మమతా బెనర్జీ చేసిన ప్రకటనను జోడిస్తూ కేటీఆర్ ట్విట్టర్‌లో సోమవారం పోస్టు చేశారు. 'తెలంగాణలో మేం చెప్పిందే ఆచరణలో పెడుతున్నాం. దాన్ని దేశం అనుసరిస్తోంది..'అని ఆయన పేర్కొన్నారు.


రిజర్వేషన్ల తగ్గింపు.. రాజ్యాంగ విరుద్ధం



ఆర్.కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 22 శాతానికి తగ్గించడం రాజ్యాంగ విరుద్ధమని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం ఈ మేరకు పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శిని ఆయన కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల కోటాను తగ్గిస్తూ వెలువరించిన ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోటా కుదింపు కారణంగా బీసీలు మరింత వెనకబడి పోతారని ఆందోళన వ్యక్తం చేశారు.

ద.మ.రైల్వే సీపీఆర్వోకు పదోన్నతి



ఉమాశంకర్

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఉమాశంకర్ కుమార్‌కు ఆర్వీఎన్ఎల్ జనరల్ మేనేజర్‌గా పదోన్నతి లభించింది. ఈమేరకు సోమవారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఉమాశంకర్ కుమార్ ఇండియన్ రైల్వేస్ ఆఫ్ ఇంజినీర్స్ 1997 బ్యాచ్‌కు చెందినవారు. ఉస్మానియా వర్సిటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. నాలుగేళ్లుగా దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారిగా విధులు నిర్వర్తించారు. హైలైట్స్, తథాస్తు యాప్ రూపకల్పనలో, సికింద్రాబాద్–వాడి కొలిజన్ అవాయిడ్ సిస్టమ్ పరిశీలనలో కీలకంగా వ్యవహరించారు. 2018లో భోపాల్‌లో జరిగిన ఇండియన్ రైల్వే ఎగ్జిబిషన్‌లో దక్షిణ మధ్య రైల్వే ప్రజాసంబంధాల విభాగానికి తొలి అవార్డు రావడంలో ఈయన కీలకపాత్ర పోషించారు.

భవనంపై నుంచి పడిన చిన్నారి

క్షేమంగా తల్లి ఒడికి

హైదరాబాద్: తండ్రి, బాబాయి తోపులాటలో రెండంతస్తుల భవనంపై నుంచి ఓ చిన్నారి కింద పడింది. ఈ ఘటన ఆదివారం హైదరాబాద్‌లోని మల్లాపూర్–నర్సింహనగర్‌లో చోటుచేసుకుంది. మనోజ్, జాహ్నవి దంపతులకు 8 నెలల పాప (శివాని) ఉంది. మనోజ్ తన భార్యతో కలసి బంధువుల ఇంటికి వెళ్లారు. అంతలో మనోజ్ సోదరుడు అక్కడికొచ్చాడు. పాత కక్షలతో అన్నదమ్ములు గొడవ పడ్డారు. అన్నా తమ్ముడూ తోపులాడుకుంటుండగా.. ఆ సమయంలో మనోజ్ చేతుల్లో ఉన్నా శివాని జారి కింద పడింది. చెట్ల కొమ్మలకు తాకుతూ కింద ఉన్న చెత్త కుప్పలో పడింది. దీంతో వారు వెంటనే కిందకు దిగి చిన్నారిని ఆస్పత్రికి తరలించగా.. పాప క్షేమంగా ఉందని వైద్యులు తెలిపారు.

ఆ నాలుగు స్థానాలపై కోర్టుకు..

- ధర్మపురి, తుంగతుర్తి, కోదాడ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలపై న్యాయపోరాటం
- ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాల్సిందే
- బీసీ రిజర్వేషన్లపైనా పోరాటం..
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షలో కాంగ్రెస్ నిర్ణయం
- పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల వ్యూహంపై చర్చ



సాక్షి, హైదరాబాద్: చాలా తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన ధర్మపురి, తుంగతుర్తి, కోదాడ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ విషయమై ఎన్నికల అధికారులను కోరినా పట్టించుకోలేదని, దీనిపై న్యాయపోరాటం చేయాలని నిర్ణయించింది. పోలైన ఓట్లకు, కౌంటింగ్ జరిగిన ఓట్లకు మధ్య వ్యత్యాసం ఉన్న స్థానాల్లో కూడా వివరాలు సేకరించి ఆ నియోజకవర్గాల విషయంలో కూడా కోర్టును ఆశ్రయించేందుకు పార్టీ నేతల నుంచి వివరాలు కోరింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై సమీక్షించేందుకు సోమవారం హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. సమావేశానికి రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహతో పాటు ఏఐసీసీ కార్యదర్శి సలీమ్ అహ్మద్, టీపీసీసీ ముఖ్య నేతలు షబ్బీర్‌అలీ, సంపత్, పద్మావతి రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్, దామోదర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, అజారుద్దీన్, మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్‌యాదవ్, బలరాంనాయక్ హాజరయ్యారు. ఇటీవలి ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను నియోజకవర్గాలు, జిల్లాల వారీగా నేతలు సమీక్షించారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌తో పాటు, కౌంటింగ్, పోలింగ్ ఓట్లు సరిపోలక పోవడం, రైతుబంధు చెక్కులను ఎన్నికల సమయంలోనే జమ చేయడం, పంటలు సాగు చేయకపోయినా భూమి ఉన్న ప్రతి ఒక్కరికీ నగదు రూపంలో జమ చేయడం లాంటి కారణాలతో ఓటమి పాలైనట్లు అభిప్రాయపడ్డారు. కొందరు కలెక్టర్లు తమ అభ్యర్థుల విజ్ఞప్తులను పట్టించుకోలేదని, కనీసం పనిచేయని ఈవీఎంల సమాచారం కూడా ఇవ్వలేదని, వీటన్నింటిపై సమగ్ర ఆధారాలను తీసుకుని కోర్టుకు వెళ్లాలని నేతలు నిర్ణయించారు.

గెలిచిన నేతలతో ప్రత్యేక భేటీ

గత ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలతో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి (మునుగోడు). హర్షవర్ధన్ రెడ్డి (కొల్లాపూర్), శ్రీధర్ బాబు (మంథని), కందాల ఉపేందర్‌రెడ్డి (పాలేరు), పైలెట్ రోహిత్‌రెడ్డి (తాండూరు)లతో పాటు మాజీ ఎంపీ విజయ శాంతి హాజరయ్యారు. అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకూడదని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో రాజీపడకుండా అసెంబ్లీలో ప్రభుత్వంపై కొట్లాడాలని నిర్ణయించారు.

వారిదే బాధ్యత

త్వరలో జరగనున్న పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ నేతలు చర్చించారు. పార్టీ గెలిచిన స్థానాల్లోని పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యతలను ఎమ్మెల్యేలే తీసుకోవాలని సూచించారు. ఓటమి పాలైన చోట్ల నేరుగా పీసీసీ పర్యవేక్షించడంతో పాటు పోటీచేసిన అభ్యర్థులు, సీనియర్ నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు చొరవ తీసుకుని వీలున్నన్ని పంచాయతీ స్థానాలు గెలుచుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని నిర్ణయించారు. ఎంపీ ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని, ఇప్పటి నుంచే అసెంబ్లీ నియోజకవర్గాల వారీ సమీక్షలు, పార్టీ సమావేశాలు నిర్వహించాలని, లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని నిర్ణయించారు. ఎన్నికల్లో ఓడిపోయినా అందరం కలిసికట్టుగా ఉండాలని, ప్రజావ్యతిరేక విధానాలపై అధికార పార్టీతో తలపడాల్సిందేనని నేతలు అభిప్రాయపడ్డారు. పంచాయతీల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, ఇందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాటం చేయాలని నిర్ణయించారు.

వచ్చే ఎన్నికల్లో వ్యూహంపై చర్చ..



'తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు. ప్రభుత్వంలో ఉన్నా లేకపోయినా పార్టీ నిర్మాణం ఎలా ఉండాలన్న దానిపై సమావేశం జరిగింది. పంచాయతీ, పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించాం'

– మాజీ మంత్రి జానారెడ్డి

ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పాలన



'నూతన సంవత్సర శుభాకాంక్షలు. ప్రజాస్వామ్య విధానాల మీద పాలన నడవాలి. మెజార్టీ ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా పాలన నడుస్తోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన జరగాలని కోరుకుంటున్నా.'

– పొన్నాల లక్ష్మయ్య, మాజీ మంత్రి

ఓట్లు తొలగించారు..



'ఈవీఎం మెషీన్‌లో తప్పుల వల్లే టీఆర్ఎస్ గెలిచింది. కాంగ్రెస్ బలంగా ఉన్న చోట్ల ఓట్లు తొలగించారు. 48 ఈవీఎం మెషీన్లు పాడయ్యాయి. రీకౌంటింగ్ అడిగిన చోట్ల కూడా ఎన్నికల అధికారులు పట్టించుకోలేదు. ఈ ఎన్నికల్లో జరిగిన తప్పిదాలపై రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలుస్తాం.'

– ఆర్.సి.కుంతియా

న్యాయపోరాటం చేస్తాం..

'తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఎన్నికల ఫలితాలపై సమీక్ష జరిగింది. ధర్మపురి, తుంగతుర్తి, కోదాడ, ఇబ్రహీంపట్నం స్థానాల్లో తక్కువ ఓట్లతో ఓడిపోయాం. అక్కడ న్యాయపోరాటం చేస్తాం. గెలిచిన ఎమ్మెల్యేలు పంచాయతీ ఎన్నికల్లో గెలుపు బాధ్యతలను తీసుకుంటారు. పంచాయతీల్లో బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తాం.'

– పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అప్పుడే ఓటమికి సాకులా!

చంద్రబాబుపై జగదీశ్‌రెడ్డి, బాల్క సుమన్ ధ్వజం



జగదీశ్‌రెడ్డి



బాల్కసుమన్

సాక్షి, హైదరాబాద్: ఏపీ సీఎం చంద్రబాబుకు ఓటమి ఖరారైందని, దానికోసం ఇప్పటినుంచే సాకులు వెతుక్కుంటున్నారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి మాట్లాడారు. కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఇతర విషయాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. బాబును ఓడించేందుకు మోదీ ఎందుకని, ఏపీ ప్రజలు చాలన్నారు. తమకు బీజేపీతో ఎలాంటి రాజకీయ సంబంధాలు లేవని స్పష్టం చేశారు. ఎన్టీఆర్‌ను దించేందుకు కేసీఆర్ సూత్రధారి అయితే ఆయనే సీఎం అయ్యేవారు కదా అని చంద్రబాబుని ప్రశ్నించారు. కేసీఆర్ తెలంగాణ కోసం గొంగళి పురుగునైనా ముద్దు పెట్టుకుంటానన్నారని జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ సాధనలో భాగంగానే 2004లో కాంగ్రెస్‌తో, 2009లో టీడీపీతో పొత్తు పెట్టుకున్నామన్నారు. ఈ క్రమంలో దాదాపు 36 పార్టీలను ఒప్పించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. మొన్నటి ఎన్నికల్లో మోదీ – కేసీఆర్ దోస్తీ అని చంద్రబాబు మొత్తుకున్నా ప్రజలు నమ్మలేదన్నారు. గోబెల్స్ ఆశ్చర్యపోయేలా చంద్రబాబు అబద్ధాలాడుతున్నారని విమర్శించారు. బాబు మాటలను తెలంగాణ ప్రజలు నమ్మలేదని, ఏపీ ప్రజలుకూడా తిరస్కరిస్తారని అన్నారు. రాష్ట్రాలు విడిపోయినా, రెండు రాష్ట్రాల హైకోర్టు ఎందుకు కలసి ఉండాలో బాబు సరైన కారణం చెప్పలేకపోతున్నారని, ఇన్నేళ్లకాలంలో చంద్రబాబు కనీసం హైకోర్టు భవనం కూడా కట్టలేకపోయారని ఎద్దేవాచేశారు. పొరుగు రాష్ట్రాల విషయంలో కేసీఆర్ చాలా పరిణతితో వ్యవహరించారన్నారు. ఈ విషయంలో మహారాష్ట్రతో కుదుర్చుకున్న సాగునీటి ఒప్పందం ఒకటి చాలని ఆయన ఉదహరించారు. కేసీఆర్ బూచిచూపి ఏపీలో ఓట్లు పొందాలనుకోవడం అత్యాశే అవుతుందని ఎద్దేవా చేశారు. ఇకనైనా చంద్రబాబు అబద్ధాలు ఆపి, పరిపాలనలో కేసీఆర్‌తో పోటీపడాలని జగదీశ్ రెడ్డి హితవు పలికారు.

ఇక ప్రకటనే తరువాయి!

- ఎన్నికల నిర్వహణకు కసరత్తు పూర్తి
- రెండు మూడు రోజుల్లో పంచాయతీ షెడ్యూల్
- 12,751 గ్రామ పంచాయతీల్లో జరగనున్న ఎన్నికలు
- ఓటేయనున్న 1,49,73000 మంది ఓటర్లు
- రేషన్ డీలర్లు ఎన్నికల్లో పోటీకి అర్హులే
- ఎన్నికల వ్యయంపై వచ్చిన స్పష్టత

సాక్షి, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు పూర్తయింది. రాష్ట్రంలోని 12,751 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒకట్రెండు రోజుల్లో షెడ్యూల్ ప్రకటించే అవకాశాలున్నాయి. మండల, వార్డు స్థాయిల్లో సర్పంచ్, వార్డుసభ్యుల రిజర్వేషన్లకు సంబంధించిన జిల్లాల వారీ గెజిట్లను సోమవారం పంచాయతీరాజ్ శాఖ అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అందజేశారు. ఈ ఎన్నికల్లో 1,49,73,000 మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలు ప్రకటించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత రోజూ సాయంత్రం 6 గంటల వరకు ప్రచారం నిర్వహించుకునేందుకు అభ్యర్థులను అనుమతించనున్నారు. సర్పంచ్ అభ్యర్థుల కోసం 30, వార్డు సభ్యుల కోసం 20 ఎన్నికల గుర్తులను ఎన్నికల సంఘం సిద్ధం చేసి ఉంచింది. ఒక గుర్తును పోలి మరో గుర్తు లేకుండా చర్యలు తీసుకున్నట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి. గత ఎన్నికల్లో పోటీ చేసి ఎన్నికల వ్యయ లెక్కలను సమర్పించని కారణంగా 12,716 మందిని ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా ఎన్నికల సంఘం తాజాగా ప్రకటించింది. ఈ ఎన్నికల్లో రేషన్ డీలర్లు సైతం పోటీ చేయొచ్చని స్పష్టతనిచ్చింది.

బలవంతపు ఏకగ్రీవాలపై చర్యలు

ప్రజాస్వామ్యబద్ధంగా సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ఇబ్బంది లేదని, ఈ పదవులను వేలం వేయడం లేదా ఓటర్లను భయాభ్రాంతులకు గురిచేసి ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నిస్తే సంబంధిత జిల్లా కలెక్టర్‌తో విచారణ జరిపించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేయనుంది.

ఎన్నికల ఖర్చులపై స్పష్టత

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల వ్యయ పరిమితులపై ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది. 5 వేలకు పైగా జనాభా గల గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థి రూ.2.5 లక్షలు, వార్డు సభ్యుడు రూ.50 వేల వరకు ఖర్చు చేయొచ్చని తెలిపింది. 5 వేల లోపు జనాభా ఉంటే రూ.1.5 లక్షల లోపు, వార్డు సభ్యుడు రూ.30 వేల వరకు మాత్రమే వ్యయం చేయాలని తెలిపింది. ఎన్నికల నిర్వహణకు 95 వేల బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసింది.

ఇట్లు.. మీ విధేయులు

▶ మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యే కోటాలోని ఒక స్థానం మినహా అన్ని అధికార పార్టీకే దక్కనున్నాయి. ఎన్నికల వరకు ప్రతిపక్ష ఎమ్మెల్యేల సంఖ్య ఇంకా తగ్గితే అన్ని టీఆర్ఎస్ గెలుచుకునే పరిస్థితి ఉంటుంది. అయితే టీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ స్థానాలు ఆశించే వారి సంఖ్య సైతం భారీగానే ఉంది.

- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న హోం మంత్రి మహమూద్ అలీ (టీఆర్ఎస్), మహమ్మద్ సలీం (టీఆర్ఎస్), టి.సంతోశ్‌కుమార్ (టీఆర్ఎస్), మహమ్మద్ షబ్బీర్‌అలీ (కాంగ్రెస్), పొంగులేటి సుధాకర్‌రెడ్డి (కాంగ్రెస్) పదవీకాలం మార్చి ఆఖరుతో ముగుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన మైనంపల్లి హనుమంతరావు (టీఆర్ఎస్) రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానం సైతం ఎమ్మెల్యే కోటాలోనిదే. ఇలా ఆరు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం వీటిలో ఐదు స్థానాలను టీఆర్ఎస్ గెలుచుకునే పరిస్థితి ఉంది. పదవీకాలం ముగుస్తున్న ముగ్గురు టీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు ఆ పార్టీ అధిష్టానం మళ్లీ అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. వీరితోపాటు టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ సలహాదారు శేరి సుభాశ్‌రెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రవీందర్‌రావుకు టీఆర్ఎస్ కొత్తగా ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. అలాగే తెలంగాణ ఉద్యమం, 2014 వరకు టీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా పని చేసిన అందరికీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్‌లు దక్కాయి. వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించిన రవీందర్‌రావుకు ఈసారి ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని టీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలిసింది.
- అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేలు అయిన కారణంగా మైనంపల్లి హనుమంతరావు (టీఆర్ఎస్), పట్నం నరేందర్‌రెడ్డి (టీఆర్ఎస్), కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి (కాంగ్రెస్) రాజీనామా చేశారు. ఎన్నికలకు ముందు టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కొండా మురళీధర్‌రావు (టీఆర్ఎస్) సైతం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. పట్నం నరేందర్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల కోటా స్థానానికి మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్ రెడ్డి, క్యామ మల్లేశ్, కంజర్ల చంద్రశేఖర్‌రెడ్డి పోటీ పడుతున్నారు. కె.రాజగోపాల్‌రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన నల్లగొండ స్థానిక సంస్థల స్థానం నుంచి తేరా చిన్నపరెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, వేనేపల్లి చందర్‌రావు పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొండా మురళీధర్‌రావు రాజీనామాతో ఖాళీ అయిన వరంగల్ ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయ్యింది. టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేరును అధిష్టానం ఈ స్థానానికి పరిశీలిస్తోంది. శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే కోటాలో అవకాశం కల్పిస్తే ఇతర పేర్లను పరిశీలించే అవకాశం ఉంది.
- హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎం.ఎస్.ప్రభాకర్‌రావు (టీఆర్ఎస్) పదవీకాలం మార్చి ఆఖరుతో ముగుస్తోంది. టీఆర్ఎస్ అధిష్టానం ఈ స్థానంలో ఎం.ఎస్.ప్రభాకర్‌రావుకు మళ్లీ అవకాశం కల్పించనుంది.
- కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ కె.స్వామిగౌడ్ (టీఆర్ఎస్) పదవీకాలం మార్చితో ముగుస్తోంది. శాసన మండలి చైర్మన్‌గా ఉన్న స్వామిగౌడ్‌కు ఇదే స్థానంలో పోటీ చేసే అవకాశం కల్పించనుంది. స్వామిగౌడ్‌కు ఎమ్మెల్యే కోటాలో అవకాశం కల్పిస్తే ఇక్కడ కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్, గ్రూప్–1 అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్‌లలో ఒకరిని టీఆర్ఎస్ బరిలో దింపే అవకాశం ఉంది.
- కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి (టీఆర్ఎస్) పదవీకాలం మార్చిలో ముగుస్తోంది. టీఆర్ఎస్ అధిష్టానం ఈ స్థానంలో మరోసారి పాతూరికే అవకాశం ఇవ్వాలని భావిస్తోంది.
- వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ పూల రవీందర్ (స్వతంత్ర) పదవీకాలం మార్చిలో ముగుస్తోంది. పూల రవీందర్ అధికార పార్టీకి అనుబంధంగానే కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకే టీఆర్ఎస్ మద్దతు తెలిపే అవకాశం ఉంది.

బ్రాండ్.. తెలంగాణ

▶ మొదటి పేజీ తరువాయి

ప్రారంభించాలన్నారు. తర్వాత భారీ స్థాయిలో విస్తరించవచ్చన్నారు. అధికారులు వివిధ స్థాయిల్లో మేధోమథన కార్యక్రమాలను, వర్క్‌షాపులను నిర్వహించాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధికి కేంద్రం అమలు చేస్తున్న కార్యక్రమాలతో పాటు అంతర్జాతీయ స్థాయిలో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలన్నారు. ఎంత ఖర్చు పెట్టడానికైనా ప్రభుత్వం వెనకాడదన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. 4 లక్షలకు పైగా ఉన్న ఐకేపీ మహిళా సంఘాల్లో ఉన్న 45 లక్షల మంది సభ్యులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విత్తన కంపెనీల నియంత్రణ, కల్తీ విత్తనాల అమ్మకం పూర్తిగా నిషేధం, విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలన్నారు. నాటు యంత్రాలు, కలుపుతీసే యంత్రాలు, పసుపు రైతులకు ఇవ్వాల్సిన యంత్రాల విషయంలో కార్యాచరణ రూపొందించాలన్నారు.

పంట మార్పిడిపై అవగాహన రావాలి..

''రైతులు నియంత్రిత విధానంలో పంటలు పండించేలా చూడాలి. ప్రతి కుంట భూమిలో ఏ విత్తనం పెడుతున్నామో వ్యవసాయ శాఖకు తెలియాలి. మేలు రకమైన విత్తనాలు రైతులకు ఇవ్వాలి. వ్యవసాయ విశ్వ విద్యాలయంలో తదనుగుణంగా పరిశోధనలు జరగాలి. అంతర్జాతీయ విపణిలో మన దేశ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ చేసుకోలేని పరిస్థితిలో ఉండటం దురదృష్టకరం. దీన్ని అధిగమించాలి. ప్రతి గ్రామం అక్కడి ప్రజల అవసరాలు తీర్చే స్థాయిలో కూరగాయలు పండించాలి. మిగులు కూరగాయలు సమీపంలోని నగరాలు, పట్టణాలకు సరఫరా చేయాలి'అని సీఎం అన్నారు. 'రైతులందరూ ఒకే రకమైన పంటలేస్తే సమస్యలొస్తాయి. వారికి పంట మార్పిడిపై అవగాహన కల్పించాలి. రైతుల సంప్రదాయబద్ధ అలవాట్లలో కొంత వరకు మార్పు రావాలి. ముల్కనూరు గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. అక్కడ సహకార పద్ధతిలో రైతులను సంఘటితపరచడంతో గొప్ప ఫలితాలొచ్చాయి. ఇలా చేస్తే లాభం కలుగుతుందని అధికారులు నమ్మకం కలిగిస్తే బ్రహ్మాండమైన ఫలితాలొస్తాయి. రాష్ట్రంలో ఈ అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించాలని ఢిల్లీలో వ్యవసాయ ఆర్థిక శాస్త్రవేత్త అశోక్ గులాటిని ఆహ్వానించాను. త్వరలో ఆయన రాష్ట్రానికి వస్తారు''అని కేసీఆర్ తెలిపారు.

పంట కాలనీలుగా విభజించాలి...

'రాష్ట్రాన్ని పంట కాలనీలుగా విభజించాలి. రైతు పండించే పంటకు డిమాండ్ ఉండాలి. రాష్ట్ర ఆహార అవసరాలను తెసుకొని, ఆ మేరకు పంటలు వేసే దిశగా రైతుల్లో అవగాహన పెంచాలి. రైతులపై ఒకేసారి అభిప్రాయాలను రుద్దకుండా క్రమపద్ధతిలో జరగాలి. గ్రామీణ, పట్టణ ప్రజల ఆహార అవసరాలకు తగ్గట్లు ఉత్పత్తులుండాలి. కూరగాయలు, కొత్తిమీర, జీలకర్ర వంటి వాటిని దిగుమతి చేసుకోవడం దురదృష్టకరం. నగరాల, పట్టణాల సమీపంలో కూరగాయల ఉత్పత్తి జరగాలి. వచ్చే వానాకాలం కల్లా కాళేశ్వరం నీళ్లు వస్తాయి. కొత్త ఆయకట్టు వస్తుంది. వచ్చే రెండేళ్లలో నీటి పారుదల ప్రాజెక్టులన్నీ పూర్తై కోటి ఎకరాలకుపైగా సాగు నీరందుతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి. చెరువులు నిండుతాయి. ఈ నేపథ్యంలో ఎటువంటి భూమిలో ఎలాంటి పంట వేయాలో రైతులకు అవగాహన కలిగించాలి'అని ముఖ్యమంత్రి ఆదేశించారు. పంటలకు సంబంధించి చాలా విషయాల్లో కచ్చితమైన గణాంకాలు లేక సరైన నిర్ణయానికి రావడం కష్టంగా మారిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బ్రహ్మాండంగా వుందని, గత నాలుగేళ్లలో సగటున 17.17 శాతం వృద్ధి రేటును సాధించామని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 29.97 శాతం వృద్ధిరేటు వుందని, స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ)లో ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. వచ్చే 5 ఏళ్లలో రూ.10 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేయబోతున్నామని, అన్ని విధాలుగా రాష్ట్రాభివృద్ధికి అవకాశాలున్నాయన్నారు. మూస పద్ధతిలో ఆలోచించకుండా కొత్త ఒరవడికి సిద్ధం కావాలన్నారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు రాజీవ్ శర్మ, సీఎంఓ అధికారులు నర్సింగ్ రావు, భూపాల్ రెడ్డి, స్మితా సభర్వాల్, డీజీపీ మహేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు అనురాగ్ శర్మ, మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, శాసనమండలి చీఫ్ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, ఆనంద్, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ పాల్గొన్నారు.



సోమవారం ప్రగతి భవన్‌లో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి

సాక్షి
మంగళవారం, జనవరి, 1

ఇది తగునా బాబూ...!

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు వేర్వేరు రాష్ట్రాలుగా మనుగడ ప్రారంభించిన నాలుగున్నరేళ్ల తర్వాత ఏపీకి విడిగా హైకోర్టు ఏర్పడింది. అది నేటినుంచి పనిచేయడం ప్రారంభించబోతోంది. న్యాయవ్యవస్థ ప్రజలకు చేరువ కావాలని ఆశించేవారంతా దీన్ని హృదయపూర్వకంగా స్వాగతిస్తారు. ఇంత సువిశాల దేశంలో నిజానికి ఇప్పుడున్న న్యాయ స్థానాలు సరిపోవు. వాటి సంఖ్య పెంచాలని కోరడంతోపాటు సుప్రీంకోర్టు బెంచ్‌లు వేర్వేరు రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలని, కొన్ని హైకోర్టులకు ఆయా రాష్ట్రాల పరిధిలో వేరే చోట్ల బెంచ్‌లు ఏర్పాటు చేయాలని అనేకులు కోరుతున్నారు. దేశంలోని నాలుగు మెట్రో నగరాల్లో సుప్రీంకోర్టు బెంచ్‌లు ఏర్పాటు చేస్తే దేశ పౌరులకు వ్యయప్రయాసలు తగ్గుతాయని, సత్వర న్యాయానికి వీలవుతుందని చాన్నాళ్లక్రితం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. వేర్వేరు లా కమిషన్‌లు, పార్లమెంటరీ స్థాయీ సంఘాలు సైతం భిన్న సందర్భాల్లో కేంద్రానికి సిఫార్సు చేశాయి. కానీ స్పందించాల్సిన కేంద్ర పాలకులు మాత్రం ఎప్పుడూ వాటి గురించి తమ వైఖరి వెల్లడించలేదు. కానీ మూడేళ్లక్రితం సుప్రీంకోర్టులో దాఖలైన ఒక వ్యాజ్యంపై విచారణ సందర్భంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం కొత్త బెంచ్‌ల ఏర్పాటు కుదరదని తేల్చిచెప్పింది.

వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం హైకోర్టు బెంచ్ కావాలంటూ న్యాయవాదులు ఆందోళన చేశారు. 1994 నుంచి అడపా దడపా సాగుతున్న ఈ ఆందోళనలకు అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతునిస్తూ వచ్చాయి. ఇప్పుడూ ఎటూ కొత్త రాష్ట్రం ఏర్పడింది కనుక రాజ్యాంగంలోని 214వ అధికరణానికి అనుగుణంగా హైకోర్టు కల సాకారమైంది. దీన్ని అమరావతిలో కాక కర్నూలులో ఏర్పాటు చేయాలని రాయలసీమ వాసులు, విశాఖలో ఏర్పాటు చేయాలని ఉత్తరాంధ్రవాసులు గత కొన్నేళ్లుగా డిమాండు చేస్తూ వచ్చారు. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరుకున్నట్టు చివరకు అమరావతిలోనే హైకోర్టు వచ్చింది. కొత్త హైకోర్టు ఏర్పాటుపై మొన్న బుధవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ ప్రక్రియంతా ఎవరిలోనూ అసంతృప్తి లేకుండా పూర్తయి ఉంటే ఈ శుభసందర్భానికి అతికినట్టు ఉండేది. ఎందుకంటే హైకోర్టును ఎప్పుడు విభజిస్తారంటూ తెలంగాణ న్యాయవాదులు అడిగినట్టే, తమకు కొత్త హైకోర్టు ఎప్పుడు ఏర్పాటవుతుందంటూ ఆంధ్రప్రదేశ్ న్యాయవాదులు డిమాండు చేస్తూ వచ్చారు. కానీ నోటిఫికేషన్ విడుదలయ్యాక కొన్ని అసంతృప్తి స్వరాలు వినబడ్డాయి. అవి సహేతుకమైనవేనని చెప్పకతప్పదు. అక్కడ అవసరమైన భవనాలు ఇంకా సిద్ధం కాకుండా ఇప్పటికిప్పుడు వెళ్లిపోవాలని కోరడం ఎంత వరకూ న్యాయమన్నది అందులో ప్రధానమైనది. న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సిబ్బంది, న్యాయవాదులు తరలి వెళ్లడమంటే మాటలు కాదు. వారందరూ తలదాచుకోవడానికి గూడు దొరకాలి. వారందరూ పనిచేయడానికి కావలసిన సమస్త సౌకర్యాలతో భవనం ఉండాలి. వీటన్నిటా బాబు ప్రభుత్వం దారుణంగా విఫలమైంది.

కొత్త హైకోర్టు ఏర్పాటు ప్రతిపాదన ఇప్పటికిప్పుడు వచ్చింది కాదు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అడగకుండా, దాని ప్రమేయం లేకుండా అది ఏర్పడే ప్రశ్నే ఉత్పన్నం కాదు. హైకోర్టు విభజన విషయంలో జరుగుతున్న జాప్యంపై తెలంగాణ న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేసినప్పుడు ఆంధ్రప్రదేశ్ నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడమే తరవాయి అని కేంద్రం ఒకటి రెండుసార్లు వివరణనిచ్చింది. తాత్కాలిక హైకోర్టు భవనం 2018 డిసెంబర్ 15కల్లా సిద్ధమవుతుందని ప్రమాణపూర్వకంగా సుప్రీంకోర్టు ముందు బాబు సర్కారు రెండు నెలల క్రితమే అఫిడవిట్ దాఖలు చేయడంతో ఆ అడ్డంకి కూడా తొలగింది. భవంతుల నిర్మాణానికి రూ. 500 కోట్లు కేంద్రం విడుదల చేసింది. అనంతరం ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు స్వయంగా వచ్చి నిర్మాణం పనుల్ని పరిశీలించారు. వారి వెంట మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనర్‌లు వెళ్లారు. గడువు తేదీలోగా అన్నీ పూర్తవుతాయని హామీ ఇచ్చారు. అనంతరం చంద్రబాబు సైతం ఆ మాటే చెప్పారు. తీరా చూస్తే భవంతులు పూర్తికాకపోవడమే కాదు...కనీసం వాటిని చేరేందుకు సరైన రహదారే లేదు. చినుకు పడిందంటే ఆ ప్రాంతం మోకాల్లోతు బురదతో నిండి నడిచి వెళ్లడానికే అసాధ్యంగా మారుతుంది. ఇక వాహనాలు వెళ్లడం గురించి ఆలోచించనవసరమే లేదు. హైకోర్టుకు అవసరమైన భవనం సమకూర్చాలని నాలుగున్నరేళ్లక్రితమే తెలిసినప్పుడు, కేంద్రం అందుకు అవసరమైన నిధులు అందజేసినప్పుడు చంద్రబాబుకు ఉన్న అడ్డంకులేమిటి? మొన్న మార్చి వరకూ నిర్మాణపనులు మొదలుకాకపోవడానికి, ఆ తర్వాతైనా అవి నత్తనడకన సాగటానికి కారణమేమిటి? రెణ్ణెల్లక్రితం సుప్రీంకోర్టు ముందు తప్పుడు అఫి డవిట్ ఎందుకు దాఖలు చేశారు? కనీసం డిసెంబర్ మొదట్లోనైనా వాస్తవాన్ని సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేకపోయారు? ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు వచ్చినప్పుడైనా నిజం ఎందుకు చెప్పలేకపోయారు? పైగా నోటిఫికేషన్ విడుదలైనరోజున దాన్ని కీర్తిస్తూ, అది తమ ఘనతేనంటూ చెప్పినవారు 24 గంటలు తిరగకుండా స్వరం ఎందుకు మార్చారు? వీటన్నిటికీ సంజాయిషీ చెప్పవలసిన బాబు...యథాప్రకారం తనకలవాటైన రీతిలో ఎదుటివారిపై బురదజల్లి తప్పించు కోవాలను కుంటున్నారు. నదురూ బెదురూ లేకుండా సుప్రీంకోర్టు మొదలుకొని ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరకూ అందరిపైనా నిందలేస్తూ తన నైజాన్ని బయట పెట్టుకుంటున్నారు. ఒక చారిత్రక సందర్భాన్ని తన వక్రీకరణలతో, వంచనతో మలినం చేసినందుకు చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు మాత్రమే కాదు... సర్వోన్నత న్యాయస్థానంతో సహా అందరికీ క్షమాపణ చెప్పాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబినామ సంవత్సరందక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిరమాసం తిథి బ.ఏకాదశి రా.3.48 వరకు తదుపరి ద్వాదశి నక్షత్రం స్వాతి ఉ.11.54 వరకు తదుపరి విశాఖ వర్జ్యం సా.5.31 నుంచి 7.08 వరకు దుర్ముహూర్తం ఉ.8.45 నుంచి 9.29 వరకు తదుపరి రా.10.44 నుంచి 11.36 వరకు అమృతఘడియలు..రా.3.08 నుంచి 4.56 వరకు

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం: 5.32
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

తీరిన కోరిక తెలంగాణ హైకోర్టు



మంగారి రాజేందర్

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాలకి రెండు హైకోర్టులు ఉండాలి. అమరావతిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పడాలి. తెలంగాణకు కేటాయించిన న్యాయమూర్తుల్లో ఆంధ్ర ప్రాంతానికి చెందిన న్యాయమూర్తులు అధికంగా ఉన్నారు. గత 62 సంవత్సరాలుగా న్యాయవ్యవస్థతో తెలంగాణ నలిగిపోయింది. ఈ అసమానతలు తొలగడానికి ఇంకా ఎంతకాలం పడుతుందో చెప్పలేం. దాని కోసం మరో పోరాటం అవసరమేమో. ఏమైనా, 1 జనవరి 2019 తెలంగాణ ప్రజలకు చిరకాలం గుర్తుంటుంది.

2 జూన్ 2014వ తేదీ మాదిరిగా, 1 జనవరి 2019వ తేదీ తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దాదాపు ఐదు సంవత్సరాలు అయినప్పటికీ తెలంగాణ ప్రజలు సంపూర్ణ తెలంగాణ ఏర్పడినట్టు భావించలేదు. తెలంగాణ ప్రత్యేక హైకోర్టు లేకపోవడమే అందుకు ప్రధాన కారణం. ఈ జనవరితో ఆ కోరిక తీరింది.

1947 నుంచి 1956 వరకు ఉన్న చరిత్ర ఎవరికీ తెలియకుండా చరిత్ర పుస్తకాలు వచ్చేశాయి. అందుకని హైదరాబాద్ రాష్ట్రానికి ప్రత్యేకంగా హైకోర్టు ఉండేదని, దానికి ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు ఉండేవారని ఎవరికీ తెలియదు. ఆంధ్రా హైకోర్టు, హైదరాబాద్ హైకోర్టులను 1 నవంబర్ 1956న విలీనం చేశారు. కానీ, హైదరాబాద్ హైకోర్టు ఆంధ్రా హైకోర్టులో విలీనం అయినట్టు భ్రమింపజేసి హైదరాబాద్ హైకోర్టు న్యాయమూర్తులతో ప్రమాణస్వీకారం చేయించి వాళ్లను తమకన్నా జూనియర్లు అయిన ఆంధ్రా న్యాయమూర్తులకన్నా జూనియర్లుగా మార్చి తెలంగాణ ప్రాంతానికి తీరని ద్రోహం చేశారు.

హైదరాబాద్ హైకోర్టు పద్ధతులను మంటగలిపి ఆంధ్రా పద్ధతులను హైకోర్టులో నెలకొల్పారు. అది చాలా సులువుగా అమలు జరిగింది. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు ఆంధ్రా ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆంధ్రా రాష్ట్రానికి, హైదరాబాద్ రాష్ట్రానికి చాలా భేదం ఉంది. అది బ్రిటీష్ వారి ఆధిపత్యంలో నుంచి ఏర్పడిన రాష్ట్రం. భారతదేశానికి చెందిన ముస్లిం రాజు ఆధిపత్యం నుంచి బయటపడి ఏర్పడిన రాష్ట్రం హైదరాబాద్ రాష్ట్రం. ఆంధ్రా శాసనాలు అన్నీ బ్రిటీష్ పార్లమెంట్ తయారు చేసినవి. హైదరాబాద్ రాష్ట్రంలోని శాసనాలు అన్నీ హైదరాబాద్ స్వంత శాసనాలు. ఇక భాష విషయానికి వస్తే వాళ్లది ఆంగ్లం, హైదరాబాద్ వాళ్లది ఉర్దూ. ఇక్కడి శాసనాలన్నీ ఉర్దూలో ఉండేవి. పరిపాలన ఉర్దూలో జరిగేది. హైకోర్టులో కూడా ఉర్దూలో వాదనలు వినిపించేవాళ్లు. ఇక్కడి న్యాయవాదుల సౌకర్యార్థం ఓ ఉర్దూ బెంచిని ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటు దశలో వాగ్దానం చేశారు. కానీ చేయలేదు. చాలా మంది తెలంగాణ న్యాయవాదులకు ఇంగ్లీషులో ఆంధ్రావాళ్లకి ఉన్న ప్రావీణ్యం లేకపోవడం వల్ల రెండవ శ్రేణి న్యాయవాదులుగా పరిగణించబడినారు. దానికి తోడు ఆంధ్ర రిజిస్ట్రార్ల, అధికారుల ఆధిపత్యం కింద నలిగిపోయినారు. హైకోర్టు న్యాయమూర్తులను ఎంపికచేసే కొలీజియమ్‌లో ఆంధ్రా ప్రాంతానికి చెందిన న్యాయమూర్తులే ఉండటం వల్ల ఆంధ్రా ప్రాంతానికి చెందినవారే హైకోర్టు న్యాయమూర్తులుగా, వారు నేరుగా ఎంపిక చేసిన ఆంధ్రా న్యాయవాదులే జిల్లా జడ్జీలుగా నియమితులైనారు. న్యాయవ్యవస్థ మొత్తం ఆంధ్రా ప్రాంత వాసుల గుప్పిటిలోకి వెళ్లిపోయింది. తెలంగాణ ఏర్పడటానికి ముందు మాత్రమే అడ్వకేట్ జనరల్ తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తి నియామకం కావడం వల్ల ప్రభుత్వ న్యాయవాదుల ఎంపికలో ఎంత వివక్ష జరిగిందో ఊహించుకోవచ్చు.

ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమం రావడం, న్యాయవాదులు చురుగ్గా పాల్గొనడం నేటి ఆధునిక చరిత్ర. 14 మార్చి, 2004న తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మూడవ మహాసభలు జరిగాయి. ఈ సమావేశానికి అప్పటి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి (సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పని చేసి పదవీ విరమణ చేశారు.)ని ఆహ్వానించాం. ఆ సమయంలో ఎంతో భవిష్యత్ ఉన్న హైకోర్టు న్యాయమూర్తి ఆ సమావేశాలకు రావడం సాహసమనే చెప్పాలి. సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న నేను క్రియాశీలక పాత్ర పోషించడమూ అంతే సాహసమని చెప్పుకోక తప్పదు. ఆ రోజు న్యాయమూర్తుల ఎంపికకు పరీక్ష జరుగుతోంది. అందరు న్యాయమూర్తులు ఆ డ్యూటీలో ఉన్నారు. నాకు మాత్రం మినహాయింపునిచ్చారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి, జస్టిస్ నర్సింహారెడ్డి తదితరులు తెలంగాణ ఉద్యమాన్ని ప్రత్యక్షంగా బలపరిస్తే పరోక్షంగా బలపరిచిన న్యాయమూర్తులు ఎందరో. దేశంలో ఉండేటువంటి మౌలిక వనరులు ఎవరి చేతిలో కేంద్రీకృతం కాకూడదు. అవి వివిధ ప్రాంతాలలో నివసించేటువంటి ప్రజల మధ్యన సమానత్వం పెంపొందించడానికి ఉపయోగపడాలి. రాజ్యం ఏర్పాటు చేసేటువంటి ప్రతి వ్యవస్థ ఆర్థిక రాజకీయ, సాంఘిక సమానత్వం సంపాదించడానికి, పెంపొందించడానికి సాధనాలుగా ఉపయోగపడాలి. భిన్న ప్రాంతాల, వృత్తుల ప్రజల మధ్యన ఉన్నటువంటి ఆర్థిక తారతమ్యాలను రూపుమాపడాన్ని రాజ్యాంగం ఆదేశిస్తుంది. ఈ స్ఫూర్తితో న్యాయమూర్తులు తెలంగాణ ఉద్యమాన్ని బలపరిచారు.

ఈ మూడవ సభ జరిగిన పది సంవత్సరాల తరువాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాలుగున్నర సంవత్సరాల తరువాత తెలంగాణకి హైకోర్టు ఏర్పడుతోంది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పేరుని హైదరాబాద్ హైకోర్టుగా మార్చి దాన్ని రెండు రాష్ట్రాలకు కామన్ హైకోర్టుగా ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ద్వారా ఏర్పాటు చేశారు. ఒక్కపేరు తప్ప ఏమీ మారలేదు. మిగతా కొత్త రాష్ట్రాల్లో విభజించినట్టు క్రిందికోర్టు న్యాయమూర్తుల విభజన కూడా జరుగలేదు. ఈ విషయం పట్ల దృష్టి కేంద్రీకరించాలన్న హైకోర్టు న్యాయమూర్తి నర్సింహారెడ్డి వాదనని ఎవరూ పట్టించుకోలేదు. దాని ఫలితంగా ఎంతోమంది తెలంగాణ న్యాయమూర్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాందిశీకుల్లా బతికారు. 31 డిసెంబర్‌న వారి విభజన జరిగింది. ఈ విభజనపట్ల ఎన్నో అభ్యంతరాలు ఉన్నప్పటికీ ఆ విషయాన్ని పట్టించుకునే నాథుడే లేడు. ఇప్పటికైనా ప్రత్యేక హైకోర్టు ఏర్పడుతున్నందుకు సంతోషిస్తున్నట్టుగా అనిపిస్తుంది. ఈ ఏర్పాటుని కూడా రాజకీయం చేసి పబ్బం గడుపుతున్నారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం 2014 ప్రకారం పూర్వ ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా 2 జూన్ 2014న ఏర్పడినాయి. ఈ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాలకి రెండు హైకోర్టులు ఉండాలి. అమరావతిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పడాలి. ఈ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా హైదరబాద్ హైకోర్టు నుంచి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుని విడదీసి ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రజలు కోరినారు. హైదరాబాద్‌లోనే రెండు హైకోర్టులు వేరువేరుగా ఏర్పాటు చేయడానికి అవసరమైన సౌకర్యాలని కల్పిస్తామని ధన్‌గోపాల్ కేసులో తెలంగాణ ప్రభుత్వం వివరించింది. అలా వీల్లేదని హైదరాబాద్ హైకోర్టు తీర్పుని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుని ఆంధ్రప్రదేశ్ భూభాగంలోనే ఏర్పాటు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ తీర్పుకి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ ద్వారా అప్పీలుని దాఖలు చేసింది. హైదరాబాద్ హైకోర్టు సుప్రీంకోర్టు ముందు ప్రమాణ పత్రాన్ని దాఖలు చేసింది. 16 నుంచి 18 నెలల లోపు పూర్తిస్థాయిలో హైకోర్టు భవనాల నిర్మాణం పూర్తి అవుతుందని అంతలోపు తాత్కాలిక భవనంలో హైకోర్టుని ఏర్పాటు చేయవచ్చని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తెలిపారని హైకోర్టు తమ ప్రమాణ పత్రంలో పేర్కొంది. హైదరాబాద్ హైకోర్టు నియమించిన హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ అమరావతిలోని భవనాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ మధ్య కాలంలో ఆ హైకోర్టుకు వెళ్లడానికి ఇష్టపడే న్యాయమూర్తులు తమ ఇష్టాన్ని సుప్రీంకోర్టుకి పంపించారు. న్యాయమూర్తులు అమరావతి వెళ్లడానికి ఇష్టపడటం లేదన్న అపప్రధని తొలగించారు. డిసెంబర్ 15నాటికి హైకోర్టు తాత్కాలిక భవనం సిద్ధమవుతుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకి నివేదించింది. న్యాయమూర్తులు కూడా అక్కడ ఉన్న సౌకర్యాల పట్ల సంతృప్తి చెం దారు. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటుకు ఎలాంటి ఆటంకాలు లేవని అందుకని కాంపిటెంట్ అథారిటీ (రాష్ట్రపతి) తగు చర్యలు తీసుకొని నోటిఫికేషన్ని జారీ చేయాలని సూచించింది. 1 జనవరి 2019 నాటికి రెండు హైకోర్టులు వేర్వేరుగా పని చేస్తాయని సుప్రీంకోర్టు ఆశించింది. సుప్రీంకోర్టు సూచనల ప్రకారం జనవరి 1 నుంచి అమరావతిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటు అవుతుందని నోటిఫికేషన్ని విడుదల చేసింది. రెండు హైకోర్టుల న్యాయమూర్తుల జాబితాని ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సి.ప్రవీణ్‌కుమార్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమించింది.

ఈ దశలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అనవసర సందేహాలు,అపోహలు కావాలని సృష్టించారు. ఈ విభజన వల్ల జగన్‌మోహన్‌రెడ్డి కేసులు మళ్లీ మొదటి దశకు చేరుకుంటాయన్న వాదనను లేవనెత్తారు. కేసుల విచారణకి అధికార పరిధి ఉంటుంది. ఆ అధికార పరిధిలోని కోర్టుల్లో కేసుల విచారణ జరుగుతుంది. న్యాయమూర్తులు బదిలీ అయినంత మాత్రాన అవి మళ్లీ మొదటిదశకు చేరుకోవు. ఎందుకంటే, అవి వారంట్ కేసులు. సమ్మరీ(చిన్న కేసులు)ల్లో మాత్రమే అలాంటి అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని న్యాయకోవిదులు ముఖ్యమంత్రికి చెబుతారు. అయినా, అన్నీ తెలిసీ ముఖ్యమంత్రి ఇలాంటి అపోహలని సృష్టిస్తున్నారని భావించాల్సి ఉంటుంది. చేరువలో న్యాయం ఉండాలి. సత్వర న్యాయం అందాలి. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక సూత్రాలు చెబుతున్నది ఇదే. హైకోర్టు దగ్గరలో ఉండటం న్యాయవాదులకే కాదు, కక్షిదారులకీ అవసరం. మన దేశంలో న్యాయవ్యవస్థ నత్తనడక నడుస్తున్నదని పేరుంది. 28 డిసెంబర్ 2018నాటికి మన దేశంలో 30 సంవత్సరాలకు మించి కోర్టు పరిశీలనలో 66వేల కేసులు ఉన్నాయి. ఐదు సంవత్సరాలకు పైబడిన కేసులు 60లక్షలు ఉన్నాయి. 1800 కేసులు గత 48–58 సంవత్సరాలుగా వాదన దశలో ఉన్నాయి. 60 సంవత్సరాలకు పైబిన కేసులు 140ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతి కొత్త కోర్టునీ, అందులో హైకోర్టునీ స్వాగతించాల్సింది పోయి అనవసర అపోహలు సృష్టించడం, ఆటంకాలు సృష్టించడం ఎవరికీ తగదు.

గత 62 సంవత్సరాలుగా న్యాయవ్యవస్థతో తెలంగాణ నలిగిపోయింది. తెలంగాణ న్యాయమూర్తులు తక్కువ మంది ఉన్నారు. తెలంగాణకు కేటాయించిన న్యాయమూర్తుల్లో ఆంధ్ర ప్రాంతానికి చెందినవారే అధికంగా ఉన్నారు. హైకోర్టు న్యాయమూర్తుల్లో సీనియర్ న్యాయమూర్తులు, జిల్లా జడ్జీల్లో సీనియర్లు ఎక్కువగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తులే ఉన్నారు. ఈ అసమానతలు తొలగడానికి ఇంకా ఎంతకాలం పడుతుందో చెప్పలేం. ఏమైనా, 1 జనవరి 2019 తెలంగాణ ప్రజలకు చిరకాలం గుర్తుంటుంది. ఆంధ్రప్రదేశ్ న్యాయ వ్యవస్థలో న్యాయవాదిగా, న్యాయమూర్తిగా నేను పని చేశాను. అది హైదరాబాద్ హైకోర్టుగా రూపాంతరం చెందిన తరువాత పదవీ విరమణ చేశాను. ఇప్పుడు న్యాయవాదిగా తెలంగాణ హైకోర్టులోకి ప్రవేశించడం ఓ భావోద్వేగానికి సంబంధించిన అంశం. ఇది ఒక్క నాకే కాదు, ఎంతోమంది న్యాయవాదులకీ, న్యాయమూర్తులకీ కూడా. అందరికీ అభినందనలు.

–వ్యాసకర్త మాజీ న్యాయమూర్తి మొబైల్: 9440483001

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నష్ట నివారణ



"చాలా వరకూ దెబ్బతిన్నప్పటికీ బీజేపీయే గెలుస్తుందనే అభిప్రాయం కలిగించడానికి ఆర్‌ఎస్‌ఎస్ వేసిన ఎత్తుగడే మోదీ వర్సెస్ గడ్కరీ చర్చ. ఈ ఉచ్చులోపడి మోసపోవద్దు. పార్టీ చాలా వరకూ కుప్పకూలడం ఖాయమని ఆర్‌ఎస్‌ఎస్‌కు తెలుసు. నష్ట నివారణకు ఇదొక నిరర్థక యత్నం అని అందరికీ తెలిసినదే."

–సంజయ్ ఝా, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి

జై



"నా దేశం మాతృభూమి లేదా పితృ భూమి ఎలా అవుతుంది? దీనిని ఎవరు నిర్ణయిస్తారు? నేను భారతీయుడిని. నా జాతీయతపట్ల నేను గర్వంగానే భావిస్తా. ఇతర భారతీయుల్లాగే నేనూ నా దేశాన్ని ప్రేమిస్తాను. రెండేళ్ల క్రితం వరకు భారత్ మాతాకీ జై అనడానికి నాకేమీ అభ్యంతరం ఉండేది కాదు."

–రవి నాయర్, జర్నలిస్ట్


అభివృద్ధి



"ఏ జాతి అయినా అభివృద్ధి చెందాలంటే సైన్స్, మ్యాథ్స్, లిటరేచర్‌పై ప్రజలు సమయాన్ని వెచ్చించడం ముఖ్యం. అంతేగానీ, 5వేల సంవత్సరాల క్రితం తమ పూర్వీకులు సైన్స్, మ్యాథ్స్, లిటరేచర్‌లో ఏం చేశారో చూపించుకోవడం వల్ల కాదు."

–కౌశిక్ బసు, ప్రొఫెసర్

అర్హత



"స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే నేతలకు విద్యార్హతను తొలగించడం రాజస్తాన్ ప్రభుత్వం తీసుకున్న ప్రగతిశీల నిర్ణయం. ఇప్పటికీ విద్య అందరికీ అందుబాటులోకి రాలేదు. అంతేగాక, డిగ్రీలు తెచ్చుకున్నవారికంటే కొన్నిసార్లు నిరక్షరాస్యులే ఎక్కువ సమయస్ఫూర్తితో పనిచేస్తారు. ఎన్నికల్లో ప్రజలనే నిర్ణయించుకోనిద్దాం."

–ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

ముగింపు



"కేవలం సజ్జన్ కుమార్ ను బలవంతంగా లొంగిపోయేట్టుచేసి జీవిత ఖైదు విధించినంత మాత్రాన సరిపోదు. సిక్కుల ఊచకోతలో జగదీష్ టైట్లర్, కమల్ నాథ్ పాత్రలేమిటో కూడా తేలాలి. అప్పడే 1984 నాటి మారణహోమం ముగిసినట్టు."

–హర్సిమ్రత్ కౌర్ బాదల్, కేంద్ర మంత్రి

ఇది పేదలను పట్టించుకోని ప్రజాస్వామ్యం




ఎ.రఘురామరాజు

పశ్చిమ బెంగాల్ గవర్నర్, మహాత్మాగాంధీ, రాజగోపాలాచారి మనవడు, ప్రముఖ జీవిత చరిత్ర కారుడు, మేధావి రాజమోహన్ గాంధీ విజయవాడ విచ్చేసిన సందర్భంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ అడ్లూరి రఘురామరాజు సాక్షి పాఠకులకోసం ఆయనతో జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు,

ప్రపంచంలో ప్రజాస్వామ్యం గురించి సాధారణంగానూ, భారత్‌లో ప్రజాస్వామ్యంపై ప్రత్యేకంగానూ మీ అభిప్రాయాలు వివరించండి.ప్రజాస్వామ్యంపై మహాత్మాగాంధీ అభిప్రాయాలను తెలుపండి

గ్లోబల్‌గా మారిపోయిన ప్రపంచం ఇప్పుడు, ఇటీవలి సంవత్సరాల్లో ట్రైబల్‌గా మారిపోయింది. దేశం తర్వాత దేశంలో రాజకీయనాయకులు తమ దేశం ప్రతిఒక్కరిదీ కాకుండా కొద్ది గ్రూపుల స్వంతమై ఉందనే భావాన్ని ముందుకు తెస్తున్నారు. అమెరికాను మళ్లీ వెనక్కు తీసుకెళదాం అంటున్న ట్రంప్ అమెరికా శ్వేత ప్రజలు తమ దేశాన్ని మళ్లీ నల్లజాతి ప్రజలనుంచి, స్పానిష్ మాట్లాడే అమెరికన్ల నుంచి, ఆసియన్ అమెరికన్ల నుంచి తమ స్వాధీనంలోకి తెచ్చుకోవాలనే భావాన్ని ప్రతిపాదిస్తున్నారు. నలవారు, శ్వేతేతరులు అమెరికన్లు కాదని చెబుతున్న ఆయన అభిప్రాయం ప్రతి ప్రజాస్వామిక నియమాన్నే కాకుండా అమెరికా రాజ్యాంగాన్ని కూడా ఉల్లంఘిస్తోంది. ఇక్కడ భారత్‌లో కూడా అదేవిధమైన ప్రకటనలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఆలోచన గాంధీ, మన స్వాతంత్ర్యోద్యమం పునాదులనే పూర్తిగా వ్యతిరేకిస్తోంది. పైగా ఇది మన రాజ్యాంగానికే అభాస. ప్రతి భారతీయుడికీ భారతదేశం సమానంగా చెందుతుందన్నది గాంధీ 1909లో హింద్ స్వరాజ్ అనే శక్తివంతమైన రచన చేసినప్పటి నుంచే పెట్టుకున్న స్థిరమైన అభిప్రాయం. ఇక ప్రజాస్వామ్యం, అభివృద్ధి విషయానికి వస్తే, ధనబలం ఎన్నికలను ప్రభావితం చేస్తున్నప్పుడు అభివృద్ధి అంటే ఇప్పటికే ధనవంతులైన వారిని మరింత ధనవంతులుగా చేస్తుందనే అర్థం.



రాజమోహన్ గాంధీతో ముఖాముఖి

నేడు మానవ వనరులతో సహా సహజ వనరులను ఆలోచనారాహిత్యంతో ఉపయోగిస్తుండటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

వికలాంగులు, రోగులు, గ్రామీణులు, పేదలు, నిర్వాసితులు, మహిళలు, పిల్లలు తదితరులకు సహకరించని అభివృద్ధి ఇప్పటికే బలంగా ఉన్నవారికి, సంపన్నులుగా ఉన్నవారికి మాత్రమే అనుకూలంగా ఉంటుంది. సహజ వనరులను జాగ్రత్తగా, వివేకంతో ఉపయోగించుకోవడానికి బదులుగా వాటిని విచ్చలవిడిగా కొల్లగొడుతున్నట్లయితే భవిష్యత్తు ఇప్పటికంటే భయంకరంగా మారిపోతుంది. ఈ వాస్తవం గురించి జాగరూకత పెరుగుతోంది. మనలో ప్రతి ఒక్కరూ మన అభివృద్ధి చక్రాన్ని తిరగదోడి, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు, గ్రామీణ భారతంలో విద్య, వైద్య స్థాయిలను పెంచుతూ, మన సహజవనరులను భూమి, నీరు, అడవులు, మానవ నైపుణ్యాలను పరిరక్షించేలా ఉద్యమాన్ని ప్రోత్సహించాల్సి ఉంది.

నేటివరకు గాంధీ ప్రవచించిన గ్రామస్వరాజ్ ఊహాస్వర్గంగానే ఉంటూ వస్తోందా?

కొంతమంది గ్రామస్వరాజ్యాన్ని ఊహాస్వర్గం అని పిలుస్తూండవచ్చు. కానీ మన గ్రామాల్లో జీవితాన్ని పునరుద్ధరించని సుసంపన్న భారత్ గురించిన స్వప్నమే పూర్తిగా ఊహాస్వర్గం అని చెప్పాలి. భారత్‌లోని కోట్లాది మంది ప్రజలందరూ ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ, చెన్నై వంటి నగరాలకు వలస వెళ్లవచ్చు అని ఆలోచించేవారు తమ మెదడును పరీక్షించుకోవలసి ఉంది. పైగా ఈ అన్ని నగరాలూ ఇప్పటికే నివాసయోగ్యం కాకుండా పోయాయి. అందుకే మన గ్రామాల్లోని జీవితాన్ని పునరుద్ధరించడమనేది ఈ రోజు యుద్ధప్రాతిపదికపై చేయాల్సిన విధి.

ఆధునిక దక్షిణ భారతదేశంపై మీరు ఇటీవల ప్రచురించిన ''ఎ హిస్టరీ ఫ్రమ్ ది 17త్ సెంచరీ టు అవర్ టైమ్స్'' గురించి క్లుప్తంగా మా పాఠకులకు చెబుతారా?

ప్రాచీన చరిత్ర గురించి రెండు ముక్కల్లో చెప్పడం సాధ్యం కాదు కదా? కానీ, ఆంధ్ర, తెలంగాణ ప్రజలు దక్షిణ భారత దేశం గురించిన ఈ నాలుగు శతాబ్దాల చిత్రణను తప్పకుండా చదువుతారని భావిస్తాను. ఈ పుస్తకరచనలో రెండు తెలుగురాష్ట్రాలకు చెందిన పలువురు స్నేహితులు నాకు ఎంతగానో సహకరించారు. దక్షిణభారత్ గురించి అధ్యయనానికి నోచుకోని పరిణామపూర్వక సందర్భాలను పునశ్చరణ చేయడమే నా ప్రాజెక్టు లక్ష్యం. 17, 18, 19, 20 శతాబ్దాల్లో దక్షిణ భారతదేశం ఎలా ఉండేది. ఈ ప్రాంతాన్ని పాలించిన ఏ పాలకులనుంచి బ్రిటిష్ పాలకులు తమ ఆధిపత్యాన్ని స్థిరపర్చుకున్నారు? బ్రిటన్ ఆక్రమణను అడ్డుకోవడానికి ఇక్కడి పాలకులు చేతులు కలపడానికి ప్రయత్నించారా? ఈ ప్రాంతంలోని అనేక కులాలు, భాషా బృందాల మధ్య ఎలాంటి సంబంధాలు ఏర్పడ్డాయి? వేరుగా ఉన్నప్పటికీ రాజకీయ స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం కోసం ఇక్కడి పోరాటాలు ఎలా రూపుదిద్దుకున్నాయి? నాలుగు శతాబ్దాల కాలంలో దక్షిణ భారత్‌ను మార్చిన గుర్తించదగిన ఉద్యమాల్లో స్త్రీపురుషుల పాత్ర ఎలాంటిది? అఖిల భారత స్థాయిలో నాయకత్వం కోసం దక్షిణ భారతదేశం గట్టిగా ప్రయత్నిస్తోందా? ఆధునిక దక్షిణ భారత్‌కి ఒక విశిష్టమైన గుణం ఉందా ఇలాంటి ప్రశ్నలే నేను ఈ పుస్తకంలో సంధించాను. పండితులు నా సమాధానాలను విమర్శిస్తారని, నేను లేవనెత్తని ప్రశ్నలను సంధిస్తారని ఆశిసున్నాను.

తాము ఇప్పటికే చేస్తున్న పనికి అదనంగా జోడించాల్సిన రంగాలను కనుగొనడానికి కొంతమంది యువ, ప్రతిభావంతులైన రచయితలు, స్కాలర్లు మిమ్మల్ని సంప్రదిస్తే మీరు వారికి ఏం సూచిస్తారు?


పలువురు ప్రముఖుల జీవిత చరిత్రలు (గాంధీ, పటేల్, రాజాజీ, దర్బార్ గోపాల్‌దాస్, జిన్నా) రాసిన అనుభవంతో నేను జీవిత చరిత్రలు రాయాలనే సూచిస్తాను. ప్రపంచంలోని ప్రతి వ్యక్తి వారి వారి జీవితాలనుంచి శక్తివంతమైన గాథలను చెప్పగలరు. ఒక పరిశోధకుడు లేక రచయిత మరొక వ్యక్తి గురించి తీవ్రంగా ఆసక్తి కలిగి ఉంటే ఆ వ్యక్తి జీవిత చరిత్ర రాయడమే విలువైనదిగా ఉంటుంది. 1972లో లండన్‌లోని ఒక స్కాలర్ నాకు జీవిత చరిత్ర రచన గురించి రెండు చిట్కాలు సూచించారు. ఒకటి మీరెన్నుకున్న అంశంపై సహానుభూతి, రెండు అతడిని లేక ఆమెను విమర్శించాలని భావించడం. అలాగే చరిత్ర ప్రత్యేకించి చిన్న, పెద్ద ప్రాంతాల చరిత్ర చాలా ఆసక్తికరమైనది. అవిభాజ్య పంజాబ్ గురించి నేను 2013లో నేను రాసిన పుస్తకం ప్రచురించిన తర్వాత చాలామంది దాన్ని ఆదరించారు. దాంతో నేను మరింత పెద్దదైన దక్షిణ భారత్ చరిత్ర గురించి రాయాలనే కుతుహలం పెరిగింది. నిజానికి అవి అసాధారణమైన, అనూహ్యమైన, మరువలేని పరిణామాలను క్రోడీకరించినట్లయితే జిల్లా, తాలూకా, పట్టణం, గ్రామం వంటి వాటి చరిత్ర కూడా ఆసక్తికరంగా ఉంటుంది.

(నేటి సాయంత్రం విజయవాడలో జాతీయ పుస్తకోత్సవం సందర్భంగా)

సంవత్సరాది సంకల్పాలు

మరో కొత్త సంవత్సరం వస్తున్నదంటే మానవాళికి మనసుల నిండా కొత్త ఆశలు, ఆకాంక్షలు! రాబోయే సంవత్సరం సర్వవిధాలా సంతోషకరంగా, శుభప్రదంగా సాగాలనీ, సాగుతుందనీ. మనకు మనవారికీ భవిష్యత్తు నవనవోన్మేషం కావాలనీ, అవుతుందనీ. గతంలోని చికాకులనూ, చిరాకులనూ, చింతలనూ వెళ్ళిపోతున్న పాత సంవత్సరం మూట కట్టి మోసుకెళ్లి పోవాలనీ, మళ్లీ కనిపించకుండా మాయ చేయాలనీ.

అసలు, ప్రతి రోజూ మనిషి (శేష)జీవితానికి తొలిరోజే. ఎప్పటికప్పుడు 'గతం గతః'. ఎప్పుడు ముందున్న జీవితం ఎలా గడపాలన్నదే ముఖ్యం. మనం కోరినట్టు మన భవిష్యత్తు ఉండాలంటే, మన అలవాట్లలో, జీవనవిధానంలో, వ్యవహార ధోరణిలో అవసరమైన మార్పులు మరొకరు చేయరు. మనం చేసుకోవాల్సిందే. ఈ మార్పుల గురించి నింపాదిగా సమీక్షించు కొనేందుకు నూతన సంవత్సర ఆరంభం మరో మంచి ముహూర్తం. పాత అలవాట్లలో, పద్ధతులలో పనికిరానివని తోచినవన్ని వదిలివేయటానికి గానీ, కొత్త అలవాట్లకు, ఆచరణలకు శ్రీకారం చుట్టేందుకు గానీ జనవరి ఒకటో తేదో అనువైన సమయం.



అందుకే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది, డిసెంబర్ 31న పాత వర్షానికి వీడ్కోలు, వినోదాల మత్తులో మునిగి తేలేటప్పుడో, కొత్త సంవత్సరానికి స్వాగత సంరంభాలలో ఓలలాడేటప్పుడో, ఎన్నెన్నో విధాలైన నూతన సంకల్పాలు చేసుకుంటారు. మద్యపానమో ధూమపానమో మానేస్తామనేవారు కొందరు, వాకింగ్‌లు, వ్యాయమాలు ఆరంభిస్తామనేవారు కొందరు. మాంసాహారం మానేస్తామనే వాళ్లు మరి కొందరు. స్వీట్స్ జోలికి పోకుండా మితాహారానికి కట్టుబడతామనేవాళ్లు ఇంకొందరు. సామాన్యులు సామన్యులే గనుక, వీటిలో చాలా సంకల్పాలు కొత్త సంవత్సరం కొంచెం పాతబడే లోపే భంగమయ్యే మాట నిజమే. కానీ నూటికి ఏ అయిదారుగురైనా వాళ్ళ సంకల్పాలు నిజం చేసుకుంటే, కొన్ని కోట్ల మంది తమ చెడు అలవాట్లకు చెల్లు చీటీ రాయించుకొంటారు. ఇది తక్కువ ప్రయోజనమేమీకాదు. కనుక ఈ సంవత్సరాది సంకల్పాలు ఆనవాయితీ అనుసరణీయమే. ఆరోగ్యానికి శరీర శుద్ధిలాగా ఆనందానికి అంతఃకరణశుద్ధి అవసరం. కనుక మన నూతన సంవత్సర సంకల్పాలు మన మనసుల నుండి మాలిన్యాలను తొలగించేందుకు పనికొచ్చేవయితే, కామ క్రోధాలకు కళ్ళెం వేసేవయితే శ్రేయస్కరం. వాక్కుకూడా మన జీవితానందాన్ని బాగా ప్రభావితం చేసే సాధనం. నోరు మంచిదైతే, ఊరు మంచిదౌతుంది.మితభాషిత్వం, మృదు భాషిత్వం, ప్రియ భాషిత్వం పెంచే దిశగా నూతన సంవత్సర సంకల్పాలు చేసి నిలుపుకుంటే 'హేపీ న్యూ ఇయర్' ను సాకారం చేసుకోవచ్చు.
మన కర్మలు చేసి తీరతాం అని అందరం యథాశక్తి నూతన సంవత్సర సంకల్పం చేసుకొని అమలు చేస్తే అందరు బాగుంటారు, అందులో మనముంటాం.
అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు!

–ఎం. మారుతి శాస్త్రి

2018 అప్పులు.. ప్రమాదాలు అచ్చిరాలేదు

నిరాశాజనకంగా ఆర్టీసీ ఏడాది ప్రయాణం

రాష్ట్ర ఆర్టీసీకి ఈ ఏడాది చాలా చేదు జ్ఞాపకాలే మిగిలాయి. పెరుగుతున్న అప్పులు, వాటి వడ్డీలు, నిర్వహణ వ్యయం, డీజిల్ ధరలతో ఓ వైపు సతమతమవుతుంటే.. మరోవైపు ఫిట్‌నెస్ లేని బస్సుల కారణంగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు మరింత కలవరపెట్టాయి. ఇటు ప్రభుత్వం నుంచి ఆశించినంత సహకారం అందకపోవడం సంస్థకు శాపంగా మారింది. ఆర్టీసీకి కేటాయించిన బడ్జెట్‌లో ఇంతవరకు పూర్తిస్థాయిలో ఎప్పుడూ నిధులు విడుదల కాలేదు. కొత్త బస్సుల కొనుగోలు, సిబ్బందిపై పని ఒత్తిడి ఆర్టీసీలో సత్వరమే పరిష్కరించాల్సిన సమస్యలుగా ఉన్నాయి. అయితే స్పెషల్ సీజన్లలో ప్రయాణికుల నుంచి వస్తున్న స్పందనతో ఆదాయం పెరుగుతుండటం కొంత ఊరట కలిగించే విషయంగా చెప్పవచ్చు.

– సాక్షి, హైదరాబాద్



ఓ వైపు పెరిగే అప్పులు.. మరోవైపు ప్రమాదాలు

ఇటు ఇబ్బంది పెట్టిన కార్మికుల సమ్మె నిర్ణయాలు

స్పెషల్ సీజన్లలో వచ్చే ఆదాయంతో కొంత ఊరట

మొదటి 6 నెలల పరిణామాలు

ఈ ఏడాది మొదటి నుంచి ఆరు నెలల పాటు ఆర్టీసీ అన్ని రకాల పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. కార్మికుల సమ్మె నిర్ణయం, రెండు ప్రమాద ఘటనలు పెద్దవిగా చెప్పవచ్చు. జనవరిలో హైదరాబాద్‌లో టికెట్ రేట్లను ఆర్టీసీ స్వల్పంగా సవరించింది. చిల్లర ధర తలెత్తుతుండటంతో ఈ మేరకు కొన్ని టికెట్ల ధరలో పెంపు, మరికొన్నింటికి కోత విధించింది. ఫిబ్రవరిలో సంస్థ ఇంధన పొదుపు, వాహన ఉత్పాదకతలో స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్ ఆర్టీసీకి ఉత్తమ రవాణా సంస్థగా అవార్డు దక్కింది. మార్చిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.975 కోట్లు కేటాయించింది కానీ, రూ.230 (సెప్టెంబర్ వరకు) మాత్రమే విడుదల చేశారు. ఏప్రిల్‌లో కొత్త బస్సుల కొనుగోలుకు ప్రభుత్వం రూ.140 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది. మేలో వేతన సవరణ జరపాలని కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. స్పందన లేకపోయే సరికి 11వ తేదీన సమ్మెలోకి వెళ్తున్నట్లు గుర్తింపు పొందిన సంఘం టీఎంయూ, ఇతర సంఘాలు ప్రకటించాయి. కానీ, ఆ నెలలో సమ్మెజరగలేదు. ఇటు రిమ్మనగూడలో జరిగిన రోడ్డు ప్రమాదం 13 మంది మరణించారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు సమీపంలో జరిగిన ప్రమాదంలో ఏడుగురు ప్రయాణికులు మృతి చెందారు. జూన్‌లో మరోసారి కార్మిక సంఘాలు సమ్మెకు వెళ్లాలని నిర్ణయించాయి. దీనిపై ప్రభుత్వం మండిపడింది. అవసరమైతే ఆర్టీసీని ప్రైవేటు పరం చేస్తారన్న ప్రచారం జరిగింది. మంత్రుల కమిటీతో యూనియన్ల చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించారు. 16 శాతం మధ్యంతర భృతి చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. ఇదే నెలలో సంస్థ ఎండీ రమణారావు పదవీకాలం పూర్తవడంతో ఆయన పదవి నుంచి తప్పుకున్నారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి ఎండీగా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సునీల్ శర్మ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రుణాల వివరాలు.. (సుమారుగా రూ. కోట్లలో)	
అప్పులు	3,200
ఏటా వడ్డీ	250
తాజా అప్పు	500
ఏటా నమోదవుతున్న నష్టం	600
ఏటా నమోదవుతున్న ఆదాయం	300

సెప్టెంబర్‌లో కొండగట్టు ప్రమాదం..

జూలైలో ఆదాయం పెంచుకునేందుకు, సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఎక్స్‌పర్ట్ కమిటీ నియమించారు. తర్వాతి నెలలో పెద్దగా పరిణామాలు జరగలేదు. అయితే సెప్టెంబరు 11న ఆర్టీసీ చరిత్రలోనే ఘోర దుర్ఘటన చోటు చేసుకుంది. కొండగట్టు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బస్సు లోయలో పడి ఏకంగా 62 మంది దుర్మరణం పాలయ్యారు. ఆర్టీసీ చరిత్రలోనే ఈ స్థాయి ప్రమాదం ఎప్పుడూ చోటుచేసుకోలేదు. అదే నెల దసరా సెలవులప్పుడు నడిపిన బస్సుల ద్వారా దాదాపు రూ.18 కోట్లు ఆర్జించినట్లు సమాచారం. నవంబర్‌లో ఆర్టీసీ నష్టాలు రూ.270 కోట్లు (సెప్టెంబర్) వరకు దాటినట్లు ఆర్టీసీ వెల్లడించింది. ఆర్టీసీకి కొత్తగా రూ.500 కోట్ల అప్పు దొరికింది. ప్రభుత్వ పూచీకత్తుతో బ్యాంకులు ఈ మొత్తాన్ని సంస్థకు ఇచ్చాయి. డిసెంబర్‌లో సీసీఎస్ నుంచి వాడుకున్న నిధుల్లో రూ.80 కోట్లు తిరిగి ఆర్టీసీ చెల్లించింది.

రైతుబంధు, రైతు బీమా దేశవ్యాప్తంగా అమలు చేయాలి

బడ్జెట్ అనుబంధ పద్దులపై చర్చలో ఎంపీ వినోద్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, రైతు బీమా పథకాలు రైతు సంక్షేమానికి భరోసా ఇస్తున్నందున వాటిని దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు అన్నీ పార్టీలు ముందుకు రావాలని టీఆర్ఎస్ ఎంపీ వినోద్‌కుమార్ కోరారు. సోమవారం బడ్జెట్ అనుబంధ పద్దుల బిల్లు సందర్భంగా ఆయన మాట్లాడారు. 'తెలంగాణలో రైతు బంధు ద్వారా ఎకరాకు రూ.8 వేలు రైతులకు పెట్టుబడి సహాయంగా ఇస్తున్నాం. దురదృష్టవశాత్తూ రైతులు మరణిస్తే ఎల్ఐసీ ద్వారా రూ. 5 లక్షలు ఇచ్చేలా బీమా పథకం అమలు చేస్తున్నాం. జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ సహా దేశంలోని అన్ని పార్టీలూ దీనిపై ఆలోచించాలి. వచ్చే ఏడాది ఏ ప్రభుత్వం వచ్చినా.. ఈ అత్యుత్తమ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది' అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ ప్రతి జిల్లాలో ఒక జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు వీలుగా బడ్జెట్ అనుబంధ పద్దుల్లో కేటాయింపులు జరపాలన్నారు. ఈ దిశగా బిల్లును సవరించాలని, ప్రతి జిల్లాకు ఒక విద్యాలయం ఉండాలని చట్టం చెబుతోందని వివరించారు. 2014 వరకు ఏర్పాటైన జిల్లాలకు మంజూరు చేశారని, 2014 తర్వాత వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటైన కొత్త జిల్లాలకు ఇవ్వలేదని వినోద్ నివేదించారు.

ఏఐసీసీ అధికార ప్రతినిధిగా దాసోజు



సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ అధికార ప్రతినిధిగా తెలంగాణ కాంగ్రెస్ నేత దాసోజు శ్రవణ్ నియమితులయ్యారు. ఈమేరకు ఏఐసీసీ సోమవారం ఒక ప్రకటన వెలువరించింది. శ్రవణ్ సహా 10 మందిని ఏఐసీసీ అధికార ప్రతినిధులుగా నియమించింది. రాజ్యసభ ఎంపీ సయ్యద్ నజీర్ హుస్సేన్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. అధికార ప్రతినిధిగా ఎన్నికైన శ్రవణ్, కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్.సి.కుంతియా, ఏఐసీసీ మీడియా కమిటీ చైర్మన్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, ఏఐసీసీ నాయకుడు కొప్పుల రాజు తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ ప్రధాన కార్యదర్శిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన శ్రవణ్, అనతికాలంలోనే రాష్ట్ర రాజకీయాల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రజారాజ్యం పార్టీ, టీఆర్ఎస్‌ల్లో క్రియాశీలకంగా పనిచేసిన శ్రవణ్ 2014 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా, ముఖ్య అధికార ప్రతినిధిగా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

సీఎంవో కార్యదర్శుల కొనసాగింపు

కొత్తగా సందీప్ సుల్తానియా, మాణిక్‌రాజ్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు సీనియర్ ఐఏఎస్, ఇతర అధికారులను యథాతథంగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మిషన్ భగీరథతో పాటు ఇతర కీలక శాఖలను పర్యవేక్షిస్తున్న ఐఏఎస్ స్మితాసభర్వాల్ కార్యదర్శిగా కొనసాగనున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ నర్సింగ్‌రావును ముఖ్య కార్యదర్శిగా, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ కె.భూపాల్‌రెడ్డిని ప్రత్యేక కార్యదర్శిగా, ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పి.రాజశేఖర్‌రెడ్డిని ప్రత్యేక కార్యదర్శిగా ప్రభుత్వం కొనసాగించింది. అయితే, సీఎంవో కార్యదర్శిగా రెవెన్యూ శాఖ వ్యవహారాలను పర్యవేక్షించిన ఐఏఎస్ శాంతికుమారితో పాటు హరితహారం పథకం ఓఎస్డీగా పనిచేసిన ఐఎఫ్ఎస్ ప్రియాంక వర్గీస్‌కు పొడిగింపు లభించలేదు. వీరి స్థానంలో కొత్తగా ఐఏఎస్ సందీప్‌కుమార్ సుల్తానియాను సీఎంవో కార్యదర్శిగా, కె.మాణిక్‌రాజ్‌ను అదనపు కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నదుల పునరుజ్జీవంపై కార్యాచరణ ప్రణాళిక

జనవరి 15లోగా తయారీకి సీఎస్ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు నదుల పునరుజ్జీవంపై నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ముసాయిదా కార్యాచరణ ప్రణాళికను జనవరి 15లోగా రూపొందించాలని సీఎస్ ఎస్కే జోషి ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ నదులకు సంబంధించి తమ దగ్గరనున్న సమాచారాన్ని జనవరి 5లోగా నేషనల్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు అందజేయాలని నీటిపారుదల, భూగర్భజల, జల మండలి, పురపాలక, పరిశ్రమలు తదితర శాఖలను కోరారు. సోమవారం సీఎస్ నేతృత్వంలో నదుల పునరుజ్జీవ కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించి మొత్తం వాటర్‌షెడ్ మ్యాప్‌ను రూపొందించాలని సీఎస్ ఆదేశించారు. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా నీటి నాణ్యతను నిరంతరం సమీక్షించాలన్నారు. నదుల్లో కాలుష్యానికి సంబంధించి ముఖ్యమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి సంబంధించి నీటి నాణ్యత, ఇరిగేషన్ ద్వారా నీటి లభ్యతపై కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అధ్యయనం జరిపించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మురుగునీటి శుద్ధి ప్లాంట్ల(ఎస్టీపీ) నిర్మాణానికి సంబంధించి జలమండలిని నోడల్ సంస్థగా నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. మొత్తం సీజన్‌కు సంబంధించి గృహ, మురుగునీటి, భూగర్భజలాలు, పర్యావరణ సహజ ప్రవాహం, వరద ప్రభావిత ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని నివేదిక రూపొందించాలన్నారు. సమీక్షలో అటవీ శాఖ, మున్సిపల్, పరిశ్రమల శాఖ కార్యదర్శులు అజయ్ మిశ్రా, అర్విందకుమార్, జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్లకు నదుల పరిరక్షణ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: నదుల పరిరక్షణ బాధ్యతలు ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అప్పగించింది. నదుల ప్రక్షాళనకోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ జారీచేసిన ఆదేశాల అమలులో భాగంగా అన్ని జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలో ప్రత్యేక పర్యావరణ నిఘా బృందాలను ఏర్పాటు చేసింది. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, జిల్లా జడ్జి/లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ సభ్యులుగా, పీసీబీ ప్రాంతీయ అధికారి మెంబర్ కన్వీనర్‌గా ఈ కమిటీలో వ్యవహరించనున్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ నిర్మూలనకు ఈ కమిటీ పనిచేయనుంది. ఈ మేరకు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జార్ఖండ్‌లో 'రైతుబంధు'

సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్ రాష్ట్రంలోనూ రైతుబంధు పథకాన్ని అమలు చేసేందుకు అక్కడి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ రాష్ట్రానికి చెందిన ఉన్నతాధికారుల బృందం ఇటీవల రాష్ట్రంలో పర్యటించి కొన్ని జిల్లాల్లో పథకంపై అధ్యయనం చేసింది. తెలంగాణలో ఈ ఏడాది ఖరీఫ్, రబీలకు కలిపి ఎకరానికి రూ.8 వేల చొప్పున రైతులకు ఇచ్చారు. వచ్చే ఖరీఫ్ నుంచి ఎకరానికి ఏడాదిలో రూ.10 వేలు ఇవ్వనున్నారు. అయితే జార్ఖండ్ ప్రభుత్వం మాత్రం ఎకరానికి రూ.5 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలంగాణ వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అంటే ఒక సీజన్‌కు ఎకరానికి రూ.2,500 చొప్పున ఇచ్చే అవకాశముంది. మరోవైపు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కూడా రైతుబంధు పథకాన్ని అమలు చేస్తామని తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడి ఉన్నతాధికారుల బృందం రాష్ట్రంలో పర్యటించి ఇక్కడ పథకం తీరు తెన్నులను పరిశీలించనుందని అధికారులు చెబుతున్నారు. జార్ఖండ్ ప్రభుత్వం అక్కడ రైతుబంధును అమలు చేస్తే తెలంగాణకు చెందిన సాఫ్ట్‌వేర్‌ను తీసుకునే అవకాశముందని సమాచారం. ఈ మేరకు తెలంగాణ అధికారులను వారు కోరినట్లు తెలిసింది.

బాబుపై చర్యలు తీసుకోండి

- 850 ఎకరాలను ఐఎంజీకి అప్పనంగా కట్టబెట్టారు
- ఆపద్ధర్మ సీఎంగా హడావుడిగా భూముల ధారాదత్తం
- మార్కెట్ ధర కంటే కారుచౌకకు కట్టబెట్టిన వైనం
- రిజిస్ట్రేషన్లకూ రాయితీ కల్పించారు
- అహోబిలరావు(బిల్లీరావు), ప్రభాకరరావుని కూడా విచారించాలి
- తెలంగాణ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు న్యాయవాది వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: మరోసారి ఐఎంజీ భూముల వ్యవహారం తెరపైకి వచ్చింది. కోట్లాది రూపాయల విలువైన భూముల్ని అప్పటి ఉమ్మడి ఏపీ ఆపద్ధర్మ ముఖ్యమంత్రి హోదాలో నారా చంద్రబాబు నాయుడు ఐఎంజీ భరత(ఐఎంజీబీ) ప్రైవేట్ లిమిటెడ్‌కు కట్టబెట్టారని, ఈ వ్యవహారంలో చంద్రబాబు, కంపెనీపై ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీకి న్యాయవాది ఇమ్మనేని రామారావు వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉండగా అసెంబ్లీకి ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న తర్వాత ఐఎంజీ పేరిట కాగితాలకే పరిమితమైన కంపెనీకి సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూములుసహా 850 ఎకరాలు కారుచౌకగా ఇచ్చారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని కోట్లాది రూపాయల విలువైన 850 ఎకరాలను ఐఎంజీ–భరత కంపెనీకి ఇవ్వడం వెనుక కుట్ర, మోసం, అధికార దుర్వినియోగం, అవినీతి ఉందని ఆయన ఆరోపించారు. ఇందుకు కీలక పాత్రధారి అయిన అప్పటి ఉమ్మడి ఏపీ ఆపద్ధర్మ సీఎం, ప్రస్తుత ఏపీ సీఎం నారా చంద్రబాబు తనకు సన్నిహితుడైన అహోబిలరావు (బిల్లీరావు), ఆయన సోదరుడు ప్రభాకరరావు(ప్యాట్రో)లకు చెందిన ఐఎంజీబీ కంపెనీకి అప్పనంగా భూములు రిజిస్ట్రేషన్ చేయించారని వివరించారు. భూముల రిజిస్ట్రేషన్లకు కూడా చంద్రబాబు ప్రభుత్వం రాయితీలు ఇచ్చిందని, చంద్రబాబు బినామీ కంపెనీలకు భూములు ఇచ్చారని, ఇందుకు కారణమైన ఆ ముగ్గురిని ప్రాసిక్యూట్ చేయాలని కోరారు. కేవలం 8 రోజుల కంపెనీకి, రూ.5 లక్షల షేర్ క్యాపిటల్ ఉన్న కంపెనీకి కోట్లాది రూపాయల హైదరాబాద్ భూముల్ని ఇచ్చేసే కుట్రకు కారణమైనవారిని వదిలిపెట్టడానికి వీల్లేదన్నారు.

ఆ ఇద్దరూ బాబుకు సన్నిహితులు

ఆగస్టు 5వ తేదీ 2003లో ఐఎంజీబీని రిజిస్ట్రేషన్ చేశారని, అప్పుడు షేర్ క్యాపిటల్ కేవలం రూ.5 లక్షలు మాత్రమేనని, ఈ కంపెనీ అధిపతులుగా చెప్పుకునే బిల్లీరావ్, ప్యాట్రోలు ఇద్దరూ చంద్రబాబుకు అత్యంత సన్నిహితులని ఇమ్మనేని తెలిపారు. క్రీడలకు చెందిన అంతర్జాతీయ కంపెనీ ఐఎంజీకి అనుబంధ కంపెనీగా ఐఎంజీబీని పేర్కొన్నారని, నిజానికి ఐఎంజీకి ఐఎంజీబీలకు ఏమాత్రం సంబంధం లేదని, ఇదే విషయాన్ని ఫ్లోరిడాలో ఉండే ఐఎంజీ వెల్లడించిందని తెలిపారు. తప్పుడు పత్రాలు, ఫోర్జరీలతో మోసం చేసిన ఆ చంద్రబాబు, బిల్లీరావు, ప్యాట్రోలను విచారించాలని, వీరిపై ఐపీసీలోని 420, 406, 408, 468,471, 120 సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాలని, రిజిస్ట్రేషన్ చట్టంలోని 82, 83 సెక్షన్ల ప్రకారం వారిపై చర్యలు తీసుకునే అధికారం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీకి ఉందని పేర్కొన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక వ్యవహారాల్లో రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని సుప్రీంకోర్టు సైతం చెప్పిందని, అందుకు అనుగుణంగా ఐఎంజీబీ పేరిట రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రేషన్ అధికారులు చేసిన 850 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్ల రద్దుకు చర్యలు తీసుకోవాలని న్యాయవాది ఇమ్మనేని వినతిపత్రంలో పేర్కొన్నారు.

పార్టీని పటిష్టం చేయాలి

- సొంత బలం పెంచుకోవాలి...
- బీఎల్ఎఫ్ ప్రజలకు అర్థమయ్యేలా చూడాలి
- రాష్ట్ర పార్టీకి సీపీఎం జాతీయ నాయకత్వం ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని, ప్రధానంగా సొంతబలం పెంచుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర పార్టీని సీపీఎం జాతీయ నాయకత్వం ఆదేశించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ నిరాశాజనకమైన ఫలితాలకు కిందిస్థాయిలో పార్టీ బలంగా లేకపోవడం, కార్యకర్తల్లో అంకితభావం లోపించడం కూడా కారణమేనని తేల్చినట్టు సమాచారం. దీంతోపాటు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) పేరిట ఎన్నికల్లో కులాల ప్రాతిపదికన అభ్యర్థులను పోటీకి నిలబెట్టడం, పార్టీ మౌలిక విధానాలకు భిన్నమైనదని తప్పుబట్టినట్టు తెలుస్తోంది. ఇకముందు కూడా ఈ ప్రయోగాన్ని కొనసాగించాల్సి ఉందని, అయితే కట్టుదిట్టమైన ఆచరణ, అట్టడుగు వర్గాలకు ఈ సిద్ధాంతాలు అర్థమయ్యేలా స్పష్టంగా వివరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల పార్టీ కేంద్ర కమిటీ (సీసీ) విడుదల చేసిన నివేదికలో సైతం బీఎల్ఎఫ్ ప్రయోగం పేరిట కులం, సామాజిక అంశాలకు రాష్ట్ర పార్టీ అత్యంత ప్రాధాన్యతనివ్వడాన్ని తప్పుబట్టిన విషయం తెలిసిందే. సీపీఎం–బీఎల్ఎఫ్ కూటమిని ప్రజల ముందు పెట్టిన తీరు పార్టీ మౌలిక విధానాలకు భిన్నంగా ఉందని ఈ నివేదికలో పేర్కొంది. ఈ ఎన్నికల్లో కులానికి సంబంధించి తప్ప మిగతా అన్ని అంశాలు వదిలేయడం వల్ల పార్టీ వర్గ సమస్యకు ఇచ్చే ప్రాధాన్యాన్ని మరుగునపరిచినట్టు అయ్యిందని అభిప్రాయపడింది. ఇది పార్టీ మౌలిక విధానాల నుంచి దూరం జరిగిందనే అభిప్రాయం ఏర్పడేందుకు దోహదపడుతోందని అభిప్రాయపడింది. శనివారం జరిగిన రాష్ట్ర కార్యదర్శివర్గం, ఆది, సోమవారాల్లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాల్లో తెలంగాణ అసెంబ్లీ ఫలితాలపై సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కారత్, బీవీ రాఘవులుతో కలిసి సమీక్షించారు.

బీఎల్ఎఫ్ ప్రయోగం కొనసాగించాలి

రాష్ట్రంలో చేపట్టిన బీఎల్ఎఫ్ ప్రయోగాన్ని రాబోయే పంచాయతీ, ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగించాలని నాయకత్వం సూచించినట్టు తెలిసింది. అయితే బీఎల్ఎఫ్ కులాలు, సామాజికవర్గాలకే పరిమితమని అసెంబ్లీ ఎన్నికల్లో పడిన ముద్రను తొలగించుకుని ముందుకు పోవాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. కిందిస్థాయిలో బీఎల్ఎఫ్ ఆశయాలు, లక్ష్యాలను ప్రతిభావంతంగా ప్రజలకు వివరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నట్టు సమాచారం. కాంగ్రెస్ కూటమి ఎన్నికల ప్రచారానికి చంద్రబాబు సారథ్యం వహించడం, తెలంగాణ సెంటిమెంట్‌ను కేసీఆర్ అనుకూలంగా ఉపయోగించుకునేందుకు కారణమైందని ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అభిప్రాయపడినట్టు తెలుస్తోంది.

వరిపై మంచు దెబ్బ

అగ్గి తెగులు సోకే అవకాశం ఉందని హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత పెరగడంతో వరిపైరు వణుకుతోంది. రాత్రివేళలో మంచు పడుతుండటంతో ఇప్పుడిప్పుడే నాట్లు పడిన వరికి అగ్గి తెగులు సోకే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు హెచ్చరించారు. మరో 10, 15 రోజుల పాటు పరిస్థితులు ఇలాగే ఉంటాయని సస్యరక్షణ చేపట్టాలని చెబుతున్నారు. చలికి ఇప్పటికే నారుమడి దశలో ఉన్న మొక్కలు సరిగ్గా ఎదగక నాట్లు కూడా ఆలస్యమయ్యే పరిస్థితి ఏర్పడుతోంది. తెగుళ్లు వస్తే 3 క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ రబీ వరి సాధారణ సాగు విస్తీర్ణం 17.62 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 1.23 లక్షల ఎకరాల్లో మాత్రమే నాట్లు పడినట్లు ఇటీవల విడుదల చేసిన నివేదికలో వ్యవసాయ శాఖ తెలిపింది. రబీలో రైతులు అధికంగా తెలంగాణ సోన, కునారం సన్నాలు, బతుకమ్మ, శీతల్, కాటన్ దొర సన్నాలు, తెల్లహంస, జగిత్యాల సాంబ వంటి రకాలు సాగు చేస్తారు. ఒకవైపు వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడం, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల ద్వారా యాసంగి ఆయకట్టుకు లక్ష్యం మేరకు నీరందే సూచనలు కనిపించకపోవడంతో సాగు మందగిస్తోంది. ఇప్పటికే వివిధ ప్రాజెక్టుల ఆయకట్టు కింద వేసిన వరినాట్లకు నీరందక వరిమళ్లు బీడుగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చలి కారణంగా నారు ఎదుగుదల లోపించి ఎర్రబడతాయి. ఇందుకు నారుమడులపై సన్నటి పాలిథీన్ పట్టాను కర్రతో అమర్చి కప్పాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. రాత్రి వేళలో కప్పి ఉదయం తీసినట్టైతే నారు త్వరగా పెరుగుతుంది. అలాగే జింక్ సల్ఫేట్‌ను తగిన మోతాదులో వాడాలి. ఈ మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.జగదీశ్వర్ తెలిపారు. దీంతో పాటుగా ఎకరాకు సరిపడా లింగాకర్షక బుట్టలు అమర్చి కాండం తొలిచే పురుగును గమనించాలన్నారు. అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లజోల్ తగు మోతాదులో వాడాలని సూచించారు.



కాసుల కృష్ణకు పార్టీ సభ్యత్వం అందజేస్తున్న చెరుకు సుధాకర్

బీసీల లెక్కలు తేల్చాకే 'పంచాయతీ'

చెరుకు సుధాకర్ డిమాండ్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని లక్ష్యంగా చేసుకొని అసభ్యకర భాషలో విమర్శిస్తున్నారని తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ అన్నారు. సుప్రీంకోర్టుకు బీసీ జనాభా లెక్కలు సమర్పించి రిజర్వేషన్లు ఖరారు చేసిన తరువాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడి ఆదర్శనగర్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ద్వారా జరిగే మార్పులు ఏమీ ఉండవని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు తీవ్ర ప్రభావం చూపిందన్నారు. తెలంగాణ అమరులు, ఉద్యమకారుల సంక్షేమం గురించి కేసీఆర్ ఒక్కమాట కూడా ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. వివిధ పత్రికలు, చానెళ్లను చెప్పుచేతల్లో పెట్టుకోవాలనే ఉద్దేశంతో యాజమాన్యాలను బెదిరించడం అప్రజాస్వామికమన్నారు. సుధాకర్ సమక్షంలో తెలంగాణ జనసమితి రాష్ట్ర అధికార ప్రతినిధి కాసుల కృష్ణ ఇంటి పార్టీ కండువా కప్పుకున్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం ఇంటి పార్టీయేనని, అందుకే ఈ పార్టీలో చేరుతున్నానని కాసుల కృష్ణ తెలిపారు. సమావేశంలో ఇంటి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొమ్మాట వెంకటేశ్వర్లు, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, నేతలు కొమురయ్య, హరీశ్‌యాదవ్, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కారు' ఎక్కనున్న కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్?

- సంక్రాంతి తర్వాత అజారుద్దీన్ టీఆర్ఎస్‌లో చేరతారని గుసగుసలు
- ఇటీవల ఓ ఎంపీ కూతురు పెళ్లిలో టీఆర్ఎస్ కీలక నేతలతో చర్చలు
- సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగాలని యోచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అజారుద్దీన్ పార్టీ వీడేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఇటీవల ఓ ఎంపీ కూతురు వివాహంలో టీఆర్ఎస్ కీలక నేతలతో ఆయన చర్చలు జరిపినట్టు తెలిసింది. సంబంధిత ఎంపీ సైతం అజారుద్దీన్‌ను పార్టీలోకి తీసుకొని సికింద్రాబాద్ నుంచి ఎంపీ టికెట్ ఇవ్వాలని నేరుగా పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు విజ్ఞప్తి చేసినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్‌లో చేరి సికింద్రాబాద్ నుంచి పోటీలో ఉండాలని అజారుద్దీన్ భావిస్తున్నారు. సంక్రాంతి తర్వాత టీఆర్ఎస్‌లో అజారుద్దీన్ అధికారికంగా చేరుతున్నట్టు ఆయన సన్నిహితులు, అభిమానులు వెల్లడించారు.

2009లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా..

క్రికెటర్‌గా పేరు ప్రఖ్యాతులు పొందిన అజారుద్దీన్ 2009 ఫిబ్రవరిలో కాంగ్రెస్‌లో చేరారు. ఆ ఏడాదే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొరాదాబాద్ స్థానం నుంచి గెలుపొందారు. 2014లో మాత్రం అజారుద్దీన్ పోటీకి దూరంగా ఉన్నారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో ఆయన పూర్తిగా తెలంగాణకే పరిమితమయ్యారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఆయన్ను రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ నియమించింది. ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓడటంతో అజారుద్దీన్ తన రాజకీయ భవిష్యత్ కోసం పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్నట్టు ఆయన సన్నిహితులు పేర్కొన్నారు.

అందుబాటులోకి రాని అజారుద్దీన్..

టీఆర్ఎస్‌లో చేరే విషయంపై 'సాక్షి' అజారుద్దీన్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు. అజారుద్దీన్‌కు బాగా సన్నిహితులుగా పేరున్న ఇతర కాంగ్రెస్ నేతలు మాత్రం ఆయన త్వరలోనే టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుంటారని, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాన్ని టీఆర్ఎస్ ఆయనకు కేటాయించే అవకాశాలున్నాయని తెలిపారు. కాగా, సోమవారం గోల్కొండ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ సమీక్ష సమావేశానికి కూడా అజారుద్దీన్ హాజరయ్యారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఏఈఓల మృతి

భైంసా/భైంసారూరల్ (నిర్మల్): నిర్మల్ జిల్లాలో భైంసా మండలం వానల్‌పాడ్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఏఈఓలు మృతిచెందారు. భైంసా మండలం పేండ్‌పెల్లిలో ఆదివారం జరిగిన విందు కార్యక్రమంలో పాల్గొని రాత్రి తిరిగి వీరు ద్విచక్ర వాహనంపై భైంసాకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇసుకలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని వెనక నుంచి ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న విక్రమ్ (25)తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో యువకుడు అక్షయ్‌కుమార్ (25)కు రెండు కాళ్లు విరిగాయి. భైంసాలో ప్రథమ చికిత్స అనంతరం వీరిని నిజామాబాద్‌కు తరలించారు. అయితే పరిస్థితి విషమించి ఇద్దరూ మృతిచెందారు. ఇందులో విక్రమ్‌ది మామడ మండలం గాయక్‌పల్లి గ్రామంకాగా, మరో ఏఈఓ అక్షయ్‌కుమార్ కుభీర్ మండలం హల్దా గ్రామం వాసి. విషయం తెలుసుకున్న కలెక్టర్ ప్రశాంతి భైంసా చేరుకుని బాధిత కుటుంబీకులకు రూ. 5వేల చొప్పున, జిల్లా వ్యవసాయ అధికారి అమరేశ్‌కుమార్ రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు.

చలికి ముగ్గురి మృతి

చర్ల/నేలకొండపల్లి/కంగ్టి: చలితీవ్రతకు వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం ముగ్గురు మృతి చెందారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంకు చెందిన బోడ ఉమ(23) అనే వికలాంగురాలు సోమవారం మృతిచెందగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రాళ్ల గూడెం గ్రామానికి చెందిన బంటు జానికమ్మ(73) ఆదివారం రాత్రి నిద్రలోనే మృతిచెందింది. అలాగే.. సంగారెడ్డి జిల్లా కంగ్టికి చెందిన అమృత్, సావిత్రి దంపతులకు నెల రోజుల క్రితం బాబు జన్మించాడు. ఆదివారం రాత్రి నుంచి బాబు చలికి వణుకుతుండగా కాపాడే ప్రయత్నం చేశారు. సోమవారం ఉదయం చలి మరింత ఎక్కువ కావడంతో బాబు అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందాడు.

బాబుకు ఓటమి భయం



గుత్తా సుఖేందర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌ను ఎదుర్కొనే సత్తాలేక ఏపీ సీఎం చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. అందుకే జగన్‌కు, ప్రధాన మంత్రి మోదీకి స్నేహసంబంధాలున్నాయంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సోమవారం నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు కూటమి నేతలకు రూ.500 కోట్లు అందజేశారని, ఫలితంగానే పత్రికల్లో, టీవీల్లో విస్తృతంగా ప్రకటనలు ఇచ్చారన్నారు. తాను డబ్బులు ఇవ్వలేదంటున్న చంద్రబాబు, వేంకటేశ్వరస్వామిపై ప్రమాణం చేసి చెప్పగలరా అని ప్రశ్నించారు. అమరావతి ప్రాంతం ఏపీ రాజధాని నిర్మాణానికి అనువైన స్థలం కాదని నిపుణులు చెప్పినప్పటికీ చంద్రబాబు అదేమీ పట్టించుకోకుండా అక్కడే నిర్మాణాలు చేపట్టారని, మొత్తం భవనాలకు వెచ్చించే డబ్బంతా పునాదుల్లోనే పోస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి ఆరోపించారు.

అద్భుతంగా యాదాద్రి నిర్మాణం

గవర్నర్ నరసింహన్ • స్వామివారికి ప్రత్యేక పూజలు • ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



యాదగిరిగుట్ట: రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం పనులు అద్భుతంగా జరుగుతున్నాయని గవర్నర్ నరసింహన్ అన్నారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సోమవారం గవర్నర్ నరసింహన్ సతీసమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు, ఆలయ అధికారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వామి, అమ్మవార్లకు గవర్నర్ సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. అనంతరం గవర్నర్ నరసింహన్ దంపతులు ఆలయ పునఃనిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గర్భాలయాన్ని ఏమాత్రం ముట్టుకోకుండా, స్వయంభూ మూర్తులను కదల్చకుండా ఆలయాన్ని నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణంలో స్థపతులు, అధికారులు బాగా శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. యాదాద్రి ఆలయ నిర్మాణం పూర్తయితే చాలా అద్భుతంగా ఉంటుందన్నారు. ప్రధాన ఆలయాన్ని కృష్ణ శిలతో తీర్చిద్దుతున్నారని తెలిపారు. ఆయన వెంట కలెక్టర్ అనితారామచంద్రన్, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఆలయ ఈఓ గీతారెడ్డి తదితరులున్నారు.





సోమవారం యాదాద్రిలో ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గవర్నర్ నరసింహన్



గవర్నర్ దంపతులకు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

ఇంత ధాన్యం ఎక్కడిది..?

నిజామాబాద్ జిల్లా పరిధిలో గతేడాది ఖరీఫ్ సీజనులో సేకరించిన ధాన్యం 1.51 లక్షల మెట్రిక్ టన్నులు. ఈ సీజనులో ఇప్పటి వరకే ఏకంగా 4.80 లక్షల మెట్రిక్ టన్నులు దాటింది. అంటే ఏకంగా మూడింతలు ఎలా పెరిగింది..?

రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు చేసిన ధాన్యం: 34.26 లక్షల మెట్రిక్ టన్నులు..

రైతుల సంఖ్య: 6.71లక్షలు

గత సీజన్ కంటే మూడింతలు ఎక్కువ

- పౌరసరఫరాల శాఖ ఆరా
- కొనుగోలు కేంద్రాలకు పోటెత్తిన ధాన్యం
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎఫ్‌సీఐ బృందం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కొనుగోలు కేంద్రాలకు అంచనాలకు మించి ధాన్యం రావడంతో పౌరసరఫరా శాఖ విస్మయానికి గురవుతోంది. అసలు ఇంత ధాన్యం ఎక్కడి నుంచి వచ్చింది..? నిజంగానే రైతుల వద్ద కొనుగోలు చేశారా..? ధాన్యం కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.200 వరకు పెరిగిన నేపథ్యంలో వ్యాపారులు, రైస్‌మిల్లర్లు తమ నిల్వలను కొనుగోలు కేంద్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తోంది. వాస్తవాలు తెలుసుకుని నివేదిక ఇవ్వాలని ఆ సంస్థ కమిషనర్ అకున్ సబర్వాల్ జిల్లాలకు ప్రత్యేక అధికారుల బృందాన్ని పంపారు. నిజామాబాద్‌తో పాటు నల్లగొండ, కామారెడ్డి జిల్లాల్లో ఈ అధికారుల బృందం ఇటీవల క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపింది. క్షేత్ర స్థాయికి వెళ్లి పలువురు రైతులను ఆరా తీసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల జాబితా నుంచి ర్యాండమ్ చెకప్ చేశారు. నిజమైన రైతులేనా.? ఎన్ని ఎకరాల్లో భూమి ఉంది.? ఎన్ని క్వింటాళ్లు విక్రయించారు.? ఏ కేంద్రంలో అమ్మారు..? వంటి వివరాలను ఆరా తీశారు.

ఎఫ్‌సీఐ బృందం సైతం ఆరా..

భారీ ఎత్తున దిగుబడులు రావడంతో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) కూడా ఆరా తీసింది. ఆ సంస్థ ఉన్నతాధికారులు నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. కొనుగోలు కేంద్రాలకు వెళ్లి ధాన్యం నాణ్యతను పరిశీలించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే ముందు నిజామాబాద్ జిల్లాలో వరి కోతలు జరుగుతాయి. పెద్ద ఎత్తున ధాన్యం రావడంతో ఎఫ్‌సీఐ బృందం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది.

దిగుబడుల అంచనాలు తలకిందులు

ఈసారి ధాన్యం దిగుబడులపై వ్యవసాయశాఖ ఇచ్చిన అంచనాలు జిల్లాలో తలకిందులయ్యాయి. ఎకరానికి సగటున సుమారు 28 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని, ఈ లెక్కన జిల్లాలో ఈ ఖరీఫ్ కొనుగోలు సీజనులో సుమారు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని అంచనా వేశారు. కానీ అంచనాలకు మించి దిగుబడి ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్లు వచ్చినట్లు వ్యవసాయ రివైజ్డ్ నివేదిక ఇచ్చింది. ఇలా పెరిగిన దిగుబడులే కొనుగోళ్లు పెరగడానికి ప్రధాన కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇవీ అనుమానాలు

- కేంద్ర ప్రభుత్వం ధాన్యం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ని క్వింటాలుకు రూ.200 పెంచింది ఈ సీజను నుంచే వర్తిస్తోంది. (గ్రేడ్–ఏ కు ధరను రూ.1,590 నుంచి 1,770కి, కామన్ రకానికి రూ.1,550 నుంచి రూ.1,750)కి పెంచింది.
- వ్యాపారులు, రైస్‌మిల్లర్లు గతేడాది తక్కువ ధరకు కొనుగోలు చేసిన నిల్వలను ఈసారి కేంద్రాలకు తరలించి సొమ్ము చేసుకున్నారా?

వ్యవసాయ శాఖ అంచనాలకు మించి..

- ఎంఎస్‌పీ 1,590 ఉన్నప్పుడు రైస్‌మిల్లర్లు, వ్యాపారులు బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకునే వారు. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే వారు. ఇప్పుడు పెరిగిన కనీస మద్దతు ధరతో వ్యాపారుల ప్రైవేటు కొనుగోళ్లు భారీగా తగ్గడంతో.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తినట్లు చెబుతున్నారు.

సన్న రకాలు సైతం సర్కారు కేంద్రాలకే..

- ఈసారి కనీస మద్దతు ధర భారీగా పెరగడంతో గంగాకావేరీ, బీపీటీ, ఇతర వెరైటీలు పండించిన రైతులు సైతం తమ సన్నరకం ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. ప్రస్తుతం సన్నరకాలకు అంతగా డిమాండ్ లేకపోవడంతో వ్యాపారులు ఈ రకాలను కొనుగోలు చేయడం లేదు. దీంతో ఈ సన్నరకం ధాన్యం ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 43వేల మెట్రిక్ టన్నులు సన్నరకం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మారు.



ఆకట్టుకునేలా బాక్సర్ మేరీకోమ్ సైకత శిల్పం



కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రానికి చెందిన అధ్యాపకుడు నీలం శ్రీనివాసులు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రపంచ బాక్సర్ మేరీకోమ్ సైకత చిత్రం వేసి అందరి మన్ననలు పొందుతున్నారు. మేరీకోమ్ ఆరోసారి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌గా (2018) నిలిచిన సందర్భంగా 'హ్యాపీ న్యూ ఇయర్ టు ద ఇండోమిటేబుల్ లైవ్స్ మేరీ కోమ్'అనే టైటిల్‌తో నవంబర్ 25వ తేదీ నుంచి ఈ నెల 25 తేదీ వరకు సైకత చిత్రం వేశాడు. ఇది పదికాలాల పాటు చెక్కుచెదరకుండా ఉంటుంది. కేసీఆర్ రెండో సారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయన సైకత చిత్రం వేయడం విశేషం.

జూన్‌లో ఎల్లంపల్లికి మేడిగడ్డ నీళ్లు

- విశ్రాంత ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి
- మూడు బ్యారేజీలు.. పంపుహౌస్‌లను పరిశీలన
- ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రికి నివేదిక అందిస్తాం

మంథని/రామగుండం/కాళేశ్వరం: జూన్ నాటికి మేడిగడ్డ నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు తరలిస్తామని తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలలో భాగంగా ఆరుగురు సభ్యుల విశ్రాంత ఇంజనీర్ల బృందం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతోపాటు కన్నెపల్లి, అన్నారం, గోలివాడ పంపుహౌస్‌లను సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా విలేకరులతో శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్–4లో పనులు వెనుకబడ్డాయని, రెండు నదుల కలయికతో అసౌకర్యం ఏర్పడినట్లు తెలుస్తోందని చెప్పారు. నీటిని మళ్లిస్తున్నామని, మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామని ఏజెన్సీ నిర్వాహకులు చెప్పారన్నారు. 11 మోటార్లు, పంపులు, 87 గేట్లు బిగింపు పూర్తవుతుందన్నారు. కన్నెపల్లి పంపుహౌస్‌లో 11 పంపులకు గాను నాలుగు బిగించారని తెలిపారు. మరో ఐదు ప్రోగ్రెస్‌లో ఉన్నాయన్నారు. 2 టీఎంసీకి డిజైన్‌తో పాటు అదనంగా మరో టీఎంసీ నీటిని వినియోగించుకునేందుకు వీలుగా పనులు జరుగుతున్నాయని ఆయన వివరించారు. మరో ఐదు మోటార్లు రావాల్సి ఉందని, రెండు జనవరి, మరో మూడు ఫిబ్రవరి వరకు చేరుతాయని ఏజెన్సీ వారు చెబుతున్నారని, సమయానికి చేరితే మార్చి నాటికి నిర్మాణం పూర్తవుతాయని పేర్కొన్నారు. జూన్ నాటికి రాష్ట్ర మంతటికి సాగునీరు అందుతుందని చెప్పారు. కన్నెపల్లి పంపుహౌస్, మార్చి, ఏప్రిల్ నాటికి పూర్తి కావచ్చన్నారు. అన్నారం బ్యారేజీ పూర్తయిందని, 66 గేట్లు బిగింపు, వంతెన పనులు పూర్తయ్యాయని, అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో ఉందని, చిన్నచిన్న పనులు తప్పితే బ్యారేజీ దాదాపుగా పూర్తయినట్లే అని తెలిపారు. సుందిళ్ల బ్యారేజీలోనూ 74 గేట్ల బిగింపు పూర్తయిందని, ఇక్కడా చిన్నచిన్న పనులే ఉన్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితిపై నివేదికను ముఖ్యమంత్రికి అందిస్తామన్నారు. బ్యారేజీ డిజైన్, మ్యాప్‌లను పరిశీలించినన బృందం సభ్యులు సాంకేతికకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. బృందంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమౌళి, సభ్యులు వేణుగోపాల్, రాంరెడ్డి, సత్తిరెడ్డి, వెంకట్రామరెడ్డి తదితరులు ఉన్నారు.



సోమవారం మంథని మండలంలోని సుందిళ్ల బ్యారేజీని పరిశీలిస్తున్న విశ్రాంత ఇంజనీర్ల బృందం

మీ మధ్య ఉండటం నా అదృష్టం

- నా వేతనం రూ. 2లక్షలు మీకే ఇస్తా: ఎమ్మెల్యే హరీశ్‌రావు
- విద్యార్థులతో కలసి కొత్త సంవత్సరం వేడుకలు

సాక్షి, సిద్దిపేట: 'పద్నాలుగు ఏళ్లుగా నూతన సంవత్సర వేడుకలను మీ మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉంది. అది నా అదృష్టం'అని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గమంతా తన కుటుంబమని, ఏ వేడుకైనా ప్రజల మధ్య జరుపుకోవడమే తనకు ఆనందమని ఆయన పేర్కొన్నారు. తనకు ఇటువంటి అవకాశాన్ని కల్పిస్తున్న నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతగా వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. సోమవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో ఆయన సిద్దిపేటలోని సాంఘిక సంక్షేమ, ఎస్సీ, ఎస్టీ కళాశాల విద్యార్థులతో కలసి న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు తినిపించారు. తనకు శాసనసభ్యునిగా వచ్చే వేతనం రూ.2 లక్షలు మీకే ఇచ్చేస్తానని, ఆ సొమ్ముతో మంచి లైబ్రరీ ఏర్పాటు చేసుకుని, దానిని సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. మీరంతా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.



విద్యార్థికి మిఠాయి తినిపిస్తున్న హరీశ్‌రావు

45 ఏళ్లుగా స్వామివారి సేవలో..

రామాలయ ప్రధానార్చకుడి ఉద్యోగ విరమణ

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో ప్రధానార్చకులుగా పనిచేస్తున్న పొడిచేటి జగన్నాథాచార్యులు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. 45 ఏళ్లుగా స్వామివారికి సేవ చేస్తూ.. అర్చకులుగా, ముఖ్య అర్చకులుగా, ఉప ప్రధానార్చకులుగా, ప్రధానార్చకులుగా పనిచేశారు. ఆయన పని చేసిన కాలంలో గోదావరికి రెండుసార్లు పుష్కరాలు, పుష్కర పట్టాభిషేకం, 60 ఏళ్లకు ఒకసారి నిర్వహించే మహా సామ్రాజ్య పట్టాభిషేకం (1987)లో పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా జగన్నాథాచార్యుల దంపతులకు శ్రీలక్ష్మీ తాయారమ్మ వారి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. ముందుగా జగన్నాథాచార్యుల దంపతులకు శాలువా కప్పి, పూలదండలతో ఘనంగా సత్కరించారు. పలువురు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధానార్చకులు అమరవాది విజయ రాఘవన్, సీతారామానుజాచార్యులు, గోపాలకృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

అప్పల బాధతో దంపతుల ఆత్మహత్య

నల్లగొండ క్రైం: అప్పుల బాధతో దంపతులు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని అబ్బాసియా కాలనీలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ పట్టణానికి చెందిన జగిని చంద్రశేఖర్ (43), స్వాతి (38) దంపతులకు రోహిత్, యశ్వంత్ అనే కుమారులు ఉన్నారు. పిల్లలను రోజులాగే ఉదయం పాఠశాలకు పంపించారు. అనంతరం ఇంట్లో భార్యాభర్తలు కలసి పురుగు మందు తాగారు. తర్వాత చంద్రశేఖర్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడైన తండ్రి రంగయ్యకు ఫోన్ చేసి కడుపునొప్పిగా ఉందని, అర్జెంట్‌గా ఇంటికి రావాలని చెప్పాడు. దాంతో ఆయన హుటాహుటిన కుమారుడి ఇంటికి వచ్చారు. ఏమైందని అడగడంతో.. ఇద్దరూ పురుగు మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే వారిని 108లో జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఇద్దరూ మృతిచెందారు. అప్పుల బాధతోనే వారు ఆత్మహత్యకు పాల్పడినట్లు రంగయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

అప్పులపై పోలీసుల ఆరా..

చిరు వ్యాపారి చంద్రశేఖర్ దంపతుల ఆత్మహత్య నేపథ్యంలో పోలీసులు వారి అప్పుల విషయమై ఆరాతీస్తున్నారు. అప్పుల సమస్యను అధిగమించే స్థోమత ఉన్నప్పటికీ ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డారన్న కోణంలో విచారణ జరుపుతున్నారు. గౌరవప్రదమైన కుటుంబంగా గుర్తింపు ఉండడంతో అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేకపోయారా? లేక తీర్చేమార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డారా అన్న విషయంపైనా ఆరా తీస్తున్నారు.



2019కి స్వాగతం పలుకుతూ బాణసంచా వెలుగుల్లో కాంతులీనుతున్న హాంకాంగ్‌లోని విక్టోరియా హార్బర్. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో ప్రారంభమైన కొత్త సంవత్సర వేడుకలు.. ఆస్ట్రేలియా, జపాన్, ఇండోనేసియా, రష్యా, భారత్, జర్మనీ, బ్రిటన్ తదితర దేశాల్లో అంబరాన్నంటాయి

కాంగ్రెస్‌కు మద్దతుపై పునరాలోచిస్తా



లక్నో: మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లలో ఇటీవల ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వాలకు బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయవతి వార్నింగ్ ఇచ్చారు. తమ కార్యకర్తలపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోకుంటే మద్దతు విషయంలో పునరాలోచిస్తామని స్పష్టం చేశారు. '2018 ఏప్రిల్ 2న చేపట్టిన భారత్ బంద్ సందర్భంగా అమాయకులైన మా పార్టీ కార్యకర్తలపై అప్పటి బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి. లేకుంటే వెలుపలి నుంచి మద్దతు కొనసాగింపుపై పునరాలోచించాల్సి ఉంటుంది' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఇప్పటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వాల హామీలు, ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. దీంతో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల పాలన ఒకే మాదిరిగా ఉందని ప్రజలు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లోనే కాంగ్రెస్‌కు హెచ్చరిక చేయాల్సిన అవసరం ఏర్పడింది' అని తెలిపారు.

✦ పాస్‌పోర్ట్ నిబంధనల్ని మార్చండి



కేంద్ర ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టు సూచన

చెన్నై: బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణం తీసుకున్న వారు దేశం విడిచి పారిపోకుండా పాస్‌పోర్టు నిబంధనల్లో మార్పులు తీసుకురావాలని మద్రాస్ హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. తనను విధుల నుంచి తొలగించడం అన్యాయమంటూ మంగళం అనే అంగన్‌వాడీ కార్యకర్త వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు పైవిధంగా స్పందించింది. 'రుణ ఎగవేత దారులు చట్టం నుంచి తప్పించుకునేందుకు సుదూర దేశాలకు పారిపోతున్నారు. వారు తమ పాస్‌పోర్టులను రుణం పొందిన బ్యాంకు లేదా సంస్థ వద్ద సరెండర్ చేసేలా నిబంధనలు మార్చాలి' అని కోర్టు వ్యాఖ్యానించింది. రుణం పూర్తిగా చెల్లించేవరకు రుణదాత వద్దే పాస్‌పోర్టు ఉండాలి. ఉంచకపోతే పాస్‌పోర్టు తాత్కాలికంగా రద్దుచేయాలని, పాస్‌పోర్టు రెన్యూవల్‌కు కోర్టు అనుమతి ఉండాలని తెలిపింది. మంగళం అనే అంగన్‌వాడీ కార్యకర్త..అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, తన బంధువు పాస్‌పోర్టుతో సింగపూర్ వెళ్లడంతో ప్రభుత్వం ఆమెను విధుల నుంచి తొలగించడంపై కోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు ఆమెను మందలిస్తూ వారం రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. మంగళంతోపాటు ఆమె బంధువుకు రేషన్‌కార్డు తదితర ప్రభుత్వ సౌకర్యాలను ఉపసంహరించాలంది.

✦ సబ్సిడీ సిలిండర్‌పై రూ.5.91 కోత




న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ ఆయిల్ సంస్థలు ఎల్పీజీ వినియోగదారులకు మరోసారి ఊరటనిచ్చాయి. సబ్సిడీ ఉన్న సిలిండర్‌పై రూ.5.91, సబ్సిడీలేని సిలిండర్‌పై రూ.120.50 తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. తాజాగా ధరల తగ్గుదల నేపథ్యంలో ఢిల్లీలో 14.2 కేజీల బరువున్న సబ్సిడీ సిలిండర్ రూ.494.99కు, సబ్సిడీలేని సిలిండర్ రూ.689కు అందుబాటులోకి రానుంది. ఈ తగ్గింపు సోమవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధనం ధరల్లో తగ్గుదలతో పాటు రూపాయి మారకం విలువ బలపడటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తెలిపింది.

సుప్రీంకోర్టు కొలీజియంలో మార్పులు

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మదన్ బి.లోకూర్ డిసెంబర్ 30న పదవీ విరమణ చేయడంతో సుప్రీంకోర్టు కొలీజియంలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో సీనియారిటీ ప్రకారం తొలి ఐదుగురు సీనియర్ న్యాయమూర్తులు కొలిజియంలో ఉంటారు. డిసెంబర్ 30న మదన్ బి.లోకూర్ పదవీ విరమణ చేయడంతో జస్టిస్ అరుణ్ మిశ్రా కొలిజియంలోకి వచ్చారు. కొలీజియంలో చివరిసారిగా నవంబర్‌లో మార్పులుజరిగాయి. నవంబర్ 30న జస్టిస్ కురియన్ జోసెఫ్ పదవీ విరమణ చేయడంతో జస్టిస్ ఎన్వీ రమణ కొలీజియంలోకి వచ్చారు.

మండోలి జైలుకు సజ్జన్



న్యూఢిల్లీ: 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో జీవిత ఖైదు శిక్ష పడ్డ కాంగ్రెస్ మాజీ నేత సజ్జన్ కుమార్(73) సోమవారం ఢిల్లీలోని కోర్టు ఎదుట లొంగిపోయారు. ఢిల్లీ హైకోర్టు సజ్జన్‌కు జీవిత ఖైదు విధించిన విషయం తెలిసిందే. సజ్జన్ కుమార్‌ను ఈశాన్య ఢిల్లీలోని మండోలి జైలులో ఉంచాలని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అదితీ గార్గ్ ఆదేశించారు. కాగా, తనను దోషిగా నిర్ధారిస్తూ జీవిత ఖైదు విధించడాన్ని సజ్జన్‌కుమార్ సుప్రీంకోర్టులో సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. కాగా, కోర్టులో లొంగిపోయిన తర్వాత సజ్జన్‌కుమార్‌ను భారీ భద్రత నడుమ పోలీసులు మండోలి జైలుకు తరలించారు.

సూట్‌కేసుల్లో ఖషోగ్గీ శరీర భాగాలు!

అంకారా: సౌదీ అరేబియా జర్నలిస్ట్ జమాల్ ఖషోగ్గీ శరీర భాగాలను కొందరు వ్యక్తులు సూట్‌కేసులు, బ్యాగుల్లో తరలిస్తున్నట్లుగా ఉన్న వీడియోను టర్కీ టీవీ చానల్ ఒకటి ప్రసారం చేసింది. ముగ్గురు వ్యక్తులు 5 సూట్ కేసులు, 2 పెద్ద సంచులను ఇస్తాంబుల్‌లోని సౌదీ కాన్సుల్ జనరల్ ఇంట్లోకి తీసుకెళ్తున్నట్లుగా ఉన్న వీడియో ఫుటేజీని ఎ–హబేర్ టీవీ చానల్ ఆదివారం ప్రసారం చేసింది. ఆ ఇంటికి సమీపంలో ఉన్న సౌదీ కాన్సులేట్‌లోనే 2018 అక్టోబర్‌లో ఖషోగ్గీ(59) హత్యకు గురయ్యారు. ఆయన మృతదేహాన్ని ముక్కలుగా చేసి ఆ బ్యాగులు, సూట్ కేసుల్లోనే తరలించారని తమకు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిందని ఆ చానల్ పేర్కొంది. అయితే, అప్పట్లో ఖషోగ్గీ శరీర భాగాలను యాసిడ్‌లో వేసి ఆనవాళ్లు దొరక్కుండా చేశారని అనుమానాలు వెల్లువెత్తాయి.

తెల్గీ సహా అందరూ నిర్దోషులే



సాక్షి, ముంబై: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వేల కోట్ల రూపాయల నకిలీ స్టాంపు పేపర్ల కుంభకోణం నిందితులంతా నిర్దోషులని నాసిక్ సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. సీబీఐ దర్యాప్తు చేస్తున్న ఈ కేసులో ప్రధాన నిందితుడు అబ్దుల్ కరీం తెల్గీ, మరో ఏడుగురికి వ్యతిరేకంగా సరైన ఆధారాలు లభించలేదని పేర్కొంది. 2004లో నకిలీ స్టాంపుల రాకెట్ నడుపుతున్నాడన్న ఆరోపణలపై తెల్గీని పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో సుమారు రూ.32 వేల కోట్ల మేర స్టాంపుల విక్రయం జరిగింది. కాగా, వేరే కేసుల్లో దోషిగా తేలడంతో కోర్టు 30 ఏళ్ల జైలు శిక్ష విధించింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తెల్గీ గత ఏడాది బెంగళూరులోని జైలులో చనిపోయాడు.


'అగస్టా'లో రాహుల్, సోనియా పాత్రలేదు

న్యూఢిల్లీ: అగస్టా ఒప్పందం విషయంలో కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఎన్నడూ జోక్యం చేసుకోలేదని రక్షణశాఖ మాజీమంత్రి ఏకే ఆంటోనీ తెలిపారు. తన హయాంలో జరిగిన ఏ రక్షణ ఒప్పందంలోనూ వీరి ప్రమేయం లేదని స్పష్టం చేశారు. నిజంగానే తప్పుచేసుంటే అగస్టాపై ఒప్పందంపై అసలు సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశిస్తామని ప్రశ్నించారు. ఇటలీలోని మిలాన్ కోర్టులో అగస్టాపై దాఖలు చేసిన కేసులో విజయం సాధించామని తెలిపారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ సంస్థను యూపీఏ బ్లాక్‌లిస్ట్‌లో పెడితే, మోదీ ప్రభుత్వం ఆ నిషేధం ఎత్తేసి 100 నేవీ హెలికాప్టర్లకు ఆర్డర్ ఇచ్చిందని ఆరోపించారు. మరోవైపు అగస్టాలో సోనియా, రాహుల్ పాత్రపై జాతీయస్థాయి ప్రచారానికి బీజేపీ చీఫ్ అమిత్ షా శ్రీకారం చుట్టారు. ట్విట్టర్‌లో అమిత్ షా స్పందిస్తూ..'ప్రజలు జండూ బామ్, టైగర్ బామ్ గురించి వింటుంటారు. ఇవి బాధను తగ్గించి ఉపశమనం కల్గిస్తాయి. కానీ మధ్యవర్తుల్లో ప్రతీఒక్కరూ ఈ ఫ్యామిలీబామ్‌నే కోరుకుంటున్నారు' అని ఎద్దేవా చేశారు.

చర్చకు నోచుకోని 'ట్రిపుల్ తలాక్'

- రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టిన న్యాయ మంత్రి
- బెట్టువీడని విపక్షాలు
- ప్రతిష్టంభనతో సభ వాయిదా

న్యూఢిల్లీ: ఊహించినట్లుగానే విపక్షాలు పట్టు విడవకపోవడంతో ట్రిపుల్ తలాక్ బిల్లుపై రాజ్యసభలో చర్చ ప్రారంభం కాలేదు. బిల్లును జాయింట్ సెలక్ట్ కమిటీకి పంపాలన్న తమ డిమాండ్‌ను ప్రతిపక్షాలు పునరుద్ఘాటించాయి. సోమవారం న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ జరగాలని ప్రభుత్వం కోరినా, విపక్షాలు సహకరించకపోవడంతో కార్యకలాపాలు జరగకుండానే సభ వాయిదా పడింది. అంతకుముందు కావేరి నదీ జలాల పంపిణీ వివాదంపై ఏఐఏడీఎంకే ఎంపీలు నిరసనకు దిగడంతో సభ వాయిదా పడింది. ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రవేశపెట్టాక మరో 15 నిమిషాలు అంతరాయం ఏర్పడింది. తర్వాతా పరిస్థితి మారకపోవడంతో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సభను బుధవారానికి వాయిదా వేశారు. తక్షణ ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణిస్తూ రూపొందించిన తాజా బిల్లు గురువారం లోక్‌సభలో ఆమోదం పొందింది.


రాజ్యసభలో మాట్లాడుతున్నఆజాద్

సంప్రదాయాన్ని ఉల్లంఘిస్తున్న కేంద్రం

రాజ్యసభలో కాంగ్రెస్ పక్ష నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ..బిల్లు తాజా రూపం చాలా క్రూరంగా ఉందని, దాన్ని మరింత అధ్యయనం చేసేందుకు జాయింట్ సెలక్ట్ కమిటీకి పంపాలని సగం కన్నా ఎక్కువ మంది ఎంపీలు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఏదైనా బిల్లును చట్టం చేసే ముందు జాయింట్ సెలక్ట్ కమిటీకి పంపాలన్న సంప్రదాయాన్ని ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి విజయ్ గోయల్ స్పందిస్తూ.. బిల్లుపై చర్చకు ప్రభుత్వం సిద్ధమేనని, అది ఆమోదం పొందడంలో కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వమే ట్రిపుల్ తలాక్ బిల్లుపై రాజకీయాలు చేస్తోందని మరో కాంగ్రెస్ నాయకుడు ఆనంద్ శర్మ తిప్పికొట్టారు. ఆర్డినెన్స్ తెచ్చినా కూడా ఈరోజు వరకు ట్రిపుల్ తలాక్ కేసులు నమోదయ్యాయని, లింగ సమానత్వంతో ముడిపడిన ఈ బిల్లుపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని న్యాయ మంత్రి రవిశంకర్ అన్నారు.

రఫేల్‌పై చర్చకు సిద్ధం: ఖర్గే

రఫేల్ ఒప్పందంపై లోక్‌సభలో చర్చకు రావాలన్న కేంద్ర ప్రభుత్వ సవాలును కాంగ్రెస్ స్వీకరించింది. జనవరి 2న చర్చలో పాల్గొంటామని, సమయాన్ని నిర్ణయించాలని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కోరారు. రఫేల్ ఒప్పందంపై సంయుక్త పార్లమెంట్ కమిటీతో విచారణ జరిపించాలని పునరుద్ఘాటించారు. దీనికి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ స్పందిస్తూ..ఈ అంశంపై ఖర్గే చర్చను ప్రారంభించాలని, బదులిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కానీ ఖర్గే చర్చ నుంచి పారిపోతున్నారని అన్నారు.

కొత్త ఏడాది నుంచి వెల్‌లోకి రాకండి



కొత్త ఏడాది నుంచైనా సభ్యులు నిబంధనల మేరకు నడుచుకోవాలని, వెల్‌లోకి దూసుకురావద్దని లోక్‌సభ స్పీకర్ సుమిత్ర విజ్ఞప్తి చేశారు. రఫేల్‌పై కాంగ్రెస్, కావేరిపై ఏఐఏడీఎంకే సభ్యులు ఆందోళనకు దిగిన సమయంలో ఆమె స్పందిస్తూ..వారంతా తన కోసమైనా మీమీ స్థానాల్లోకి వెళ్లాలన్నారు. ఆమె మాటను గౌరవిస్తూ రెండు పార్టీల సభ్యులు వెనక్కువెళ్లారు. ' ఈ ఏడాదిలో ఇదే ఆఖరి రోజు. మీరు వెల్‌లోకి వచ్చిన ఆఖరి రోజు కూడా ఇదే కావాలని కోరుకుంటున్నా' అని సుమిత్రా అన్న మాటల్ని సభ్యులంతా ఓపికగా వినడం గమనార్హం.


ఆకాశహర్మ్యంలో పేలుడు

- రష్యాలో నలుగురు మృతి
- 70 మంది గల్లంతు

మాస్కో: రష్యాలోని మాగ్నిటోగొర్స్క్ నగరంలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. పురాతన బహుళ అంతస్తుల భవనంలో సంభవించిన పేలుడుతో నలుగురు చనిపోయారు. చాలామంది జాడ తెలీడంలేదు. పేలుడు ధాటికి భవనంలోని ఒక భాగం కుప్పకూలింది. దాదాపు 70 మంది వరకు శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని భావిస్తున్నారు. అక్కడ ఉష్ణోగ్రతలు మైనస్ 22 డిగ్రీలకు పడిపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. అధ్యక్షుడు వ్లాడిమిర్ పుతిన్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ ప్రమాదం గ్యాస్ లీకేజీ కారణంగానే చోటుచేసుకుందని జాతీయ భద్రతా సంస్థ ఎఫ్ఎస్‌బీ నిర్ధారించింది. రష్యాలో ఇటువంటి ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి.



పేలుడు ధాటికి పాక్షికంగా కూలిన భవనం

2020 అమెరికా అధ్యక్ష బరిలో వారెన్!



వాషింగ్టన్: 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని యోచిస్తున్నట్లు డెమొక్రటిక్ పార్టీకి చెందిన సెనేటర్ ఎలిజబెత్ వారెన్(69) ప్రకటించారు. కొత్త సంవత్సరం సందర్భంగా తన అభిమానులు, మద్దతుదారులకు పంపిన వీడియో సందేశంలో ఆమె తన మనసులోని మాటను బయటపెట్టారు. అధ్యక్ష ఎన్నికల బరిలో దిగే ముందు, అవకాశాలపై అధ్యయనం చేసేందుకు అన్వేషణ కమిటీని ఏర్పాటుచేయబోతున్నట్లు వెల్లడించారు. దీంతో తదుపరి ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌కు సవాలు విసరబోతున్నానని అధికారికంగా ప్రకటించిన తొలి డెమొక్రటిక్ నాయకురాలిగా ఆమె నిలిచారు. ట్రంప్ విధానాల్ని తీవ్రంగా ఎండగట్టే వారెన్ ఇటీవల జరిగిన మధ్యంతర ఎన్నికల్లో మసాచుసెట్స్ నుంచి సెనేట్‌కు తిరిగి ఎన్నికయ్యారు. ఇండో–అమెరికన్ సెనేటర్ కమలా హ్యారిస్, హిందూ మతానికి చెందిన మరో సభ్యురాలు తులసీ గబ్బార్డ్‌లు కూడా ట్రంప్‌పై పోటీ చేసే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి.

నూతన సీఐసీగా సుధీర్ భార్గవ



న్యూఢిల్లీ: నూతన ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ)గా కేంద్ర ప్రభుత్వం సుధీర్ భార్గవను నియమించింది. ఈయనతో పాటు మరో నలుగురు సమాచార కమిషనర్ల నియామకం చేపట్టింది. భార్గవ సీఐసీ సమాచార కమిషనర్‌గా చేశారు. ప్రధాన సమాచార కమిషనర్‌తో కలిపి మొత్తం 11 మంది ఉండాల్సిన ఈ కమిషన్‌లో ప్రస్తుతం ముగ్గురే ఉన్నారు. ఐఎఫ్ఎస్ అధికారి అయిన యశ్వర్ధన్ కుమార్ సిన్హా, మాజీ ఐఆర్ఎస్ అధికారి వనజా ఎన్ సర్నా, మాజీ ఐఏఎస్ నీరజ్ కుమార్ గుప్తా, మాజీ లా సెక్రటరీ సురేశ్ చంద్రలను సమాచార కమిషనర్లుగా నియమిస్తూ సోమవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా ఈ ఏడాదే ప్రభుత్వోద్యోగులుగా పదవీ విరమణ పొందారు. ఇటీవల ప్రధాన సమాచార కమిషనర్ ఆర్.కె.మాథుర్‌తో పాటు ముగ్గురు సమాచార కమిషనర్లు శ్రీధర్ ఆచార్యులు, యశోవర్ధన్ ఆజాద్, అమితవ భట్టాచార్య పదవీ విరమణ చేసిన సంగతి తెలిసిందే. దీంతో అప్పుడున్న ఇతర ముగ్గురు కమిషనర్లు వీలైనంత త్వరగా ఈ ఖాళీలను భర్తీ చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

నియామకాల్లో పారదర్శకత ఏది?: మాడభూషి



సాక్షి, న్యూఢిల్లీ: సీఐసీ నియామకాల్లో పారదర్శకత పాటించాలని మాజీ సీఐసీ మాడభూషి శ్రీధరాచార్యులు కోరారు. కేవలం పరిపాలన రంగానికి చెందిన అధికారులనే కాకుండా ఇతర రంగాలకు చెందిన వారినీ కమిషనర్లుగా నియమించాలన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీకి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత ఖర్గేకు లేఖలు రాశారు. సీఐసీ సభ్యుల ఎంపిక కమిటీలో ప్రధాని, ప్రతిపక్ష నేత సభ్యులు. సీఐసీ సభ్యుల ఎంపిక సమాచార హక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నందునే పలువురు కోర్టుల్లో ప్రజాప్రయోజన వ్యాజ్యా(పిల్)లు దాఖలు చేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. 'సీఐసీ కమిషనర్లుగా కేవలం పరిపాలన వర్గాల వారినే ఎందుకు నియమిస్తున్నారు? న్యాయం, సామాజిక సేవ, మీడియా, జర్నలిజం, సైన్స్, టెక్నాలజీ తదితర రంగాల వారినీ నియమించాలన్న సమాచార హక్కు చట్ట నిబంధనలను ఎందుకు పాటించరు? ఇటీవల నియమించిన నలుగురినీ బ్యూరోక్రాట్ల నుంచే ఎందుకు ఎంపిక చేశారు?' అని ప్రశ్నించారు. సీఐసీతోపాటు రాష్ట్రాల సమాచార హక్కు కమిషన్(ఎస్ఐసీ)లలో సకాలంలో నియామకాలు చేపట్టాలన్న నిబంధనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు.

'బ్యాట్' దాడిని తిప్పికొట్టిన సైన్యం

ఇద్దరు పాక్ సైనికుల మృతి

శ్రీనగర్: సరిహద్దుల్లోని భారత్ సైనిక పోస్టుపై పాకిస్తాన్ ప్రత్యేక దళమైన బోర్డర్ యాక్షన్ టీం (బ్యాట్) చేసిన దొంగచాటు దాడి యత్నాన్ని భారత్ బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు పాక్ సైనికులు హతమయ్యారు. మిగతా వారు తిరిగి పాక్‌భూభాగంలోకి పారిపోయారు. ఈ ఘటన కశ్మీర్‌లోని నౌగామ్ సెక్టార్‌లోని భారత్–పాక్ నియంత్రణ రేఖ వెంబడి శనివారం అర్ధరాత్రి జరిగింది. 'సరిహద్దు దాటి లోపలికి వచ్చేందుకు 'బ్యాట్' సభ్యులు చేసిన యత్నాన్ని మన బలగాలు భగ్నం చేశాయి. పాక్ బలగాలు మోర్టార్లు, రాకెట్ లాంచర్లతో కాల్పులు జరుపుతూ రక్షణగా నిలవగా అడవి నుంచి భారత్ భూభాగంలోకి చొరబడేందుకు 'బ్యాట్' దళం ప్రయత్నించింది. వెంటనే భారత బలగాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో పాక్ సైనికులుగా భావిస్తున్న ఇద్దరు చనిపోగా, మిగతా వారు పారిపోయారు' అని సైనిక ఉన్నతాధికారి చెప్పారు. ' వారి వద్ద శక్తివంతమైన ఐఈడీ పేలుడు పదార్థాలు, ఆధునిక ఆయుధాలున్నాయి. దీనిని బట్టి భారత్ పోస్టుపై భారీ దాడికి ప్రణాళిక వేసుకున్నారని అర్థమవుతోంది' అని ఆయన పేర్కొన్నారు.



ఏమిటీ 'బ్యాట్'?

పాక్ సైన్యంలోని స్పెషల్ సర్వీస్ గ్రూప్(ఎస్ఎస్‌జీ) నిర్మించిన బోర్డర్ యాక్షన్ టీం(బ్యాట్)లో దాదాపు 8 మంది సభ్యులుంటారు. ఈ గ్రూపుల్లో సైనిక కమాండోలు, ఉగ్రవాదులు ఉంటారు. వీరు సరిహద్దుల్లోని భారత సైనికులే లక్ష్యంగా దాడులకు దిగుతుంటారు. పాక్ ఆర్మీ కమాండోలు కూడా బ్యాట్‌లో ఉన్నప్పటికీ భారత సైన్యానికి పట్టుబడినప్పుడు మాత్రం అక్కడి ప్రభుత్వం తనకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తోంది.

హసీనా నాలుగోసారి

- బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో మహాకూటమి అఖండ విజయం
- 300కు గాను 288 స్థానాలు కైవసం

ఢాకా/న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ 11వ పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాని షేక్ హసీనా(71) నేతృత్వంలోని మహాకూటమి ఘనవిజయం సాధించింది. ఆదివారం ముగిసిన ఎన్నికల్లో మొత్తం 300 స్థానాలకు గానూ హసీనాకు చెందిన అవామీలీగ్, దాని మిత్రపక్షాలు 288 చోట్ల విజయదుందుభి మోగించాయి. తాజా ఫలితాల నేపథ్యంలో బంగ్లాదేశ్ ప్రధానిగా వరుసగా మూడోసారి, మొత్తంగా నాలుగోసారి బాధ్యతలు చేపట్టేందుకు హసీనాకు మార్గం సుగమమైంది. కాగా, ఈ ఎన్నికల్లో విపక్ష కూటమి జాతీయ ఐక్య ఫ్రంట్(ఎన్‌యూఎఫ్) కేవలం ఏడు స్థానాలతో సరిపెట్టుకుంది. ఈ ఎన్నికల్లో మొత్తం పోలైన ఓట్లలో అధికార కూటమి 82 శాతం దక్కించుకోగా, విపక్షాలకు 15 శాతం ఓట్లు లభించాయి. 2008లో జరిగిన ఎన్నికల్లో 263 సీట్లు సాధించి రికార్డు సృష్టించిన హసీనా ఈసారి ఏకంగా 288 స్థానాలు కొల్లగొట్టి ఆ రికార్డును తిరగరాశారు.

ఫలితాలను అంగీకరించబోం: విపక్షాలు

బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో భారీ అవకతవకలు చోటుచేసుకున్నాయని విపక్షాల కూటమి జాతీయ ఐక్య ఫ్రంట్(ఎన్‌యూఎఫ్) ఆరోపించింది. ఈ ఫలితాలను తిరస్కరిస్తున్నట్లు ప్రకటించింది. తక్షణమే ఈ ఎన్నికలను రద్దుచేసి పారదర్శకంగా, తటస్థ ప్రభుత్వం ఆధ్వర్యంలో మళ్లీ పోలింగ్ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని(ఈసీ) డిమాండ్ చేసింది.

మళ్లీ ఎన్నికల ప్రసక్తే లేదు: ఈసీ

బంగ్లాదేశ్‌లో పోలింగ్ సందర్భంగా భారీగా అవకతవకలు, రిగ్గింగ్ చోటుచేసుకున్నాయన్న విపక్షాల ఆరోపణలను ఎన్నికల సంఘం చీఫ్(సీఈసీ) కె.ఎం.నూరల్ హుడా ఖండించారు. పోలింగ్‌కు ముందురోజు రాత్రే చాలాచోట్ల బ్యాలెట్ బాక్సులు నిండిపోయాయన్న వాదనల్లో నిజం లేదని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో నైరుతి గోపాల్‌గంజ్ నుంచి పోటీచేసిన ప్రధాని హసీనాకు 2,29,539 ఓట్లు రాగా, ఆమెపై పోటీచేసిన ఎన్‌యూఎఫ్ అభ్యర్థికి కేవలం 123 ఓట్లు వచ్చాయని తెలిపారు.

హసీనాకు మోదీ ఫోన్..

బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన షేక్ హసీనాకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. హసీనాకు సోమవారం ఫోన్‌చేసిన మోదీ.. బంగ్లాదేశ్ అభివృద్ధికి భారత్ మద్దతు కొనసాగుతుందని వెల్లడించారు. హసీనా నేతృత్వంలోని ప్రగతిశీల ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని వ్యాఖ్యానించారు. బంగ్లాదేశ్ అభివృద్ధి విషయంలో భారత్ అండగా ఉంటుందని ప్రకటించారు.

ఏక పార్టీ దిశగా అడుగులు

సైనిక కుట్రలో చనిపోకముందు హసీనా తండ్రి, బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు ముజీబుర్ దేశంలో ప్రతిపక్షాలను దెబ్బతీసి ఏకపార్టీ వ్యవస్థను నెలకొల్పేందుకు యత్నించారని ఆరోపణలు ఉన్నాయి. ముజీబుర్ తర్వాత బంగ్లాదేశ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన జియావుర్ రెహమాన్, ఎర్షాద్‌లు సైన్యానికి చెందిన వ్యక్తులు. వీరూ తమ హయాంలో ప్రజాస్వామ్యం వేళ్లూనుకోకుండా ప్రయత్నించారు. సైనిక పాలన ముగిశాక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన బీఎన్పీ చీఫ్ ఖలీదా వైఖరీ ఇదే. మూడుసార్లు బంగ్లాదేశ్ ప్రధానిగా పనిచేసిన ఖలీదా ప్రతీసారి అవామీ లీగ్‌ను అణిచేందుకు యత్నించారు. హసీనా సైతం ప్రజాస్వామ్యం ఉనికిని చెరిపేసేలా వ్యవహరించడం గమనార్హం. ఖలీదాను అవినీతి ఆరోపణలపై జైలు శిక్షపడేలా హసీనా చేశారు.

మొదటి నుంచి పెత్తందారీ ధోరణులే!

1996లో మొదటిసారి ప్రధాని పదవి చేపట్టినప్పటి నుంచీ ప్రతిపక్షాలను, పోటీదారులను హసీనా సహించిన దాఖలాలు లేవు. తన ప్రత్యర్థి ఖలీదా బాటలోనే పయనిస్తూ బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం నిర్వీర్యం కావడానికి ఆమె కారకులయ్యారు. బీఎన్పీ మిత్రపక్షమైన ముస్లిం ఛాందసవాద సంస్థ జమాతే ఇస్లామీని ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించారు. 1971 యుద్ధ నేరాలపై ఈ సంస్థ నేతలపై విచారణ జరిపించి శిక్షలు అమలు చేశారు. కొందరిని ఉరితీసి, మరి కొందరిని జైళ్లకు పంపారు. జమాతే సంస్థను ఖలీదా వాడుకున్నట్టే మరో ఇస్లామిక్ తీవ్రవాద సంస్థ హిఫాజుతుల్ ఇస్లాంను హసీనా తనకు అనుగుణం గా వినియోగించుకుంటున్నారు. అవామీలీగ్‌కు ప్రతిపక్షమే లేకుండా చేయడమే లక్ష్యంగా ఆమె అధికారం ప్రయోగిస్తున్నారు. ఇంటర్నెట్‌లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే రచయితలను చంపిన వారిని పట్టుకునే విషయంలో హసీనా ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. అయితే నిరుపేద దేశంగా, బలహీన ఆర్థిక వ్యవస్థగా పేరొందిన బంగ్లాదేశ్‌ను అభివృద్ధిలో పరుగులు పెట్టించడం హసీనా విజయంగా చెప్పొచ్చు. బంగ్లాదేశ్ విముక్తి పోరాటం, ఆతర్వాత రాజకీయా పరిస్థితుల నేపథ్యంలో హసీనా భారత్‌తో సుహృద్భావ సంబంధాలు కొనసాగిస్తూ వస్తున్నారు. హసీనా చేపట్టిన అభివృద్ధి పనులకు బంగ్లా ప్రజలు పట్టం కట్టారని మోదీ ప్రశంసించారు.



విద్యార్థి దశ నుంచే...

బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడానికి ప్రధాని హసీనా తీసుకున్న చర్యలే కారణమని ఆమె సన్నిహితులు చెబుతుంటే, ప్రతిపక్షాలను నిర్దాక్షిణ్యంగా అణచివేస్తున్నారని వ్యతిరేకులు ఆరోపిస్తున్నారు. హసీనా.. బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు ముజీబుర్ రెహమాన్ కుమార్తె. తూర్పుపాకిస్తాన్ (ఇప్పటి బంగ్లాదేశ్)లోని తుంగిపరాలో 1947, సెప్టెంబర్ 28న జన్మించారు. ఢాకాలోని ఈడెన్ కాలేజీలో విద్యార్థి రాజకీయాల్లో హసీనా చురుగ్గా పాల్గొనేవారు. 1975, ఆగస్టు 15న ఆమె తండ్రి రెహమాన్, మిగిలిన కుటుంబ సభ్యులను ఆర్మీలోని ఓ వర్గం దాడిచేసి చంపేసింది. విదేశాల్లో ఉండటంతో హసీనా ప్రాణాలతో బతికిపోయారు. తర్వాత ఐదేళ్ల పాటు భారత్‌లోనే ప్రవాస జీవితం గడిపారు. 1981లో ఆమె అవామీలీగ్ పార్టీ అధ్యక్షురాలయ్యారు. బంగ్లాదేశ్‌లో సైనిక పాలనను పార్లమెంటులో తీవ్రంగా వ్యతిరేకించడంతో హసీనాకు మద్దతుదారులు క్రమంగా పెరిగారు. ఇదే సమయంలో ఆమెను సైన్యం గృహనిర్బంధంలో ఉంచింది. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్పీ) చీఫ్ జియా ఖలీదాతో కలిసి హసీనా ప్రజాస్వామ్య పోరాటాన్ని తీవ్రతరం చేయడంతో చివరికి 1990, డిసెంబర్‌లో అధ్యక్షుడిగా లెఫ్టినెంట్ జనరల్ హుస్సేన్ మొహమ్మద్ ఎర్షాద్ రాజీనామా చేశారు. దీంతో బంగ్లాదేశ్‌లో సైనిక పాలనకు తెరపడింది. అయితే కాలక్రమంలో హసీనా, ఖలీదా రాజకీయ ప్రత్యర్థులుగా మారిపోయారు. అణు శాస్త్రవేత్త అయిన ఎం.ఎ.వాజెద్‌ను హసీనా 1968లో పెళ్లి చేసుకున్నారు. వీరికి కుమారుడు జోయ్, కుమార్తె సైమా ఉన్నారు. 2009లో హసీనా భర్త కన్నుమూశారు. హసీనా హయాంలోనే బంగ్లాదేశ్ పౌరుల తలసరి ఆదాయం మూడు రెట్లు పెరిగింది. 2017లో దేశ జీడీపీ 250 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

సాక్షి బిజినెస్

మంగళవారం 1-1-2019

WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్‌		నిఫ్టీ	
8	▼	3	▲
36,068		10,863	

మరిన్ని వార్తలు, స్టాక్‌ అప్‌డేట్స్‌ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30గం.లకు)

సూచీ		విలువ		మార్పు
నాస్‌డాక్‌		6,609	▲	23
డోజోన్స్‌		23,224	▼	162
ఎఫ్‌టీఎస్‌ఈ 100		6,728	▼	6
డాక్స్‌	(శుక్రవారం ముగింపు)	10,558	▲	177
షాంఘై	(శుక్రవారం ముగింపు)	2,494	▲	11
నికాయ్‌	(శుక్రవారం ముగింపు)	20,015	▼	63

● అమెరికా ● బ్రిటన్‌ ● జర్మనీ ● చైనా ● జపాన్‌

ఫారెక్స్‌ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	69.1	70.74
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	87.24	90.37
€	యూరో	ఎస్‌బీఐ	78.43	81.53
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	62.16	64.51
AUS	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	48.37	50.58
SS	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	50.35	52.11
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	17.03	20.35
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	--	--
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	9.01	10.08

2019 నాలుగు దిక్కులు

కొత్త ఏడాది స్టాక్‌ మార్కెట్‌ వెలుగులు విరజిమ్ముతుందా? పుత్తడి మిలమిలలుంటాయా? రూపాయి పరుగు కొనసాగుతుందా? ముడి చమురు ధరల కదలికలు ఎలా ఉంటాయ్‌? ఈ నాలుగు దిక్కులూ ఏం చెబుతున్నాయి?..

- సాక్షి బిజినెస్‌ ప్రత్యేకం

పసిడి పతనానికి బ్రేక్‌..



ఫెడరల్‌ రిజర్వ్‌ వడ్డీ రేట్ల పెంపు, పటిష్టమైన డాలరు తదితర అంశాలతో పసిడి ధరలు 2018లో హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. అంతర్జాతీయంగా రేట్లు గణనీయంగా క్షీణించి ఔన్సు (31.1 గ్రాములు) ధర 1,200 డాలర్ల దిగువకు పడిపోయింది. కాకపోతే కనిష్ఠ స్థాయిల నుంచి మళ్లీ 9 శాతం మేర కోలుకోవడం పసిడి పటిష్టంగానే ఉందన్న సంకేతాలిస్తోంది. ఇక 2019 విషయానికొస్తే.. వాణిజ్య యుద్ధభయాలు, రాజకీయ వివాదా లు, అమెరికా ఉద్దీపన ప్యాకేజీని ఉపసంహరిస్తుండటం వంటివి ప్రపంచ ఎకానమీకి ప్రధాన రిస్కులు కాబోతున్నాయి. స్వల్పకాలికంగా చూస్తే చాలా దేశాల వృద్ధి రేటు క్రమంగా నెమ్మదిస్తోంది. ఇవన్నీ ఇన్వెస్టర్ల విశ్వాసం, పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యం, వృద్ధి మొదలైన వాటిపై ప్రతికూల ప్రభా వం చూపవచ్చు. రాజకీయ–భౌగోళిక టెన్షన్లు.. ప్రపంచవ్యాప్తంగా ఫైనాన్షియల్‌ మార్కెట్లను కుదిపేయవచ్చు. ఈక్విటీ, బాండ్, కరెన్సీ మార్కెట్లు అంతర్జాతీయంగా తీవ్ర ఒడిదుడుకులకు లోను కావచ్చు. చాలా దేశాల్లోని ఆర్థిక, ద్రవ్య, రాజకీయ విధానాలు చూస్తుంటే.. పసిడి ధరలకు మరింత మద్దతు లభించే సూచనలే కనిపిస్తున్నాయి. స్థూల ఆర్థికాంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. బంగారం రేట్లు క్రమంగా పెరగవచ్చు. కాబట్టి పోర్ట్‌ఫోలియో డైవర్సిఫికేషన్‌ కోసం బంగారంలో పెట్టుబడులను పరిశీలించవచ్చు. పోర్ట్‌ఫోలియోకి ఉండే రిస్కులను తగ్గించుకునేందుకు ఇది ఉపయోగపడొచ్చు.

– చిరాగ్‌ మెహతా, సీనియర్‌ ఫండ్‌ మేనేజర్, క్వాంటమ్‌ మ్యూచువల్‌ ఫండ్‌

రూపాయి జోరు..



డాలర్‌తో రూపాయి మారకం విలువ 2018లో 9 శాతం క్షీణించింది. కొత్త ఏడాదిలో రూపాయి పరిస్థితి కొంచెం మెరుగుపడవచ్చు. క్రూడ్‌ ధరలు పతనమైతే... ఆ మేరకు రూపాయి పుంజుకుంటుంది. అయితే ఎన్నికల నేపథ్యంలో ప్రజాకర్షక పథకాలు వెల్లువెత్తే అవకాశాలుండటం రూపాయిపై ప్రతికూల ప్రభావంపడచ్చు. 2019లో రూపాయి 68–70 రేంజ్‌లో కదలాడవచ్చు. కాగా రూపాయి విలువ సోమవారం 18 పైసలు పెరిగి 69.77 వద్ద ముగిసింది.

చమురు బేజారు..




ముడి చమురు ధరలు 2018లో తీవ్రమైన హెచ్చుతగ్గులకు గురయ్యాయి. ఇదే స్థాయి హెచ్చుతగ్గులు ఈ ఏడాది కూడా కొనసాగవచ్చు. ధరలు పెరిగే అవకాశాలు పెద్దగా లేవు. అలాగని భారీగా తగ్గే అవకాశాలూ తక్కువే. ఎందుకంటే బ్యారెల్‌ ధర 50 డాలర్లకన్నా దిగువకు చేరితే ఉత్పత్తిని తగ్గిస్తామని ఒపెక్‌ దేశాలు ఇప్పటికే చెప్పాయి. మొత్తంగా బ్రెంట్‌ చమురు 55– 65 డాలర్ల రేంజ్‌లో ఉండొచ్చు.

స్టాక్‌ మార్కెట్‌ కళకళ..



గత ఏడాది మాదిరే కొత్త సంవత్సరంలోనూ ఒడిదుడుకులు కొనసాగుతాయి. లోక్‌సభ ఎన్నికలు కీలకం కానున్నాయి. బీజేపీకి కానీ, కాంగ్రెస్‌కి కానీ ఏదో ఒక పెద్ద పార్టీకి ఎక్కువ సంఖ్యలో లోక్‌సభ స్థానాలు వస్తే, మార్కెట్‌ జోరును ఆపడం ఎవ్వరి తరమూ కాదు. అలాగే అమెరికా ఫెడరల్‌ రిజర్వ్, ఆర్‌బీఐ రేట్ల పాలసీలూ, ముడి చమురు ధరల కదలికలు, అమెరికా–చైనాల వాణిజ్య సంబంధాలు... ఇవన్నీ ప్రభావం చూపేవే. మొత్తం మీద సెన్సెక్స్‌ ఈ ఏడాది కూడా 5 శాతం మేర పెరిగే అవకాశాలున్నాయనేది నిపుణుల మాట. నిఫ్టీ ఏడాది చివరికు 11,500 పాయింట్లకు చేరవచ్చు.

బ్యాంకింగ్‌లో రికవరీ షురూ



- ఎన్‌పీఏలు తగ్గుతున్నాయ్‌
- పీఎస్‌బీల్లో మరిన్ని సంస్కరణలు అవసరం
- ఆర్‌బీఐ గవర్నర్‌ శక్తికాంత్‌ దాస్‌
- అర్ధ సంవత్సర ఆర్థిక స్థిరత్వ నివేదిక విడుదల

ముంబై: పేరుకుపోయిన మొండిబకాయిలు తగ్గుతుండడంతో బ్యాంకింగ్‌ రంగం ఊపిరి పీల్చుకుంటోందని ఆర్‌బీఐ వ్యాఖ్యానించింది. బ్యాంకింగ్‌ రంగం రికవరీ బాట పట్టినా, పీఎస్‌యూ బ్యాంకుల్లో పాలనా పరంగా మరిన్ని సంస్కరణలు రావాల్సి ఉందని ఆర్‌బీఐ గవర్నర్‌ శక్తికాంత్‌దాస్‌ అభిప్రాయపడ్డారు. సోమవారం ఆర్‌బీఐ అర్ధ వార్షిక ఆర్థిక స్థిరత్వ నివేదికను (ఎఫ్‌ఎస్‌ఆర్‌) విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. స్థూల ఎన్‌పీఏలు తగ్గుముఖం పట్టాయని నివేదిక వెల్లడించింది. పదకొండు బ్యాంకులను పీసీఏ చట్రం కిందకు తీసుకురావడంతో బ్యాంకింగ్‌ రంగంలో క్రమశిక్షణ వచ్చినట్లయిందని తెలిపింది. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకొని ఫైనాన్షియల్‌ దిగ్గజాల ఆర్థిక స్థిరత్వంపై ఎక్కువ ఫోకస్‌ పెడతామని సూచించింది.

మొండిపద్దులు తగ్గుతున్నాయ్‌

ఎఫ్‌ఎస్‌ఆర్‌ ప్రకారం... గత మార్చిలో 11.5 శాతం ఉన్న బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు సెప్టెంబర్‌ నాటికి 10.8 శాతానికి దిగివచ్చాయి. ఇదే కాలంలో పీఎస్‌యూ బ్యాంకుల జీఎన్‌పీఏలు 15.2 నుంచి 14.8 శాతానికి తగ్గాయి. ప్రైవేట్‌ బ్యాంకుల జీఎన్‌పీఏలు 4 నుంచి 3.8 శాతానికి పరిమితమయ్యాయి. ఇదే జోరు కొనసాగితే వచ్చే మార్చినాటికి బ్యాంకులన్నింటి స్థూల ఎన్‌పీఏలు 10.3 శాతానికి, పీఎస్‌బీల జీఎన్‌పీఏలు 14. 6 శాతానికి, ప్రైవేట్‌ బ్యాంకుల జీఎన్‌పీఏలు 3.3 శాతానికి తగ్గవచ్చని నివేదిక అంచనా వేసింది. నికర ఎన్‌పీఏలు గత మార్చిలో 6.2 శాతం ఉండగా మార్చినాటికి 5.3 శాతానికి పతనమయ్యాయి. 2015 అనంతరం అటు స్థూల, నికర ఎన్‌పీఏల్లో అర్ధవార్షిక తరుగుదల నమోదు కావడం ఇదే తొలిసారి. రిస్ట్రక్చర్డ్‌ స్టాండర్డ్‌ అడ్వాన్సుల (ఆర్‌ఎస్‌ఏ) నిష్పత్తి సెప్టెంబర్‌ నాటికి 0.5 శాతానికి పతనమైందని, ప్రొవిజన్‌ కవరేజ్‌ నిష్పత్తి (పీసీఆర్‌) 51 శాతానికి పెరిగిందని, క్యాపిటల్‌ టు రిస్క్‌ వెయిటెడ్‌ అసెట్‌ నిష్పత్తి (సీఆర్‌ఏఆర్‌) 13.7 శాతానికి వచ్చిందని నివేదిక వెల్లడించింది. సెప్టెంబర్‌నాటికి బ్యాంకు పోర్టుఫోలియోల్లో పెద్ద రుణఖాతాలు 54.6 శాతానికి, బ్యాంకుల జీఎన్‌పీఏల్లో బడా బకాయిల వాటా 83.4 శాతానికి చేరాయని వివరించింది. ''ప్రస్తుత ఎన్‌పీఏలు అధికమే. కానీ తరుగుదల రేటును పరిశీలిస్తే ఇవి మరింత దిగొస్తాయనిపిస్తోంది. నిజానికి ఎన్‌పీఏ అంశంలో ఈ మెరుగుదల చాలదు. పీఎస్‌యూ బ్యాంకుల నిర్వహణా సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. దీనికోసం మరిన్ని పాలనా సంస్కరణలు తీసుకురావడం, బలహీన పీఎస్‌బీలకు రీక్యాప్‌ సాయం అందించడం తదితర చర్యలు అవసరం'' అని దాస్‌ చెప్పారు. ఎన్‌పీఏలను గుర్తించే ప్రక్రియతో పీఎస్‌బీల్లో రిస్క్‌ మేనేజ్‌మెంట్‌ మెరుగుపడిందన్నారు.

క్రమశిక్షణ తెచ్చిన పీసీఏ

ఇరవై పీఎస్‌బీల్లో 11 బ్యాంకులను పీసీఏ (స్పష్టమైన దిద్దుబాటు చర్యల) పరిధిలోకి తీసుకురావడం మంచిదయిందని దాస్‌ అభిప్రాయపడ్డారు. క్రెడిట్‌ అంచనా, మార్కెట్‌ రిస్కు అంచనాలకు సంబంధించి పీసీఏ కారణంగా బ్యాంకుల్లో క్రమశిక్షణ వచ్చిందన్నారు. దివాలా చట్టం కింద చేర్చిన కేసుల్లో కొంత జాప్యం జరుగుతున్నా, ఈ చట్టం కారణంగా విత్త క్రమశిక్షణ వస్తుందన్నారు. గత నాలుగు త్రైమాసికాల్లో పీసీఏ కారణంగా 11 పీఎస్‌బీల సాల్వెన్సీ నష్టాలు 73,500 కోట్ల రూపాయల నుంచి 34,200 కోట్ల రూపాయలకు దిగివచ్చాయిని ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. క్రూడాయిల్‌ ధరలు తగ్గడం, స్థూల స్థిర మూలధన ఏర్పాటులో వృద్ధి కారణంగా ఎకానమీలో వృద్ధి ముందుకే సాగుతుందని దాస్‌ అంచనా వేశారు. వాణిజ్య భయాలు తగ్గుతున్నాయన్నారు.

ఎఫ్‌సీలపై డేగ కన్ను

భారీ ఆర్థిక సామ్రాజ్యాల (ఎఫ్‌సీ) విత్త స్థిరత్వంలో రిస్కును ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌ సంక్షోభం ఎత్తిచూపిందని ఆర్‌బీఐ తన నివేదికలో పేర్కొంది. వీటిపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఎఫ్‌సీల్లో కచ్చితమైన రిస్కులుండేందుకు పలు అవకాశాలున్నాయని అభిప్రాయపడింది. ప్రస్తుతం ఎఫ్‌సీల స్థితిగతులను ఐఆర్‌ఎఫ్‌– ఎఫ్‌సీ పర్యవేక్షిస్తోంది. ఐఆర్‌ఎఫ్‌ పర్యవేక్షణ అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఉన్నా, మరింత మెరుగుదల అవసరమని నివేదిక తెలిపింది. ఇకపై అన్ని ఎఫ్‌సీలు త్రైమాసికానికొకసారి తమ వద్ద జరిగిన ఇంటర్‌ గ్రూప్‌ లావాదేవీల డేటాను సమర్పించాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఎఫ్‌సీలకు క్రెడిట్‌ రేటింగ్‌ ఏజన్సీలు ఇచ్చే రేటింగ్‌ ప్రమాణాలపై సెబీ తీసుకువచ్చిన మార్పులు అవసరమని తెలిపింది.

నివేదికలో మరికొన్ని ముఖ్యాంశాలు...

- ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలో భారత బహిర్గత రుణభారం 3.6 శాతం తగ్గి 52,970 కోట్ల డాలర్ల నుంచి 51,040 కోట్ల డాలర్లకు చేరింది
- 2017 సెప్టెంబర్‌తో పోలిస్తే గత సెప్టెంబర్‌ నాటికి ఎన్‌బీఎఫ్‌సీల బాలెన్స్‌ షీటు 17.2 శాతం పెరిగి 26 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ప్రథమార్ధంలో ఈ రంగ నికర లాభంలో 16.2 శాతం వృద్ధి నమోదయింది. ఎన్‌బీఎఫ్‌సీ రంగ స్థూల ఎన్‌పీఏలు 5.8 శాతం నుంచి 6.1 శాతానికి విస్తరించాయి. లోన్సు, అడ్వాన్సుల్లో వరుసగా 16.3, 14.1 శాతం పెరుగుదల నమోదయింది.
- విత్త వ్యవస్థలోని మొత్తం ఆర్థిక లావాదేవీల్లో(ఆర్థిక సంస్థల మధ్యన జరిగే లావాదేవీలు– బైలేటరల్‌ ఎక్స్‌పోజర్స్‌) బ్యాంకుల ద్వైపాక్షిక విత్త లావాదేవీల వాటా 46.5 శాతానికి చేరింది. విత్త వ్యవస్థలో ఇలాంటి ద్వైపాక్షిక విత్తలావాదేవీలు అవసరం, కానీ కొన్ని సార్లు ఈ తరహా లావాదేవీలు అనుకోని రిస్కులు వ్యాపించేందుకు కారణమవుతుంటాయి.
- నియంత్రణా సంస్థల మధ్య మరింత సహకారం అవసరం. నియంత్రణా సంస్థలు కలిసికట్టుగా పని తీరు కనబరిస్తే చట్టాల్లోని లోపాలను అడ్డుపెట్టుకొని ఆటలాడే సంస్థల ఆట కట్టించవచ్చు.

జియో, ఆర్‌కామ్‌ ఒప్పంద గడువు పొడిగింపు

టెలికం శాఖ అభ్యంతరాలే కారణం



న్యూఢిల్లీ: వైర్‌లెస్‌ ఆస్తుల విక్రయానికి సంబంధించి కుదుర్చుకున్న ఒప్పందం గడువును పొడిగించుకుంటున్నట్లు ఆర్‌కామ్, జియో ప్రకటించాయి. ఆర్‌కామ్‌కు చెందిన స్పెక్ట్రం డీల్‌కు టెలికం శాఖ నుంచి అనుమతులు రాని నేపథ్యంలో ఈ డీల్‌ను పొడిగించుకోవాలని ఇరు కంపెనీలు నిర్ణయించుకున్నాయి. ''రిలయన్స్‌ కమ్యూనికేషన్స్‌తో కుదుర్చుకున్న ఆస్తుల కొనుగోలు ఒప్పంద కాలపరిమితిని 2019 జూన్‌ 28 వరకు ఆర్‌జియో పొడిగించుకుంది''అని రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ సోమవారం ప్రకటించింది. ప్రభుత్వపరమైన అన్ని రకాల అనుమతులు, ఆమోదాలు, రుణదాతల అంగీకారం పొంది సదరు ఆస్తులపై ఉన్న చిక్కులన్నీ తీరాకే కొనుగోలు జరుగుతుందని తెలిపింది. టవర్లు, ఫైబర్, ఎంసీఎన్, స్పెక్ట్రమ్‌ విక్రయానికి సంబంధించి ఆర్‌జియోతో కుదుర్చుకున్న ఒప్పంద కాలపరిమితిని పొడిగించుకున్నట్లు ఆర్‌కామ్‌ సైతం విడిగా ప్రకటించింది.

పలు సందేహాల నేపథ్యం...

జియోకు స్పెక్ట్రం విక్రయానికి సంబంధించి తమకు నో అబ్జెక్షన్‌ సర్టిఫికెట్‌ను జారీ చేయాలని ఆర్‌కామ్‌ చాలా రోజులుగా టెలికం శాఖను అభ్యర్థిస్తూ వస్తోంది. కానీ ఇరు కంపెనీల మధ్య ఈ డీల్‌కు సంబంధించిన చెల్లింపులపై టెలికం శాఖ పలు సందేహాలు వ్యక్తం చేస్తోంది. వీటిపై సమాధానమిచ్చేందుకు ఆర్‌జియో, ఆర్‌కామ్‌ ప్రతినిధులు ఈ నెలలో టెలికం సెక్రటరీతో సమావేశమయ్యారు. ఈ విషయంలో బ్యాంకు గ్యారెంటీ ఇవ్వాలన్న టెలికం శాఖ డిమాండ్‌ను టెలికం ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు తిరస్కరించినట్లు ఆర్‌కామ్‌ గుర్తు చేసింది. బ్యాంకు గ్యారెంటీ బదులు తమ అనుబంధ సంస్థ ఆర్‌రియల్టీ ద్వారా అవసరమైన కార్పొరేట్‌ గ్యారెంటీ ఇస్తామని తెలిపింది. అందువల్ల ఇక అభ్యంతరాలకు ఎలాంటి అవకాశం లేదని ఆర్‌కామ్‌ పేర్కొంది. టెలికం శాఖ మాత్రం డీల్‌కు ఆమోదముద్ర వేసేందుకు ఇంకా అంగీకరించలేదు. ముఖ్యంగా చెల్లింపుల బకాయిలు, ఇతర చార్జీలపై ఇంకా స్పష్టత రావాలని టెలికం శాఖ భావిస్తోంది. ముఖ్యంగా డీల్‌కు సంబంధించి ఆర్‌కామ్‌కు ఎలాంటి గ్యారెంటీ కూడా ఇవ్వటానికి జియో అంగీకరించలేదు. అందుకని టెలికం శాఖ పలు అనుమానాలు వ్యక్తం చేస్తోంది. దీంతో ఇరు కంపెనీలు ఒప్పంద కాలపరిమితిని పొడిగించుకున్నాయి.

జీఎస్‌టీ తగ్గింపు ఎఫెక్ట్‌... నేటి నుంచి ఇవన్నీ చౌక!



న్యూఢిల్లీ: జనవరి ఒకటి నుంచి 23 వస్తుసేవలపై తగ్గించిన జీఎస్‌టీ రేట్లు అమల్లోకి రానున్నాయి. డిసెంబర్‌ 22న జరిగిన జీఎస్‌టీ కౌన్సిల్‌లో 23 రకాల వస్తు సేవలపై జీఎస్‌టీ శ్లాబులను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ తగ్గింపుతో సామాన్యుడికి అవసరమైన పలు వస్తు సేవల ఖరీదు తగ్గనుంది. పన్ను తగ్గింపుతో సినిమాటికెట్లు, టీవీలు, మానిటర్లు, పవర్‌బ్యాంకులు, నిల్వచేసిన కూరగాయలు ఇకపై చౌకగా లభిస్తాయి.పన్నును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించిన జాబితాలో కప్పీలు, ట్రాన్స్‌మిషన్‌ షాఫ్ట్, పునర్వినియోగ టైర్లు, లిథియం అయాన్‌ పవర్‌ బ్యాంకులు, డిజిటల్‌ కెమెరాలు, వీడియో కెమెరా రికార్డర్‌లు, వీడియో గేమ్‌ పరికరాలున్నాయి. దివ్యాంగుల ఉపకరణాలపై ప్రస్తుతం అమలవుతున్న పన్నును 28 శాతం నుంచి 5 శాతానికి కుదించారు. సరకు రవాణా వాహనాల థర్డ్‌ పార్టీ బీమా ప్రీమియాన్ని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించారు. అత్యల్ప పన్ను శాతమైన 5 శాతం శ్లాబులోఊత కర్ర, ఫ్లైయాష్‌ ఇటుకలు, సహజ బెరడు, చలువరాళ్లను చేర్చారు. పుణ్యక్షేత్రాలకు ప్రభుత్వం సమకూర్చే నాన్‌–షెడ్యూల్డ్, చార్టర్డ్‌ విమానాల సేవలపై 5 శాతం జీఎస్టీ వర్తిస్తుంది. పునర్వినియోగ ఇంధన ఉపకరణాలు, వాటి తయారీపై కూడా 5 శాతం పన్ను విధించారు. శీతలీకరించిన, ప్యాక్‌ చేసిన కూరగాయలతో పాటు రసాయనాలతో భద్రపరచిన, తక్షణం తినడానికి సిద్ధంగా లేని కూరగాయలకు పన్ను మినహాయింపు ఇచ్చారు. జన్‌ధన్‌ యోజన ఖాతాదారులకు బ్యాంకులు అందించే సేవలను కూడా పన్ను పరిధి నుంచి తప్పించారు.

గృహరుణంపై వడ్డీ రాయితీ 2020 మార్చి వరకూ...

- మరో విడత గడువు పొడిగించాలని కేంద్రం నిర్ణయం



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన (అర్బన్‌) పథకం కింద మధ్యాదాయ వర్గాల (ఎంఐజీ) వారికి ఇస్తున్న క్రెడిట్‌ లింక్డ్‌ సబ్సిడీని (సీఎల్‌ఎస్‌ఎస్‌) 2020 మార్చి వరకు పొడిగిస్తున్నట్టు కేంద్ర మంత్రి హర్‌దీప్‌ పూరి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌పై సంతకం కూడా చేసినట్టు చెప్పారు. ఈ పథకం కింద గృహ రుణం తీసుకున్న వారికి రూ.2.67 లక్షల వరకు వడ్డీ సబ్సిడీని ఇస్తారు. డిసెంబర్‌ 30 నాటికి 3,39,713 మంది లబ్ధిదారులు సీఎల్‌ఎస్‌ఎస్‌ను వినియోగించుకున్నట్టు మంత్రి తెలిపారు. తొలుత వడ్డీ రాయితీతో కూడిన రుణ పథకాన్ని 2017 డిసెంబర్‌ వరకు ఏడాది కాల పరిమితితో కేంద్రం తీసుకొచ్చింది. నూతన నిర్మాణం, తిరిగి కొనుగోలు చేసే గృహాల పైనా దీన్ని పొందేందుకు వీలు కల్పించింది. ఆ తర్వాత దీన్ని 2019 మార్చి వరకు పొడిగించింది. తాజాగా దీన్ని మరో ఏడాది పొడిగించేందుకు నిర్ణయించింది. వార్షికంగా రూ.6– 12 లక్షల మధ్య ఆదాయం కలిగిన వారు 20 ఏళ్ల కాలానికి సంబంధించి రూ.9 లక్షల రుణం మొత్తంపై 4 శాతాన్ని రాయితీగా పొందొచ్చు. రూ.12– 18 లక్షల మధ్య ఆదాయం ఉన్న వారికి వడ్డీ రాయితీ మూడు శాతమే లభిస్తుంది.

ఈడీ కేసులో టెక్‌ మహీంద్రాకు ఊరట

ఫిక్స్‌డ్‌ డిపాజిట్ల జప్తు ఉత్తర్వుల నిలిపివేత



హైదరాబాద్‌: ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ కేసులో టెక్నాలజీ సంస్థ టెక్‌ మహీంద్రాకు హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. సత్యం కంప్యూటర్‌ సర్వీసెస్‌కు చెందిన రూ.822 కోట్ల విలువైన ఫిక్స్‌డ్‌ డిపాజిట్లను జప్తు చేయాలన్న ఈడీ ఆదేశాలను నిలుపుదల చేస్తూ హైదరాబాద్‌ హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. మనీ లాండరింగ్‌ కేసులో 2012లో అప్పటి సత్యం కంప్యూటర్స్‌ ఫిక్స్‌డ్‌ డిపాజిట్లను స్తంభింపజేస్తూ ఈడీ తాత్కాలిక ఆదేశాలను జారీ చేసిన సంగతి తెలిసిందే. అక్రమ మార్గంలో వచ్చిన సొమ్ము అన్న ఆరోపణలతో ఈ మొత్తాన్ని ఈడీ జప్తు చేసింది. జస్టిస్‌ వి.రామసుబ్రమణియన్, జస్టిస్‌ జె.ఉమాదేవిల బెంచ్‌ ఈడీ ఆదేశాలను నిలుపుదల చేస్తూ ఆదేశాలిచ్చారు.

ఆ సమయంలో నిధులేవి?

టెక్‌ మహీంద్రా తరఫు న్యాయవాది వివేక్‌ రెడ్డి మాట్లాడుతూ.. '2009లో టెక్‌ మహీంద్రా కొనుగోలు చేసిన సమయంలో సత్యం కంప్యూటర్‌ సర్వీసెస్‌లో నిధులే లేవు. పైగా సత్యంను తిరిగి గాడిలో పెట్టేందుకు మహీంద్రా గ్రూప్‌ నిధులు వెచ్చించాల్సి వచ్చింది. టెక్‌ మహీంద్రా టేక్‌ ఓవర్‌ చేసిన సమయంలో సత్యం కంప్యూటర్స్‌కు ఆదాయమే లేదు. నెగటివ్‌ బ్యాలెన్స్‌ ఉన్నప్పుడు అక్రమ ఆదాయం అన్న ప్రశ్నే తలెత్తదు' అని అన్నారు. ఇదిలావుంటే, బి.రామలింగ రాజు, ఆయన అనుచరులు అక్రమంగా కంపెనీ షేరు ధరను పెంచి, వాటిని విక్రయంతోపాటు తనఖా పెట్టారని ఈడీ చెబుతోంది. బినామీ కంపెనీల నుంచి పొందిన రూ.2,171.45 కోట్ల రుణాల్లో రూ.822 కోట్లు సత్యం కంప్యూటర్స్‌లోకి వచ్చిచేరాయి. వీటిని రోజువారీ వ్యయాలు, వేతనాలకు ఖర్చు చేసినట్టుగా ఈడీ గుర్తించింది.

సుప్రీంకు వెళతాం..

హైకోర్టు ఉత్తర్వులను సవాల్‌ చేస్తూ సుప్రీంను ఆశ్రయించే అవకాశం ఉందని ఈడీ తరఫు న్యాయవాది పి.వి.పి.సురేష్‌ కుమార్‌ వెల్లడించారు. సీబీఐ ప్రత్యేక కోర్టు రామలింగ రాజు, ఆయన సోదరులను దోషులుగా బోనులో నిలబెట్టడాన్ని బలమైన కారణంగా ఉన్నత న్యాయ స్థానం ముందు చూపెడతామని అన్నారు. 'దోషిగా నిలబెట్టడం విషయంలో ఐపీసీ నిబంధనలకు, మనీ లాండరింగ్‌ యాక్టుకు మధ్య ప్రతికూలతలు ఉన్నాయి. ఇలాంటి సందర్భంలో ఈడీ అటాచ్‌మెంట్‌ ఉత్తర్వులు చెల్లుబాటు అవుతాయి. ఇదే సరైనది కూడా' అని సురేష్‌ కుమార్‌ స్పష్టం చేశారు. కాగా, కేసు పూర్వాపరాలు ఏమంటే.. ఈడీ అటాచ్‌మెంట్‌ ఆర్డర్‌పై సింగిల్‌ బెంచ్‌ జడ్జ్‌ గతంలో స్టే విధించారు. దీనిని సవాల్‌ చేస్తూ డివిజన్‌ బెంచ్‌ ముందు ఈడీ రిట్‌ అప్పీల్‌ చేసింది. ఈడీ విన్నపం నిబంధనలకు విరుద్ధమంటూ 2014 డిసెంబరు 31న కేసును కొట్టివేసింది.

మూడు నెలల్లో రెండు రైల్వే ఐపీఓలు!

- మూడు నెలల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- డిజిన్వెస్ట్‌మెంట్‌ లక్ష్య సాధనకు ప్రభుత్వం యత్నాలు
- దీన్లో భాగంగా రైల్వే వికాస్‌ నిగమ్‌ ద్వారా రూ.500 కోట్లు
- ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా రూ.1,000 కోట్లు సమీకరణ!!



ముంబై: రైల్వేలకు చెందిన రెండు అనుబంధ కంపెనీలు ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఐపీఓకు (ఇనీషియల్‌ పబ్లిక్‌ ఆఫర్‌) వచ్చే అవకాశాలున్నాయి. వచ్చే మూడు నెలల్లో రైల్వేకి చెందిన ఇండియన్‌ రైల్వే ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ (ఐఆర్‌ఎఫ్‌సీ), రైల్‌ వికాస్‌ నిగమ్‌ లిమిటెడ్‌ (ఆర్‌వీఎన్‌ఎల్‌) ఐపీఓలను తేవాలని, ఈ రెండు కంపెనీల్లో కనీసం పది శాతం వాటాను విక్రయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆర్‌వీఎన్‌ఎల్‌ ఐపీఓ ద్వారా రూ.500 కోట్లు, ఐఆర్‌ఎఫ్‌సీ ఐపీఓ ద్వారా రూ.1,000 కోట్ల వరకూ నిధులు సమీకరించే అవకాశముంది. మరోవైపు ఇండియన్‌ రైల్వే కేటరింగ్‌ అండ్‌ టూరిజం కార్పొరేషన్‌ (ఐఆర్‌సీటీసీ) ఐపీఓ వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఉండొచ్చని అంచనా.

ఇప్పటికే రెండు రైల్వే ఐపీఓలు...

ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయం (డిజిన్వెస్ట్‌మెంట్‌) ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.80,000 కోట్లు సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఇప్పటిదాకా (గత నెల 11 నాటికి) రూ.34,000 కోట్ల మేర మాత్రమే సమీకరించగలిగింది. లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరో మూడు నెలల్లో రూ.46,000 కోట్లు సమీకరించాలి. దీంతో ప్రభుత్వం వివిధ ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాను ఫాలో ఆన్‌ ఆఫర్ల (ఎఫ్‌పీఓ) ద్వారా విక్రయించడం, ఇంతవరకూ స్టాక్‌ మార్కెట్లో లిస్ట్‌ కాని ప్రభుత్వ రంగ సంస్థలను ఐపీఓకు అనుమతించడం దీంట్లో భాగమే. రైల్వేల నుంచి ఇప్పటికే రైట్స్, ఇర్కాన్‌ ఇంటర్నేషనల్‌ ఐపీఓలు వచ్చాయి. వీటికి ఇన్వెస్టర్ల నుంచి స్పందన బాగానే ఉంది. రైట్స్‌ ఐపీఓ 67 రెట్లు, ఇర్కాన్‌ ఐపీఓ 10 రెట్లు చొప్పున ఓవర్‌ సబ్‌స్క్రైబయ్యాయి. ఈ రెండు కంపెనీలు చెరో రూ.466 కోట్ల మేర సమీకరించాయి.

ఆర్‌వీఎన్‌ఎల్‌ ఇష్యూ సైజు రూ.500 కోట్లు...

హై స్పీడ్‌ రైల్‌ ప్రాజెక్టులకు కావలసిన మౌలిక సదుపాయాల నిర్మాణానికి స్పెషల్‌ పర్పస్‌ వెహికల్‌గా (ఎస్‌పీవీ) రైల్‌ వికాస్‌ నిగమ్‌ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. ఐపీఓకు రావడానికి ఇప్పటికే ఈ కంపెనీ సెబీ నుంచి ఆమోదం పొందింది. ఐపీఓలో భాగంగా 10 శాతం వాటాకు సమానమైన 2.08 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేస్తుంది.

ఆకర్షణీయ రైల్వే కంపెనీ.. ఐఆర్‌ఎఫ్‌సీ...

ఇండియన్‌ రైల్వే ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ (ఐఆర్‌ఎఫ్‌సీ) రూ.6,392 కోట్ల పన్ను బాధ్యతను కంపెనీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గత ఏడాది ఆరంభంలోనే రద్దు చేసింది. ఈ పన్ను బాధ్యత రద్దు వల్ల ఐఆర్‌ఎఫ్‌సీ నెట్‌వర్త్‌ పెరిగింది. దీంతో నెట్‌వర్త్‌కు పది రెట్ల రుణాన్ని సమీకరించే వెసులుబాటు ఈ కంపెనీకి లభించింది. ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా రూ.1,000 కోట్ల మేర నిధులు సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. అన్ని రైల్వే అనుబంధ కంపెనీల కంటే ఐఆర్‌ఎఫ్‌సీయే అత్యంత ఆకర్షణీయ కంపెనీ అని, మార్కెట్‌ పరిస్థితులు ఎలా ఉన్నా, ఈ ఐపీఓకు మంచి స్పందన ఉండగలదని అంచనా. 2018, మార్చినాటికి ఈ కంపెనీ ఆస్తులు 1.52 లక్షల కోట్లు.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఐఆర్‌సీటీసీ ఐపీఓ

ఇండియన్‌ రైల్వే కేటరింగ్‌ అండ్‌ టూరిజం కార్పొరేషన్‌ (ఐఆర్‌సీటీసీ) ఐపీఓ వచ్చే ఆర్థిక సంవత్సరంలో వచ్చే అవకాశాలున్నాయి. ఈ ఐపీఓ కూడా ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఉండాలని ఆర్థిక శాఖ వర్గాలు పట్టుబట్టాయి. అయితే వేల్యూయేషన్‌ సంబంధిత సమస్యల కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే ఈ ఐపీఓ ఉంటుందని రైల్వే మంత్రి గోయల్‌ స్పష్టం చేశారు. పెద్ద నోట్ల రద్దుతో ఆన్‌లైన్‌ టికెట్ల బుకింగ్‌పై సర్వీస్‌ చార్జీని ప్రభుత్వం రద్దు చేసింది. ఫలితంగా ఈ కంపెనీకి ఏడాదికి రూ.500 కోట్ల ఆదాయం తగ్గిందని అంచనా. దీంట్లో రూ.80 కోట్లే ఆర్థిక శాఖ సర్దుబాటు చేయగలిగింది. కాగా గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ స్థూల లాభం 3 శాతం వృద్ధితో రూ.341 కోట్లకు చేరింది. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్లో ప్రకటనలను అనుమతించడం, డేటా మానిటైజేషన్, ఈ–ఆక్షనింగ్, రిటైల్‌ మేనేజ్‌మెంట్‌ కారణంగా ఈ స్థాయి లాభం వచ్చింది. రైల్‌ నీర్‌ కారణంగా ఆదాయంలో 4.2 శాతం, కేటరింగ్‌ వ్యాపారం కారణంగా ఆదాయంలో 22 శాతం పెరుగుదల నమోదైందని రైల్వే ఉన్నతాధికారొకరు చెప్పారు.

ఒడిదుడుకుల వీడ్కోలు

రూపాయి బలపడినా... 2018వ సంవత్సరానికి చివరి రోజైన సోమవారం స్టాక్ మార్కెట్లు అక్కడక్కడే ముగిశాయి. సూచీలు మిశ్రమంగా 2018కి వీడ్కోలు పలికాయి. దీంతో మూడు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. బీఎస్ఈ సెన్సెక్స్ 8 పాయింట్లు పతనమై 36,068 పాయింట్ల వద్ద, నిఫ్టీ 3 పాయింట్లు పెరిగి 10,863 పాయింట్ల వద్ద ముగిశాయి. లోహ, ఫార్మా షేర్లు లాభపడగా, ఆర్థిక రంగ షేర్లు నష్టపోయాయి.

- మూడు రోజుల లాభాలకు బ్రేక్
- మిశ్రమంగా విదేశీ మార్కెట్లు
- తీవ్ర హెచ్చుతగ్గుల్లో సూచీలు
- 8 పాయింట్లు తగ్గి 36,068కు సెన్సెక్స్
- 3 పాయింట్లు పెరిగి 10,863కు నిఫ్టీ



252 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్

అమెరికా– చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు సడలగలవనే సానుకూల అంతర్జాతీయ సంకేతాల నేపథ్యంలో సోమవారం సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. అయితే అంతర్జాతీయ ఆర్థిక వృద్ధిపై ఆందోళన నెలకొనడం, ఆసియా, యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో స్టాక్ సూచీలు లాభ, నష్టాల మధ్య కదలాడాయి. సెన్సెక్స్ ఒక దశలో 209 పాయింట్లు లాభపడగా, మరో దశలో 43 పాయింట్లు పతనమైంది. మొత్తం మీద రోజంతా 252 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఇక నిఫ్టీ ఒక దశలో 64 పాయింట్లు వరకూ లాభపడింది.

రూ.7.25 లక్షల కోట్ల సంపద ఆవిరి

గత ఏడాది సెన్సెక్స్‌పెరిగినా, ఇన్వెస్టర్ల సంపద మాత్రం తగ్గింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ విలువ రూ.7.25 లక్షల కోట్లు తగ్గి రూ.1,44,48,466 కోట్లకు పడిపోయింది.

మూడో ఏడూ లాభాల్లోనే..

ఏడాది పరంగా చూస్తే స్టాక్ మార్కెట్ లాభాల్లోనే ముగిసింది. స్టాక్ సూచీలు వరుసగా మూడో ఏడాదీ లాభపడ్డాయి. 2018లో సెన్సెక్స్ 2,011 పాయింట్లు (6 శాతం), నిఫ్టీ 332 పాయింట్లు(3.2 శాతం) చొప్పున పెరిగాయి.

చిత్తయిన చిన్న షేర్లు

గత ఏడాది సెన్సెక్స్ 6%పెరిగినా, చిన్న షేర్లు మాత్రం చిత్తయ్యాయి. చిన్నషేర్లకు ప్రాతినిధ్యం వహించే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 4,524 పాయింట్లు(24%), బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2,384 పాయింట్లు (13%) చొప్పున పతనమయ్యాయి. నిబంధనల్లో మార్పులు, 2017లో వేల్యూయేషన్లు అధికంగా ఉండటం, స్టాక్ మార్కెట్ తీవ్రమైన హెచ్చుతగ్గులు దీనికి ప్రధాన కారణాలు.

స్టాక్ మార్కెట్ డేటా

టర్నోవర్ (రూ. కోట్లలో)	
బీఎస్ఈ	1,827
ఎన్ఎస్ఈ	22,049
ఎన్ఎస్ఈ (డెరివే.)	4,12,149
ఎఫ్ఐఐ	- 327
డీఐఐ	322

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
JSWSTEEL	307.5	3.15
TATASTEEL	521	1.59
VEDL	202.15	1.38
TATAMOTORS	173.05	1.29
SUNPHARMA	430.15	1.16
TECHM	721.65	1.07
INDUSINDBK	1,599.85	1.05
KOTAKBANK	1,253.00	0.94
HINDALCO	225.5	0.89
GAIL	359.1	0.79

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
INFRATEL	258.9	-1.56
BHARTIARTL	312.3	-1.34
HINDPETRO	253.1	-1.09
HEROMOTOCO	3,090.00	-1.04
AXISBANK	619.9	-0.82
NTPC	148.7	-0.77
HDFC	1,965.00	-0.76
IOC	137.2	-0.72
MARUTI	7,452.00	-0.71
COALINDIA	240.75	-0.64

కీలక పరిశ్రమల వృద్ధి వేగానికి బ్రేకులు

నవంబర్‌లో 3.5%.. 16 నెలల కనిష్ట స్థాయి



న్యూఢిల్లీ: పారిశ్రామికోత్పత్తిలో భాగమైన ఎనిమిది ప్రధాన రంగాల వృద్ధి నవంబర్‌లో 16 నెలల కనిష్ట స్థాయి 3.5 శాతానికి పరిమితమయింది. ముడి చమురు, ఎరువుల ఉత్పత్తిలో క్షీణత ఇందుకు కారణం. గతంలో 2017 జూలైలో ఈ రంగాల వృద్ధి రేటు అత్యంత తక్కువగా 2.9 శాతం నమోదైంది. ఆ తర్వాత ఇంత తక్కువ తిరిగి 2018 నవంబర్ నెలలోనే కావడం గమనార్హం.

- మౌలిక రంగాలు... బొగ్గు, ముడి చమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్ వృద్ధి నవంబర్‌లో 6.9 శాతంగా నమోదైంది.
- ముడి చమురు ఉత్పత్తి 3.5 శాతం మేర, ఎరువుల తయారీ 8.1 శాతం మేర ప్రతికూల వృద్ధిని నమోదు చేశాయి.
- సహజవాయువు 0.50 శాతం, రిఫైనరీ ఉత్పత్తులు 2.3 శాతం, స్టీల్ 6 శాతం, సిమెంట్ 8.8 శాతం మేర వృద్ధి చెందాయి. ఇది తక్కువ వృద్ధి రేటు. మొత్తం పారిశ్రామికోత్పత్తి రేటులో ఈ కీలక పరిశ్రమల వాటా 41 శాతంగా ఉంది.
- బొగ్గు, విద్యుత్ రంగాలు మాత్రం 3.7 శాతం, 5.4 శాతం చొప్పున వృద్ధి చెందాయి. అంతకుముందు ఏడాది ఇదే నెలలో ఈ వృద్ధి 0.7 శాతం, 3.9 శాతమే కావడం గమనార్హం.
- 2018 ఏప్రిల్–నవంబర్ మధ్య ఎనిమిది కీలక రంగాల వృద్ధి రేటు 5.1 శాతంగా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో ఈ వృద్ధి 3.9 శాతంతో పోలిస్తే పెరిగింది.

ద్రవ్యలోటుకు ఆర్‌బీఐ మిగులు నిల్వలు అక్కర్లేదు: జైట్లీ



న్యూఢిల్లీ: ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించుకునేందుకు ఆర్‌బీఐ మిగులు నిల్వలు అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలతో పోలిస్తే నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి ద్రవ్యలోటు నిర్వహణ విషయంలో మెరుగైన ట్రాక్ రికార్డు ఉందన్నారు. రెండో విడత మధ్యంతర నిధుల అవసరాలపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా జైట్లీ మాట్లాడారు. ప్రభుత్వరంగ బ్యాంకుల రీక్యాపిటలైజేషన్‌కు, పేదరిక నిర్మూలనకు ఆర్‌బీఐ మిగులు నిల్వలు వినియోగించాలని అభిప్రాయపడ్డారు. రూ.85,948 కోట్ల అదనపు ఖర్చులకు గాను లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఇందులో రూ.41,000 కోట్లను ప్రభుత్వరంగ బ్యాంకులకు నిధుల సాయంగా అందించనున్నారు. ఎయిర్ ఇండియాకు రూ.2,345 కోట్లు అందనున్నాయి.

అమ్మకానికి ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ ఆస్తులు



న్యూఢిల్లీ: రుణభారం తగ్గించుకునే క్రమంలో ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ సంస్థ మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రూప్‌నకు చెందిన పలు ఆస్తులను అమ్మకానికి పెట్టింది. ముంబై, కోల్‌కతాల్లోని నివాస, వాణిజ్య సముదాయాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్నవారి నుంచి బిడ్లను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. మలబార్ హిల్‌లోని 1,376 చదరపు అడుగుల నివాస స్థలంతో పాటు ముంబైలోని మూడు వాణిజ్య ఆస్తులు, కోల్‌కతాలోని ఒక కమర్షియల్ అసెట్‌ను అమ్మకానికి ఉంచింది. ఆసక్తి ఉన్న వారు జనవరి 15లోపు బిడ్లు దాఖలు చేయాలని సూచించింది. ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ గ్రూప్‌నకు దాదాపు రూ.91వేల కోట్ల రూపాయల రుణభారం ఉంది.

4 పీఎస్‌బీలకు రూ. 10,882 కోట్లు



న్యూఢిల్లీ: నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకులకు 10,882 కోట్ల రూపాయల మూలధన సాయాన్ని ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. గతంలో ప్రకటించిన రూ. 28,615 కోట్ల సాయంలో భాగంగా ఈ మొత్తాన్ని అందించారు. తాజాగా సాయం పొందిన బ్యాంకుల్లో యూకో బ్యాంకు(రూ. 3,074 కోట్లు), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(రూ. 4,498 కోట్లు), సిండికేట్ బ్యాంకు(రూ. 1,632 కోట్లు), సెంట్రల్ బ్యాంకు(రూ. 1,678 కోట్లు) ఉన్నాయి. ఇప్పటికే బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, ఓబీసీలకు ప్రభుత్వం దాదాపు రూ. 18వేల కోట్ల రూపాయల మూలధన సాయం అందించింది. రీక్యాప్ బాండ్ల ద్వారా ఈ సాయాన్ని ప్రభుత్వం అందిస్తోంది.

ముగిసిన శిఖాశర్మ పదవీకాలం

నేటి నుంచి కొత్త ఎండీ, సీఈవోగా అమితాబ్



న్యూఢిల్లీ: యాక్సిస్ బ్యాంకు ఎండీ, సీఈవోగా శిఖా శర్మ పదవీ విరమణ తీసుకున్నారు. డిసెంబర్ 31తో బ్యాంకు సేవల నుంచి ఆమె రిటైర్ అయినట్టు బ్యాంకు ప్రకటించింది. జనవరి 1 నుంచి నూతన ఎండీ, సీఈవోగా అమితాబ్ చౌదరి వ్యవహరిస్తారని పేర్కొంది. అమితాబ్ చౌదరి హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి ఎండీ, సీఈవోగా వ్యవహరించారు. శిఖాశర్మను నాలుగో విడత బ్యాంకు ఎండీ, సీఈవో పదవులకు 2018 జూన్ నుంచి నియమిస్తూ యాక్సిస్ బ్యాంకు బోర్డు గతంలో నిర్ణయం తీసుకోగా, దీనిపై ఆర్‌బీఐ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దీంతో శిఖా శర్మ తన పదవీ కాలాన్ని డిసెంబర్ వరకే పరిమితం చేసుకున్నారు.

స్టాక్స్‌లో మరిన్ని పెట్టుబడులు... ఈపీఎఫ్‌వో సభ్యులకు అవకాశం

న్యూఢిల్లీ: ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యులు నూతన సంవత్సరంలో తమ భవిష్య నిధిలో మరింత మొత్తాన్ని స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసుకునే అవకాశాలు రానున్నాయి. ప్రస్తుతం సభ్యులకు సంబంధించి 15 శాతం నిధులను ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేస్తోంది. ఈ మొత్తం రూ.55,000 కోట్లుగా ఉన్నాయి. అయితే, సభ్యుల ఖాతాల్లో మాత్రం పొదుపు మొత్తాన్ని ఒకటే బ్యాలన్స్‌గా చూపిస్తున్నారు. నగదు, ఈటీఎఫ్‌లను వేర్వేరుగా చూపించడం లేదు. దీంతో ఈపీఎఫ్‌వో ఓ నూతన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ సాఫ్ట్‌వేర్ ఈటీఎఫ్ యూనిట్లు, నగదును సభ్యుల ఖాతాల్లో వేర్వేరుగా చూపించనుంది. ఆ తర్వాత విడిగా సభ్యులకు స్టాక్స్‌లో పెట్టుబడులు మరింత పెంచుకునేందుకు, తగ్గించుకునే ఆప్షన్ ఇవ్వనున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

3 రెట్లు పెరిగిన ఎన్‌సీడీ నిధులు

న్యూఢిల్లీ: భారత కంపెనీలు నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా గత ఏడాది రూ.29,300 కోట్లు సమీకరించాయి. అంతకు ముందటి సంవత్సరంలో ఎన్‌సీడీల ద్వారా సమీకరించిన నిధులు రూ.9,779 కోట్లతో పోలిస్తే ఇది మూడు రెట్లు అదనంజ ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు కార్పొరేట్ రుణాలపై శీతకన్ను వేయడం వల్ల కంపెనీలు ఎన్‌సీడీల వైపు మొగ్గు చూపాయని డబ్ల్యూజీసీ వెల్త్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ రాజేశ్ చెరువు పేర్కొన్నారు. విస్తరణ కార్యకలాపాలకు, రుణ భారం తగ్గించుకోవడానికి, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు కంపెనీలు ఎన్‌సీడీల ద్వారా నిధులను సమీకరించాయి.

దేశీ ఈ కామర్స్ సంస్థలకూ అవే నిబంధనలు...

అమలుకు సీఏఐటీ డిమాండ్...



న్యూఢిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో (ఎఫ్‌డీఐ) కూడిన ఈ కామర్స్ సంస్థలకు సంబంధించిన నిబంధనలను దేశీయ ఈ కామర్స్ సంస్థలకూ అమలు చేయడం ద్వారా, అనైతిక వ్యాపార విధానాలకు పాల్పడకుండా నిరోధించాలని అఖిల భారత వర్తకుల సంఘం (సీఏఐటీ) డిమాండ్ చేసింది. ఇందుకు సంబంధించిన విధానాన్ని వెంటనే విడుదల చేయాలని కోరుతూ కేంద్ర వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభుకు లేఖ రాసింది. ఈ కామర్స్ రంగానికి సంబంధించిన విధానంపై వాణిజ్య శాఖ పనిచేస్తుండగా... త్వరలోనే దాన్ని విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో సీఏఐటీ లేఖ రాయడం గమనార్హం. ''నూతన విధానంలో పేర్కొన్న ఎఫ్‌డీఐ నిబంధనలు దేశీయ ఈ కామర్స్ సంస్థలకూ వర్తింపజేయాలి. అనైతిక వ్యాపార ధోరణలను అనుసరించకుండా నిరోధించాలి. వాటిని ఇతర ఈ కామర్స్ సంస్థలతో సమానంగా చూడాలి'' అని సీఏఐటీ కోరింది. ఈ రంగానికి స్వతంత్ర నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలని కూడా డిమాండ్ చేసింది. కొన్ని సంఘాలు ఎఫ్‌డీఐ నిబంధనలను తప్పుబడుతున్నాయని, ఎటువంటి ఒత్తిళ్లకు లొంగవద్దని కోరింది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి విదేశీ ఈ కామర్స్ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లపై, తమ వాటాలు కలిగిన కంపెనీల ఉత్పత్తులను విక్రయించకుండా, ప్రత్యేకమైన మార్కెటింగ్ ఒప్పందాలతో ఉత్పత్తులను మార్కెట్ చేయకుండా ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించిన విషయం విదితమే. అయితే త్వరలోనే ఈ–కామర్స్‌లోకి రావటానికి ప్రయత్నాలు చేస్తున్న రిలయన్స్ వంటి సంస్థలకు ఈ పరిణామం లాభించవచ్చనే అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో దేశీ సంస్థలకూ ఇవే నిబంధనలు వర్తింపజేయాలని వర్తకుల సంఘం డిమాండ్ చేస్తోంది.

హెచ్‌డీఎఫ్‌సీ రుణ రేట్లు స్వల్పంగా పెంపు

న్యూఢిల్లీ: ఇళ్ల రుణాలిచ్చే అతిపెద్ద సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ గృహ రుణాలపై 10 బేసిస్ పాయింట్లు (0.10 శాతం) పెంచింది. పలు శ్లాబులపై కొత్త రేట్లు 8.90–9.15 శాతం మధ్యలో ఉండనున్నాయి. గృహ రుణాలకు బెంచ్ మార్క్‌గా పరిగణించే ఆర్‌పీఎల్‌ఆర్‌ను జనవరి 1 నుంచి పది బేసిస్ పాయింట్ల చొప్పున పెంచుతున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ ప్రకటించింది.



బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	32,190
బంగారం (99.5, 10గ్రా)	30,670
వెండి (కిలో)	41,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	31,680
బంగారం (22 క్యారెట్లు)	30,170
వెండి (కిలో)	41,500
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	31,680
బంగారం (22 క్యారెట్లు)	30,170
వెండి (కిలో)	41,500
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	32,500
బంగారం (22 క్యారెట్లు)	30,110
వెండి (కిలో)	39,400
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	32,410
బంగారం (22 క్యారెట్లు)	30,140
వెండి (కిలో)	39,500
విజయవాడ	
బంగారం(24 క్యారెట్లు)	32,650
బంగారం (22 క్యారెట్లు)	30,100
వెండి (కిలో)	39,400
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	32,620
బంగారం (22 క్యారెట్లు)	30,170
వెండి (కిలో)	39,400

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

టైర్ల రంగం ఏటా 7-9 శాతం వృద్ధి

రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



ముంబై: టైర్ల డిమాండ్ ఐదేళ్ల పాటు ఏటా 7–9 శాతం చొప్పున వృద్ధి చెందగలదని, దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమపై ఉన్న సానుకూల అంచనాలే దీనికి కారణమని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. ఇదే కాలంలో సామర్థ్య విస్తరణపై టైర్ల పరిశ్రమ రూ.20,000 కోట్ల మేర పెట్టుబడులు పెడుతుందని పేర్కొంది. ముడి చమురు ధరలు తగ్గడం, సహజ రబ్బర్ ధరలు స్థిరంగా ఉండడం వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ భాగంలో మార్జిన్లు మెరుగుపడతాయని తన నివేదికలో పేర్కొంది. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్‌గా ఉండగా, 2021 నాటికి మూడో స్థానానికి చేరుతుందని ఇక్రా అంచనా వ్యక్తం చేసింది. ఏటా 5.9 శాతం చొప్పున ఈ రంగం వృద్ధి చెందుతూ 2026 నాటికి –251.4– 282.8 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుందని అభిప్రాయపడింది. కేరళ వరదలు, రుణాల కఠినతరం, బీమాకు సంబంధించి నియంత్రణపరమైన మార్పులు, వడ్డీ రేట్ల పెరుగుదల, ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావం (ఐదేళ్ల బీమా) డిమాండ్‌పై చూపించినప్పటికీ... ఇప్పటి వరకు చూసుకుంటే మొత్తం మీద చాలా విభాగాల్లో అమ్మకాలు బలంగానే ఉన్నాయని, ఇది టైర్ల డిమాండ్ వృద్ధికి ప్రయోజనం కలిగిస్తుందని పేర్కొంది.

స్టీల్ వినియోగంలో 7 శాతం పెరుగుదల

రేటింగ్ సంస్థ ఇక్రా వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయ స్టీల్ వినియోగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు 2019–20లోనూ 7 శాతానికి పైగా పెరుగుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టడమే దీనికి కారణమని పేర్కొంది. ముఖ్యంగా అందుబాటు ధరల్లో ఇళ్లు, విద్యుత్ పంపిణీ, రైల్వేలకు 2018–19 బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చినందున, మధ్య కాలంలో దేశీయంగా స్టీల్ వినియోగ వృద్ధి సానుకూలంగా ఉంటుందని, దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7 శాతం వృద్ధి నమోదవడమే కాకుండా, రానున్న ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్థాయిలో వృద్ధికి అవకాశం ఉంటుందని ఇక్రా అంచనా వేసింది. డిమాండ్ ఆశాజనకంగానే ఉన్నప్పటికీ... దేశీయ స్టీల్ పరిశ్రమ ఉత్పత్తి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.5– 3 శాతం మధ్యే ఉండొచ్చని, చౌక దిగుమతులే ఇందుకు కారణమని పేర్కొంది. చైనా స్టీల్ డిమాండ్ మితంగానే ఉండడం, అధిక సరఫరా పరిస్థితులు సమీప కాలంలో ఈ రంగానికి సవాళ్లని అంచనా వేసింది. మరీ ముఖ్యంగా, అంతర్జాతీయ మార్కెట్లో స్టీల్ ధరలు గణనీయంగా తగ్గడంతో దిగుమతులు చౌకగా మారాయని, ఈ రకమైన దిగుమతులు దేశీయ మార్కెట్‌కు చేరడం మొదలైతే దేశీయంగా ధరలపై అధిక ఒత్తిడి ఉంటుందని పేర్కొంది.

బ్రీఫ్స్

• టయోటా కిర్లోస్కర్ సేల్స్ 10% అప్

గతేడాది డిసెంబర్ వాహన అమ్మకాలు 11,830 యూనిట్లుగా కంపెనీ ప్రకటించింది. అంతకుముందు ఏడాది ఇదే నెలలో నమోదైన 10,793 యూనిట్లతో పోల్చితే 10 శాతం వృద్ధి చెందినట్లు వెల్లడించింది. ఈ ఏడాది మొత్తంగా 1,51,474 యూనిట్లను విక్రయించగా.. 2017తో పోలిస్తే ఇది 9 శాతం అధికమని సంస్థ డిప్యూటీ ఎండీ ఎన్ రాజా తెలిపారు.

• థిస్సెన్‌క్రప్ ఎండీగా వివేక్ భాటియా

జర్మనీకి చెందిన థిస్సెన్‌క్రప్ ఇండస్ట్రీస్‌కు చెందిన భారత అనుబంధ సంస్థ థిస్సెన్‌క్రప్ ఇండియాకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా వివేక్ భాటియా నియమితులయ్యారు. జనవరి ఒకటి నుంచి ఈయన నూతన పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇంతకుముందు భాటియా సంస్థ ఏసియా పెసిఫిక్ విభాగానికి సీఈఓగా సేవలందించారు.

• ఎల్ అండ్ టీకి మరో భారీ ఆర్డర్

లార్సన్ అండ్ టూబ్రో అనుబంధ సంస్థ ఎల్ అండ్ టీ కన్‌స్ట్రక్షన్స్ రూ.2,084 కోట్ల ఆర్డర్‌ను చేజిక్కించుకుంది. ఈ సంస్థకు చెందిన విద్యుత్ ప్రసార, పంపిణీ వ్యాపార విభాగం.. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్స్ (ఈపీసీ) ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు వెల్లడించింది.

• బీహెచ్ఈఎల్‌కు రూ.3,500 కోట్ల ఆర్డర్



ప్రభుత్వ రంగ సంస్థ బీహెచ్ఈఎల్.. సోమవారం భారీ ఆర్డర్‌ను దక్కించుకుంది. పశ్చిమబెంగాల్‌లో 660 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు నిమిత్తం అక్కడి అభివృద్ధి సంస్థ నుంచి ఆర్డర్ పొందినట్లు వెల్లడించింది.

• సీఏఐ అధ్యక్షునిగా అతుల్ ఎస్ గణతంత్ర

కాటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఏఐ) ప్రెసిడెంట్‌గా మరోసారి అతుల్ ఎస్ గణతంత్ర ఎన్నికయ్యారు. గతవారం జరిగిన బోర్డ్ సమావేశంలో డైరెక్టర్లు ఈయనను ఎన్నుకున్నట్లు వెల్లడైంది. ఇక వైస్ ప్రెసిడెంట్‌గా భూపేంద్ర సింగ్ రాజ్‌పాల్ ఎన్నికయ్యారు.

• అలహాబాద్ బ్యాంకుతో ఎస్‌బీఐ లైఫ్ ఒప్పందం

ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా సేవలను అలహాబాద్ బ్యాంకు శాఖల నుంచి అందుకోవచ్చని బ్యాంక్ సీఈఓ మల్లికార్జున రావు ప్రకటించారు. తమ 3,238 శాఖల్లో ఎస్‌బీఐ లైఫ్ బీమా ఉత్పత్తులను అందించే విధంగా ఇరు సంస్థల మధ్య సోమవారం ఒక ఒప్పందం కుదిరిందని తెలిపారు.

• యూఎస్ఎఫ్‌డీఏ నుంచి లుపిన్‌కు అనుమతి

క్లోబాజమ్ ఓరల్ సస్పెన్షన్ మార్కెటింగ్‌కు అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి సోమవారం అనుమతి లభించినట్లు లుపిన్ ప్రకటించింది.

• మైక్రో ఫైనాన్స్ రుణాల్లో 9 శాతం వృద్ధి

సెప్టెంబర్ త్రైమాసికంలో మైక్రో ఫైనాన్స్ సంస్థల స్థూల రుణ పోర్ట్‌ఫోలియో రూ.63,081 కోట్లకు చేరినట్టు మైక్రోఫైనాన్స్ సంస్థల అసోసియేషన్ 'సాధన్' తన నివేదికలో తెలిపింది. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే 9 శాతం వృద్ధిగా పేర్కొంది. కర్ణాటక, బిహార్, పశ్చిమబెంగాల్, యూపీ, ఒడిశా రుణాల పరంగా టాప్–5లో ఉన్నాయని పేర్కొంది.

టెక్నాలజీతోనే బీమా పరిశ్రమ వృద్ధి

- రానున్న సంవత్సరాల్లోనూ పెరుగుదల వేగవంతం
- పరిశ్రమ నిపుణుల అంచనా



న్యూఢిల్లీ: బీమా పరిశ్రమ వృద్ధికి టెక్నాలజీ అండగా నిలుస్తోంది. కొత్త కస్టమర్లను చేరుకునేందుకు టెక్నాలజీని అవి వినియోగించుకుంటున్నాయి. పూర్తి స్థాయి సంస్కరణలు, సులువుగా అర్థం చేసుకునే ఉత్పత్తులను ప్రవేశపెట్టినప్పటికీ... ఇప్పటికీ తక్కువ బీమా రక్షణే ఉన్న దేశంలో మరింత మంది కస్టమర్లను సొంతం చేసుకునేందుకు కంపెనీలకు టెక్నాలజీ ఉపయోపడుతోంది. హెచ్ఐవీ, మానసిక అనారోగ్యాలనూ బీమా పరిధిలోకి చేర్చడం, దీర్ఘకాలిక థర్డ్ పార్టీ మోటారు ఇన్సూరెన్స్‌ను తప్పనిసరి చేయడం గతేడాది సంస్కరణల్లో భాగంగా ఉన్నాయి. అంతేకాదు, పేదల కోసం ఆయుష్మాన్ భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓ ఆరోగ్యబీమా పథకాన్ని కూడా తీసుకొచ్చింది. 2018లో కూడా ఆన్‌లైన్ విక్రయాల్లో బలమైన వృద్ధి నమోదైనట్టు కెనరా హెచ్ఎస్‌బీసీ ఓబీసీ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో అనుజ్‌మాథుర్ తెలిపారు. పెద్ద ఎత్తున డిజిటైజేషన్, వినియోగదారు అనుకూల ఉత్పత్తులను తీసుకురావడం ఈ వృద్ధికి దోహదపడినట్టు చెప్పారు. పాయింట్ ఆఫ్ సేల్ ఉత్పత్తులు, ఇతర చానళ్లను వినియోగించుకోవడం ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జీవిత బీమా ఉత్పత్తుల విస్తరణ పెరిగినట్టు తెలిపారు. రానున్న సంవత్సరాల్లో ఆరోగ్య బీమా పరంగా వినూత్నమైన, కస్టమర్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ప్రత్యేకమైన పాలసీలు రానున్నాయని మాథుర్ అంచనా వేశారు. పారదర్శకత పెంపు దిశగా ఐఆర్‌డీఏ తీసుకున్న చర్యలతో రానున్న సంవత్సరాల్లోనూ పరిశ్రమ వృద్ధి కొనసాగిస్తుందని హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఈడీ సురేష్ బాదామి తెలిపారు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	45.20 (రాత్రి 11.30కు)	$45.33 (శుక్రవారం ముగింపు)
బ్రెంట్	53.24 (రాత్రి 11.30కు)	$53.21 (శుక్రవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 01-01-209

విశాఖ	458–00
చిత్తూరు	438–00
వరంగల్	441–00
చెన్నై	445–00
ముంబై	494–00
విజయవాడ	453–00
నమక్కల్	430–00
గోదావరి	453–00
31–12–2018 ఫామ్ ధర...	
హైదరాబాద్	439–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	5.00
బెంగళూరు	445–00
కోల్‌కత్త	492–00
ఢిల్లీ	460–00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	387.7	387.4
ASIAN PAINT	1373.05	1366
AXIS BANK L	619.9	625.05
BAJAJ AUTO	2720.15	2717.5
BAJAJ FINSE	6476.95	6502.9
BAJAJ FINAN	2645.15	2634.8
BHARTI AIRT	312.5	316.55
BHARAT PETR	362.75	361.9
CIPLA LTD	519.5	522
COAL INDIA	240.75	242.3
EICHER MOTO	23158.35	23124.1
GAIL (INDIA	360.3	356.3
GRASIM INDU	825.6	824.6
HCL TECHNOL	964.35	958.35
HDFC LTD	1968.35	1979.95
HDFC BANK L	2121.7	2122.9
HERO MOTOCO	3104.25	3122.6
HINDALCO I	226.2	223.5
HPCL	253.25	255.9
HUL	1819.65	1822.05
INDIABULLS	853.85	849.25
ICICI BANK	360.15	360.75
INDUSIND BA	1599.3	1583.25
BHARTI INFR	259	263
INFOSYS LIM	658.95	656.95
INDIAN OIL	137.05	138.2
ITC LTD	281.65	282.25
JSW STEEL L	306.75	298.1
KOTAK MAHIN	1256.5	1241.35
LARSEN & T	1437.55	1439.4
MAHINDRA &M	803.85	803.55
MARUTI SUZU	7465.5	7505.55
NTPC LTD	149.05	149.85
OIL AND NAT	149.9	150.5
POWER GRID	198.65	197.05
RIL	1121.25	1125.55
SBI	295.9	294.8
SUN PHARMAC	430.5	425.2
TATA MOTORS	172.7	170.85
TATA STEEL	521.05	512.85
TATA CONSUL	1893.05	1896.05
TECH MAHIND	723.15	714
TITAN COMPA	931	922.7
ULTRATECH C	3990.95	4004.95
UPL LIMITED	758.25	758.4
VEDANTA LIM	202.2	199.4
WIPRO LTD	330.85	330.05
YES BANK LI	181.8	181.45
ZEE ENTERTA	476.45	474.45

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1336.75	1313.3
ADITYA BIRL	100	99.9
ACC LIMITED	1508.1	1479.7
AMBUJA CEME	225.1	220.95
ASHOK LEYLA	102.5	102.75
BANDHAN BAN	550.15	535.85
BANK OF BAR	118.8	118.35
BHARAT ELEC	87.95	87.9
BHEL	73.1	72.05
BIOCON LIMI	629.05	620.8
BOSCH LIMIT	19611.2	19629.75
BRITANNIA I	3115.4	3098.5
CADILA HEAL	348.45	345.3
COLGATE PAL	1343.55	1320.15
CONTAINER C	687.7	670.4
DABUR INDIA	430.65	433.25
DLF LIMITED	177.55	177.95
AVENUE SUPE	1606.65	1654.95
GENERAL INS	259	255.65
GODREJ CONS	810.65	810.85
HAVELLS IND	691.5	690.1
HDFC STAND	387.15	387.35
HINDUSTAN Z	278.65	275.4
ICICI LOMBA	864.45	850.65
ICICI PRU L	324.5	327.9
VODAFONE ID	37.75	37.5
INTERGLOBE	1165.05	1178.5
L&T FINANCE	152.6	154.45
LIC HOUSING	488.7	488.75
LUPIN LIMIT	844.3	840.3
MARICO LIMI	373.4	378.1
UNITED SPIR	635.8	638.65
MOTHERSON S	166.85	162.7
MRF LTD	66984.7	67036.95
NHPC LTD	26	25.95
THE NEW IND	179.75	178
NMDC LTD.	96.85	95.5
ORACLE FIN	3707.75	3660.85
OIL INDIA L	174.8	177.8
PIRAMAL ENT	2381.75	2358.15
PETRONET LN	224.15	226.1
P&G HYGIENE	9884.1	9884.1
PIDILITE IN	1107.85	1101.95
STEEL AUTHO	56.35	54.65
SBI LIFE IN	597.85	598.8
SHREE CEMEN	17236.1	17227.05
SIEMENS LTD	1046.9	1043.35
SHRIRAM TRA	1239.95	1224.45
SUN TV NETW	607.75	615.3

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	7.89	7.9
Alphageo	478.15	477.45
Alu Flouride	123	122.2
Amar Raja Bat	744	736.35
And Bank	29.4	29.5
And Cemen	5.95	5.94
And Paper	444.15	445.35
And Petro	57.4	56.25
Anjani Portl	130	134.95
Aries Agro Ltd	100.1	101.65
Aurobindo Ph	731.4	723.35
Avantel Soft	230	228.9
Avanti Feeds	385.55	388
AvonOrg	6.99	6.69
BN Rathi Sec	27.7	26.1
Bakelite	19.5	18.75
Balaji Amin	460	448.35
Bambino Agro	191.35	194.5
Bartronics	7.39	7.5
Bhagira Chem	452	438.95
Bhagya Nag	32.4	29.6
Bhaskar Agro	18.5	18.4
Brilliant Sec	1.11	1.06
Cont Coffee	269.2	271.55
CoroFert	448.75	449.7
Cosboard Ind	12.96	12.35
Country Club	7.43	7.41
Cubex Tub	14.5	14.3
Cybermate	2.3	2.39
DR Reddy	2617	2622.05
Danlaw Tec	106.6	103.85
DecCement	419.5	402.5
Divi's Lab	1482	1465.85
Divya Granit	90.4	86.45
Dolphin Medi	0.82	0.86
Dredgin Corp	441.15	369.75
Empee Sugars	1.33	1.27
Everest Org	103	105
Fortune Info	39.9	40.5
Four Soft	40.3	33.6
GMR Infra	16.4	16.2
GVK Power	7.74	7.87
Gati Corpn	86.95	86.95
Gayatri Bio	3.22	3.07
Gayatri Proj	175.55	181
Gayatri Sugrs	2.81	2.95
Gennex Lab	3.81	3.7
GodavDru	23.5	22.7
Goldstn Tele	233.45	244.6
Goldstone Tech	16.7	16.8
Granules (I)	89.65	89.7
HBL Nife Pow	28.8	28.75
HYDIndus	2078.6	2051
Heritage Food	527.6	533.3
Hifco Marwel	72.75	69.3
HindFlurocarb	17	17.25
IDL Industrs	291	295.1
IKF Soft	0.31	0.32
IVRCL Infras	0.98	0.98
Incap	42.4	42.4
IndoNationl	715	720
Infotech En	619.05	613.2
JSTL	38	37.55
KCP LTD	92.35	92.3
KNR Constructio	212.55	212.15
KakatiCem	203.6	202.65
Kallam Spg	18.15	18
Kernex Micro	23.9	23.95
Krebs Bio	108.25	109
LGS Global	2.69	2.69
LancoIndus	188.35	187.2
Lokesh Mach	47.85	45.7
Lotus Choc	24.45	25.45
MIC Elec	1.47	1.54
Madhucon Proje	6.66	6.98
Maytas Infra	17.07	17.96
Medinova Dia	17	17.2
Mold-tek	42.5	42.5
Moldtek Plastic	264.75	264
Moschip Semi	25.8	24.85
NCCBlue Wat	3.59	3.42
NCLInd	135.75	134.05
NETTLINX	50	50.4
NMDC Ltd	97.05	95.45
NagarAgrich	27.7	28.45
NagarConst	88.1	86.5
Natco Pharma	680.8	684.2
Nava Bh Ventur	120.5	118.9
Neha Inter	4.89	4.83
Neocure Ther	2.38	2.35
Neuland Lab	459	466.6
Nihar Info Glo	13.65	13
Nile	385	380
Northgate Tech	0.9	0.86
Oil Country	16.58	16.5
Ortin Lab	15.85	15.85
Padmalaya Tele	2.33	2.45
Panyam Cemen	13.4	13.83
PennInd	36.5	36.45
PennProf	3.6	3.6
Phytochem I	49	48.95
Pitti Lamin	72.75	74.7
Pokarna	166.45	161.15
Prajay Engs	9.26	9
PremiExpl	238.8	244.1
Prism Cement	89	88.25
Ragsan Petro	55.2	56.1
Rain Industries	134.25	132.95
Raj Packagin	28.05	28.2
Ram Informat	41.55	40.1
RavilGr	15.3	16
Reg.Ceramic	3.06	2.92
Restile Cer	4.19	4.25
SS Organics	9.45	9.45
Sagar Cem	675	684
Sai Wires(I)	1.18	1.24
Samkrg Pist	192	191.05
Sampre Nutri	39	37.25
SangInd	60.65	60.05
Satvah. Ispat	9.98	9.78
Saven Techno	22.3	21.7
Sibar Auto	38	39.45
SrRayAlk	33.9	32.7
Srinivasa Ship	44.9	42.85
Sujana Towers	1.01	0.97
Surana Tele	4.6	4.65
Suryachakra Pow	0.36	0.36
SuvarCem	66.75	63.6
Suven Pharma	227.35	229.9
TCI Finance	15.35	15.25
Taj Gvk Hotel	175.4	179.8
Tanla Solutions	30.55	30.75
Trans Biotek	3.32	3.31
Transport Co	289.85	289.1
Trendy Knit	0.19	0.19
Usher Agro	2.55	2.53
V&K Soft	4.05	4
VBC Ferro	45.35	43.55
VST Indus	3280	3262.6
Vamshi Rubb	31	33.2
Viceroy Hotels	5.15	4.92
VijayTextil	43.9	41.65
Vimta Labs	314.75	310
Virat Crane	33	32.35
Virinchi Con	82.05	83.05
VisakaInd	428	427.55
Vista Pharma	29	29.5
Vivimed Labs	36.75	37.05
Vjil Consult	39.3	37.45
ZenoTech Lab	37.85	37.3

13 నుంచి అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌కు అనుబంధంగా ఈనెల 13 నుంచి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడించారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లోని పర్యాటక భవన్‌లో సంబంధిత అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. గత ఉత్సవాల్లో వెయ్యి రకాల స్వీట్లు ప్రదర్శించారని, ఈసారి కూడా అదే స్థాయిలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20 దేశాల నుంచి దాదాపు 10 లక్షల మంది పర్యాటకులు ఈ ఉత్సవాలకు హాజరవుతున్నందున.. పక్కాగా ఏర్పాట్లు నిర్వహించాలని ఆదేశించారు.

గ్రేడ్-1 ఆఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని గ్రేడ్–1 హాస్టల్ వెల్ఫేర్ పోస్టుల భర్తీకి డిసెంబర్ 22న నిర్వహించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆయా పోస్టుల్లో నియమిస్తూ టీఎస్‌పీఎస్సీ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పూర్తి వివరాలు www.tspsc.gov.in చూడాలని ఓ ప్రకటనలో సూచించింది.

లైబ్రేరియన్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

సాక్షి, హైదరాబాద్: రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలోని జూనియర్ కాలేజీల్లో లైబ్రేరియన్ పోస్టుల కోసం అభ్యర్థులను ఎంపిక చేసినట్లు టీఎస్‌పీఎస్సీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ 19, 20న నిర్వహించిన ఇంటర్వ్యూల్లో అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొంది. మరిన్ని వివరాలకు www.tspsc.gov.in సందర్శించాలని సూచించింది.

7, 8 తేదీల్లో 'డీఎంఈ ట్యూటర్' వెరిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)లో ట్యూటర్ పోస్టుల భర్తీలో భాగంగా ఎంపికైన అభ్యర్థులకు రెండో దశ సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఈ నెల 7, 8వ తేదీల్లో ఉదయం 10.30 నుంచి హైదరాబాద్‌లోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఈ వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొంది. పూర్తి వివరాలు తమ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించింది.

పంచాయతీ ఎన్నికలకు రూ.50 కోట్లు

సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.50 కోట్లకు పరిపాలనా మంజూరునిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అయ్యే వ్యయం భరించేందుకు ఈ మొత్తానికి మంజూరునిచ్చింది. దీనికి సంబంధించి ఇప్పటికే ఆర్థికశాఖ బడ్జెట్ విడుదల ఉత్తర్వులు (బీఆర్వోలు) జారీ చేసింది. సోమవారం ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులిచ్చారు.

ఏపీలో '108' అంబులెన్సుల కొను'గోల్‌మాల్'

చంద్రబాబుది అవినీతి పాలన: మాజీమంత్రి లక్ష్మారెడ్డి



షాద్‌నగర్‌టౌన్: ఏపీ సీఎం చంద్రబాబు అవినీతి పాలన కొనసాగిస్తున్నారని, '108' అంబులెన్సుల కొనుగోలులో భారీ అవకతవకలు జరిగాయని మాజీమంత్రి లక్ష్మారెడ్డి ఆరోపించారు. సోమవారం టీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలసి మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనావ్యవహారాలపై సీఎం కేసీఆర్ నిజాలు మాట్లాడారని, అవి నచ్చకపోవడంతో ఆంధ్రామంత్రులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. అవినీతిలో కూరుకుపోయిన చంద్రబాబుపై ఎన్నో కేసులు ఉన్నాయని, విచారణ జరగకుండా స్టేలు తెచ్చుకుని చంద్రబాబు బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి టెండర్లను పిలిచి ఒక్కో అంబులెన్సును రూ.15 లక్షలకు కొనుగోలు చేస్తే, చంద్రబాబు ఒక్కో అంబులెన్సును రూ.20 లక్షలకు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు ఆంధ్రా ప్రజల సొమ్మును భారీగా దోచి ఎన్నికల్లో టీటీడీపీ, కాంగ్రెస్ నేతల కోసం తరలించారని ఆరోపించారు.

ఇక ఈఎన్‌టీ పరీక్షలకు సన్నాహాలు..?

- సీఎం ఆదేశాల మేరకు మార్గదర్శకాలపై కసరత్తు
- సమగ్రంగా అధ్యయనం చేయాలని అధికారులకు ఆదేశం
- రెండు కోట్లమంది లబ్ధిపొందవచ్చని అంచనా



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో ఈఎన్‌టీ వైద్య పరీక్షలకు సర్కారు సన్నాహాలు ప్రారంభించింది. 'కంటి వెలుగు'కార్యక్రమం ముగిసిన వెంటనే ప్రజలందరికీ చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) సహా దంత పరీక్షలు జరపాలని సర్కారు నిర్ణయించిన సంగతి విదితమే. దీనిపై సీఎం కేసీఆర్ ఇటీవల వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో ఇటీవల సమీక్ష చేశారు. ఈఎన్‌టీ పరీక్షలు ఎన్నాళ్లు చేయగలం? ఎంతమందికి చేయాలి? ఇందులో సంక్లిష్టమైన సమస్యలు ఏమైనా ఉంటాయా? వంటి అంశాలపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శకాలతో రావాలని ఆయన ఆదేశించినట్లు తెలిసింది. దీంతో అధికారులు ఈ కార్యక్రమంపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. గత ఆగస్టు 15న ప్రారంభమైన 'కంటి వెలుగు'6 నెలల పాటు కొనసాగించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ పథకం 6 నెలలు పూర్తయ్యాక ఈఎన్‌టీ, దంత పరీక్షలు ప్రారంభిస్తారు. అంటే వచ్చే ఏప్రిల్ నుంచి మొదలు కావచ్చని అంటున్నారు. అధికారుల అంచనా మేరకు కనీసం 2 కోట్ల మందికి ఈ పరీక్షలు జరిపే అవకాశముంది. 'కంటి వెలుగు'మాదిరిగా ప్రతీ గ్రామంలోనూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. ఈఎన్‌టీ, దంత స్క్రీనింగ్ చేశాక లోపాలను గుర్తించి వారికి చికిత్స, శస్త్రచికిత్సలు చేస్తారు.కంటి వెలుగు కింద 90% మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేదలే ఉపయోగించుకున్నందున ఈఎన్‌టీ, దంత పరీక్షలూ ఆ వర్గాల వారికే ఉపయోగపడతాయని అంచనా.

ఈఎన్‌టీలో కీలకమైన వ్యాధులు... అవసరమైన చికిత్సలు

కంటి వెలుగు కింద ఇప్పటికే కోటి మందికి పరీక్షలు చేశారు. మరో కోటి మందికి చేసే అవకాశముంది. లక్షలాది మందికి కంటి అద్దాలు ఇచ్చారు. ఈ విధంగానే రెండు కోట్ల మందికి ఈఎన్‌టీ, దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వినికిడి యంత్రాలు అందిస్తారు, ఆపరేషన్లు చేస్తారు. ఈఎన్‌టీలో వేటికి శస్త్రచికిత్సలు చేయాల్సి వస్తుందనే దానిపైనా అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఇక గొంతు క్యాన్సర్ అనేది ఇప్పుడు అనేకమందిని వేధిస్తున్న సమస్య. ఈ కేసులకు చేయాల్సిన చికిత్స, శస్త్రచికిత్సలు, ఇతర ఏర్పాట్లపైనా కసరత్తు జరుగుతోంది. ముక్కుకు చెందిన కొన్ని రకాల వ్యాధులు కూడా చాలా సంక్లిష్టంగా ఉంటున్నాయి. వాటికి చికిత్స చేయడానికి అనువైన వసతులపై కూడా కసరత్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే ఈఎన్‌టీ వైద్యులు, దంత వైద్యులు, నర్సులు, సాంకేతిక నిపుణుల జాబితాను రూపొందిస్తున్నారు. అంతేకాదు లోపాలను సరిదిద్దడం, ఆపరేషన్లు చేయడానికి వీలుగా కొన్ని ప్రైవేటు ఈఎన్‌టీ, దంత ఆసుపత్రులతోనూ ఒప్పందం కుదుర్చుకోవాలని భావిస్తున్నారు. అందుకోసం ఎంత ఖర్చు అవుతుందో తేల్చాలని సర్కారు ఆదేశించింది.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ మంగళవారం
1-1-2019

వెల్‌కమ్ 2019


● చిరంజీవి

యాక్షన్ 2019


● వెంకటేష్ ● నాగార్జున ● రామ్‌చరణ్ ● మహేశ్‌బాబు ● ప్రభాస్ ● అల్లు అర్జున్ ● ఎన్టీఆర్

2019 లగేజ్‌తో పాటు వచ్చి బంజారా హిల్స్‌లో నిలుచుని ఉంది. దాని సూట్‌కేస్‌లో ఏ హీరోకు ఏ సర్‌ప్రైజ్ ఉందో తెలియదు. అది బంగారు నాణేల మూటను ఏ నిర్మాత ముంగిట్లో జార విడుస్తుందో తెలియదు. సక్సెస్ అనే కిరీటాన్ని ఏ దర్శకుడి తలుపు తట్టి అతడి శిరస్సున ఉంచుతుందో తెలియదు. ఏ కొత్త అందాలను ముంబై నుంచి టికెట్లు బుక్ చేసి రప్పిస్తుందో తెలియదు. ఏ పాత చరిత్రలను బయోపిక్‌ల పేరుతో తిరగతోడుతుందో తెలియదు. మనకు తెలిసిందల్లా ఆశ పెట్టుకోవడమే.

భవిష్యత్తుపై ఆశ పెట్టుకోవడమే.

తెలుగు సినీ ఇండస్ట్రీకి 2019లో అంతా మంచే జరుగుతుందని నమ్మి ముందుకు అడుగు వేయడమే.

2018 కాలబిలంలోకి జారిపోయింది.

2019 కాలరెత్తుకొని అడుగుపెట్టింది.

ఈ సంవత్సరం తెలుగు సినిమాను కళకళలాడించడానికి ఎవరెవరు ఏయే సినిమాలు చేస్తున్నారు? హ్యాపీ న్యూ ఇయర్ చెప్పుకుంటూ ఆ హ్యాపీ న్యూస్‌లు తెలుసుకుందాం.

చిరంజీవి... తెలుగు హీరోలలో ధృవతార చిరంజీవి. తెలుగు స్వాతంత్ర్య యోధులలో పోరాట తార ఉయ్యాలవాడ నరసింహారెడ్డి. మరి వీరిద్దరూ కలిస్తే వెండితెర ఎటువంటి వెలుగులు విరజిమ్మాలి? ఎంతటి కాంతితో నిండిపోవాలి? 2019 అటువంటి సినిమా 'సైరా: నరసింహారెడ్డి'ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. దాదాపు 200 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ సినిమాను సౌతిండియాలో అన్ని భాషల్లో రిలీజ్ చేయనున్నట్టు టీజర్ రిలీజ్ ఫంక్షన్‌లో నిర్మాత రామ్‌చరణ్ చెప్పారు. అయితే సినిమా పోస్ట్‌ప్రొడక్షన్‌లో క్వాలిటీ కోసం మరింత శ్రమిస్తున్నారని టాక్. అందుకే ముందు అనుకున్నట్లు వేసవిలో కాకుండా కొంచెం లేట్‌గా ఈ సినిమా రావచ్చని తెలుస్తోంది. బహుశా జూన్ జూలైలో కావచ్చు. ఈ సినిమా తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో చిరంజీవి ఓ సినిమా చేయనున్నారు. దీనికి డీవీవీ దానయ్య నిర్మాత. కొరటాల శివ దర్శకత్వంలో కూడా చిరంజీవి ఓ సినిమా చేయనున్నారనే ప్రచారం జరుగుతోంది. మరి ఏది ముందో ఏది తర్వాతో కూడా ఈ సంవత్సరంలోనే తేలనుంది.



బాలకృష్ణ... 2019 ఒక ముఖ్యమైన బయోపిక్‌ను తెలుగువారికి అందించనుంది. తెలుగు ప్రేక్షకుల ఆరాధ్యదైవం ఎన్.టి.ఆర్ బయోపిక్‌ను అది తెర మీదకు తేనుంది. మొదట కొన్ని సర్దుబాట్లు, మార్పులు జరిగినా దర్శకునిగా క్రిష్ రంగప్రవేశం తర్వాత నిరాటంకంగా ఈ సినిమా షూటింగ్ జరుపుకుని విడుదలకు సిద్ధమైంది. ఇందులో హీరోగా నటించిన బాలకృష్ణకు సంక్రాంతి సెంటిమెంట్ ఉంది. సంక్రాంతికి హిట్ కొట్టడం బాలకృష్ణకు ఆనవాయితీ. ఆ వరుసలో ఈ సినిమా కూడా హిట్ అవుతుందని ఆశిద్దాం. 'యన్.టి.ఆర్–కథానాయకుడు' జనవరి 9న విడుదల, రెండోభాగం 'యన్.టి.ఆర్ మహానాయకుడు' ఫ్రిబవరి 7న రిలీజ్.

నాగార్జున... రాంగోపాల్ వర్మ, నాగార్జున కాంబినేషన్ 1990లో సక్సెస్ అయినంతగా 2018లో కాలేదు. వారి కాంబినేషన్‌లో వచ్చిన 'ఆఫీసర్' నిరుత్సాహపరిచింది. అయితే నానితో కలిసి నాగ్ చేసిన మల్టీస్టారర్ 'దేవదాస్' ఆడియన్స్ దగ్గర ఒప్పుకోలు పొందింది. ప్రస్తుతం నాగార్జున 'బ్రహ్మాస్త్ర' అనే హిందీ చిత్రంతో పాటు తమిళ హీరో ధనుశ్‌తో ఓ మల్టీస్టారర్‌లో నటిస్తున్నారు. 'మన్మథుడు' సీక్వెల్‌లో నాగార్జున నటించనున్నారని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. 'సోగ్గాడే చిన్ని నాయనా' ప్రీక్వెల్‌లో కూడా నటించనున్నారు. 2019లో ఈ రెండు చిత్రాలతో బిజీ.

వెంకటేష్... 2018 వెంకటేష్‌కు ఏ కెరీర్ జ్ఞాపకమూ మిగల్చలేదు. ఎందుకంటే ఆయన సినిమా ఏదీ రాలేదు. ఆ కొసరు ఈ సంవత్సరం అసలు అంతా కలిపి ఇవ్వదలుచుకున్నారాయన. అందుకే 'ఎఫ్ 2'తో జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. నాగచైతన్యతో 'వెంకీమామ' చేయనున్నారు. అలాగే నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో ఓ సినిమా ఉంటుందట. బొమ్మరిల్లు భాస్కర్ కూడా ఓ కథ చెప్పారట. ఇలా 2019లో వెంకీ డైరీ ఖాళీ లేదు.

రాజశేఖర్... 'పీఎస్వీ గరుడవేగ: 126.18ఎమ్' సినిమాతో హిట్ బ్యాక్ ఇచ్చారు రాజశేఖర్. ఇప్పుడు 'కల్కి' అనే డిఫరెంట్ జానర్ సినిమా చేస్తున్నారు. యాభై శాతానికి పైగా చిత్రీకరణ పూర్తయిందని టాక్. దీనికి దర్శకుడు ప్రశాంత్ వర్మ.

రవితేజ... 2018 రవితేజకు పెద్దగా అచ్చి రాలేదు. ఆ సంవత్సరం రిలీజైన 'టచ్ చేసి చూడు, నేలటిక్కెట్టు, అమర్ అక్బర్ ఆంటొని' మిశ్రమ ఫలితాలే ఇచ్చాయి. 2019 ఆయనకు సత్ఫలితాలు ఇస్తుందని ఆశిద్దాం. వీఐ ఆనంద్ దర్శకత్వంలో 'డిస్కో రాజా' (వర్కింగ్ టైటిల్) అనే సినిమా చేయనున్నారు రవితేజ. చిత్రీకరణ త్వరలో ప్రారంభం అవుతుంది.

గోపీచంద్... 2018లో గోపీచంద్ 'పంతం'తో తెరపైకి వచ్చారు. ప్రస్తుతం తమిళ దర్శకుడు తిరుతో చేతులు కలిపి ఓ స్పై థ్రిల్లర్‌ను ప్లాన్ చేశారు. ఈ నెలలో చిత్రీకరణ మొదలవుతుంది.

కల్యాణ్ రామ్... 'ఎమ్మెల్యే', 'నా నువ్వే..' ఈ ఏడాది కల్యాణ్‌రామ్ హీరోగా వచ్చిన చిత్రాలివి. ఇప్పుడు ఆయన '118' అనే థ్రిల్లర్ మూవీలో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా టీజర్ విడుదలైంది. ఈ సినిమా కూడా జనవరి లేదా ఫ్రిబవరిలో విడుదల అవుతుందని ఊహించవచ్చు.

శర్వానంద్... ఈ ఏడాదిలో 'పడి పడి లేచె మనసు' అనే ప్రేమకథతో థియేటర్స్‌లోకి వచ్చారు శర్వానంద్. ప్రస్తుతం సుధీర్‌వర్మ దర్శకత్వంలో హీరోగా ఓ సినిమా చేస్తున్నారు శర్వానంద్. ఈ సినిమా వచ్చే ఏడాది మొదట్లో విడుదల కానుంది. అలాగే తమిళ్ హిట్ '96' చిత్రంలో ఆయన హీరోగా నటించబోతున్నారని తాజా టాక్.

రామ్... 'హలో గురు ప్రేమకోసమే..' సినిమాతో ప్రేక్షకులకు హలో చెప్పారు రామ్. ప్రస్తుతం పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ఆయన హీరోగా నటించనున్నారు. ఈ సినిమాను సమ్మర్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

మహేశ్‌బాబు... 'భరత్ అనే నేను' సినిమాతో బంపర్ హిట్ అందుకున్న మహేశ్‌బాబు ప్రస్తుతం 'మహర్షి'లో నటిస్తున్నారు. న్యూ ఇయర్ సందర్భంగా ఈ సినిమా సెకండ్ లుక్‌ని విడుదల చేశారు. ఏప్రిల్ 5న చిత్రం విడుదల కానుంది. దీని తర్వాత సుకుమార్ దర్శకత్వంలో నటించనున్నారు. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తారని టాక్.

ప్రభాస్.. చూడగా 'సాహో'కు 2019 రాసి పెట్టినట్టుంది. 2018లో విడుదల కావాల్సిన ఈ చిత్రం యాక్షన్ సన్నివేశాలకు మరింత పెద్ద పీట వేయడంతో క్వాలిటీ పరంగా ఎక్కువ శ్రద్ధ పెట్టడంతో 2019కి సిద్ధమవనుంది. ఆగస్టు 15న విడుదల. రాధాకృష్ణకుమార్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'జాన్' (వర్కింగ్ టైటిల్) ఈ సంవత్సరం సెకండాఫ్‌లో రిలీజ్ కానుంది. సో.. 2019కి డబుల్ ట్రీట్ ఇస్తారు ప్రభాస్.

ఎన్టీఆర్... 2018లో 'అరవిందసమేత వీర రాఘవ' సినిమాతో థియేటర్స్‌లోకి వచ్చిన ఎన్టీఆర్ ప్రస్తుతం 'ఆర్ఆర్ఆర్' (వర్కింగ్ టైటిల్) సినిమాలో ఒక కథానాయకుడిగా నటిస్తున్నారు. అశ్వనీదత్ బ్యానర్‌లో ఎన్టీఆర్ ఓ సినిమా కమిట్ అయ్యారు. దీనికి అట్లీ దర్శకుడని టాక్.

రామ్‌చరణ్... 'రంగస్థలం'తో కెరీర్‌లోనే బ్లాక్ బస్టర్ హిట్‌ను ఖాతాలో వేసుకున్నారు రామ్‌చరణ్. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'వినయ విధేయ రామ' జనవరి 11న విడుదల కానుంది. ఇక రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆర్ఆర్ఆర్' సినిమాలో రామ్‌చరణ్ ఒక హీరోగా నటిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు కొరటాల శివ దర్శకత్వంలో ఓ సినిమా అనౌన్స్ చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. 2019 ఆయనకు ఉత్సాహ భరితంగా ఉండనుంది.

అల్లు అర్జున్... ఎప్పటినుంచో తన నెక్ట్స్ చిత్రం గురించి ఉన్న సస్పెన్స్‌కు న్యూ ఇయర్ సందర్భంగా తెరదించారు అల్లు అర్జున్. త్రివిక్రమ్ దర్శకత్వంలో హీరోగా నటించనున్నట్లు వెల్లడించారు. గీతా ఆర్ట్స్, హారిక అండ్ హాసిని సంస్థ అధినేతలు అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలలో ప్రారంభం కానుంది. మిగతా వివరాలను త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం పేర్కొంది. ఇంతకుముందు అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో 'జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి' వంటి విజయవంతమైన చిత్రాలు వచ్చాయి. దీంతో వీరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాపై అంచనాలు ఉన్నాయి.


● మమ్ముట్టి

బయోపిక్స్

బయోపిక్స్ హవా టాలీవుడ్‌లో పెరిగింది. 2019లో మహానేత వైయస్సార్ బయోపిక్ 'యాత్ర', ఎన్టీఆర్ బయోపిక్ (కథానాయకుడు, మహానాయకుడు) ఆల్రెడీ రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ జీవితం ఆధారంగా 'తెలంగాణ దేవుడు', 'ఉద్యమసింహం' అనే సినిమాలు రూపొందుతున్నాయి. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ బయోపిక్ రెడీ అవుతోంది. తమిళనాడులో ఎంజీఆర్, జయలలిత బయోపిక్‌లను అనౌన్స్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీవితం ఆధారంగా 'చంద్రోదయం' అనే సినిమా వస్తోంది. ప్రముఖ దర్శకుడు విశ్వనాథ్ జీవితం ఆధారంగా 'విశ్వదర్శనం' అనే బయోపిక్, ప్రముఖ సంగీత విద్వాంసుడు ఘంటసాల జీవితం ఆధారంగా 'ఘంటసాల: ది గ్రేట్' బయోపిక్‌లు తెరకెక్కుతున్నాయి. నటుడు కాంతారావు బయోపిక్, మల్లయోధుడు కోడి రామ్మూర్తి, నటి కన్నాంబ బయోపిక్‌లు తెరపైకి రానున్నాయని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

ప్రస్తుతం సాయిధరమ్ తేజ్ 'చిత్రలహరి'లో నటిస్తున్నారు. తేజ దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఓ సినిమా చేస్తున్నారు. సందీప్ కిషన్ 'నిను వీడను నీడను నేనే' చేస్తున్నారు. ఈ సినిమాకు సందీప్ ఓ నిర్మాత కూడా. నిఖిల్ 'ముద్ర'లో నటిస్తున్నారు. నారా రోహిత్ 'శబ్దం', 'అనగనగా దక్షిణాదిలో' సినిమాల్లో 2019లో కనిపించవచ్చు. అడవి శేష్ ప్రస్తుతం '2 స్టేట్స్'లో, పీవీపీ బేనర్‌లో ఓ థ్రిల్లర్‌లో నటిస్తున్నారు. 'గూఢచారి'కి సీక్వెల్‌ను కూడా అనౌన్స్ చేశారు. ఆది పినిశెట్టి 'ఆర్ఎక్స్ 100' తమిళ రీమేక్‌లో నటించనున్నారు. 'విజేత' చిత్రంతో హీరోగా పరిచయమైన చిరంజీవి చిన్న అల్లుడు కల్యాణ్ దేవ్ ప్రస్తుతం పులి వాసు దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. సాయిధరమ్ తమ్ముడు వైష్ణవ్ తేజ్ ఈ ఏడాది హీరోగా పరిచయం కానున్నారు. సుకుమార్ అసిస్టెంట్ బుచ్చిబాబు ఈ చిత్రానికి దర్శకుడు.

రజనీకాంత్... 2018 రజనీకాంత్‌కు రెండు సినిమాలను ఇచ్చింది. 'కాలా', '2.ఓ'. అభిమానులకు ఈ సంగతి ఆనందమే అయినా ఫలితాల విషయంలో నిజంగా అంత ఆనందంగా లేరు. వారికి కావాల్సిన సిసలైన రజనీ స్టైల్ మాస్ ఫిల్మ్ గత సంవత్సరం పడలేదనే చెప్పాలి. 2019 ఆ వెలితి తీర్చవచ్చు. ఆయన హంగామా చేసిన సినిమా 'పేట' జనవరి 10న విడుదల కానుంది. ఇందులోని గెటప్స్, ట్రైలర్ ఇప్పటికే కుతూహలం రేపుతున్నాయి. సినిమా కూడా ఆ లెవల్‌లోనే ఉండొచ్చు. దీని తర్వాత మురుగదాస్ దర్శకత్వంలో రజనీ సినిమా ఉండబోతోంది. ఆ సినిమా కూడా 2019లోనే రిలీజ్ కావచ్చు.

కమల్ హాసన్... 'విశ్వరూపం 2' ఒక్కటే కమల్‌హాసన్‌కు 2018లో రిలీజ్. కానీ ఆ సినిమా ఆయనకు పెద్దగా కలిసి రాలేదు. ఇప్పుడు 'ఇండియన్ 2' చిత్రానికి ప్రిపేర్ అవుతున్నారు. అలాగే పెండింగ్‌లో పడ్డ 'శభాష్‌నాయుడు' (తెలుగు టైటిల్) కూడా పూర్తి కావాల్సి ఉంది. ఈ చిత్రానికి కమలే దర్శకుడు. ఇందులో కమల్ కూతురిగా రియల్ లైఫ్ డాటర్ శ్రుతీహాసన్ నటిస్తున్నారు.

నితిన్... 2018లో నితిన్ 'ఛల్ మోహన్‌రంగ', 'శ్రీనివాస కల్యాణం' రెండు చిత్రాల్లో కనిపించారు. ప్రస్తుతం నితిన్ 'భీష్మ' అనే సినిమా చేస్తున్నారు. వెంకీ కుడుముల దర్శకుడు. అలాగే తమిళంలో హిట్ సాధించిన 'రాక్షసన్' అనే సినిమా తెలుగు రీమేక్‌లో నితిన్ నటించనున్నారని సమాచారం. ఈ సినిమా రీమేక్స్ రైట్స్‌ను కూడా నితిన్ సొంతం చేసుకున్నారట. సుధీర్‌వర్మ దర్శకుడని టాక్.

రానా... ఈ ఏడాది రానా సిల్వర్‌స్క్రీన్‌పైకి రాలేదని బాధపడాల్సిన అవసరం లేదు. 2019లో కనీసం మూడు నెలలకోసారి రానాను చూడొచ్చు. అలా ప్లాన్ చేశారు ఆయన. ఆయన హీరోగా నటిస్తున్న 'అరణ్య', '1945' సినిమాల చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. అలాగే 'హిరణ్య కశ్యప' అనే సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారాయన. ఎన్టీఆర్ బయోపిక్, హిందీ చిత్రం 'హౌస్‌ఫుల్ 4'లో క్యారెక్టర్స్ చేశారు రానా.

నాగచైతన్య... 2019లో భార్య సమంతాతో కలిసి 'మజిలీ' సినిమాలో నటిస్తున్నారు నాగచైతన్య. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్‌లో విడుదల కానుంది. ఈ సినిమా కాకుండా వెంకటేష్‌తో కలిసి 'వెంకీమామ' అనే మల్టీస్టారర్ మూవీకి కమిట్ అయ్యారు. కేఎస్. రవీంద్ర ఈ సినిమాకు దర్శకుడు.

వరుణ్ తేజ్... 2019ని మల్టీస్టారర్ మూవీ 'ఎఫ్2'తో స్టార్ట్ చేయనున్నారు వరుణ్ తేజ్. ఇందులో వెంకటేశ్ మరో హీరో. ఆ నెక్ట్స్ కిరణ్ కొర్రపాటి దర్శకత్వంలో వరుణ్ తేజ్ ఓ సినిమా కమిట్ అయ్యారు. సాగర్‌చంద్ర దర్శకత్వంలో ఓ సినిమా అనౌన్స్ అయిన విషయం గుర్తుండే ఉంటుంది.


● నాని

'మళ్ళీరావా...' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో నాని నటిస్తున్న 'జెర్సీ'. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను సోమవారం విడుదల చేశారు. 1990ల బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా ఉంటుంది. క్రికెటర్ అర్జున్ పాత్రలో నాని నటిస్తున్నారు. పీడీవీ ప్రసాద్, సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్‌లో విడుదల కానుంది. నెక్ట్స్ 'మనం', '24' చిత్రాల ఫేమ్ విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా అనౌన్స్ చేశారు. ఇంకా అవసరాల శ్రీనివాస్, చంద్రశేఖర్ ఏలేటి, మోహన్ కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వాల్లో నాని సినిమాలు చేయనున్నారట.

విజయ్ దేవరకొండ... విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న 'డియర్ కామ్రేడ్' ఈ సమ్మర్‌లో విడుదల కానుంది. క్రాంతి మాధవ్ దర్శకత్వంలో ఓ సినిమా కమిట్ అయ్యారాయన. అలాగే మైత్రీమూవీ మేకర్స్‌లో మరో సినిమా, నిర్మాత అశ్వనీదత్ బ్యానర్‌లో రెండు ప్రాజెక్ట్‌లు కమిట్ అయ్యారు.

అఖిల్... అఖిల్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'మిస్టర్ మజ్ను'. ఈ సినిమా జనవరి 25న విడుదల కానుంది. ఆ నెక్ట్స్ తెలుగు, హిందీ భాషల్లో రూపొందే ఓ సినిమాలో అఖిల్ నటించనున్నారని టాక్.

ముగ్గు-ముచ్చట

19 చుక్కలు .. 19 వరుసలు




మద్దుల పద్మావతి, కొత్తపేట, తెనాలి

22 చుక్కలు, 6 వరుసలు, అటు ఇటు వదిలి 6 వరకు



హసిత ఉన్నవ, విద్యానగర్, హైదరాబాద్

19 చుక్కలు, 19 వరుసలు



కట్టమూరి సుభాషిణి, గుంటూరు

ముగ్గులకు ఆహ్వానం ... ముగ్గులు పంపవలసిన చిరునామా= ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com

పాశుర ప్రభాతం 17వ రోజు



గాలి కనబడదు. కానీ అదే శ్వాసగా సకల ప్రాణికోటిని జీవింపజేస్తుంది. జీవితం మనదే అయినా దానిని నడిపించే భగవంతుడే జీవాత్మ. పరమాత్మ.

అమ్బరమే, తణ్ణీరే, శోరే, అరమ్ శెయ్యుమ్
ఎమ్బెరుమాన్! నన్దగోపాలా! ఎళున్దిరాయ్;
కొమ్బనార్కెల్లామ్ కొళున్దే, కులవిళక్కే!
ఎమ్బెరుమాట్టి! యశోదాయ్! అరివురాయ్,
అమ్బర మూడరుత్తోఙ్గి యులగళన్ద
ఉమ్బర్ కోమానే! ఉరఙ్గాదెళున్దిరాయ్,
శెమ్ పాఱ్కళలడిచ్చెల్వా! బలదేవా!
ఉమ్బియుమ్ నీయు మురఙ్గేలో రెమ్బావాయ్.

భావం: అడిగినదే తడవుగా ఆదరించే మహోన్నతుడు శ్రీకృష్ణుడు. ఎవరేది అడిగినా ఫలాపేక్ష లేక దానం చేసే ఉత్తముడు నందగోపాలుడు. అవసరాన్ని గమనించి అనుగ్రహించే ఉదాత్తుడు యశోదానందనుడు. శ్రీకృష్ణా! స్వామీ! మేల్కొనుము. యదుకుల శోభను ఇనుమడింపజేసే యశోదాదేవీ నిద్ర మేల్కొనుము. ఇంతింతై వటుడింతై అన్నట్లు భూమ్యాకాశాలను ఆక్రమించిన త్రివిక్రమా! నీవే ఇంకా నిదురిస్తే లోకమంతా కళావిహీనమైనట్లు అనిపిస్తుంది. బలరామా! శ్రీకృష్ణా! ఇరువురూ మేల్కొని మాకందరికీ మార్గదర్శకం చూపించండని గోపికలు ప్రభాత స్వాగతం తెలుపుతున్నారు.


● పెళ్లికూతురి వెంట ప్రభాస్


● చేతిలోన చెయ్యేసి...


● కార్తికేయ, పూజా ప్రసాద్‌లతో రామ్‌చరణ్, ఉపాసన...

రాజమౌళి తనయుడు కార్తికేయ, జగపతిబాబు సోదరుని కుమార్తె పూజా ప్రసాద్‌ల వివాహం ఆదివారం రాజస్థాన్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు టాలీవుడ్ యాక్టర్స్ చాలామంది హాజరయ్యారు. సంగీత్‌లో తమిళ్ చిత్రం ‘వేదాళమ్’లోని ‘ఆలూమా డోలుమా’ సాంగ్‌కు ఎన్టీఆర్, రామ్‌చరణ్, రాజమౌళి డ్యాన్స్ చేయడం హైలైట్‌గా నిలిచింది. అలాగే పెళ్లి కూతుర్ని ప్రభాస్ పక్కనే ఉండి మండపం వరకూ తీసుకువచ్చే వీడియో వైరల్‌గా మారింది. మూడు రోజుల పాటు ఈ వివాహ వేడుకలు రాజస్థానీ స్టైల్‌లో జరిగాయి.


● విద్యాబాలన్

అప్పటినుంచి నాకు నచ్చినట్లు నేనుంటున్నాను

నటుడు, మాజీ ముఖ్యమంత్రి యన్.టి. రామారావు జీవితం ఆధారంగా ఆయన తనయుడు బాలకృష్ణ నటించి, నిర్మించిన చిత్రం ‘యన్.టి.ఆర్’. క్రిష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం రెండు భాగాలుగా (కథానాయకుడు, మహానాయకుడు) రూపొందింది. యన్.టి. రామారావు భార్య బసవతారకం పాత్రను విద్యాబాలన్ పోషించారు. ఈ చిత్రం జనవరి 9న రిలీజ్ కానుంది. నేడు విద్యాబాలన్ బర్త్‌డే. ఈ సందర్భంగా ఆమె పలు విశేషాలు పంచుకున్నారు.

● బర్త్‌డే స్పెషల్ అంటూ ఏమీ లేదు. ఈసారి తెలుగు సినిమా చేశానంతే. ఇంతకు ముందు కూడా చాలా తెలుగు సినిమాలు ఆఫర్ చేశారు. కొత్త భాషలోకి పరిచయం అవుతున్నాం అంటే ఆ పాత్ర ఎంతో ఎగ్జైటింగ్‌గా, చాలెంజింగ్‌గా ఉండాలి. విబ్రీ మీడియా విష్ణుగారు ‘యన్.టి.ఆర్’ సినిమా అవుట్ లైన్ చెప్పినప్పుడు నేనిది కచ్చితంగా చేయాలి అనుకున్నాను. నా 9 ఏళ్ల వయసులో హైదరాబాద్‌లో మా మామయ్య వాళ్ల ఇంటికి వచ్చినప్పుడు ఫస్ట్ టైమ్ రామారావుగారి గురించి విన్నాను.

● ఇంతకు ముందు నేను రియల్ లైఫ్ క్యారెక్టర్స్ పోషించాను. కానీ ఈ పాత్రకు సంబంధించి ఎక్కువ ఇన్‌ఫర్మేషన్ బయట లేదు. రామారావుగారి కుటుంబ సభ్యులతో మాట్లాడటమే ఎక్కువ ప్రిపరేషన్. బాలకృష్ణగారితోనూ కథను బాగా డిస్కస్ చేసుకున్నాం. దర్శకుడు క్రిష్‌గారు అన్నీ ఈజీ చేసేశారు. సీన్స్ ఎలా అప్రోచ్ అవ్వాలో చూపించారు. దర్శకుల మీద డిపెండ్ అయ్యాను. దర్శకుల ఇన్‌పుట్స్, యాక్టర్స్ యాక్టింగ్ కెపాసిటీ విడివిడిగా ఉండవని నా అభిప్రాయం. ఇదంతా ఓ ప్రాసెస్.

● షూటింగ్ టైమ్‌లో నా డైలాగ్స్ నేనే చెప్పుకున్నాను. డబ్బింగ్ చెప్పుకోవాలని ముందే అనుకున్నాను. కానీ నా తెలుగు భాషలో కొంచెం అర్బన్ స్టైల్ కనిపిస్తుంది. తారకమ్మ చాలా స్వచ్ఛమైన, అచ్చ తెలుగు మాట్లాడేవారట. వేరే వాళ్లతో డబ్ చేస్తున్నాం అని నాకు చెప్పి మరీ డబ్బింగ్ చెప్పించారు క్రిష్.

● ఈ మధ్య ఎక్కువగా బయోపిక్స్ చేస్తున్నాను. కావాలని చేయలేదు. నాకు ఆ ఆఫర్సే వచ్చాయి. అవి చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించాయి. ఏ పాత్ర గురించైనా విన్నప్పుడు ఈ పాత్ర చేయాలనే ఓ ఫీలింగ్ రావాలి. అది అనిపిస్తేనే సినిమా చేయాలనుకుంటా.

● ఈ జనరేషన్‌లో యంగ్‌స్టర్స్ అందరూ బావుండటమంటే కేవలం లుక్స్ అనే అనుకుంటున్నారు. గుడ్ లుక్స్, స్లిమ్‌గా ఉండాలని వాటి వెంట పరిగెడుతున్నారు. నాకు బరువు గురించి పెద్దగా పట్టింపులేదు. అయితే హీరోయిన్ ఇంత లావు ఉండకూడదని చెప్పేవారు. మొదట్లో నేను అమాయకంగా వాళ్లు చెప్పింది నమ్మేసి క్రాష్ డైట్‌లు, అదీ ఇదీ చేసేసి స్లిమ్ అయ్యాను. కానీ లైఫ్‌లెస్‌గా (నిస్సారంగా) అనిపించింది. ఆ తర్వాత తెలుసుకున్నాను మనం మనలా ఉంటేనే బాగుంటుందని. అప్పటి నుంచి నాకు నచ్చినట్టు నేనుంటున్నాను. ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్నామా? లేదా? అన్నది కూడా ముఖ్యమే. ముందు మనల్ని మనం ఇష్టపడాలి. ఎలా ఉన్నామో అలా అంగీకరించగలగాలి. అప్పుడు ఎలా ఉన్నాం అన్నది పెద్ద ప్రశ్న అవ్వదు. దానికి సమాధానం కోసం పరిగెత్తే పని కూడా ఉండదు.


బొద్దుగా ఉన్న హీరోయిన్స్ ఎవ్వరిని అడిగినా ‘మాకు విద్యాబాలన్‌గారే ప్రేరణ’ అంటుంటారు. మరి మీరు అలా ఉండటానికి ఇన్‌స్పిరేషన్ ఎవరు? అని అడగ్గా “ఈ విషయం తెలుసుకోవడం హ్యాపీగా ఉంది. నాకు ఇన్‌స్పిరేషన్ అంటే చాలామంది ఉన్నారు. ఫస్ట్ నా సిస్టర్ ప్రియా బాలన్. తను ఏ మూమెంట్‌లో అయినా కాన్ఫిడెంట్‌గా ఉంటుంది. తనే నా హీరో” అన్నారు.

● ఇంతకు ముందు న్యూ ఇయర్‌కు కొత్త నిర్ణయాలు తీసుకునేదాన్ని. ఈరోజుతో నాకు 40ఏళ్లు వస్తాయి. ఈ సంవత్సరం నుంచి కొత్త నిర్ణయాలు తీసుకోను. ఏదో కొత్త నిర్ణయం తీసుకుంటాం. 4,5 తారీఖుల్లో అది పాటించడం మానేస్తే గిల్టీ అనిపిస్తుంది. ఈ ఏడాది నుంచి ప్రతీ క్షణాన్ని ఆనందంగా గడపాలనుకుంటున్నాను. ఎప్పుడూ కుదరదు కానీ ట్రై చేస్తా..

● రాజమౌళి దర్శకత్వంలో యాక్ట్ చేయాలనుంది. వీలుంటే మళ్లీ క్రిష్‌తో పని చేస్తా. ఇందిరా గాంధీ బుక్ రైట్స్ తీసుకున్నాను. ఆవిడ గురించి చెప్పడానికి చాలా మెటీరియల్ ఉంది. అందుకే వెబ్ సిరీస్ ప్లాన్ చేస్తున్నాను. ‘మిషన్ మంగళ్’లోనూ నటిస్తున్నాను.


● మహేశ్‌బాబు


● నయనతార, విఘ్నేశ్


● సాయిధరమ్

న్యూ ఇయర్ మూడ్.. పార్టీ మోడ్


● వాణీ కపూర్, రాశీ ఖన్నా

హాయ్ దుబాయ్!

న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం కొంతమంది హీరోయిన్లు దుబాయ్‌లో దిగిపోయారు. ఫ్యామిలీతో కలిసి మహేశ్‌బాబు దుబాయ్‌లో చిల్ అవుతున్నారు. స్నేహితురాలు వాణీ కపూర్‌తో కలిసి రాశీఖన్నా అక్కడే న్యూ ఇయర్ పార్టీ మోడ్‌లో ఉన్నారు. ఆలియా భట్, కత్రినా కైఫ్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, నిధీ అగర్వాల్‌ల సెలబ్రేషన్స్ వేదిక కూడా దుబాయ్‌నే కావడం విశేషం. ఫ్యామిలీతో కలిసి సీనియర్ నటి ఖుష్బూ కూడా సేమ్ ప్లేస్‌లో ఉన్నారు. మరికొంతమంది కూడా దుబాయ్‌కు హలో చెప్పారట.


● కరీనా, సైఫ్


షూటింగ్‌లు, ప్యాకప్‌లు, లొకేషన్ చేంజ్‌లు, ప్రమోషన్‌లు, హిట్టూ, ఫ్లాప్, కొత్త సినిమా అగ్రిమెంట్‌లు, కాల్షీట్ల సర్దుబాట్లు... ఇలా ఒకటా? రెండా? ఎన్నో పనులతో ఆర్టిస్టులు ఉరుకుల పరుగుల జీవితం గడుపుతారు. అలాగే 2018 గడియారాన్ని తిప్పేశారు. ఇప్పుడు 2019కి వెల్‌కమ్ చెప్పడానికి ఫ్లైట్ ఎక్కి విదేశాలకు ఎగిరిపోయారు కొందరు తారలు. కొత్త ఆశలతో, సరికొత్త ఆశయాలతో న్యూ ఇయర్‌కి గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పేశారు. ప్రస్తుతానికి కొందరి లొకేషన్ ట్రేస్ అయ్యింది. వారి వివరాలపై ఓ లుక్కేద్దాం.

సూపర్‌స్టార్ రజనీకాంత్ ఫ్యామిలీతో కలిసి అమెరికా వెళ్లిన విషయం తెలిసిందే. న్యూ ఇయర్‌కి ఆయన అక్కడే స్వాగతం పలుకుతారు. లోక నాయకుడు కమల్‌హాసన్ ప్రస్తుతం సింగపూర్‌లో ఉన్నట్లు కోలీవుడ్ సమాచారం. హీరో అల్లు అర్జున్ కూడా హాలీడేలో ఉన్నారు. ఇక నాగార్జున, ప్రభాస్, రానా, ఎన్టీఆర్, రామ్‌చరణ్, అనుష్కతో పాటు మరికొందరు తారలు ఆదివారం జరిగిన రాజమౌళి కుమారుడు కార్తికేయ పెళ్లిసందడి కోసం జైపూర్ వెళ్లారు. మరి...న్యూ ఇయర్‌కి ఎవరెవరు ఏయే ప్లేస్‌లను సెలక్ట్ చేసుకున్నారనేది కొన్ని గంటల్లో తెలిసిపోతుంది. కొత్త సంవత్సరాన్ని నాగచైతన్య, సమంత ఆమ్‌స్టర్‌డామ్‌లో గడపనున్నారు. సాయిధరమ్ తేజ్ ‘హాయ్ అజర్ బైజాన్’ అంటూ అక్కడికెళ్లిపోయారు. సౌత్ క్రేజీ లవ్ జోడీ నయనతార, విఘ్నేష్ శివన్ లాస్ వేగాస్‌లో ల్యాండ్ అయ్యారు. ఇక విజయ్‌దేవరకొండ న్యూ ఇయర్ సెలబ్రేషన్‌ని ఫోన్‌కి సిగ్నల్ కూడా రాని ఓ ఐల్యాండ్‌లో ప్లాన్ చేశారు. తేజ దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా షూటింగ్ కోసం కాజల్ వియత్నాంలో ఉన్నారని సమాచారం. మరి కాజల్ అక్కడే న్యూ ఇయర్‌కి వెల్‌కమ్ చెబుతారా? లేక వేరే డ్రీమ్ ప్లేస్ ఏదైనా ప్లాన్ చేశారా? అనే విషయం చూడాలి. ‘ఏంజిల్’ సినిమా కోసం ఫిజీ వెళ్లారు పాయల్ రాజ్‌పుత్. పూజా హెగ్డే న్యూయార్క్‌లో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను ప్లాన్ చేసినట్లు తెలిసింది. అల్లు శిరీష్ లెబనాన్‌లో ఉన్నారు. వియత్నాం వెళ్లారు రెజీనా. ఇజ్రాయెల్‌లో ల్యాండైపోయారు ప్రణీత. ఒకసారి బాలీవుడ్ డోర్ కొడితే... కొత్త దంపతులు ప్రియాంకా చోప్రా, నిక్ జోనస్ స్విట్జర్లాండ్ వెళ్లారు. కరీనా కపూర్, సైఫ్ అలీఖాన్ జంట కూడా స్విట్జర్లాండ్‌లోనే ఉన్నారు. దీపికా పదుకోన్–రణ్‌వీర్ సింగ్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లండన్‌లో జరుగుతాయని బీ టౌన్ టాక్. భర్త విరాట్ కోహ్లీతో కలిసి సిడ్నీకి ఫ్లైట్ ఎక్కారు అనుష్కా శర్మ. సోనమ్ కపూర్, ఆనంద్ బాలీలో వాలారు. థాయ్‌ల్యాండ్‌లో ఫ్యామిలీతో అజయ్ దేవగన్ ఎంజాయ్ చేస్తున్నారు. చెల్లెళ్లు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్‌ల కోసం అర్జున్ కపూర్ శనివారం సింగపూర్‌లో షాపింగ్ చేసి, ఆదివారం ముంబై వచ్చేశారు. కొత్త ఏడాదికి జాన్వీ కపూర్ తిరుపతి వచ్చి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుంటారన్న టాక్ వినిపిస్తోంది. ఈ ఏడాది ఫుల్ రైజింగ్‌లో ఉన్న కియారా అద్వానీ మాల్దీవుల్లో మస్త్ మజా చేస్తున్నారు. దిశా పాట్నీ కూడా మాల్దీవుల్లోనే ఉన్నారట. బాలీవుడ్ నిర్మాత ఏక్తా కపూర్ టర్కీలో ఉన్నారు. పరిణీతి చోప్రా లండన్‌లో వాలిపోయారు. మరికొంతమంది బాలీవుడ్ స్టార్స్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం ఫారిన్ పోదాం చలో చలో అంటూ అక్కడికెళ్లిపోయారు. ఇలా పలువురు తారలు హ్యాపీ మూడ్‌లో న్యూ ఇయర్ పార్టీ మోడ్‌లోకి వెళ్లిపోయారు.


● ప్రియాంకా చోప్రా


● తనయుడితో కాజోల్


● ఆనంద్, సోనమ్


● నిధీ అగర్వాల్


● విరాట్, అనుష్కా


● పూజా హెగ్డే


● ఈశ్వర్, టువ చక్రవర్తి

కుర్రాళ్లకి అర్థమవుతుంది

ఈశ్వర్ హీరోగా, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరోయిన్లుగా పరిచయం అవుతున్న చిత్రం ‘4 లెటర్స్’. ‘కుర్రాళ్లకి అర్థమవుతుందిలే’ అన్నది ఉపశీర్షిక. ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో ఓం శ్రీ చక్ర క్రియేషన్స్ పతాకంపై దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. నిర్మాతలు మాట్లాడుతూ – ‘‘సత్యానంద్‌గారి వద్ద శిక్షణ తీసుకున్న ఈశ్వర్ ఈ సినిమా కోసం హార్డ్ వర్క్ చేశాడు. ‘కలుసుకోవాలని’ వంటి బ్యూటిఫుల్, క్యూట్ లవ్‌స్టోరీని తెరకెక్కించిన రఘురాజ్‌గారు మా చిత్రాన్ని చక్కగా తీశారు. త్వరలోనే పాటలు, సినిమా విడుదల తేదీని ప్రకటిస్తాం’’ అన్నారు. ‘‘కలుసుకోవాలని’ సినిమా తర్వాత కన్నడ, తమిళ సినిమాలతో బిజీగా మారిపోయా. చాలా గ్యాప్ తర్వాత తెలుగులో నేను డైరెక్ట్ చేసిన మూవీ ‘4 లెటర్స్’. ఒక రకంగా చెప్పాలంటే ఇది నేటితరం ప్రేమకథా చిత్రం. అందుకే ‘కుర్రాళ్లకి అర్థమవుతుందిలే’ అని ఉపశీర్షిక పెట్టాం. ప్రేమ,పెళ్లి విషయాల్లో నేటితరం యువత ఆలోచనలు, అభిప్రాయాలు, వాస్తవాలు ఏమిటనే విషయాలను వాస్తవానికి దగ్గరగా ఉండేలా చిత్రీకరించాం. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ చిత్రం అందర్నీ అలరించేలా ఉంటుంది’’ అని ఆర్.రఘురాజ్ అన్నారు. కౌసల్య, అన్నపూర్ణ, సుధ, సత్యకృష్ణ, విద్యుల్లేఖా రామన్, సురేశ్, పోసాని కృష్ణమురళి, కృష్ణభగవాన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: చిట్టిబాబు.కె.

ఈ ఉద్యమాలతో ఏం సాధిస్తారు?


● షావుకారు జానకి

‘‘నేను స్త్రీవాదినే. కాకపోతే ప్రస్తుతం ఇండస్ట్రీలో జరుగుతున్న ‘మీటూ’ ఉద్యమమంతా రబ్బిష్ (చెత్త) ’’ అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు సీనియర్ నటి షావుకారు జానకి. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఇలా పేర్కొన్నారామె. ఓ తమిళ చానెల్ ఇంటర్వ్యూలో ‘మీటూ’ గురించి ఆమె మాట్లాడుతూ – ‘‘కొన్ని రోజులుగా టీవీల్లో, పేపర్స్‌లో ‘మీటూ’ గురించే వార్తలు వస్తున్నాయి. ఎప్పుడో ఇలాంటి ఓ పనికి అంగీకరించి ప్రస్తుతం ప్రమోషన్ కోసం దానిని వాడుకుంటున్నారు. ఇలాంటి పనుల వల్ల మీ పేరు, మీ కుటుంబ సభ్యుల పరువు పోవడం తప్ప ఏం లేదు. ఇలాంటి ఉద్యమాలతో ఏం సాధిస్తారు? చీప్ పబ్లిసిటీ కోసం ఎప్పుడో జరిగినవాటి గురించి, లేదా జరగని వాటి గురించిన ఆరోపణలు చేస్తున్నారు వీళ్లంతా’’ అని పేర్కొన్నారు షావుకారు జానకి.



రైతమ్మలు, రైతన్నలు, వ్యవసాయ కార్మికులు..
అష్టకష్టాలు పడి ఆరుగాలం చెమట చిందిస్తే..
ఆ తడితో మొలిచి పండిన గింజలే మనందరి ఆకలి తీరుస్తున్నాయి.
అందుకు అన్నదాతకు ప్రతి ముద్దకూ కృతజ్ఞతలు చెప్పుకోవాలి.
దొరికీ దొరకని సాయంతో.. నిండీ నిండని డొక్కలతో..
చిన్నా చితకా కమతాల్లో నేలతల్లినే నమ్ముకొని మొక్కవోని మనోబలంతో
ముందడుగేసే మట్టి మనుషులందరికీ నిండు మనసుతో నూతన
సంవత్సర శుభాకాంక్షలు చెబుతోంది 'సాగుబడి'.
ప్రకృతి మాత కనుసన్నల్లో సాగే వ్యవసాయంలో కష్టనష్టాలు..
ఒడిదొడుకులెన్నో.. జ్ఞాపకాలను మిగిల్చి వెళ్లిపోయిన 2018 మనకు
అందించిన మార్గదర్శనం చేసే ఊసులను స్మరించుకుంటూ.. ప్రకృతికి
ప్రణమిల్లుతూ.. సరికొత్త ఆశలతో ముందడుగు వేద్దాం!

సాక్షి సాగుబడి

నల్లగొండ
మంగళవారం 1-1-2019

వరి, చెరకు, గోధుమ
ఈ మూడు పంటల సాగు విస్తీర్ణం 40%
వీటి సాగుకు వాడుతున్న సాగు నీరు 80%



పూర్వాషాఢ కార్తె - జనవరి 10 వరకు

పంటలు మారితే బతుకు బంగారం



● చిరుధాన్యాలు + పప్పుధాన్యాలు.. మన బడుగు రైతుల బతుకుల్లో జీవితేచ్ఛను పండించే బంగారు పంటలు..

భారతీయుల్లో 30 శాతం మందికి రక్తహీనత ఉంది. భూతాపోన్నతి వల్ల చాలా ప్రాంతాల్లో సాగు నీటి కొరత తీవ్రంగా ఉంది. వర్షపాతం తగ్గిపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో భారతీయ రైతులు వరి, గోధుమ పంటలను వదిలి... మొక్కజొన్న, చిరుధాన్య పంటలు సాగు చేయడం ప్రారంభిస్తే సాగు నీటి బాధలు 33% తీరిపోతాయని ఒక ముఖ్య అధ్యయనం(2018) తేల్చింది. అంతేకాదు, పౌష్టికాహారాన్ని వినియోగదారులకు అందుబాటులోకి తేవచ్చని అమెరికాకు చెందిన ఎర్త్ ఇన్‌స్టిట్యూట్, కొలంబియా యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సంయుక్తంగా చేసిన అధ్యయనం తేల్చింది.

1996–2009 మధ్యకాలంలో ధాన్యం ఉత్పత్తి గణాంకాల ఆధారంగా ఎంత నీరు ఖర్చయిందో లెక్కగట్టారు. వరి సాగుకు అత్యధికంగా సాగు నీరు ఖర్చవుతోంది. వరికి బదులు మొక్కజొన్న, రాగి, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాలు సాగు చేస్తే సాగు నీరు ఆదా కావడమే కాకుండా.. ఐరన్ (27%), జింక్ (13%) వంటి పోషకాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని 'సైన్స్ అడ్వాన్సెస్'లో ప్రచురితమైన ఈ అధ్యయనం విశ్లేషించింది. అన్ని జిల్లాలకూ ఒకే పరిష్కారం కుదరదు.

ప్రతి జిల్లా స్థితిగతులను బట్టి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించాలి అని కొలంబియా యూనివర్సిటీ ఎర్త్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన కైల్ డావిస్ అంటున్నారు. అధిక నీటిని వాడుకుంటూ అధిక ఉద్గారాలను వెలువరిస్తున్న వరికి బదులు.. అంత కన్నా పోషక విలువలున్న, కొద్దిపాటి నీటితో పండే మిల్లెట్స్‌ను పండించి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలందరికీ అందించవచ్చు. వీటిని సేంద్రియంగానే పండించవచ్చు అని ఆయన అంటున్నారు. 2018ని భారత్ జాతీయ చిరుధాన్య సంవత్సరంగా ప్రకటించుకున్న విషయం తెలిసిందే.

తిండి మారితే మేలు..

భూమిపై వనరుల వినియోగ భారాన్ని గణనీయంగా తగ్గించుకోవడానికి ఉత్తమ మార్గం మాంసం, డెయిరీ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించుకోవడమేనని సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం (2018) పేర్కొంది. మాంసం, పాల ఉత్పత్తులను తినటం మానివేస్తే చాలు.. ప్రజలకు ఆహార కొరత రాకుండా చూసుకుంటూనే ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ భూమి విస్తీర్ణాన్ని 75% తగ్గించవచ్చని ఒక అతిపెద్ద అధ్యయనం తెలిపింది.

యూకేలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ 119 దేశాల్లో 40 వేల క్షేత్రాలు, ప్రజలు ఎక్కువగా తింటున్న 40 ఆహారోత్పత్తులపై అధ్యయనం చేసింది. ఈ ఉత్పత్తులకు అయ్యే వనరుల ఖర్చు, కాలుష్యం, వెలువడే ఉద్గారాలు తదితర విషయాలను పరిగణనలోకి తీసుకున్నది. అడవులు నరికి వ్యవసాయానికి మళ్లించడం వల్ల వన్యప్రాణుల సంఖ్య భారీగా అంతరిస్తున్నది.


ప్రపంచవ్యాప్తంగా మాంసం, పాల ఉత్పత్తుల ద్వారా ప్రజలకు అందుతున్నది 18% కేలరీలు, 37% ప్రొటీన్లు. అయితే, వీటి కోసం 83% వ్యవసాయ భూములను కేటాయించాల్సి వస్తున్నది. వ్యవసాయం వల్ల వెలువడే కర్బన ఉద్గారాలలో 60% మాంసం, పాల ఉత్పత్తుల తయారీ వల్లనేనని ఈ అధ్యయనం తేల్చింది. మాంసం, పశువుల పాల ఉత్పత్తులను సగాన్ని తగ్గించుకొని, వాటి స్థానంలో పంటల ఉత్పత్తులతో భర్తీ చేసుకున్నా చాలా మేలు జరుగుతుందని తేలింది.



ప్రకృతి మూలుగ పీల్చేస్తున్నాం..

జీవవైవిధ్యంతో కూడిన ప్రకృతి నుంచి మనం పొందే సేవలు ఎంతో అమూల్యమైనవి. ముఖ్యంగా, మనం తినే ఆహారం, శుద్ధమైన నీరు, ఇంధనం.. వీటన్నిటికీ జీవవైవిధ్యం, ప్రకృతే మూలాధారం. మన మనుగడకు మాత్రమే కాదు మన సంస్కృతులకు, మన అస్తిత్వానికి, మన జీవన ఆనందాలకు కూడా ఇవి ప్రాణాధారాలు. అయినప్పటికీ, మనం పట్టించుకోవడం లేదు. ఆధునిక మానవుల దైనందిన జీవితం ప్రకృతి నుంచి విడివడి పోవడమే ఇందుకు కారణం.

మన ఆర్థిక కలాపాలన్నీ అంతిమంగా ప్రకృతి పైనే ఆధారపడి ఉంటాయి. ప్రకృతి మనకు అందించే వివిధ రకాల సేవల విలువ నిజానికి అమూల్యం. అయితే, ఆర్థికవేత్తల లెక్కల ప్రకారం ప్రకృతి సేవల విలువ ఏడాదికి ప్రపంచవ్యాప్తంగా 125 ట్రిలియన్ డాలర్ల మేరకు ఉంటుంది. ప్రకృతిని స్థిమితంగా ఉంచగలిగేంత మేరకు వనరుల వినియోగం జరిగితే పర్వాలేదు. కానీ, మనం విచ్చలవిడిగా వాడేస్తున్నాం. ఎంతగానంటే, ప్రకృతి తిరిగి తెప్పరిల్ల లేనంతగా ఏకంగా



70% అధికంగా వాడేస్తున్నాం. ఈ వత్తిడి వల్ల ప్రపంచవ్యాప్తంగా భూమి పైన, నేల లోపల ప్రాణప్రదమైన జీవ జాతులు, జీవరాశి చాలా వేగంగా అంతరించిపోతోందని లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ –2018 చెబుతోంది. వెన్నెముక లేని జీవులు 1970–2014 మధ్యకాలంలో 60% అంతరించిపోయాయి. దక్షిణ, మధ్య అమెరికాలోని ఉష్ణమండలాల్లో జంతువుల సంతతి మరీ ఎక్కువగా 89% నశించాయి. మంచినీటిలో పెరిగే జంతువులు కూడా 1970తో పోల్చితే 83% నశించాయి. ప్లాస్టిక్ కాలుష్యం సముద్రాలు, నదులను నాశనం చేసింది.

విశ్వవిఖ్యాత నిపుణులు మనకు ఇస్తున్న సందేశపు సారాంశం ఏమిటంటే.. పొదుగు కోసి పాలు తాగటం మానాలి. ప్రకృతికి తీరని హాని చేసేలా ప్రవర్తించడం మనం ఇప్పటికిప్పుడు ఆపెయ్యాలి. లేదంటే, మన భవిష్యత్తు మాత్రమే కాదు వర్తమానం కూడా మరింత దుర్భరంగా మారిపోతుంది. అయితే, అదృష్టం ఏమిటంటే.. ప్రాణప్రదమైన ప్రాకృతిక సంపదను పాక్షికంగానైనా పునరుద్ధరించుకునే దారులు మనకు రూఢిగా తెలుసు. ప్రకృతిలో జీవజాతులు, జంతుజాలంపై, అడవులపై వత్తిడిని తగ్గించేలా వ్యవసాయ పద్ధతులను, విలాసాలను, ఆహార విహారాలను మార్చుకోవటం అత్యవసరం.

అత్యుత్తమం సిక్కిం సేంద్రియ సేద్య విధానం



సిక్కిం రాష్ట్రం సంపూర్ణ సేంద్రియ రాష్ట్రం. ఆ చిన్న రాష్ట్రంలో సాగు భూమి 75 వేల హెక్టార్లు. రసాయనిక సేద్యానికి సబ్సిడీలను క్రమంగా తగ్గిస్తూ సేంద్రియ సేద్యాన్ని అన్ని విధాలా ప్రోత్సహిస్తూ రైతాంగాన్ని సంపూర్ణ సేంద్రియ సేద్యం వైపు మళ్లించడంలో ముఖ్యమంత్రి పవన్ చామ్లింగ్ ప్రభుత్వం పరిణతిని కనబరచడం విశేషం. దీంతో భూసారం పెరగటం, నీటి నాణ్యత పెరగటం, ప్రజల ఆరోగ్యం, ఆర్థిక సామాజిక అభివృద్ధికి సేంద్రియ సేద్యం దోహదపడింది. పండ్లు, సుగంధ ద్రవ్యాలు, కూరగాయలను సిక్కిం ఆర్గానిక్ బ్రాండ్‌పై విక్రయించడం వల్ల రైతాంగానికి మంచి ఆదాయం లభిస్తోంది. ఇదిలా ఉండగా, ప్రకృతి/సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే ప్రభుత్వ చట్టాలు, విధానాలపై ఎఫ్.ఎ.ఓ. నిర్వహించిన పోటీలో సిక్కింకు బంగారు పతకం(2018) లభించింది.

6న కొర్నెపాడులో సిరిధాన్యాల ప్రకృతి సేద్యంపై శిక్షణ

ప్రకృతి వ్యవసాయ విధానంలో సిరిధాన్యాల సాగుపై గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గరలో కొర్నెపాడు రైతు శిక్షణా కేంద్రంలో జనవరి 6 (ఆదివారం)న కడప జిల్లా వేంపల్లెకు చెందిన రైతు శాస్త్రవేత్త విజయకుమార్ రైతులకు శిక్షణ ఇస్తారు. కొర్రలు, అండుకొర్రలు, సామలు, ఊదలు, అరికలను రసాయనిక ఎరువులు వాడకుండా సాగు చేసి నాణ్యమైన దిగుబడులు పొందే మార్గాలపై ఉ. 10 గం. నుంచి సా. 5 గం. వరకు శిక్షణ ఇస్తారు.

అనంతరం ఉచితంగా 'అటవీ చైతన్య' ద్రావణం పంపిణీ చేస్తారు. రిజిస్ట్రేషన్ ఇతర వివరాలకు.. 83675 35439, 97053 83666, 0863 2286255 నంబర్లలో సంప్రదించవచ్చు.

6న బసంపల్లిలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

అనంతపురం జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లిలోని శ్రీ అమరణారేయన స్వామి దేవస్థానంలో జనవరి 6 (ఆదివారం)న ఉ. 9 గం. నుంచి సా. 4 గం. వరకు గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై రైతు నాగరాజు శిక్షణ ఇస్తారు. రుసుము రూ. 100. రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు.. 94407 46074, 96636 67934, 94405 66069

17,18 తేదీల్లో సిరిధాన్యాల అటవీ వ్యవసాయంపై శిక్షణ



డా. ఖాదర్ వలి పర్యవేక్షణలో జనవరి 17,18 తేదీల్లో అటవీ చైతన్య ద్రావణంతో భూసారం పెంపుదల, సిరిధాన్యాలు – పప్పుధాన్యాల మిశ్రమ సాగు, సిరిధాన్యాల శుద్ధి విధానాలపై రైతులకు తెలుగులో శిక్షణా కార్యక్రమం జరగనుంది. వేదిక : హెచ్.డి. కోటె, హ్యాండ్ పోస్టు, బేస్ క్యాంప్, మైరాడ. బిదర హల్లి కబిని డ్యాం దగ్గర గల అటవీ వ్యవసాయ క్షేత్రాన్ని కూడా సందర్శించవచ్చు. రిజిస్ట్రేషన్ ఇతర వివరాలకు.. 99017 30600, 81234 00262, 934 66 94156.

భూమి, నీటి యాజమాన్యంతో సుస్థిర సేద్యంపై కోర్సు



తెలంగాణ ప్రభుత్వానికి చెందిన నీరు, భూమి యాజమాన్య శిక్షణ –పరిశోధన సంస్థ (వాలంతరి) భూమి, నీటి యాజమాన్యంతో సుస్థిరమైన లాభసాటి వ్యవసాయంపై గ్రామీణ యువత కోసం నాలుగు నెలల సర్టిఫికెట్ కోర్సు నిర్వహించనుంది. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వాలంతరి కార్యాలయంలో జనవరి 25 నుంచి మే 24 వరకు శిక్షణ ఉంటుంది. ఇంటర్ లేదా ఐటిఐ లేదా డిప్లొమా చదివిన, 18–30 సంవత్సరాల మధ్య వయస్కులైన గ్రామీణ యువత ఈ కోర్సుకు అర్హులు. ఉచిత భోజనం, వసతి కల్పిస్తారు. కోర్సు రుసుము రూ. 1,200. కోర్సు పూర్తి చేసిన వారు ఆదర్శ వ్యవసాయదారుగా లేదా వ్యవసాయ రంగంలో కన్సల్టెంట్‌గా స్వయం ఉపాధి పొందవచ్చు. జనవరి 10లో దరఖాస్తు చేసుకోవాలి. మౌఖిక పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపికచేస్తారు. దరఖాస్తు నమూనా, ఇతర వివరాలకు.. 040–24006205
https:tswalamtari.cgg.gov.in

నేలతల్లికి ఎంత కష్టం.. ఎంత కష్టం..




విత్తనం మొలకెత్తి ధాన్యరాశులైతేనే మన కడుపు నిండేది. మనం తింటున్న ఆహారం 95% మేరకు నేలతల్లే మనకు అందిస్తున్నది. అయితే, ఈ క్రమంలో మనం అనుసరిస్తున్న విధ్వంసకర పద్ధతుల వల్ల భూమి నిస్సారమైపోతోంది. భూమి నాశనమైపోతోందని అందరికీ తెలిసిందే. అయితే, ప్రపంచవ్యాప్తంగా ఎంత భూమి పాడై ఉంటుంది? ఈ విషయం తెలుసుకునేందుకు 2018లో ఐక్యరాజ్య సమితి ఒక సర్వే జరిపింది. భూముల విస్తీర్ణంలో 75% ఇప్పటికే తీవ్రస్థాయిలో నిస్సారమైపోయిందని దిగ్భ్రాంతికరమైన వాస్తవాన్ని వెల్లడించింది. రైతులే కాదు మానవాళి యావత్తూ మేలుకొని జాగ్రత్తపడకపోతే 2050 నాటికి 90% భూమి నాశనమైపోవచ్చని కూడా ఐరాస హెచ్చరించింది. భూమికి జరిగే ఈ నష్టం విలువ ఎంత ఉండొచ్చు? ఎడారీకరణపై ఐక్యరాజ్యసమితి ఒడంబడిక నివేదిక ప్రకారం ఈ నష్టం 23 ట్రిలియన్ డాలర్ల మేరకు ఉండొచ్చని అంచనా.

భూతాపం పెరిగి సాగు యోగ్యం కాకుండా ఎడారిగా మారిపోవడానికి మూడింట ఒక వంతు కారణం.. అడవిని నరికేయడం, ప్రకృతికి నష్టదాయక వ్యవసాయ పద్ధతుల వల్ల భూమిలో కర్బనం తగ్గిపోవడం, నీటి లభ్యత తగ్గిపోవడం. భూమిలో జీవం తగ్గిపోవడం వల్ల జీవవైవిధ్యం అంటే.. భిన్న జాతుల చెట్టు చేమ, జీవరాశి అంతరించిపోతోంది.

వరల్డ్ వైడ్ ఫండ్ సంస్థ తొలిసారి 2018లోనే 'గ్లోబల్ సాయిల్ బయోడైవర్సిటీ అట్లాస్'ను రూపొందించింది. చాలా దేశాల్లోని భూముల్లోని సూక్ష్మజీవరాశి, వానపాములు వంటి జీవులకు తీవ్ర ముప్పు పొంచి ఉంది. నిజానికి ఈ ముప్పు మానవాళికి ఎదురవుతున్న ముప్పే. జాగ్రత్తపడకపోతే 2050 నాటికి 500 కోట్ల మంది మనుగడకే ముప్పు పొంచి ఉంటుంది.

అటువంటి దేశాల జాబితాలో మన దేశంతో పాటు పాకిస్తాన్, చైనా కూడా ఉన్నాయి. ఆఫ్రికా, ఐరోపా, ఉత్తర అమెరికా దేశాల్లో నేలల్లో సూక్ష్మజీవరాశి ఘోరంగా దెబ్బతిన్నది. భూమి లోపల జీవవైవిధ్యం దెబ్బతినటంతోపాటు పరపరాగ సంపర్కానికి దోహదపడే తేనెటీగలు, సీతాకోకచిలుకలు అంతరించిపోతున్నాయి. వ్యక్తులు, సంస్థలు, అన్ని దేశాలూ కలసికట్టుగా కదలాలి. నిర్ణీత కాలంలో జీవవైవిధ్యాన్ని పెంపొందించుకునేలా చర్యలు తీసుకొని అమలు చేయడం మేలని ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తోంది. గమనించాల్సిన విషయం ఏమిటంటే ఏటేటా ముప్పు పెరుగుతోంది.

సేంద్రియ రైతుల్లో భారతీయులే ఎక్కువ!



ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ భూమిలో రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా 1.2% విస్తీర్ణంలో వ్యవసాయం జరుగుతున్నది, ఏటేటా విస్తరిస్తూ ఉంది. పదిహేను దేశాల్లో ఉన్న వ్యవసాయ భూమిలో 10% కన్నా ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ వ్యవసాయం జరుగుతోంది. స్విట్జర్లాండ్‌కు చెందిన సేంద్రియ వ్యవసాయ పరిశోధనా సంస్థ–ఎఫ్.ఐ.బి.ఎల్., జర్మనీలోని బాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఐ.ఎఫ్.ఓ.ఎ.ఓ.ఎం. ఆర్గానిక్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఏటేటా శాస్త్రీయమైన పద్ధతుల్లో సేంద్రియ వ్యవసాయ, వాణిజ్య గణాంకాలు సేకరిస్తుంటాయి. 2018లో ఈ సంస్థలు వెలువరించిన గణాంకాల ప్రకారం.. 178 దేశాల్లో గత సంవత్సరం వరకు రసాయనిక వ్యవసాయం చేసి 2016 నుంచే సేంద్రియ వ్యవసాయం ప్రారంభించిన విస్తీర్ణం కూడా కలుపుకొని.. మొత్తం 5 కోట్ల 78 లక్షల హెక్టార్లలో సేంద్రియ వ్యవసాయం జరుగుతోంది. అంటే.. ఇంత విస్తీర్ణంలో భూములు రసాయనాల బారిన పడి నిర్జీవంగా మారకుండా ఆరోగ్యదాయకమైన ఆహారోత్పత్తులను అందిస్తున్నాయన్నమాట.

సేంద్రియ వ్యవసాయంలో ఉన్న భూమి 1999లో కోటి 10 లక్షల హెక్టార్లే. ప్రస్తుతం అత్యధికంగా ఆస్ట్రేలియాలో 2.71 కోట్ల హెక్టార్లు, అర్జెంటీనాలో 30 లక్షల హెక్టార్లు, చైనాలో 23 లక్షల హెక్టార్లలో సేంద్రియ సేద్యం జరుగుతోంది. సేంద్రియ వ్యవసాయ విస్తీర్ణం ఆసియా దేశాల్లో 2016లో 34 శాతం లేదా 9 లక్షల హెక్టార్లు పెరిగింది. ఐరోపాలో 6.7 శాతం లేదా 10 లక్షల హెక్టార్లు పెరిగింది.


అయితే, రసాయనాలు వాడకుండా నేలతల్లికి ప్రణమిల్లుతూ ప్రకృతికి అనుకూలమైన పద్ధతుల్లో పంటలు పండిస్తున్న రైతుల సంఖ్య మన దేశంలోనే ఎక్కువ. 2016 నాటికి ప్రపంచవ్యాప్తంగా వీరి సంఖ్య 27 లక్షలు. ఇందులో 40% ఆసియా దేశాల రైతులే. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతుల సంఖ్య 24 లక్షలు. వీరిలో 8,35,000 మంది సేంద్రియ రైతులు భారతీయులు కావటం విశేషం. ఉగాండాలో 2,10,352, మెక్సికోలో 2,10,000 మంది సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు.

ఇంతకీ ఈ గణాంకాలు క్షేత్రస్థాయి వాస్తవాలను ఎంత వరకూ ప్రతిబింబిస్తున్నాయి? భారత్ సహా కొన్ని దేశాలు తాజా గణాంకాలను అందించడంలో విఫలమవుతున్నాయని, అందుబాటులో ఉన్నంతవరకు క్రోడీకరిస్తున్నట్లు అధ్యయన సంస్థలు పేర్కొంటున్నాయి. ఇదిలాఉండగా, ప్రపంచ వ్యాప్తంగా సేంద్రియ ఉత్పత్తుల రిటైల్ అమ్మకాల విలువలో 20% వార్షిక వృద్ధి నమోదవుతోంది.

రైతులకు, గ్రామీణులకూ హక్కులొచ్చాయి!

- 17 ఏళ్ల సుదీర్ఘ కసరత్తు తర్వాత అతిముఖ్యమైన డిక్లరేషన్ వెలువరించిన ఐక్యరాజ్య సమితి
- సంప్రదాయ విజ్ఞానం, జీవవైవిధ్యం, ప్రకృతి వ్యవసాయం, దేశీ విత్తనాలు, నీటి వనరులపైనా హక్కులు
- రైతులు, గ్రామీణుల హక్కుల చట్టాల రూపకల్పనపై సభ్యదేశాలకు మార్గదర్శనం





● ఐక్యరాజ్యసమితిలో ఓటింగ్ ఫలితాలు

ఆరుగాలం కాయకష్టంతో పొట్టపోసుకునే చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామాల్లో పనీపాటలతో జీవనం సాగించే బడుగు ప్రజల హక్కులకు ఐక్యరాజ్య సమితి బాసటగా నిలిచింది. 2018 ఆఖరులో జరిగిన అంతర్జాతీయ స్థాయిలో చెప్పుకోదగ్గ ఒక ముఖ్య పరిణామం ఇది. పరిమిత వనరులతోనే ప్రపంచ జనాభాకు 70% ఆహారాన్ని పండించి అందిస్తున్న మట్టి మనుషులకు ఉన్న హక్కులను సముచితంగా గుర్తించమని అంతర్జాతీయ సమాజానికి ఐరాస సర్వసభ్య సమావేశం చాటిచెప్పింది. ఈ మేరకు డిసెంబర్ 17న తుది డిక్లరేషన్‌ను న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి 73వ సర్వసభ్య సమావేశం ఆమోదించింది. ఇందులో పేర్కొన్న హక్కులను దేశీయ చట్టాల ద్వారా చిన్న, సన్నకారు రైతులకు, గ్రామీణులకు రక్షణ కల్పించాలని ప్రపంచ దేశాల నేతలకు, ప్రభుత్వాలకు సూచించింది.

పాలకుల నిరాదరణకు, అన్యాయాలకు గురవుతూ కనీస మానవ హక్కులకు నోచుకోకుండా.. అరకొర ఆదాయాలతో అర్ధాకలితో అలమటిస్తూ.. భూమి హక్కులు, సాంఘిక, ఆర్థిక, ఆహార భద్రత లోపించి, అప్పులపాలై కుంగిపోతూ, ఆత్మహత్యల పాలవుతున్న చిన్న–సన్నకారు రైతులు, మహిళా రైతులు, రైతు కూలీలు, మత్స్యకారులు, ఆదివాసులు, సంచార జాతులు, ఇతర గ్రామీణ వృత్తిదారులకు.. ఐక్యరాజ్య సమితి కొత్త సంవత్సరం కానుకగా ఈ డిక్లరేషన్‌ను వెలువరించడం గొప్ప సానుకూల పరిణామం. సుమారు 17 ఏళ్ల సుదీర్ఘ తర్జన భర్జనల తర్వాత డిసెంబర్ 17న ఐక్యరాజ్య సమితి రైతులు, గ్రామీణ ప్రజల ప్రత్యేక హక్కుల డిక్లరేషన్‌ను వెలువరించడం విశేషం.

ఏమిటీ డిక్లరేషన్?

74 దేశాలకు చెందిన 164 రైతు సంఘాలతో కూడిన సమాఖ్య 'లావయ కంపెసినా', స్వచ్ఛంద సంస్థలు 'సెటిమ్', 'ఫియమ్' ఇంటర్నేషనల్‌తో కలిసి తొలుత 17 ఏళ్ల క్రితం ఈ ప్రతిపాదనను ఐరాస మానవ హక్కుల విభాగం ముందుకు తెచ్చాయి. అంతేకాదు. అది మరుగున పడిపోకుండా పట్టించుకున్నాయి.

ఆ తర్వాత ఐరాసలో బొలీవియా దేశ ప్రతినిధి 2012 నుంచి ఈ డిక్లరేషన్‌ను భుజానేసుకొని డిసెంబర్ 17న ఆమోదింపజేసే వరకూ విశేష కృషి చేశారు. ఐరాసలో సభ్యదేశాలు 193. రైతులు, గ్రామీణులకు ప్రత్యేక హక్కులు అవసరమేనని గుర్తించే 28 అధికరణాలతో కూడిన ఈ డిక్లరేషన్‌ను భారత్, చైనా సహా 121 దేశాలు సమర్థించాయి. ఆస్ట్రేలియా, యూకే, యు.ఎస్.ఎ. వంటి 8 దేశాలు వ్యతిరేకించాయి. 54 దేశాలు తటస్థంగా ఉన్నాయి. ఏదైతేనేమి డిక్లరేషన్ ఇప్పుడు అంతర్జాతీయ చట్టబద్ధత పొందింది. ఈ హక్కులను ఇక ప్రపంచ దేశాలు ప్రత్యేక చట్టాలు చేసి రైతులు, గ్రామీణుల హక్కులు రక్షించాల్సి ఉంది.

దీనికి ఎందుకంత ప్రాధాన్యం?

చిన్న కమతాల్లో పంటలు పండించుకొని జీవనం సాగించే చిన్న, సన్నకారు రైతులు ప్రపంచ జనాభాకు అవసరమైన 70% ఆహారాన్ని ఆరుగాలం కష్టపడి పండించి అందిస్తున్నారు. ప్రకృతి వనరులను తగుమాత్రంగా వాడుకుంటూ, గ్రామీణులకు ఉపాధి కల్పిస్తున్నారు. భూతాపాన్ని తగ్గించేందుకు దోహదపడుతున్నారు. అయితే, హక్కుల విషయానికి వచ్చేసరికి పట్టణప్రాంతీయులతో పోల్చితే చిన్న, సన్నకారు రైతులు, గ్రామీణులు వివక్షకు గురవుతున్నారు. వివిధ దేశాల్లో అమల్లో ఉన్న వ్యవసాయ విధానాలు సంపన్న రైతులు, పారిశ్రామిక వ్యవసాయదారులకు లబ్ధి చేకూర్చేవిగానే ఉన్నాయని.. ఈ విధానాల వల్ల చిన్న, సన్నకారు రైతులకు, రైతు కూలీలకు, ముఖ్యంగా వ్యవసాయంలో అత్యధికంగా శ్రమిస్తున్న మహిళా రైతులకు, చేకూరుతున్న లబ్ధి తూతూ మంత్రమేనని ఐరాస మానవ హక్కుల సలహా సంఘం చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులు, గ్రామీణుల హక్కుల డిక్లరేషన్ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

పర్యావరణ అనుకూల సుస్థిర వ్యవసాయ పద్ధతులను అనుసరించడం, సంప్రదాయ విజ్ఞానాన్ని పెంపొందించుకొని అనుసరించడం, ఆహార సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవడం, భూమిపైన, నీటిపైన, అడవి, ఇతర ప్రకృతి వనరులపైన రైతులు, గ్రామీణులకున్న సామూహిక హక్కులను కాపాడటం.. సభ్య దేశాల్లోని ప్రభుత్వాల విధి అని ఐక్యరాజ్యసమితి ఈ డిక్లరేషన్‌లో పేర్కొంది.


దేశీ, స్థానిక వంగడాలను సాగు చేసి భద్రపరచుకొని వినియోగించుకోవడంతోపాటు ఇతర రైతులకు విక్రయించుకునే హక్కు కూడా కల్పించమని ఈ డిక్లరేషన్ ప్రపంచ దేశాలకు సూచిస్తోంది. మన దేశంలో ఇప్పటికే చట్టం ఉన్నా, అది క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలుకావడం లేదన్న అభిప్రాయం ఉంది. రైతులకున్న హక్కులు పాలకుల దృష్టిలో ఇకనైనా ప్రాధాన్యాన్ని సంతరించుకుంటాయని ఆశిద్దాం.

● నివాళి

బండి సుధాకర్ కుటుంబానికి సాయం అందేనా?



● మృతుడు బండి సుధాకర్ భార్య, పిల్లలు



వ్యవసాయాన్నే జీవనాధారం చేసుకుని కుటుంబ పోషణకోసం రేయింబవళ్లు కష్టపడినా.. కాలం కలసి రాక పేరుకుపోయిన అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకున్న అన్నదాతల కుటుంబాలను ఆదుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చేతులు రావడం లేదు. బంగి సుధాకర్ ఆత్మహత్య పాలై 16 నెలలు గడిచినా పాలకులు ఏమాత్రం పట్టించుకోలేదని తెలుసుకుంటే ఎవరికైనా గుండె గొంతుకలోకి వస్తుంది.

కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం మద్దికెర మండల కేంద్రానికి చెందిన సుధాకర్(35) అనే రైతు అప్పుల పాలై 2017 ఆగస్టు 24న పొలంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన తండ్రి సోమన్న పేరు మీద రెండు ఎకరాల పొలం ఉంది. దీనికి తోడు మరో 13 ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాడు. అయితే, సొంత పొలం కేవలం రెండు ఎకరాలే ఉందన్న సాకుతో బ్యాంకులో అప్పు ఇవ్వలేదు. దీంతో వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించి సాగు కోసం రూ.5 లక్షలు అప్పులు చేశాడు. కొండంత ఆశతో సాగు చేసిన పంటలు వర్షాల్లేక సరిగ్గా పండకపోవడంతో ఆశలు అడియాసలయ్యాయి. చేసిన రూ.5 లక్షల అప్పులకు వడ్డీలు పెరిగిపోవడంతో కలవరం మొదలై పొలంలోనే పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య అనుమంతమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. కుమార్తె స్ఫూర్తి(11) ఆరో తరగతి, గణేష్(9) నాలుగో తరగతి, కవల పిల్లలు రాజు, రాజేష్ (5) యూకేజీ చదువుతున్నారు.

ఆర్డీఓ విచారణ చేసి వెళ్లారు.. సాయం అందలేదు..

భర్త ఆత్మహత్య చేసుకోవడంతో నలుగురు పిల్లల పోషణ తనకు కష్టంగా మారిందని అనుమంతమ్మ అన్నారు. కూలీ నాలీ చేసి పిల్లలను పోషిస్తున్నారు. ఆదోని ఆర్డీఓ వచ్చి విచారణ చేసి వెళ్లారని, అయినా తమకు ఎలాంటి సహాయం చేయలేదన్నారు.

– పి. గోపాల్,
సాక్షి, పత్తికొండ, కర్నూలు జిల్లా

సాక్షి
భవిత
స్పర్థయా వర్ధతే విద్య


మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

మంగళవారం
1-1-2019

కాల చక్రం గిరుక్కున తిరిగింది.
అనంత కాల గమనంలో మరో సంవత్సరం కలిసిపోయింది.
నదీ ప్రవాహం ఎలాగైతే.. వెనక్కు మరలదో.. కాలమూ అంతే!
గతించిన కాలం ఎన్నటికీ తిరిగిరాదు. కానీ, ఆ జ్ఞాపకాలు మాత్రం
మనతోనే మదిలో పదిలంగా ఉంటాయి. ముఖ్యంగా సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలు రాసే వారికి
గతించిన సంవత్సరం చాలా కీలకం. ఎందుకంటే.. 2019లో జరిగే వివిధ పరీక్షల్లో 2018లో
సంభవించిన ముఖ్య పరిణామాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. కాబట్టి 2018లో జరిగిన
ముఖ్య సంఘటనలను ఒకసారి గుర్తు చేసుకుంటూ... కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుదాం...








విజయానికి వర్తమానం

వార్తల్లో వ్యక్తులు

- **కె.శివన్:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్‌గా జనవరి 15న బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్ కిరణ్‌కుమార్ స్థానంలో శివన్ నియమితులయ్యారు.
- **విజయ్ కేశవ్ గోఖలే:** భారత విదేశీ వ్యవహారాల కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన ఎస్.జైశంకర్ స్థానంలో బాధ్యతలు చేపట్టారు.
- **సలీల్ పరేఖ్:** ఇన్ఫోసిస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మేనేజింగ్ డైరెక్టర్‌గా జనవరి 2న బాధ్యతలు చేపట్టారు.
- **బెంజమిన్ నెతన్యాహూ:** ఇజ్రాయెల్ ప్రధాని హోదాలో జనవరిలో భారత్‌లో పర్యటించారు. జనవరి 16న న్యూఢిల్లీలో జరిగిన రైజీనా డైలాగ్‌లో ప్రారంభోపన్యాసం చేశారు.
- **హసన్ రుహానీ:** ఇరాన్ అధ్యక్షుడు. ఫిబ్రవరిలో భారత్‌లో పర్యటించారు.
- **జస్టిన్ ట్రుడో:** కెనడా ప్రధాని హోదాలో ఫిబ్రవరిలో భారత్‌లో పర్యటించారు.
- **సిరిల్ రమాఫోసా:** దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా ఫిబ్రవరిలో బాధ్యతలు చేపట్టారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో రాజీనామా చేసిన జాకోబ్ జుమా స్థానంలో సిరిల్ ఎన్నికయ్యారు.
- **ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలి:** నేపాల్ నూతన ప్రధానిగా ఫిబ్రవరిలో రెండోసారి బాధ్యతలు చేపట్టారు.
- **స్టీఫెన్ హాకింగ్:** ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త హాకింగ్ మార్చి 14న మరణించారు. ఆయన కృష్ణబిలాలపై పరిశోధనలు చేశారు. 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' పేరుతో పుస్తకం రాశారు.
- **ఇమ్మాన్యుయేల్ మాక్రోన్:** ఫ్రాన్స్ అధ్యక్షుడు. మార్చిలో భారత్‌లో పర్యటించారు. మార్చి 11న న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) సదస్సుకు అధ్యక్షత వహించారు.
- **వ్లాదిమిర్ పుతిన్:** మార్చిలో రష్యా అధ్యక్షుడిగా నాలుగోసారి ఎన్నికయ్యారు.



- **బిద్యాదేవి భండారి:** మార్చిలో నేపాల్ ప్రెసిడెంట్‌గా వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు.
- **విన్ మింట్:** మార్చిలో మయన్మార్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు.
- **మైక్ పాంపియో:** అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా మార్చిలో నియమితులయ్యారు. రెక్స్ టిల్లర్‌సన్ స్థానంలో నియమితులయ్యారు.
- **భాను ప్రతాప్ శర్మ:** బ్యాంక్స్ బోర్డ్ బ్యూరో (బీబీబీ) చైర్మన్‌గా ఏప్రిల్‌లో వినోద్‌రాయ్ స్థానంలో నియమితులయ్యారు.
- **మిగుయెల్ డియాజ్ కెనాల్:** క్యూబా అధ్యక్షుడిగా ఏప్రిల్‌లో బాధ్యతలు చేపట్టారు. రౌల్‌కాస్ట్రో స్థానంలో ఎన్నికయ్యారు.
- **సుభాష్ చంద్ర కుంతియా:** ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డీఏఐ) చైర్మన్‌గా మేలో బాధ్యతలు చేపట్టారు.
- **మహతీర్ మహమ్మద్:** 92 ఏళ్ల మహతీర్ మలేసియా నూతన ప్రధానిగా మేలో బాధ్యతలు స్వీకరించారు.
- **గిసెప్పీ కాంటె:** ఇటలీ ప్రధానిగా జూన్‌లో బాధ్యతలు స్వీకరించారు.
- **దివ్య సూర్యదేవర:** అమెరికాలోని అతిపెద్ద కార్ల కంపెనీ జనరల్ మోటార్స్ (జీఎం)కు తొలి మహిళా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో)గా జూన్‌లో నియమితులయ్యారు.
- **మారియా ఫెర్నాండా ఎస్పినోజా:** ఈక్వెడార్‌కు చెందిన మారియా జూన్‌లో ఐక్యరాజ్య సమితి సాధారణ సభ (యూఎన్‌జీఏ) అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.
- **రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్:** టర్కీ అధ్యక్షుడిగా జూన్‌లో తిరిగి ఎన్నికయ్యారు.
- **జస్టిస్ ఆదర్శ్‌కుమార్ గోయల్:** జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) చైర్మన్‌గా జూలైలో నియమితులయ్యారు.
- **మూన్ జే ఇన్:** దక్షిణ కొరియా అధ్యక్షుడు. జూలైలో భారత్‌లో పర్యటించి, ప్రపంచంలోనే అతిపెద్ద మొబైల్ ఫ్యాక్టరీని నోయిడాలో ప్రారంభించారు. ఇది శాంసంగ్‌కు చెందినది.
- **రేఖాశర్మ:** జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) చైర్‌పర్సన్‌గా ఆగస్టులో నియమితులయ్యారు.
- **జస్టిస్ గీతా మిట్టల్:** జమ్మూకాశ్మీర్ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆగస్టులో నియమితులయ్యారు.
- **హరివంశ్ నారాయణ్‌సింగ్:** రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా ఆగస్టులో ఎన్నికయ్యారు. ఆయన జనతాదళ్ (యునైటెడ్) పార్లమెంటు సభ్యుడు.
- **జి.సతీశ్‌రెడ్డి:** డీఆర్‌డీవో నూతన చైర్మన్‌గా ఆగస్టులో నియమితులయ్యారు. క్రిస్టోఫర్ స్థానంలో బాధ్యతలు చేపట్టారు.
- **జస్టిస్ రంజన్ గొగోయ్:** సుప్రీంకోర్టు 46వ ప్రధాన న్యాయమూర్తిగా అక్టోబర్ 3న బాధ్యతలు చేపట్టారు. అసోంకు చెందిన ఆయన జస్టిస్ దీపక్ మిశ్రా స్థానంలో నియమితులయ్యారు.
- **జైర్ బోల్సొనారో:** బ్రెజిల్ కొత్త అధ్యక్షుడిగా అక్టోబర్‌లో ఎన్నికయ్యారు. మిషెల్ టెమెర్ స్థానంలో 2019, జనవరి 1న బాధ్యతలు స్వీకరిస్తారు.
- **ఇబ్రహీం మహమ్మద్ సోలి:** మాల్దీవుల నూతన అధ్యక్షుడిగా నవంబర్ 17న ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు.
- **అరవింద్ సక్సేనా:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) చైర్మన్‌గా నవంబర్ 28న నియమితులయ్యారు.
- **సునీల్ అరోరా:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా డిసెంబర్ 2న బాధ్యతలు స్వీకరించారు.
- **కృష్ణమూర్తి సుబ్రమణ్యన్:** డిసెంబర్ 7న భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా (సీఈఏ)గా నియమితులయ్యారు.
- **శక్తికాంత దాస్:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 25వ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఉర్జిత్ పటేల్ స్థానంలో బాధ్యతలు స్వీకరించారు.
- **హర్షవర్ధన్ ష్రింగ్లా:** అమెరికాలో భారత రాయబారిగా డిసెంబర్ 20న నియమితులయ్యారు.

కొత్త ముఖ్యమంత్రులు

- త్రిపుర-బిప్లబ్ కుమార్‌దేబ్
- నాగాలాండ్-నేఫ్యూ రియో
- మేఘాలయ-కొన్రాడ్ సంగ్మా
- కర్ణాటక-హెచ్‌డి కుమారస్వామి
- తెలంగాణ-కె.చంద్రశేఖర్‌రావు
- మిజోరం-జొరాంథాంగ
- మధ్యప్రదేశ్-కమల్‌నాథ్
- ఛత్తీస్‌గఢ్-భూపేష్ బఘేల్
- రాజస్థాన్-అశోక్ గెహ్లాట్

అవార్డులు

జాతీయం


- **పద్మ అవార్డులు:** వివిధ రంగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన వారికి భారత ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 25న పద్మ అవార్డులను ప్రకటించింది. వీరిలో తొమ్మిది మందికి పద్మ భూషణ్ దక్కగా.. ఇళయరాజా, గులాం ముస్తఫా ఖాన్, పి.పరమేశ్వరన్‌లకు పద్మ విభూషణ్ లభించింది.
- **అశోకచక్ర:** శాంతి సమయంలో ధైర్య సాహసాలకిచ్చే అత్యున్నత అశోక చక్ర అవార్డును భారత వాయుసేన గరుడ్ కమాండో ఫోర్స్‌కు చెందిన జ్యోతి ప్రకాశ్ నిరాలా (మరణానంతరం)కు జనవరి 26న ప్రదానం చేశారు.
- **దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు:** భారత అత్యున్నత చలనచిత్ర పురస్కారంగా పేరుగాంచిన ఈ అవార్డును ప్రముఖ హిందీ నటుడు వినోద్ ఖన్నాకు మరణానంతరం ఏప్రిల్‌లో ప్రకటించారు.



- **65వ జాతీయ చలన చిత్ర పురస్కారాలు:** వీటిని ఏప్రిల్‌లో ప్రకటించారు. ఉత్తమ చిత్రం-విలేజ్ రాక్‌స్టార్స్ (అస్సామీస్), ఉత్తమ దర్శకుడు-జయరాజ్ (భయానకం, మలయాళం), ఉత్తమ నటుడు-రిద్ధీసేన్ (నగర్ కీర్తన్, బెంగాలీ), ఉత్తమ నటి-శ్రీదేవి (మామ్, హిందీ).
- **సరస్వతి సమ్మాన్:** గుజరాతీ రచయిత సీతాన్షు యశష్‌చంద్రకు 'వాఖర్' పుస్తకానికి గాను ఏప్రిల్‌లో ఈ పురస్కారం లభించింది.
- **బాల సాహిత్య అకాడమీ పురస్కారం:** విజయనగరం జిల్లాకు చెందిన నారంశెట్టి ఉమామహేశ్వరరావు జూన్‌లో 'ఆనంద లోకం' నవలకు గాను ఈ అవార్డుకు ఎంపికయ్యారు.
- **యువ సాహిత్య అకాడమీ పురస్కారం:** విజయనగరం జిల్లాకు చెందిన బాల సుధాకర్‌మౌళికి 'ఆకు కదలని చోటు' అనే కవితా సంపుటికి లభించింది.
- **రాజీవ్ సద్భావన అవార్డ్:** రాజీవ్ గాంధీ జయంతి ఆగస్టు 20న ఈ అవార్డును పశ్చిమ బెంగాల్ మాజీ గవర్నర్ గోపాల్ కృష్ణ గాంధీకి ప్రదానం చేశారు.
- **లాల్ బహదూర్ శాస్త్రి అవార్డు:** అక్టోబర్‌లో సీనియర్ న్యాయవాది ఫాలీ నారిమన్‌కు ప్రదానం చేశారు.
- **రాజా రామ్ మోహన్‌రాయ్ అవార్డు:** జర్నలిజంలో విశేష సేవలందించినందుకు 'ద హిందూ' గ్రూప్‌నకు చెందిన ప్రముఖ పాత్రికేయుడు ఎన్.రామ్‌కు నవంబర్‌లో లభించింది.

అంతర్జాతీయం

- **90వ ఆస్కార్ పురస్కారాలు:** 2018, మార్చి 5న లాస్ ఏంజెల్స్‌లో ప్రదానం చేశారు. ఉత్తమ చిత్రం-ది షేప్ ఆఫ్ వాటర్, ఉత్తమ దర్శకుడు-గులెర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్), ఉత్తమ నటుడు-గ్యారీ ఓల్డ్‌మ్యాన్ (డార్కెస్ట్ అవర్), ఉత్తమ నటి-ఫ్రాన్సెస్ మెక్‌డొర్మాండ్ (త్రీ బిల్‌బోర్డ్స్ అవుట్‌సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి).
- **ప్రిట్జ్‌కర్ ప్రైజ్:** ప్రతిష్టాత్మక ప్రిట్జ్‌కర్ ప్రైజ్‌ను 2018కి గాను బాలకృష్ణ దోషి గెలుచుకున్నారు. ఈ పురస్కారం దక్కించుకున్న తొలి భారతీయుడుగా గుర్తింపు సాధించారు. దీన్ని ఆర్కిటెక్చర్‌లో నోబెల్‌గా అభివర్ణిస్తారు.
- **మ్యాన్ బుకర్ ఇంటర్నేషనల్ ప్రైజ్:** పోలండ్ రచయిత్రి ఓల్గా తొకర్‌జుక్‌కు మేలో లభించింది. ఆమె రచనను జెన్నిఫర్ క్రాఫ్ట్.. 'ఫ్లైట్స్'గా ఆంగ్లంలోకి అనువదించారు.
- **స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ:** భారతీయ-అమెరికన్ బాలుడు కార్తీక్ నెమ్మాని మేలో విజేతగా నిలిచాడు.
- **నిక్కీ ఏషియా ప్రైజ్:** ఇది ప్రతిష్టాత్మక జపాన్ దేశ అవార్డు. దీనికి సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్ జూన్ నెలలో ఎంపికయ్యారు.
- **బ్రిటిష్ ఇండియన్ ఆఫ్ ది ఇయర్:** ఎనిమిదేళ్ల భారత సంతతి బాలుడు ఈశ్వర్ శర్మకు ఈ టైటిల్ దక్కింది. యోగాలో అత్యుత్తమ ప్రదర్శనకు గాను ఈ గౌరవం లభించింది.
- **రామన్ మెగసెసె అవార్డు:** ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఆగస్టు 31న ఇద్దరు భారతీయులకు ప్రదానం చేసింది. వారు ప్రముఖ మానసిక వైద్యుడు భరత్ వత్వానీ, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్.
- **ఫీల్డ్స్ మెడల్:** భారతీయ ఆస్ట్రేలియన్ గణితవేత్త అక్షయ్ వెంకటేశ్‌కు ఆగస్టులో ఫీల్డ్స్‌మెడల్‌ను ప్రదానం చేశారు.
- **ఛాంపియన్స్ ఆఫ్ ఎర్త్ అవార్డు:** ఐక్యరాజ్యసమితి అత్యున్నత పర్యావరణ పురస్కారాన్ని సెప్టెంబర్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రోన్‌లకు ప్రకటించింది.
- **నోబెల్ బహుమతులు:** ఈ అవార్డులను అక్టోబర్‌లో ప్రకటించారు. 2018లో సాహిత్యానికి సంబంధించి నోబెల్ బహుమతిని ప్రకటించలేదు.
  ఫిజిక్స్: ఆర్థర్ యాష్కిన్ (అమెరికా), గెరార్డ్ మౌరో (ఫ్రాన్స్), డొన్నా స్ట్రిక్‌లాండ్ (కెనడా).
  కెమిస్ట్రీ: ఫ్రాన్సెస్ ఆర్నాల్డ్ (అమెరికా), జార్జ్ స్మిత్ (అమెరికా), గ్రెగరీ వింటర్ (బ్రిటన్).
  మెడిసిన్: జేమ్స్ అల్లిసన్ (అమెరికా), తసాకు హోంజో (జపాన్).
  ఎకనామిక్స్: విలియం నోర్దాస్, పాల్ రోమర్ అనే ఇద్దరు అమెరికన్ ఆర్థికవేత్తలకు లభించింది.
  శాంతి: డెనిస్ ముక్వెగె (డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో), నదియా మురాద్ (ఇరాక్).
- **మ్యాన్ బుకర్ ప్రైజ్:** యూకే రచయిత్రి అన్నా బర్న్స్‌కు అక్టోబర్‌లో 'మిల్క్‌మ్యాన్' అనే ఆంగ్ల నవలకు గాను లభించింది.
- **సియోల్ శాంతి బహుమతి:** 2018కి గాను భారత ప్రధాని నరేంద్ర మోదీకి దక్షిణ కొరియా ఈ అవార్డును అక్టోబర్‌లో ప్రకటించింది.



- **ప్రపంచ వ్యవసాయ బహుమతి:** మొట్టమొదటి ప్రపంచ వ్యవసాయ బహుమతిని ఎం.ఎస్ స్వామినాథన్‌కు అక్టోబర్‌లో న్యూఢిల్లీలో ప్రదానం చేశారు.
- **బ్లూక్రాస్ అవార్డు:** ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) ఈ అత్యున్నత అవార్డును నవంబర్‌లో భారత దిగ్గజ షూటర్ అభినవ్ బింద్రాకు ప్రదానం చేసింది.
- **మిస్ వరల్డ్ 2018:** మెక్సికో చెందిన వనెస్సా పాన్స్ డి లియోన్.
- **మిస్ యూనివర్స్ 2018:** ఫిలిప్పీన్స్‌కు చెందిన కట్రియోనా గ్రే.

సైన్స్ అండ్ టెక్నాలజీ

- అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్ 'ప్రత్యూష్'ను కేంద్ర శాస్త్ర, సాంకేతిక మంత్రి హర్షవర్ధన్ జనవరిలో ప్రారంభించారు. దీన్ని పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెట్రాలజీ (ఐఐటీఎం)లో ఏర్పాటు చేశారు.
- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో).. జనవరి 12న పీఎస్ఎల్‌వీ-సీ40 ద్వారా 31 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించింది.
- ఉపరితలం నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే పృథ్వీ-2 క్షిపణిని ఫిబ్రవరి 7న పరీక్షించారు. ఇది 350 కి.మీ. పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు.
- అమెరికా అంతరిక్ష సంస్థ 'స్పేస్ ఎక్స్'.. ఫాల్కన్-9 ఎఫ్‌టీ(బ్లాక్ 5) రాకెట్‌ను మే 11న ప్రయోగించింది. ఇది బంగబంధు-1 అనే బంగ్లాదేశ్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపింది.
- స్పైస్‌జెట్ కంపెనీ భారత్‌లో తొలిసారిగా ఆగస్టు 27న జీవ ఇంధనంతో ఎగిరే విమానాన్ని ప్రారంభించింది. ఇది డెహ్రాడూన్ నుంచి ఢిల్లీకి ప్రయాణించింది. జట్రోపా మొక్కల నుంచి జీవ ఇంధనాన్ని తయారు చేశారు.



- ఎనిమిది షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) దేశాలు రష్యాలో ఆగస్టులో 'పీస్ మిషన్' పేరిట సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించాయి.
- 'స్లినెక్స్ 2018' పేరిట శ్రీలంకలోని ట్రికోమలీలో సెప్టెంబర్‌లో భారత్, శ్రీలంక నౌకాదళాల సంయుక్త విన్యాసాలు జరిగాయి.
- బిమ్స్‌టెక్ దేశాలు తొలిసారిగా సెప్టెంబర్‌లో పుణెలో 'మైలెక్స్-2018' పేరిట సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించాయి.
- భారత్, అమెరికాలు సెప్టెంబర్‌లో 'యుద్ధ అభ్యాస్' పేరుతో ఉత్తరాఖండ్‌లోని చౌబతియాలో సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించాయి.
- స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల 'అస్త్ర' క్షిపణిని సెప్టెంబర్‌లో పరీక్షించారు. దీన్ని సుఖోయ్-30 యుద్ధ విమానం నుంచి ప్రయోగించారు.
- అక్టోబర్‌లో విశాఖపట్నంలో భారత్, జపాన్‌ల నౌకాదళాలు సంయుక్తంగా జిమెక్స్-2018 పేరిట సంయుక్త విన్యాసాలు నిర్వహించాయి.
- నవంబర్‌లో పోర్ట్‌బ్లేర్‌లో సింబెక్స్ పేరిట భారత్, సింగపూర్ నౌకాదళాలు సంయుక్త విన్యాసాలు నిర్వహించాయి.
- ఐక్యరాజ్య సమితి వాతావరణ మార్పుల సదస్సు (కాప్-24) డిసెంబర్‌లో పోలండ్‌లోని కటోవిచ్ నగరంలో జరిగింది.
- భారత్ అత్యంత బరువైన జీశాట్-11 ఉపగ్రహాన్ని డిసెంబర్ 5న ఫ్రెంచ్ గయానాలోని కౌరు నుంచి ప్రయోగించింది. దీని బరువు 5,854 కిలోలు.
- అగ్ని-V ఖండాంతర క్షిపణిని ఒడిశాలోని అబ్దుల్ కలాం దీవి నుంచి డిసెంబర్ 10న విజయవంతంగా పరీక్షించారు. ఇది 5 వేల కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించగల దీర్ఘశ్రేణి క్షిపణి.

అంతర్జాతీయ సదస్సులు

- **ఐఎస్ఏ సదస్సు:** అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ) తొలి సదస్సు మార్చి 11న న్యూఢిల్లీలో జరిగింది. దీనికి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రోన్ హాజరయ్యారు.
- **ఛోగమ్ సదస్సు:** రెండేళ్లకోసారి కామన్వెల్త్ దేశాల ప్రభుత్వాధినేతల సదస్సు (ఛోగమ్) నిర్వహిస్తారు. 25వ ఛోగమ్ సదస్సు ఏప్రిల్‌లో లండన్‌లో జరిగింది. బ్రిటిష్ ప్రధాని థెరిసా మే సదస్సుకు అధ్యక్షత వహించారు.
- **జీ-7 సదస్సు:** 44వ జీ-7 సదస్సు కెనడాలోని లా మల్బేయ్ పట్టణంలో జూన్ 8 నుంచి రెండు రోజుల పాటు జరిగింది. ఈ సదస్సుకు కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో అధ్యక్షత వహించారు.
- **సింగపూర్ సదస్సు:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా సుప్రీంలీడర్ కిమ్ జోంగ్ ఉన్‌లు సింగపూర్‌లో జూన్ 12న శాంతి చర్చలు జరిపారు.
- **ఎస్‌సీవో సదస్సు:** 18వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సు చైనాలోని కింగ్‌డావో నగరంలో జూన్ 9, 10 తేదీల్లో జరిగింది.
- **బ్రిక్స్ సదస్సు:** పదో బ్రిక్స్ సదస్సు జూలై 25 నుంచి 27 వరకు దక్షిణాఫ్రికాలోని జొహెన్నెస్‌బర్గ్‌లో జరిగింది. 5 బ్రిక్స్ దేశాల సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు.
- **బిమ్స్‌టెక్ సదస్సు:** బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్ (బిమ్స్‌టెక్) 4వ సదస్సు ఆగస్టు 30, 31 తేదీల్లో నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో జరిగింది. దీనికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు.
- **జీ-20 సదస్సు:** 13వ జీ-20 సదస్సు నవంబర్ 30 నుంచి రెండు రోజుల పాటు అర్జెంటీనా రాజధాని బ్యూనస్‌ఎయిర్స్‌లో జరిగింది. దీనికి అర్జెంటీనా అధ్యక్షుడు మరీసియో మక్రి అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యారు.

క్రీడలు

- జనవరిలో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో మహిళల సింగిల్స్ టైటిల్‌ను కరోలిన్ వోజ్నియాకి (డెన్మార్క్), పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) గెలుచుకున్నారు.
- న్యూజిలాండ్‌లో జరిగిన అండర్-19 ప్రపంచ కప్ క్రికెట్ టైటిల్‌ను భారత్ గెలుచుకుంది. ఫిబ్రవరి 3న మౌంగనూయ్‌లో జరిగిన ఫైనల్లో ఆస్ట్రేలియాపై భారత్ విజయం సాధించింది.
- జిమ్నాస్టిక్ ప్రపంచకప్‌లో వ్యక్తిగత పతకం సాధించిన తొలి భారతీయ జిమ్నాస్ట్‌గా హైదరాబాద్‌కు చెందిన అరుణా రెడ్డి చరిత్ర సృష్టించింది. ఫిబ్రవరిలో మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రపంచకప్‌లో అరుణ కాంస్య పతకం సాధించింది.
- 21వ కామన్వెల్త్ క్రీడలు ఏప్రిల్‌లో ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్ నగరంలో నిర్వహించారు. భారత్ 26 స్వర్ణ, 20 రజత, 20 కాంస్య (మొత్తం 66) పతకాలు సాధించి మూడోస్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లు వరుసగా మొదటి, రెండో స్థానాల్లో నిలిచాయి.
- పారిస్‌లో జూన్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో మహిళల సింగిల్స్ టైటిల్‌ను రుమేనియాకు చెందిన సిమోనా హాలెప్, పురుషుల సింగిల్స్ టైటిల్‌ను స్పెయిన్‌కు చెందిన రఫెల్ నాదల్ గెలుచుకున్నారు.
- జూన్‌లో ముంబైలో జరిగిన ఇంటర్ కాంటినెంటల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత్ విజయం సాధించింది. ఫైనల్లో కెన్యాను ఓడించింది. భారత ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి.
- 12 ఏళ్ల 10 నెలల 13 రోజుల వయసులో చెన్నైకి చెందిన ఆర్.ప్రజ్ఞానంద చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ హోదా అందుకున్నాడు. భారత్ తరపున అత్యంత పిన్నవయస్కుడైన గ్రాండ్ మాస్టర్‌గా గుర్తింపు సాధించాడు.
- జూలైలో లండన్‌లో జరిగిన వింబుల్డన్ టెన్నిస్ టోర్నీలో మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఏంజెలిక్ కెర్బర్ (జర్మనీ), పురుషుల సింగిల్స్ టైటిల్‌ను నొవాక్ జకోవిచ్ (సెర్బియా) సాధించారు.
- జూలై 15న మాస్కోలోని లుజ్నికి స్టేడియంలో జరిగిన ఫిఫా ప్రపంచకప్ ఫుట్‌బాల్ ఫైనల్లో ఫ్రాన్స్ 4-2 గోల్స్ తేడాతో క్రొయేషియాపై విజయం సాధించింది. ఇది ఫ్రాన్స్‌కు రెండో ప్రపంచకప్.



- 18వ ఆసియా క్రీడలు ఇండోనేషియాలో ఆగస్టు 18 నుంచి సెప్టెంబర్ 2 వరకు జరిగాయి. భారత్ 15 స్వర్ణ, 24 రజత, 30 కాంస్య పతకాలు (మొత్తం 69) సాధించి 8వ స్థానంలో నిలిచింది. చైనా, జపాన్, దక్షిణ కొరియా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి.
- సెప్టెంబర్‌లో న్యూయార్క్‌లో జరిగిన యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను నవోమి ఒసాకా (జపాన్), పురుషుల సింగిల్స్ టైటిల్‌ను నొవాక్ జకోవిచ్ (సెర్బియా) సాధించారు.
- సెప్టెంబర్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నిర్వహించిన ఆసియాకప్ క్రికెట్‌లో భారత్ విజేతగా నిలిచింది. దుబాయ్‌లో జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌ను ఓడించి, టైటిల్ చేజిక్కించుకుంది. ఇది భారత్‌కు ఏడో ఆసియా కప్ టైటిల్.
- నార్వేకు చెందిన మాగ్నస్ కార్ల్‌సన్ నాలుగోసారి ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నాడు. నవంబర్‌లో లండన్‌లో జరిగిన పోటీల్లో ఫాబియానో కరుయానా (అమెరికా)ను ఓడించాడు.
- బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టైటిల్‌ను డిసెంబర్‌లో పి.వి.సింధు దక్కించుకుంది. చైనాలోని గ్వాంగ్‌జూ నగరంలో జరిగిన ఫైనల్లో నొజొమి ఒకుహర (జపాన్)ను ఓడించి, టైటిల్ సాధించింది.
- భువనేశ్వర్‌లో డిసెంబర్ 16న జరిగిన ఫైనల్లో బెల్జియం జట్టు నెదర్లాండ్స్‌ను ఓడించి, ప్రపంచ కప్ హాకీ (పురుషుల) టైటిల్ సాధించింది.

ఆర్థిక అంశాలు

- కార్పొరేట్ గవర్నెన్స్‌పై ఉదయ్ కోటక్ కమిటీ చేసిన సిఫార్సులను సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) మార్చిలో ఆమోదించింది. సెబీ.. దేశంలో మార్కెట్ నియంత్రణ సంస్థగా సేవలందిస్తోంది. లిస్టెడ్ కంపెనీల్లో సీఎండీ పోస్టును చైర్‌పర్సన్, సీఈవో/ఎండీగా విభజించడం, ఒక స్వతంత్ర మహిళా డైరెక్టర్‌ను నియమించడం తదితర సిఫార్సులను ఉదయ్ కోటక్ కమిటీ చేసింది.
- ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఏప్రిల్‌లో మార్కెట్ విలువ పరంగా 100 బిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ ఐటీ కంపెనీగా టీసీఎస్ గుర్తింపు సాధించింది.
- జర్మనీకి చెందిన రసాయన, ఫార్మా దిగ్గజం బేయర్ అమెరికన్ బయోటెక్ కంపెనీ.. మోన్‌శాంటో కొనుగోలును పూర్తిచేసినట్లు జూన్‌లో ప్రకటించింది. ఈ కొనుగోలు ఒప్పందం విలువ 63 బిలియన్ డాలర్లు.
- ఫ్రాన్స్‌ను వెనక్కునెట్టి భారత్ ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు ప్రపంచ బ్యాంకు జూలై 11న ప్రకటించింది. అమెరికా, చైనా, జపాన్, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్ తొలి అయిదు స్థానాల్లో నిలిచాయి.
- యూరోపియన్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ (ఈబీఆర్‌డీ)లో భారత్‌కు సభ్యత్వం లభించింది. జూలైలో భారత్ 69వ సభ్యదేశంగా చేరింది.
- భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ).. జూలైలో కొత్త రూ.100 నోటును విడుదల చేసింది. దీనిపై యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన 'రాణి కి వావ్'ను ముద్రించారు. ఇది గుజరాత్‌లోని పటాన్ పట్టణంలోని ఓ మెట్ల బావి.
- స్వీడన్‌కు చెందిన ప్రపంచంలోనే అతిపెద్ద ఫర్నిచర్ రిటైలర్ ఐకియా.. దేశంలో తొలి స్టోర్‌ను ఆగస్టు 9న హైదరాబాద్‌లో ప్రారంభించింది.
- అమెరికన్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్.. భారతీయ కంపెనీ ఫ్లిప్‌కార్ట్‌లో 77 శాతం వాటాను కొనుగోలు చేసింది. ఈ ఒప్పందం విలువ 16 బిలియన్ డాలర్లు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సెప్టెంబర్ 1న ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ)ను న్యూఢిల్లీలో ప్రారంభించారు. ఇందులో ప్రభుత్వానికి 100 శాతం వాటా ఉంది.
- అక్టోబర్‌లో ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈవో పదవికి చందాకొచ్చర్ రాజీనామా చేశారు. ఆమె స్థానంలో సందీప్‌బక్షి నూతన ఎండీ, సీఈవోగా బాధ్యతలు చేపట్టారు.
- మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జ్ఞాపకార్థం రూ.100 నాణేన్ని డిసెంబర్ 24న ప్రధాని నరేంద్ర మోదీ విడుదల చేశారు.

విశ్లేషణాత్మక అధ్యయనంతోనే విజయం



ఎన్.విజయేందర్‌రెడ్డి,
విజయేందర్ అకాడమీ,
హైదరాబాద్.

"ప్రస్తుతం ఏపీపీఎస్సీ నుంచి వరుసగా నోటిఫికేషన్లు వెలువడుతున్నాయి. కొత్త సంవత్సరంలో టీఎస్‌పీఎస్సీ నుంచి కూడా ప్రకటనలు వెలువడే అవకాశముంది. ఖాళీల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ పోటీ లక్షల్లోనే ఉంటోంది. కరెంట్ అఫైర్స్ విభాగంలో ఇతత రచడి; కింది వాటిలో సరైనవి? సరికానివి ఏవి? తదితర ప్రశ్నలు ఎక్కువగా ఎదురవుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు సన్నద్ధతను మెరుగుపరచుకోవాలి. ఒక అంశాన్ని వివిధ కోణాల్లో విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేస్తేనే ఈ తరహా ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించేందుకు వీలుంటుంది. దీనికి సొంత నోట్స్‌ను రూపొందించుకోవడం లాభిస్తుంది. ప్రిపరేషన్‌కు ప్రామాణిక పత్రికలతో పాటు http://pib.nic.in వంటి వెబ్‌సైట్లను ఉపయోగించుకోవచ్చు."